# ఆధునిక భారత దేశ చరిత్ర మరియు సంస్కృతీ (1764 – 1947 A. D)

## బి. ఎ. ద్వితీయ సంవత్సరం

### సెమిష్టర్ –3


**రచయితలు**

**డా. జి. సోమశేఖర్,**
సహ ఆచార్యులు,
చరిత్ర విభాగం,
ఒంగోలు పి. జి. సెంటర్, ఒంగోలు – 523001.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**డా. బి. ఆర్. ప్రసాద రెడ్డి,**
రీడర్, చరిత్ర విభాగం,
సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కర్నూలు.

**డా. ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు,**
అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రాజంపేట – 516 115,
వై. ఎస్. ఆర్. కడప జిల్లా.

**ఆచార్య. జి. రాజ మోహన్ రావు,**
ఆచార్యులు,
చరిత్ర విభాగం,
ఒంగోలు పి. జి. సెంటర్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంపాదకులు**

**ఆచార్య. జి. రాజ మోహన్ రావు,**
ఆచార్యులు, చరిత్ర విభాగం,
ఒంగోలు పి. జి. సెంటర్, ఒంగోలు – 523001.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంచాలకులు**

**డా. నాగరాజు బట్టు**
*ఎం.బీ.ఏ., ఎం.హెచ్.ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజీ), ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సోషియాలజీ), ఎం.ఇ. డి., ఎం.ఫిల్., పిహెచ్.డి.*

దూర విద్యాకేంద్రం,
ఆచార్య నాగార్జున యూనివర్శిటి
నాగార్జున నగర్ 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**Website : www.anucde.info**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. ఎ. ద్వితీయ సంవత్సరం, సెమిష్టర్ – 3
# ఆధునిక భారత దేశ చరిత్ర మరియు సంస్కృతీ (1764 – 1947 A. D)

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

**© ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికిసంతోషిస్తున్నాను.ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

**PROGRAMME : THREE-YEAR B.A.**

**Domain Subject: History**

**Course Code : 307 HIS 21**

**Semester-wise Syllabus under CBCS**

**B. A. II Year : Semester – III**

**307 HIS 21 Course 3 : MODERNINDIAN HISTORY & CULTURE (1764-1947 A. D)**

**Learning Outcomes :**

After successful completion of this course, the student will be able to :

- Unearth the true nature of the British rule and its disastrous impact on Indian economy and society.
- Gauge the disillusionment of people against the Company's rule even during the early 19th century.
- Assess the causes and effects of Reformation movements and also inspire the public to overthrow inequalities of the present day society.
- Rise above petty parochial issues after understanding the sacrificial saga of freedom struggle.
- Evaluate the undercurrent of communal politics that led to India's partition and identify the enemies of India's integrity and sovereignty.
- Visualize where places are in relation to one another through map pointing.

## Syllabus :

**Unit – I :** Policies of Expansion –Warren Hastings, Cornwallis - Subsidiary Alliance & Doctrine of Lapse – Causes & Results of 1857 Revolt – Lytton, Rippon, Curzon.

**Unit – II :** Social, Religious & Self-Respect Movements – Raja Rammohan Roy, Dayananda Saraswathi, Swami Vivekananda, Jyotiba Phule, Narayana Guru, Periyar, Dr. B. R. Ambedkar.

**Unit – III :** Causes for the growth of Nationalism - Freedom Struggle from 1885 to 1920 : Moderate Phase — Militant Phase: Vandemataram Movement - Home Rule Movement.

**Unit – IV :** Freedom Struggle from 1920 to 1947: Gandhiji's Role in the National Movement – Revolutionary Movement – Subhas Chandra Bose.

**Unit – V :** Muslim League & the Growth of Communalism – Partition of India – Advent of Freedom - Integration of Princely States into Indian Union – SardarVallabhai Patel.

**References :**

1. Anil Seal, Emergence of Indian Nationalism.

2. Banerjee, Sekhar, From Plassey to Partition.

3. Bipan Chandra, Rise and Growth of Economic Nationalism in India.

4. Chandra, Bipan, et. al., India's Struggle for Independence.

5. Bipan Chandra, Modern India.

6. Joshi, P.C., Rammohun and the Forces of Modernisation in India.

7. R.P.Dutt, India Today

**Mandatory Co-Curricular Activity :**

Map pointing should be a compulsory activity as it helps student to understand vividly and clearly than the text and should be made part of Internal Examination by allotting marks for this skill-based activity.

**Suggested Co-Curricular Activities.**

@ Debates.
@ Student seminars.
@ Viva voce interviews.
@ Quiz Programmes.
@ Photo Album.
@ Recording local history.
@ Role Play of freedom struggle events.
@ Organizing photo exhibition on freedom fighters.
@ Celebrations of important events / personalities.
@ Conducting Philately.
@ Examinations (Scheduled and surprise tests).
@ Students may be asked to prepare a project on the differences between Mughal and British administration.
@ Encourage students to write their autobiography or biography of their inspiring personalities.

# MODEL QUESTION PAPER

## B.A. DEGREE EXAMINATION.

## Second Year – Third Semester

## Part – II : History

### Paper III – MODERN INDIAN HISTORY AND CULTURE (1764 – 1947 A.D.)

**Time: Three hours** **Max. Marks : 70**

**SECTION – A (15 Marks)**

Answer **ALL** questions. Each question carries 1 mark.

1. Matching : (5 x 1 = 5)
జతపరుచుము :

| | A | | B |
|---|---|---|---|
| (a) | Social reforms<br>సంఘ సంస్కరణలు | (i) | 1906<br>1906 |
| (b) | Moderates<br>మిత వాదులు | (ii) | 1916<br>1916 |
| (c) | Muslim League<br>ముస్లిం లీగ్ | (iii) | 1942<br>1942 |
| (d) | Home Rule Movement<br>హోమ్ రూల్ ఉద్యమం | (iv) | G.K. Gokale.<br>జి. కె. గోఖలే |
| (e) | Quit India Movement<br>క్విట్ ఇండియా ఉద్యమం | (v) | JyothiRao pule<br>జ్యోతిరావు పూలే |

2. Multiple choice : (5 x 1 = 5)
సరియైన సమాధానాలు ఎన్నుకొనుము :

(a) Extremists
అతివాదులు

(i) Dadabhai Nehruji
దాదాభాయ్ నెహ్రూజీ

(ii) Tilak
తిలక్

(iii) Aravindha Gosh
అరవింద ఘోష్

(b) Father of local bodys

స్థానిక సంస్థల పితామహుడు

(i) Lord Rippon

లార్డ్ రిప్పన్

(ii) Curzon

కర్జన్

(iii) Lord Lytton

లార్డ్ లిట్టన్

(c) Drafting committee chairman

రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్

(i) Dr. B. Rajendra Prasad

డా. రాజేంద్ర ప్రసాద్

(ii) Dr. B.R. Ambedkar

డా. బి. ఆర్. అంబేద్కర్

(iii) Sinha

సిన్హా

(d) Salt Satyagraha

ఉప్పు సత్యాగ్రహం

(i) 1920

1920

(ii) 1930

1930

(iii) 1940

1940

(e) Integration of princely states into Indian Union

ఇండియన్ యూనియన్ లో స్వదేశీ సంస్థానాల విలీనం

(i) Sardharvallabhai Patel

సర్దార్ వల్లభాయ్ పటేల్

(ii) Lalbhadhur Sashtri

లాల్ బహదూర్ శాస్త్రి

(iii) Mahmadh Zinna

మహమ్మద్ జిన్నా

3. Map Pointing (5 x 1 = 5)

మ్యాపును గుర్తించుము.

AP Map

ఆంధ్ర ప్రదేశ్ మ్యాపును గుర్తించుము.

(a) Guntur
గుంటూరు

(b) Prakasham
ప్రకాశం

(c) Vishakapatnam
విశాఖ పట్నం

(d) West Godavari
పశ్చిమ గోదావరి

(e) Kadapa
కడప

**SECTION – B** **(3 x 5 = 15 Marks)**

4. Answer any **THREE** questions, each question carries 5 marks

(a) Subhas chandrabose.
సుభాష్ చంద్ర బోస్.

(b) Role of moderates in freedom movement.
స్వాతంత్ర ఉద్యమంలో మితవాదుల పాత్ర.

(c) Quit India Movement.
క్విట్ ఇండియా ఉద్యమం.

(d) Sardhar Vallabhai Patel.
సర్దార్ వల్లభాయ్ పటేల్.

(e) Dr. B. R. Ambedkar.
డా. బి. ఆర్. అంబేద్కర్.

(f) Swadeshi Movement.
స్వదేశీ ఉద్యమం.

**SECTION – C** **(3 x 15 = 45 Marks)**

5. Answer any **THREE** questions, each question carries 15 marks

(a) Explain the social and religious movements in 19th Century in India.

19 వ శతాబ్దంలో భారతదేశంలో జరిగిన సాంఘిక, మాత ఉద్యమాలను గూర్చి వివరింపుము.

(b) Discuss the causes for the growth of Nationalism in India.

భారతదేశంలో జాతీయ వాదం పెరగడానికి దోహదం చేసిన కారణాలను చర్చించుము.

(c) Describe the role of Mahatma Gandhi in National Movement.

జాతీయోద్యమంలో మహాత్మా గాంధీ నిర్వహించిన పాత్రను వర్ణింపుము.

(d) Explain the Integration of princely states into Indian Union.

ఇండియన్ యూనియన్ లో స్వదేశీ సంస్థానాలు విలీనమైన విధానమును వివరింపుము.

(e) Factors led to partition of India.

దేశ విభజనకు దారి తీసిన పరిస్థితులు.

(f) Write an essay on Home Rule Movement.

హోమ్ రూల్ ఉద్యమము గూర్చి ఒక వ్యాసము వ్రాయుము.

*****

# విషయ సూచిక


| యూనిట్ నెంబర్ | పాఠం నెంబర్ | పాఠం పేరు | పేజి నెంబర్ నుండి | వరకు |
|---|---|---|---|---|
| యూనిట్ - 1 | 1 | వారెన్ హేస్టింగ్స్ , కార్న్ వాలీస్, లార్డ్ వెల్లస్లి – సైన్య సహకార పద్ధతి | 1.1 - | 1.11 |
| | 2 | డల్ హౌసి – 1857 విప్లవం | 2.1 - | 2.15 |
| | 3 | భారతదేశంలో వైస్రాయ్ ల పాలన | 3.1 - | 3.13 |
| యూనిట్ - 2 | 4 | బ్రహ్మసమాజం – రాజారామమోహన్ రాయ్ | 4.1 - | 4.8 |
| | 5 | ఆర్యసమాజం – రామకృష్ణ మిషన్ | 5.1 - | 5.8 |
| | 6 | కులనిర్మూలన – ఆత్మగౌరవ ఉద్యమాలు | 6.1 - | 6.7 |
| | 7 | అంతరానితన నిర్మూలన – డాక్టర్ బి .ఆర్. అంబేద్కర్ | 7.1 - | 7.6 |
| యూనిట్ - 3 | 8 | జాతీయభావం అభివృద్ధి | 8.1 - | 8.7 |
| | 9 | భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం | 9.1 - | 9.7 |
| | 10 | మితవాదయుగం | 10.1 - | 10.8 |
| | 11 | అతివాద యుగం | 11. 1 - | 11.11 |
| యూనిట్ - 4 | 12 | గాంధీజీ – తొలి ఉద్యమాలు | 12. 1 - | 12.7 |
| | 13 | 1920 – 1929 మధ్య స్వాతంత్రోద్యమం | 13. 1 - | 13.11 |
| | 14 | శాసనోల్లంఘన ఉద్యమం | 14. 1 - | 14.8 |
| | 15 | 1935 – 1945 మధ్య స్వాతంత్రోద్యమం | 15. 1 - | 15.7 |
| | 16 | విప్లవోద్యమాలు | 16. 1 - | 16.7 |
| | 17 | సుభాష్ చంద్రబోస్ – భారతజాతీయ సైన్యం | 17. 1 - | 17.6 |
| | 18 | 1935 చట్టం | 18. 1 - | 18.6 |
| యూనిట్ - 5 | 19 | మతతత్త్వం – ముస్లింలీగ్ | 19. 1 - | 19.9 |
| | 20 | దేశవిభజన – స్వాతంత్ర్య సముపార్జన | 20. 1 - | 20.9 |
| | 21 | సంస్థానాల విలీనం – సర్దార్ వల్లభాయి పటేల్ | 21. 1 - | 21.8 |

# పాఠం – 1
# బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ – వారెన్ హేస్టింగ్, కార్న్ వాలిస్, లార్డ్ వెలస్లీ సైన్య సహకార పద్ధతి

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వలన విద్యార్థులకు క్రింది విషయాలపై అవగాహన ఏర్పడుతుంది.

- వ్యాపారస్థులగా ఆరంగేట్రం చేసిన బ్రిటిష్ వారు అధికారం చేపట్టుట
- అధికార స్థాపనకు వివిధ గవర్నర్ లు చేసిన కృషిని తెలిసికొనుట
- బాల్యదశలో ఉన్న కంపెనీని తన పరిపాలన చాతుర్యంతో ఏ విధంగా వారెన్ హేస్టింగ్ సుస్థిరతను చేకూర్చాడు.
- కార్న్ వాలిస్ ప్రవేశపెట్టిన శాస్వత శిస్తు నిర్ణయ పద్ధతి యొక్క ఆవశ్యకత మరియు లాభ నష్టాలను బేరీజు వేయుట.
- కంపెనీ సామ్రాజ్య స్థాపకుడిగా వెల్లస్లీ ఎందుకు ప్రసిద్ధికెక్కాడు.
- సైన్య సహకార పద్ధతి లాభ, నష్టములను విశ్లేషించుట.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

1.1 ఉపోద్ఘాతం

1.2 వారెన్ హేస్టింగ్ కంపెనీ పరిపాలన నిర్మాత

1.3 కార్న్ వాలిస్ – శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి, లక్షణములు, లాభాలు, నష్టాలు.

1.4 వెల్లస్లీ – కంపెనీ సామ్రాజ్య స్థాపకుడు – సైన్య సహకార పద్ధతి, లక్ష్మణములు, లాభాలు, నష్టాలు.

1.5 సంగ్రహంగా

1.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

  1.6.1 వ్యాసరూప ప్రశ్నలు

  1.6.2 లఘుప్రశ్నలు

  1.6.3 బహుళైచ్ఛిక ప్రశ్నలు – సమాధానాలు

  1.6.4 జతపరుచు ప్రశ్నలు – సమాధానాలు

1.7 ఉపయుక్త గ్రంథాలు

## 1.1 ఉపోద్ఘాతం :

మొఘల్ సామ్రాజ్య శిధిలాలపై స్థాపించబడిన రాజ్యమే బ్రిటీష్ సామ్రాజ్యం. వ్యాపారార్ధమై భారతదేశంలో అడుగిడిన బ్రిటీష్ వారి తూర్పు ఇండియా కంపెనీ, లాభార్జన కొరకు తోటి ఐరోపా వర్తకులతో పోటీపడింది. భారతదేశంలో మొదటిగా అడుగిడిన పోర్చుగీసు, డచ్ లను ఓడించి చివరగా ఫ్రెంచి వారిని సైతం ఓడించి ఏకస్వామ్యంను సాధించిరి. అంతటితో సంతృప్తి చెందక, దేశంలో నెలకొనిన రాజకీయ అనైక్యతను తమకు అనుకూలంగా మలుచుకోదలిచారు. అందులో భాగంగా మొదటిగా బెంగాల్ రాజ్యంపై దృష్టి మళ్ళించి నాటి బెంగాల్ నవాబు అయిన సిరాజ్ ఉద్దౌలా ను చారిత్రాత్మకమైన ప్లాసీ యుద్ధంలో (జూన్ 23, 1757) ఓడించిరి. అతని స్థానంలో మీర్ జాఫరు నవాబుగా నియమించి, ప్రతిగా మీర్ జాఫర్ నుంచి అనేక వ్యాపార సౌకర్యాలతో పాటు 24 పరగణాలపై పట్టు సాధించారు. తూర్పు ఇండియా వర్తక సంఘము భారతదేశంలో మొదటిగా అధికారంను సాధించడం ఇక్కడ గమనార్హం. అందుకనే ప్లాసీ యుద్ధంను బ్రిటీష్ వారు భారతదేశంలో అధికార స్థాపనకు కారణమయినదిగా యుద్ధ విజేత ' రాబర్ట్ క్లైవ్ ' ను అధికారా స్థాపకుడుగా చెప్పవచ్చును.

ప్లాసీ యుద్ధం ద్వార విశేష సంపదను పొందిన కంపెనీ వారు మరింత సంపద కొరకు, బెంగాల్ పై పట్టు సాధించేందుకు దృష్టి సారించారు. అందుచే బెంగాల్ గవర్నర్ వాన్ సిద్దార్ట్, మీర్ జాఫర్ స్థానంలో మీర్ ఖాసింను బెంగాల్ నవాబుగా నియమించి, ప్రతిఫలంగా బర్ద్వాన్, మిద్నపూర్, చిట్టగాంగ్ జిల్లాలను సంపాదించిరి, మీర్ ఖాసిం కొంత తెలివిగా వ్యవహరించి, బ్రిటిష్ వారికి గల వ్యాపార సదుపాయాలను రద్దు చేయడమేగాక రాజధానిని ముర్షిదాబాద్ నుంచి మాంఘీర్ కు మార్చడంతో అతనిని పదవి నుంచి తొలగించి తిరిగి మీర్ జాఫర్ ను బెంగాల్ నవాబుగా నియమించారు. దీనిని వ్యతిరేకించిన మీర్ ఖాసిం అయోధ్య చేరి, అయోధ్య వజీర్ అయిన షుజా ఉద్దౌలా, మొగల్ చక్రవర్తి షా ఆలం తో చేతులు కలిపి కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమాఖ్య ను ఏర్పాటు చేసెను. ఈ ముగ్గురు తమ సైన్యాలు సంయుక్తంగా కంపెనీపై యుద్ధాన్ని ప్రకటించారు. అక్టోబర్ 22, 1764 న బాక్సర్ దగ్గర జరిగిన యుద్ధంలో మిత్ర సైన్యాలు చిత్తుగా ఓడాయి. మీర్ ఖాసీం యుద్ధభూమి నుండి పారిపోగా షుజా రోహిల్ ఖండ్ కు పారిపోయాడు. మొగల్ చక్రవర్తి షా ఆలం కంపెనీ వారితో అలహాబాద్ సంధి చేసుకున్నాడు. బాక్సర్ యుద్ధంలో మొగల్ చక్రవర్తి ని ఓడించినా ' కంపెనీ వారు ' దేశవ్యాప్తంగా కాకుండా బెంగాల్, బీహార్, ఒరిస్సాలలోనే అధికారంను పటిష్టం చేసుకోవాలనుకోవడం వారి బుద్ధి కుశలతకు తార్కాణం.

### అలహాబాద్ సంధి :

అయోధ్యను ఆక్రమించిన కంపెనీ వారు మొత్తం రాష్ట్రమును (అలహాబాద్, కారా జిల్లాలు మినహా) అయోధ్య నవాబుకు ఇచ్చి, 50 లక్షలు యుద్ధ నష్ట పరిహారమును కంపెనీకి ఇచ్చేందుకు అతనిని ఒప్పించింది. అయోధ్య నుంచి పొందిన అలహాబాద్ జిల్లాలతో పాటు 56 లక్షల కప్పంను కంపెనీ వారు మొగల్ చక్రవర్తి కి ఇచ్చారు. దీనికి ప్రతి ఫలంగా మొగల్ చక్రవర్తి నుంచి బెంగాల్ పై దివాన్ అధికారం (పన్ను వసూలు)ను పొందిరి. అనగా బెంగాల్ నవాబు కు ఉన్న

దివాన్, నిజామత్ అధికారాలలో పన్ను వసూలు బ్రిటీష్ వారికి. నిజామత్ (శాంతి భద్రతలను కాపాడటం) బెంగాల్ నవాబు కు ఇవవ్వడం. ఒకే రాష్ట్రంలో ఇద్దరు అధికారులు. దీనినే 'ద్వంద్వ పాలన' యని అందురు.

ప్లాసీ యుద్ధం బెంగాల్ రాష్ట్రములో 24 పరగణాలతో భారతదేశ భూభాగంపై ఆరంగేట్రం చేయగా, బాక్సార్ యుద్ధం ' దివాన్ ' అధికారాలను పొందడం ద్వారా బెంగాల్ లో వారి అధికారాన్ని సుస్థిరం చేసెను.

## 1.2 వారెన్ హేస్టింగ్ (1772 – 85) :

బెంగాల్ రాష్ట్రంపై ద్వంద్వ పాలన ద్వార బెంగాల్లో అధికారం ను సంపాదించిన నేపథ్యంలో, కంపెనీ ప్రభుత్వం బెంగాల్ గవర్నర్ గా మంచి పరిపాలకుడు, దూరదృష్టి కలిగిన అధికారి కొరకు ప్రయత్నించి ' వారన్ హేస్టింగ్ ' ను ఎంపిక చేశారు. అతని యొక్క ముఖ్య విధి బెంగాల్ లో కంపెనీ అధికారాన్ని సుస్థిరం చేయడం ద్వారా భారతదేశంలో అధికారానికి దిక్సూచిగా బెంగాల్ ను మార్చాలని ఆదేశించారు. అతని నియామకం భారతదేశంలో, కంపెనీ పాలనలో ఒక నూతన అధ్యాయానికి నాందిగా మారింది. ఒక వైపు 'ద్వంద్వ పాలన' విఫలమై కంపెపీ అధికారం పూర్తిగా నిలదొక్కుకోలేదు. ఈ నేపథ్యంలో ద్వంద్వ పాలన రద్దు చేసి, దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టి సివిల్ పరిపాలనా విధానమునకు మూలపురుషుడు అయ్యెను. వాస్తవానికి కంపెనీ అధికారాన్ని స్థాపించినవాడు రాబర్ట్ క్లైవ్ కాగా పరిపాలనను స్థాపించినవాడు వారెన్ హేస్టింగ్.

### సామ్రాజ్య విస్తరణకు వారన్ హేస్టింగ్ ఆక్రమణలు :

బెంగాల్ రాష్ట్రంలో కంపెనీ విస్తరణే ప్రధాన ధ్యేయం అయినప్పటికీ అవసరమైనప్పుడు దండయాత్రలకు వెనుకాడలేదు. అందులో మొదటిది అయోధ్య నవాబుతో 1773 లో చేసుకున్నా "బెనారస్ సంధి". దీని ప్రకారం అలహాబాద్ సంధిలో మొగల్ చక్రవర్తికి ఇచ్చిన అలహాబాద్ జిల్లాలను అయోధ్య నవాబుకు తిరిగి యిచ్చి ప్రతిగా 50 లక్షల రూ॥లను తీసుకున్నాడు. అతనికి అవసరమైనప్పుడు సైనిక సహాయం చేయడానికి అంగీకరించి దానిని రక్షణ రాజ్యం (బఫర్ స్టేట్ గా) చేసుకొనెను. మొగల్ చక్రవర్తి సంధిని ఉల్లంఘించి మహారాష్ట్రులతో చేతులు కలిపాడని, ఏటా అతనికిచ్చే 26 లక్షల కప్పంను రద్దు చేసి అలహాబాద్ జిల్లాలను సైతం ఆక్రమించెను.

### రోహిల్లాలతో యుద్ధం (1774):

వారెన్ హేస్టింగ్ విదేశాంగ విధానం అతనికి చెడ్డ పేరు తెచ్చి, అతని అభిశంసనకు సైతం కారణమయినది. మహారాష్ట్రులకు వ్యతిరేకంగా రొహిల్ ఖండ్ నాయకుడు హఫీస్ రహమత్ ఖాన్ ఆయోధ్య నవాబుతో ఒక ఒప్పందం చేసుకున్నాడు. దీని ప్రకారం అయోధ్య నవాబుకు 40 లక్షల రూపాయలు హఫీస్ ఇవ్వాల్సి ఉంది. 1773 లో మహారాష్ట్ర నవాబు ఇతర కారణాల వలన స్వచ్ఛందంగా రోహిలండ్ నుంచి వెళ్ళిపోయాడు. ఇందులో అయోధ్య నవాబు పాత్ర లేదు. అయితే అనుకున్న ప్రకారం రొహిల్ ఖండ్ తనకు ఇవ్వాల్సిన 40 లక్షలు ఇచ్చితీరాలని అయోధ్య నవాబు పట్టుపట్టాడు. దీనికి

వారెన్ హేస్టింగ్ (రక్షణ సంధి రీత్యా) అయోధ్యా నవాబుకు మద్దతిచ్చి, రోహిల్ ఖండ్ పై దండెత్తి దాదాపు 20 వేల మంది రొహిల్లాలను నిరాశ్రయులను చేసి వారి ఆగ్రహానికి గురైనాడు. ఇది అనేక విమర్శలకు దారితీసింది.

మహారాష్ట్ర ప్రాంతాన్ని ఆక్రమించడంలో కూడా వారెన్ హేస్టింగ్ భాగస్వామి అయ్యాడు. 1761 లో జరిగిన 3వ పానిపట్టు యుద్ధం మహారాష్ట్రులను కృంగదీసి, వారిమధ్య లుకలుకలు ప్రారంభమయ్యాయి. అందులో క్రమమే రఘోబా మరియు నానా పడ్నవీస్ మధ్య జరిగిన వారసత్వ యుద్ధం. ఇందులో వారెన్ హేస్టింగ్ రఘోబాకు మద్దతు ఇచ్చి నానా పడ్నవీస్ ను ఓడించి అతనితో ' సాల్బే సంధి ' (1782) చేసుకొనెను. ఈ సంధి ప్రకారం రెండవ మాధవరావు పీష్వా అయి, ఆంగ్లేయులకు 'సాల్ సెట్టి ద్వీపం' లభించింది. ఇదియే చరిత్రలో మొదటి మహారాష్ట్ర యుద్ధంగా (1778 – 1782) వాసికెక్కింది.

మైసూర్ ప్రాంతాన్ని ఆక్రమించుటకు కంపెనీవారు మైసూర్ సుల్తాన్ లతో నాలుగు మైసూర్ యుద్ధాలు చేసారు. అందులో రెండవది వారెన్ హేస్టింగ్ కాలంలో జరిగింది. మొదటి మైసూర్ యుద్ధంలో ఘోరంగా ఓడిన కంపెనీ ప్రభుత్వం "మద్రాస్ సంధి"కి ఒప్పుకుంది. కానీ దానితో సంతృప్తి చెందక, సంధి షరతులను ఉల్లంఘించడంతో మరొకసారి వారిద్దరి మధ్య యుద్ధం అనివార్యమయ్యెను. అదియే 1780 నుంచి 1784 కు జరిగిన రెండవ మైసూర్ యుద్ధం ఇందులో డిసెంబర్ 7, 1782 హైదర్ ఆలీ పోర్ట్ నోవా యుద్ధంలో ఓడి తదుపరి కాన్సర్ వ్యాధితో మరణించెను. హైదర్ ఆలీ కుమారుడు టిప్పు సుల్తాన్ యుద్ధాన్ని కొనసాగించి 1784, మే నెల 11వ తేదీన "మంగళూర్" సంధితో ముగిసింది. ఇరుపక్షాలు యుద్ధసమయంలో ఆక్రమించుకున్న ప్రాంతాలను ఇవ్వాలని నిర్ణయించడంతో, ఆంగ్లేయులకు ఎట్టి లాభం సమకూరలేదు.

పై విధంగా క్లైవ్ స్థాపించిన కంపెనీ రాజ్యాన్ని వారన్ హేస్టింగ్ సురక్షితంగా కాపాడి సుస్థిరత చేకూర్చెను.

## 1.3 కార్న్ వాలిస్ (1786 1793):

వారెన్ హేస్టింగ్ ప్రారంభించిన సివిల్ పరిపాలనా వ్యవస్థను రూపకల్పన చేసి భారతదేశంలో పతిష్టం చేసిన వాడు కార్న్ వాలిస్. న్యాయ వ్యవస్థలో సంచార న్యాయస్థానాలను నెలకొల్పి కారెన్ వాలిస్ ' న్యాయ నియమావళి ' (కోడ్) ను రూపొందించడంతో భారతీయ ప్రజలకు న్యాయఫలాలు అందాయి. తద్వార ఆంగ్ల న్యాయ విచారణ వ్యవస్థను భారతదేశంలో ప్రారంభించినట్లయింది. మొదటిసారిగా జిల్లాలను ఠాణాలుగా విభజించడం, దానిని పోలీస్ స్టేషన్ ఆధీనంలోనికి తేవడం, దానిపై "దరోగా" అనే పోలీస్ అధికారిని నియమించడం జిల్లాకు ' పోలీస్ సూపరింటెండెంట్ ' ను నియమించడం నాటి పరిపాలనలో కొంగొత్త సంస్కరణలు; అదనంగా శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ప్రవేశ పెట్టి రెవిన్యూ విధానంలో నూతన శకంను ప్రారంభించెను.

### శాశ్వత శిస్తు విధానం లక్షణములు :

1757 లో బెంగాల్ రాష్ట్రంలో కంపెనీ వారు అధికారాన్ని స్థాపించి 1765 లో బెంగాల్ ' దివాన్ అధికారం' ను పొందారు. 1772 లో బెంగాల్ గవర్నర్ అయిన వారెన్ హేస్టింగ్ కంపెనీ లాభాలను వృద్ధి చేయడమే లక్ష్యంగా

"వేలంపాట" ను ప్రారంభించారు. ఒక్కొక్క ప్రాంతంలో పన్ను వసూలు చెయ్యడానికి జమీందారు వేలం ఎక్కువగా పాడి అధికారాలు దక్కించుకోవచ్చు. దీనివలన జమీందారులు, రైతులు ఎక్కువగా నష్టపోయి ప్రభుత్వం మాత్రం ఆదాయంను సంపాదించింది. అయితే ప్రభుత్వం కూడ ఆశించినంత లాభం పొందలేక పోయింది.

ఈ నేపథ్యంలో గవర్నర్ జనరల్ గా కారెన్ వాలిస్ 1776 లో పదవీ బాధ్యతలు చేపట్టాడు. భూస్వామిక వర్గానికి చెందిన ఈయన బ్రిటిష్ భూస్వామిక వ్యవస్థను భారతదేశంలో ప్రవేశపెట్టడం అవసరమని భావించారు. అందులో భాగంగా జాన్ షోర్ నాయకత్వంలో భూమిశిస్తు, విధానాల కమిటి నియమించి దాని నివేదిక ఆధారంగా "శాశ్వత శిస్తు" విధానాన్ని 1793 నుండి ప్రవేశపెట్టాడు.

**శాశ్వత శిస్తు విధాన లక్షణములు :**

1. ప్రతి సంవత్సరము నిర్వహించు వేలం పాటలు వ్యయంతో కూడుకోవడం వలన వాటిని రద్దు చేయడం.
2. జమీందారులు శాశ్వతంగా ఉందురు కావున వారికి భూమిపై హక్కును సంపాదించారు.
3. భూమిని వివిధ కమతాలుగా విభజించి స్థానిక జమీందారులకు ఇవ్వడం జరిగింది.
4. భూయజమానులుగా జమీందారులు ప్రజల నుంచి పన్ను వసూలు చేయాలి.
5. జమీందారులు వసూలు చేసిన మొత్తం 1:10 నిష్పత్తిలో జమీందారులు, బ్రిటిష్ వారు పంచుకుంటారు.
6. దీని పదవీకాలం పదిసంవత్సరములు.

**ప్రభుత్వానికి లాభ నష్టాలు :**

శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ద్వార నిర్ణీత మొత్తం ప్రభుత్వానికి లభించడంతో ఆ ఆదాయంను మిగతా వాటిపై వెచ్చించడానికి అవకాశం కల్గింది. ఈ పద్దతి ద్వారా వేలం ఖర్చులు మిగిలి, ప్రతి సంవత్సరం వేలం నిర్వహణ పనిభారం తగ్గింది. అంతేగాకుండా జమీందారులు ప్రభుత్వానికి అనుకూలమైన వర్గంగా తయారయింది. ఆయా ప్రాంతాలలో జరిగే అల్లర్లను, అసంతృప్తిని ప్రభుత్వానితో సంబంధం లేకుండా జమీందారులే అణచి వేసే బాధ్యతను నిర్వహించారు. జమీందారులకు భూమిపై హక్కు రావడంతో వారు వ్యవసాయంపై దృష్టిని సారించి వ్యవసాయాభివృద్ధికి పాటుపడే అవకాశం కలిగింది. వీరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తం ఖరారయింది. కాని, ప్రజలనుంచి వీరు వసూలు చేసే మొత్తం ఖరారు కాలేదు. కావున జమీందారులు బాగా లబ్ధిపొంది భవిష్యత్లో సమాజంను ప్రభావితం చేసే వర్గంగా తయారయ్యారు.

కార్న్ వాలిస్ ఎంతో దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఈ విధానం ప్రభుత్వానికి లాభాలతో పాటు నష్టాలను కూడా తెచ్చిపెట్టింది. ఇందులో ప్రధానమైనది ప్రభుత్వం ఆదాయం తగ్గుదల, జమీందారులు పన్ను చెల్లించినంతకాలం వారికి శాశ్వతమైన హక్కు ఇవ్వడం ద్వారా శాశ్వతంగా పన్ను నిర్ణయమయింది. అయితే జమీందారులు ప్రజలనుంచి ఎక్కువగా వసూలు చేసిన మొత్తం ప్రభుత్వానికి చెందలేదు. అదియును గాక ప్రజల దోపిడీకి గురి అవుతుండడంతో జమీందారులతో

పాటు బ్రిటీష్ ప్రభుత్వం కూడా నిందమోయాల్సి వచ్చింది. ఆర్థికంగా నిలదొక్కుకున్న జమీందారులు ప్రభుత్వాన్ని సమర్థించకపోగా అనేక తిరుగుబాట్లు చేసి ప్రభుత్వాన్ని అస్థిరపరిచిరి.

**రైతులకు నష్టాలు :**

కారెన్ వాలిస్ ఆశించినట్లు బ్రిటీష్ భూస్వామిక వర్గం లాగ, జమీందారులు వ్యవసాయాభివృద్ధిలో శ్రద్ధ వహించకపోవడం గమనార్హం. అదనంగా రైతులనుంచి బలవంతంగా అధికమొత్తంలో పన్నులను పీడించి వసూలు చేసి వారిని కడు దరిద్రులను చేసిరి. భూమిపై రైతుకు ఆస్తిహక్కు లేకపోవడంతో వారు జమీందారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చెను. కావున రైతులు కౌలుదారులుగా వ్యవసాయ కూలీలుగా బ్రతకాల్సి వచ్చింది. దీనివల్ల గ్రామాలలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. ప్రాచీన గ్రామీణ వ్యవస్థ నశించింది. ఆస్తుల సంబంధాలు మారిపోయాయి. నూతన సాంఘీక వర్గాలు ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం 1950లో జమీందారీ పద్ధతి, శాశ్వత నిర్ణయపద్ధతి విధానాలను రద్దుచేశారు.

## 1.4 వెల్లస్లీ – కంపెనీ సామ్రాజ్య నిర్మాత – సైన్య సహకార పద్ధతి :

భారతదేశమునకు బ్రిటీష్ వారిని సార్వభౌములుగా చేసిన వారిలో వెల్లస్లీ మొదటి వరుసలో ఉంటాడు. సైన్య సహకార పద్ధతిని క్రమ పద్ధతిలో అమలుపరుచుట ద్వారా బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణకు తన వంతు కృషిని చేసెను. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి ప్రధాన నిదర్శనము సైన్య సహకార పద్ధతి.

సైన్య సహకార పద్ధతి అనగా "భారతదేశ భూభాగంలోని ఏ సంస్తానాధిపతికైన అవసరమయిన సైన్యాన్ని సహాయం చేయడం దానికి బదులుగా బ్రిటీష్ వారు కొంత ప్రతిఫలాన్ని ఆ సంస్థానాధిపతి నుంచి పొందడం". ఇందులో సహాయం పొందిన వారు కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది.

వాటిలో ముఖ్యమైనవి :

1. సంస్థానాధిపతులు తమ సైన్యాన్ని పూర్తిగా రద్దుచేసి, అంతరంగిక మరియు విదేశాంగ రక్షణకు బ్రిటీష్ వారిపై ఆధారపడటం.
2. మిగతా ఐరోపా వారిని తమ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టడం.
3. ఆంగ్లేయుల అనుమతి లేకుండ ఇతర స్వదేశీ రాజులతో యుద్ధాలుగాని సంధులు గాని చేసుకోరాదు.
4. తమ దేశంలోని అన్ని తగువలకు బ్రిటీష్ వారిని మధ్య వర్తులుగా అంగీకరించడం.
5. ప్రభుత్వ సైన్యాన్ని పోషించి సంస్థానాలను కాపాడినందుకు ప్రతిగా తమ రాజ్యంలో కొంత భాగం లేక ధనంను కంపెనీకి ఇవ్వడం.

అలాగే బ్రిటీష్ ప్రతినిధి కూడ సైన్య నిర్వహణకు స్వదేశంలోనే ఉంటాడు. అతని ఖర్చులను సైతం స్వదేశపాలకుడు భరించాలి.

బ్రిటీష్ ప్రభుత్వం నిర్దేశించిన నియమాలకు లోబడ భారతీయ సంస్థానాధిపతులు సైన్య సహకార పద్ధతిలో సంతకాలు చేశారు. వారిలో ముఖ్యులు మొదటివారు హైదరాబాద్ నిజాం ఆలీఖాన్. 1798లో సైన్య సహకార పద్ధతి యందు చేరి, ఆంగ్ల సైన్యపోషణార్ధం దత్త మండలాలను వారికి అప్పగించెను. కడప, కర్నూల్, బళ్లారి, అనంతపురం జిల్లాలు వాటిలో భాగాలే. మైసూర్ పాలకుడు మూడవ కృష్ణరాజు వడేయార్ 1799 లో ఆయోధ్య పాలకుడు సాదత్ ఆలీ 1801లో, మహారాష్ట్రుల పీష్వా 1802 లో, 180 3లో మొగలు చక్రవర్తి షా ఆలంలు సైన్య సహకార ఒప్పందంలో భాగస్వాములయినారు. ఆయోధ్య నవాబు ఈ ఒప్పందం ద్వారా గోరఖ్ పూర్, రోహిల్ ఖండ్, గంగా – యమున అంతర్వేదిలతో కూడిన దాదాపు సగం అయోధ్య భూమిని కోల్పోయెను.

**సైన్య సహకార పద్ధతి లాభములు :**

అందులో :

లార్డ్ వెల్లస్లీ శాస్త్రీయ పద్ధతిలో అమలుపరచిన ఈ పద్ధతి బ్రిటీష్ ప్రభుత్వానికి అనేక లాభాలను తెచ్చిపెట్టింది.

1. బ్రిటీష్ వారి ప్రాబల్యం దేశమంతటా విస్తరించడం.
2. బ్రిటీష్ ప్రభుత్వానికి సైనిక వ్యయభారం బాగా తగ్గడం.
3. భవిష్యత్ లో యుద్ధాలు బ్రిటీష్ రాజ్యంలో గాక స్వదేశీరాజుల ప్రాంతాలలో జరిగి వీరికి వారికి శాంతి భద్రతలకు విఘాతం కలిగెను.
4. రక్తపాతం లేకుండ ఫ్రెంచివారిని తరిమికొట్టడం.
5. గుడ్డిలో మెల్లలాగ భారతీయ పాలకులకు బ్రిటీష్ వారి అండ దొరకడం వీరికి ఆత్మబలంగా మారడం జరిగింది. అయితే దీనిని ఏ స్వదేశీ రాజులు ఉపయోగించుకోక పోవడం గమనార్హం.

**నష్టములు :**

సైన్య సహకార పద్ధతి ప్రభుత్వానికి అనేక లాభాలను చేకూర్చి భారతీయులకు నష్టాలను మిగిల్చింది. వాటిలో స్వదేశీ పాలకులు అవివేకంతో స్వయంగా స్వతంత్రాలన్ని బ్రిటీష్ వారి చేతిలో పెట్టడం, స్వదేశీ పాలకులు బ్రిటీష్ సైన్య పోషణ నిమిత్తం ఆర్ధిక దుస్థితికి గురికావడం, బ్రిటీష్ రక్షణ పేరుతో స్వదేశీ పాలకులు సోమరులుగా మారడం, (తమ సైన్యాన్ని రద్దుచేయడం) తద్వారా తమ ప్రాంతంలో నిరుద్యోగాన్ని కొని తెచ్చుకోవడం మొదలైనవి ముఖ్యమైనవి.

సైన్య సహకార పద్ధతి ఎంతో లోపభూయిష్టంగా ఉంది అనడం ఎంత సమంజసమో, ఇది భారతదేశంలో బ్రిటీష్ సార్వభౌమత్వంను నిలబెట్టిందనడం కూడా అంతే సమంజసము. బ్రిటీష్ వారి పట్ల ఉన్న భయం స్వదేశీపాలకులను ఆ సంధికి ఒప్పించిందా లేక బ్రిటీష్ వారి అండతో మరిన్ని విజయములను సాధించవచ్చు అనుకున్నారు అనే విషయం తెలియాల్సి ఉంది.

### 1.5 సంగ్రహంగా :

రాబర్ట్ క్లైవ్ బెంగాల్ లో ప్రారంభించిన తూర్పు ఇండియా వర్తక సంఘంనకు పరిపాలన వ్యవస్థను అందించిన వాడు వారెన్ హేస్టింగ్. ఆయోద్య నవాబుతో బెనారస్ సంధి చేసుకొని బ్రిటీష్ వారికి రక్షణ రాజ్యంగా మార్చెను. రోహిల్లా యుద్ధంలో పాల్గొనడం ఇతని పేరు ప్రతిష్ఠలు దెబ్బతినడమే గాక అభిశంసనకు కూడ గురియయ్యెను. మొదటి మహారాష్ట్ర యుద్ధంలో పాల్గొని 'సాల్ సెట్టి ద్వీపం' బహుమానంగా సంపాదించెను.రెండవ మహారాష్ట్ర యుద్ధంలో పాల్గొని హైదరాలి, టిప్పుసుల్తాన్లతో పోరాడెను.

కంపెనీ సివిల్ పాలనను వారె  హేస్టింగ్ ప్రారంభించగా దానిని పతిష్టపరిచిన వాడు కార్న్ వాలిస్. సంచార న్యాయస్థానాలు ఏర్పాటు, ఠాణాలు ఏర్పాటు, శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ప్రవేశపెట్టడంతో చిరకాల కీర్తిని సంపాదించాడు. జమీందారులకు భూమిపై శాశ్వత హక్కును కల్పించి, బ్రిటీష్ ప్రభుత్వానికి ఒక విధేయ వర్గాన్ని ఏర్పాటు చేసెను.

భారతదేశంలో కంపెనీ సామ్రాజ్య నిర్మాతగా ప్రసిద్ధికెక్కిన వాడు లార్డ్ వెల్లస్లీ. వెల్లస్లీ పాటించిన సైన్య సహకార పద్ధతి, స్వదేశీ సంస్థానాలను బ్రిటీష్ వారి ఆధీనంలోనికి లాగింది. బ్రిటీష్ వారి పెత్తనంను అంగీకరించి వారి సైన్యానికి అయ్యే ఖర్చునంతా స్వదేశీయ రాజులు భరించాల్సి వచ్చింది. తమ శత్రువులయిన ఫ్రెంచివారిని సైతం, రక్తపాతం లేకుండా భారతదేశం నుంచి తరిమి వేసింది సైన్య సహకారపద్ధతి.

## 1.6 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 1.6.1 వ్యాసరూప ప్రశ్నలు

1. కంపెనీ పరిపాలన వ్యవస్థాపకుడు వారెన్ హేస్టింగ్ చర్చించుము.
2. శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి లక్షణములను, లాభ, నష్టములను వివరింపుము.
3. సైన్య సహకార పద్దతి లక్షణములను వాటి ప్రభావంను వివరించండి.

### 1.6.2 లఘుప్రశ్నలు :

1. ద్వంద్వపాలన
2. బెనారస్ సంధి

3. కార్న్ వాలిస్

4. రెండవ మైసూర్ యుద్ధం

5. నిజాం ఆలీఖాన్

**1.6.3 బహుళైచ్ఛిక ప్రశ్నలు :**

1. తూర్పు ఇండియా వర్తక సంఘం మొదటిగా ఏ రాష్ట్రంలో అధికారాన్ని సంపాదించింది.
   ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర సి) బెంగాల్ డి) పంజాబ్

2. రాజధానిని ముర్షిదాబాద్ నుంచి మాంఘీర్ కు మార్చినది?
   ఎ) సిరాబుద్దాలా బి) మీర్ జాఫర్ సి) మీర్ ఖాసిం డి) షా ఆలం

3. బెంగాల్ లో ద్వంద్వ పాలన ఏ సంవత్సరంలో జరిగింది?
   ఎ) 1757-1772 బి) 1764 -1772 సి) 1765 -1772 డి)1757-1765

4. అలహాబాద్ సంధి ఏ సంవత్సరంలో జరిగింది?
   ఎ)1757 బి) 1764 సి)1765 డి)1772

5. మొదటి మహారాష్ట్ర యుద్ధం ఏ సంధితో ముగిసింది?
   ఎ) అలహాబాద్ సంధి బి) మంగళూరు సి) సాల్బేసంధి డి) శ్రీరంగపట్నం సంధి

6. బెంగాల్ రాష్ట్రంలో సివిల్ పరిపాలన విధానమునకు మూలపురుషుడు
   ఎ) రాబర్ట్ క్లైవ్ బి) బెంటింగ్ సి ) వారెన్ హేస్టింగ్ డి ) డల్ హౌసీ

7. శాశ్వత శిస్తు విధానంను ప్రవేశపెట్టినవారు
   ఎ) రాబర్ట్ క్లైవ్ బి) వారెన్ హేస్టింగ్ సి) కార్న్ వాలిస్ డి) వెల్లస్లీ

8. సైన్య సహకార పద్ధతిని ప్రవేశ పెట్టిన గవర్నర్ జనరల్ ఎవరు?
   ఎ) బెంటింగ్ బి) కర్జన్ సి) వెల్లస్లీ డి) డల్ హౌసీ

9. దత్త మండలాలతో సంబంధము ఉన్న పాలకుడు?
   ఎ) టిప్పుసుల్తాన్ బి) మహారాష్ట్రులు సి) హైదరాబాద్ నవాబు డి)కృష్ణరాజు వడయార్

10. ఆంగ్లేయులతో సైన్య సహకార ఒప్పందమును చేసుకున్న మైసూర్ పాలకుడు ?
    ఎ) హైదర్ ఆలీ బి) టిప్పుసుల్తాన్ సి) కృష్ణరాజు వడయార్ డి) ఎస్.ఆర్. బొమ్మై

**జవాబులు :**

**1 – సి, 2 – సి, 3 – సి, 4 – సి, 5 – సి, 6 – సి, 7 – సి, 8 – సి, 9 – సి, 10 – సి.**

**1.6.4 క్రింది వాటిని జతపరుచుము**

I)
1) 1757 — ఎ) దత్త మండలాలు
2) 1764 — బి) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి
3) 1765 — సి) అలహాబాద్ సంధి
4) 1791 — డి) బాక్సర్ యుద్ధం
5) 1799 — ఇ) ప్లాసీ యుద్ధం

II)
1) రాబర్ట్ క్లైవ్ — ఎ) ఫ్రెంచి వారు నిర్వీర్యులగుట
2) వారెన్ హేస్టింగ్ — బి) భారతదేశ సామ్రాజ్య నిర్మాత
3) కార్న్ వాలిస్ — సి) న్యాయసమక్షను ఏర్పాటుచేయుట
4) వెల్లస్లీ — డి) సివిల్ పరిపాలన నిర్మాత
5) సైన్య సహకార పద్ధతి — ఇ) భారతదేశంలో కంపెనీ పాలన స్థాపకుడు

III)
1) ద్వంద్వ పాలన — ఎ) బాక్సర్ యుద్ధం
2) బెనారస్ సంధి — బి) ప్లాసీ యుద్ధం
3) నిజాం ఆలీఖాన్ — సి) హైదం ఆలీ
4) సిరాజుదౌలా — డి) వారెన్ హేస్టింగ్
5) మీర్ జాఫర్ — ఇ) రాబర్ట్ క్లైవ్

**జవాబులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **I)** | : 1 – ఇ, | 2) – డి | 3) – సి | 4) – బి | 5) – ఎ |
| **II)** | : 1 – ఇ, | 2) – డి | 3) – సి | 4) – బి | 5) – ఎ |
| **III)** | : 1 – ఇ, | 2) – డి | 3) – సి | 4) – బి | 5) – ఎ |

## 1.7 ఉపయుక్త గ్రంథాలు :

1. వెంకట రంగయ్య మామిడిపూడి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర – మొదటి భాగం

2. సరోజినీ రదాని : High lights of Freedom Movement in A.P.

3. అల్లాడి వైదేహి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర

4. సుమిత్ సర్కార్ : Modern India (1885 – 1947) (Englih)

5. తార చంద్ : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Vol. – 3) (Englih)

6. మజుందార్ ఆర్. సి . : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Englih)

7. ముఖర్జీ హరి దాస్, ముఖర్జీ, ఉమ : The Origins of the National Movement (1905 – 1910)

8. దత్త కె. కె . : A Social History of Modern India.

9. బిపిన్ చంద్ర : India's Struggle of Independence

10. దత్ ఆర్. సి . : The Economic History of India in the Victorian Age.

**డా. బి. గంగాధర్**

# పాఠం – 2
# బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ – డల్ హౌసి – 1857 విప్లవం

**లక్ష్యాలు :**

ఈ పాఠం చదివిన తర్వాత విద్యార్థులు క్రింది విషయాలను తెలుసుకోగలరు.

- ➢ బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణలో డల్ హౌసీ కృషి
- ➢ డల్ హౌసీ ప్రారంబించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతం లక్ష్యం, దాని పరిణామాలు
- ➢ డల్ హౌసీ పాలనానంతరం జరిగిన తిరుగుబాటుకు కారణము
- ➢ 1857 తిరుగుబాటు కారణములు, గమనం, ఫలితాలను అధ్యయనం చేయడం
- ➢ 1857 తిరుగుబాటు స్వభావంను తెలుసుకోవడం

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


2.1 ఉపోద్ఘాతము

2.2 డల్హౌసి – రాజ్య సంక్రమణ సిద్ధాంతం, అర్థ వివరణ

2.2.1 రాజ్య సంక్రమణ సిద్ధాంతం అమలు

2.2.2 రాజ్య సంక్రమణ సిద్ధాంపరిణామాలు

2.3 1857 తిరుగుబాటు కారణములు

2.4 1857 తిరుగుబాటు గమనం

2.5 1857 తిరుగుబాటు విఫలమవుటకు కారణములు

2.6 1857 తిరుగుబాటు / పరిణామాలు

2.7 సంగ్రహంగా

2.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

2.8.1 వ్యాసరూప ప్రశ్నలు

2.8.2 లఘుప్రశ్నలు

2.8.3 బహుళైచ్ఛిక ప్రశ్నలు – సమాధానాలు

2.8.4 జతపరుచుము ప్రశ్నలు – సమాధానాలు

2.9 ఉపయుక్త గ్రంథాలు

## 2.1 ఉపోద్ఘాతము :

రాబర్ట్ క్లైవ్ ప్లాసీ యుద్ధానంతరము ప్రారంభించిన బ్రిటిష్ వారి రాజ్యాధికారమును పూర్తి చేసిన వాడు డల్ హౌసీ. అంతేకాదు వారెన్ హేస్టింగ్ శ్రీకారం చుట్టిన పాలనా సంస్కరణలను సైతం ప్రజలకు అందివ్వడానికి రైల్వేలు, తంతి తపాలా మొదలైన వాటిని ఏర్పాటు చేసిన వ్యక్తి కూడ డల్ హౌసీ నే. అందుకనే ఇతను భారతదేశపు ఆధునిక నాగరికత ఆద్యుడిగా కూడ పేరు గణించాడు. కాని యాదృశ్చికంగా ఇతని కాలమే బ్రిటీష్ కంపెనీ సామ్రాజ్యానికి చివరి పాలన కావడం గమనించవలసిన ముఖ్య విషయం. భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణకు సంకల్పించిన రాజ్య సంక్రమణ విధానం, కంపెనీ సామ్రాజ్యానికి గుదిబండగా మారి 1857 తిరుగుబాటుకు ముఖ్య కారణమయ్యెను. ఈ తిరుగుబాటు కంపెనీ సామ్రాజ్యాన్ని ఓడించి వారి పాలనను అయితే అంతమొందించారు. కాని బ్రిటీష్ వారి నుంచి విముక్తులను చేయలేకపోయింది. ఈ పాఠ్యాంశములలో ఈ విషయాలన్నింటిని సవివరంగా తెలుసుకుందాము.

## 2.2 డల్ హౌసి రాజ్య సంక్రమణ సిద్ధాంతం – అర్ధవివరణ :

కంపెనీ బ్రిటీష్ సామ్రాజ్య వాదులలో ప్రముఖుడయిన డల్ హౌసీ సామ్రాజ్య కాంక్షతో, భారతదేశమంతటా కంపెనీ సామ్రాజ్యాన్ని విస్తరించాలని సంకల్పించెను. దాని పరంపరలో మొదటిగా అయోధ్యపై దృష్టిని మళ్ళించెను. వారెన్ హేస్టింగ్ 1773 లో అయోధ్యను రక్షణ రాజ్యంగా చేసుకున్నప్పటి నుంచి కంపెనీ పాలకుల పెత్తనం వలన అయోధ్య పాలకుడు స్వతంత్రంగా వ్యవహరించలేకపోయెను. దానితో అయోధ్యలో పరిపాలన గాడి తప్పింది. దానికి ప్రముఖ కారణం కంపెనీ పాలకులే అనడంలో సందేహం లేదు. దానికి బదులుగా అయోధ్యలో దుష్పరిపాలన ఉందని దానితో దృష్టిని మళ్ళించి పాలకుడు వజీద్ ఆలీ షా ను బలవంతంగా తొలగించింది. అంతేకాకుండా వజీద్ ఆలీషా కు సంవత్సరానికి 12 లక్షల భరణమును ఇచ్చి అయోధ్యను వాయువ్య రాష్ట్రంగా మార్పు చేశారు. అయోధ్యను ఆక్రమణ పలు విమర్శలకు గురికావడం గమనార్హం.

సామ్రాజ్య కాంక్ష పరుడయిన డల్ హౌసీ అయోధ్య ఆక్రమణతో సంతృప్తి చెందక భారతదేశంలోని అనేక ప్రాంతాలను బ్రిటీష్ వారి ఆధీనంలోనికి తీసుకోవడానికి సరికొత్త వాదాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. అదియే చరిత్రలో " రాజ్య సంక్రమణ సిద్ధాంతం " గా ప్రసిద్ధికెక్కెను. దీని ప్రకారం " ఆంగ్లరక్షిత రాజ్యములు (Protected Allies)" గాని ఆంగ్లేయులపై ఆధారపడిన రాజ్యములు (dependent states) గాని సంతానహీనులైన వారు బ్రిటీష్ వారి అనుమతి లేకుండా ఎవరిని దత్తత (adoption) చేసికొనరాదు. అలా అనుమతి లేకుండా ఏ స్వదేశీ రాజైన దత్తత సంక్రమించదు. పైగా ఆ స్వదేశీ సంస్థానము తీసికొనిన పక్షంలో ఆ దత్త కుమారునికి ఆ స్వదేశీరాజు వ్యక్తిగత ఆస్థి సంక్రమించునేగాని, ఆస్వదేశీ సంస్థానము కంపెనీకి సంక్రమించును.

స్వదేశీరాజును దత్తతను అంగీకరించుటకుగాని, తిరస్కరించుటకుగాని పూర్తి అధికారం ఆంగ్లేయులకు కలదని ప్రకటించెను. కాని అన్ని సందర్భములలోను కంపెనీ దత్తత అంగీకరింపకపోవుట ఎక్కువమంది స్వదేశీరాజులకు అదేనసమయంలో సంతానం లేకపోవుట శోచనీయం. సనాతన హిందూధర్మ సాంప్రదాయం, ఆచారణమయిన 'దత్తత

స్వీకరణ' ను తిరస్కరించుటకు బ్రిటీష్ వారు ఎలాంటి శాస్త్రీయ వాదనలను వినిపించలేదు. ఏ విధంగానైనా యావత్ భారతదేశమంతటా బ్రిటీష్ సామ్రాజ్యం విస్తరించుటే వారి ఏకైక ఆశయమని దీనివలన మనం అర్థం చేసికొనవచ్చును.

### 2.2.1 రాజ్యసంక్రమణ సిద్ధాంతం అమలు :

చారిత్రాత్మకంగా ఈ రాజ్య సంక్రమణ సిద్ధాంతం డల్ హౌసీ కాలంలోనే ప్రారంభంకాలేదు. తూర్పు ఇండియా వర్తక డైరెక్టర్ల సంఘం 1834 లో ఈ సూత్రమును ప్రారంభించి డల్ హౌసీ కాలం నాటికి మాండవి, కొలబా, సూరత్లను కంపెనీ సామ్రాజ్యంలో కలిపారు. అయితే డల్ హౌసీ, దీనిని నిర్లక్ష్యంగా, పరిధులను దాటి వ్యవహరించి అనేక ప్రాంతాలను ఆక్రమించారు. అందులో 1848 లో సతారా ప్రాంత ఆక్రమణ మొదటిగా చెప్పవచ్చును. సతారా పాలకుడు అప్పా సాహెబ్ శ్రీమంత్ మహారాజు షాజీ రాజా ఛత్రపతి బిరుదుతో పాలించి, సంతానహీను మరణించాడు. దీనిని సాకుగా తీసుకొని డల్ హౌసీ తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. అదే క్రమంలో జైత్ పూర్, సంబల్ పూర్ లను 1849 లో, భగత్ ను 1850 లో, ఉదయపూర్ ను 1852 లో, ఝాన్సీ ప్రాంతాన్ని 1853 లో, నాగపూర్ ను 1854 లో ఆక్రమించెను. ఝాన్సీ పాలకురాలు లక్ష్మీభాయి, నాగపూర్ పాలకులు తర్వాత జరిగిన సిపాయిలు తిరుగుబాటు నాయకురాలుగా పోరాడి కంపెనీ పాలనను అంతమొందించడం గమనార్హం.

ఝాన్సీ పాలకుడు గంగాధరరావు మరణానంతరం దామోదర్రావును దత్తగా తీసుకోవడం జరిగింది. దానికి కంపెనీ ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఝాన్సీ పాలకురాలయిన లక్ష్మీభాయి, 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పాల్గొనెను. ఇందులో భాగంగా లక్ష్మీభాయి పురుష దుస్తులు ధరించి, కంపెనీ సైన్యాధికారి 'సర్ హ్యూరోస్'' ను ప్రతిఘటించిన తీరు, నేటికి లక్ష్మీభాయిని 'భారతీయమేటి వనిత'గా గుర్తించదానికి కారణమైంది. యుద్ధ రంగంలో ఆమె వీరమరణం ఎంతోమంది దేశభక్తులకు ప్రేరణను కలిగించింది. అంతేగాక 1857 తిరుగుబాటులో పాల్గొన్న నాయకులందరిలోను లక్ష్మీభాయిని తిరుగుబాటు నాయకురాలిగా బ్రిటీష్ వా రు సైతం పొగిడారు.

### 2.2.2 రాజ్యసంక్రమణ సిద్ధాంతం పరిణామాలు :

డల్ హౌసీ ప్రవేశ పెట్టిన ఈ విధానం బ్రిటీష్ పాలన దేశవ్యాప్తంగా విస్తరించడానికి బాగా దోహద పడిందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఎలాంటి ఆర్థిక నష్టం, ప్రాణ నష్టం జరుగకుండ ఇన్ని ప్రాంతాలను అతి తక్కువ కాలంలో సాధించడం నిజంగా సామ్రాజ్య పాలకులకు మంచి సదవకాశం. అయితే పాలితుల భావాలను పరిశీలించినట్లయితే కంపెనీ ప్రభుత్వం పతనమునకు డల్ హౌసీ పాటించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతం ఒక శరాఘాతం. అందుకనే 1857 లోనే కంపెనీ ప్రభుత్వ పాలనను అంతమొందించటానికి తిరుగుబాటు చెలరేగింది. అందువలన ఈ విధానం ఏ విధంగా పరిశీలించినా సమంజసముగ లేదు. ఎందువలన అంటే..

1) ఈ సిద్ధాంతము భారతదేశ ఆచార, సాంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధం. దత్తత స్వీకారం హిందు న్యాయశాస్త్ర సమ్మతము, మరియు సాంప్రదాయం. దత్త కుమారునకు వ్యక్తిగత ఆస్థినే కాకుండా రాజ్యంపై

సైతం హక్కు కలిగి వున్నాడు. కావున ఇది రాజకీయ కోణం పైన " భారతీయ ఆచార, వ్యవహారాలపై బ్రిటీష్ వారు జోక్యం" చేసుకొన్నట్లయింది. అందుకే అన్ని వర్గాలు వారు దీనిని వ్యతిరేకించారు.

2) ఈ విధానం మూలసూత్రం 'బలమున్న వారిదే రాజ్యం' అను సూత్రంను అనుసరించినట్లుంది. ఎందుకంటే ఏ ఒక్క ప్రాంతాన్ని ఆక్రమించేందుకు డల్ హౌసీ కారణం చూపలేదు. కరౌలీ, ఉదయపూర్, భగత్ ప్రాంతాలను తిరిగి వారికి కానింగ్ ప్రభుత్వం అప్పచెప్పడంలో వారిది అన్యాయ ఆక్రమణ అని ప్రజలు గుర్తించారు.

3) దీనికితోడు భారతీయ సాంస్థానాధీశుల వాదనలను వినిపించడానికి న్యాయస్థానాలు కల్పించకపోవడం ప్రజలలో, పాలకులలో భయాందోళనలు కల్పించినట్లయింది.

4) ఈ సిద్ధాంతం భారతీయ స్వదేశీరాజులలో భయాందోళనలను కల్గించి,1857 తిరుగుబాటుకు దోహదం చేసెను.

5) ఆంగ్ల ఉద్యోగులయిన లారెన్స్, స్లీమన్ లాంటి వారు దీనిని వ్యతిరేకించడం గమనించినట్లయితే ఇది ఎంత అన్యాయ ఆక్రమణోతెలుస్తుంది.

## 2.3 1857 తిరుగుబాటుకు కారణములు :

ఆధునిక భారతదేశ చరిత్రలోనే గాక, ఆధునిక బ్రిటీష్ వారి చరిత్రలో (200 సం॥లపాలన) జరిగిన ముఖ్య సంఘటనగా 1857 తిరుగుబాటును చెప్పవచ్చును. క్రీ.శ. 1600 లలో వర్తకం కొరకు భారతదేశంలో అడుగుపెట్టిన తూర్పు ఇండియా వర్తక సంఘం 1757 నాటికి రాజకీయ ఆరంగేట్రం చేసి, వంద సంవత్సరాలలోపే యావత్ భారతదేశం అంతటా పాగా వేసింది. అలాంటి పాలనను తుదముట్టించిన సంఘటన ఈ 1857 తిరుగుబాటు.

1857 తిరుగుబాటు స్వభావం, ప్రభావం, పరిణామాలను ఆధారంగా చరిత్రకారులు అనేక వాదనలను వినిపించిరి. అందులో లారెన్స్, స్మిత్, మార్షమెన్ లాంటి చరిత్రకారులు దీనిని కేవలం ' సిపాయిల పితూరి ' లేక ' సిపాయిల తిరుగుబాటుగా' వర్ణించిరి. దీనిని ప్రారంభించింది, చాలావరకు ఉద్యమాన్ని నిర్వహించింది వారే కావున వారు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాని ఆర్.సి. మజుందార్ నాయకత్వంలో చరిత్రకారులు దీనిని హిందువులు, మహ్మదీయులు కలిసి బ్రిటీష్ (క్రైస్తవులు) వారిపై చేసిన తిరుగుబాటుగా వర్ణించారు. అయితే ఈ వాదనను చాలామంది అంగీకరించలేదు. మరి కొంతమంది చరిత్రకారులు దీనిని అంగ్లేయులకు (తెల్లవారికి) మరియు నల్లవారికి (భారతీయులకు) మధ్య జరిగిన జాతి సంఘర్షణ అని కూడ వ్యక్తపరిచిరి. దీనిని సైతం అంగీకరించడానికి వీలులేదు. ఎందుకంటే నాటికీ భారతీయులలో అంత జాతీయభావం లేదనే చెప్పాలి. వి.డి. సావక్కార్, అశోక్ మెహతా లాంటి చరిత్రకారులు ఈ తిరుగుబాటును "ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా" అభివర్ణించిరి. ఇదికూడ విపరీతమయిన అభిప్రాయమని, వాస్తవదూరమని మరికొంతమంది అభిప్రాయపడిరి.

అయితే తిరుగుబాటు సంఘటనలను పరిశీలించినట్లయితే చరిత్రకారుల అభిప్రాయాలన్ని వ్యక్తిగతమని, వాస్తవంగా ఇది హిందు, మహ్మదీయులు సఖ్యతతోగాని, భారతీయులందరూ దేశభక్తితో గాని లేదా బ్రిటీష్ వారిపై వ్యతిరేకతతో గాని పాల్గొనలేదని చెప్పవచ్చు. అయితే దీనిని అనేక వివక్షలకు బలైన సిపాయిలు ప్రారంభించగా వంద సంవత్సరాలలో కంపెనీ ప్రభుత్వంచే భాధింపబడిన అనేక వర్గాలు ఇందులో పాల్గొన్నాయి. కావున దీనిని 1857 తిరుగుబాటు అనడం సమంజసమని లేదా భవిష్యత్ లో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఏర్పడిన భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాంది లేదా మొదటి మెట్టు అని చెప్పవచ్చు.

1757 రాజకీయ ఆరంగ్రేటం చేసి, రాజకీయ కాంక్షతో చేపట్టిన బ్రిటీష్ వారి విధానాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయి. అలాంటి వాటిలో 1806 వెల్లూరు తిరుగుబాటు, 1824 లో బరక్పూర్, బెంగాల్ తిరుగుబాట్లు, గిరిజన తిరుగుబాట్లు, రైతు ఉద్యమాలు ముఖ్యమైనవిగా చెప్పవచ్చును. వాటన్నిటికంటే ముఖ్యమైన తిరుగుబాటు 1857 లో జరిగిన తిరుగుబాటు. దీనికి అనేక కారణములు కలవు. వాటిలో ముఖ్యమైనవి.

**1) రాజకీయ కారణములు లేదా డల్హౌసి రాజ్య సంక్రమణ సిద్ధాంతం :**

1857 తిరుగుబాటుకు ప్రముఖ కారణము 100 సం ll ల పాటు పాలించిన కంపెనీ ప్రభుత్వం పాటించిన రాజకీయ విధానాలని చెప్పవచ్చును. సామ్రాజ్య కాంక్షతో అనేక యుద్ధాలను చేయడం, స్వదేశీపాలకులను ఓడించడం, కొన్ని ప్రాంతాలను దౌర్జన్యంగా ఆక్రమించడం లాంటి సందర్భాలలో స్థానికులు కంపెనీ వారిని వ్యతిరేకించడం ప్రారంభించారు. యుద్ధ కాలంలో ఎంతోమంది స్వదేశీ సైనికులు నిరుద్యోగులై కంపెనీ వారి పట్ల ద్వేషాన్ని పెంచుకున్నారు. వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతి ఈ కోవకే చెందినది. వీటన్నింటిని మించి డల్ హౌసీ పాటించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతం రాజకీయంగా దుమారం లేపింది. హిందూ సాంప్రదాయాలను కాలరాస్తూ దత్తత స్వీకార పద్ధతిని పాటించకపోవడం హిందువులను, పాలకులను ఎంతో బాధించింది. ముఖ్యంగా రక్షణ రాజ్యమయిన అయోధ్యను కూడ ఆక్రమించుకోవడం బ్రిటీష్ వారి అనుకూలురులో సైతం భయోత్పతాన్ని సృష్టించింది. ఈ నేపథ్యంలో తిరుగుబాటును ప్రారంభించినది సిపాయిలే అయినా, ఉ ద్యమాన్ని భుజాలమీద నడిపించింది నాగపూర్, అయోధ్య, ఝాన్సీ పాలకులు. వీరందరూ కూడా రాజ్యసంక్రమణ సిద్ధాంత బాధితులే కావడం గమనార్హం. కావున డల్ హౌసీ "రాజ్యసంక్రమణ సిద్ధాంతం" 1857 తిరుగుబాటుకు ముఖ్యకారణం అని చెప్పడంలో న్యాయముంది.

జమీందారులు, తాలుకాదార్లు సైతం కంపెనీ ప్రవేశపెట్టిన రాజకీయ విధానాల వలన నష్టపోయిన వారే. వారంతా 1857 తిరుగుబాటులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాల్గొన్నారు. ఇంకను రైతులు, వ్యవసాయదారులు, వృత్తి వర్గాలవారు కంపెనీ వారి విధానాల వలన విపరీతంగా దెబ్బతిన్న వర్గాల వారు సైతం చాలమంది ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

**2. సాంఘీక కారణాలు :**

భారతీయ సంస్కృతిని, నాగరికతను సంస్కరించడానికి కంపెనీ ప్రభుత్వం చేపట్టిన విధానాలు భారతీయ ప్రజలలో నమ్మకాన్ని కల్పించలేకపోయాయి. సాంఘిక దురాచారాలయిన సతీసహగమనం, బాల్యవివాహాలు, నరబలి, వితంతు

వివాహములను రద్దుచేయడం, స్త్రీ విద్యను ప్రోత్సహించుట మొదలగు చర్యలు సంఘాన్ని సంస్కరించడంకు బాగా ఉపయోగ పడినాయి. అయితే ఇవన్నియు కూడ క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయడంలో భాగమేకాని, హిందూ సమాజాన్ని సంస్కరించడం కాదు అని సాంప్రదాయ వాదులయిన బ్రాహ్మణులను ఒప్పించ లేకపోయింది. దానికితోడు క్షామ పరిస్థితులు, కరువు కాటకాలు, ప్రకృతి వైపరిత్యాలు మతమార్పిడులకు క్రైస్తవ పాలకులు పాల్పడడం కూడ వారి అనుమానానికి ఊతమిచ్చాయి. మతమార్పిడి చేసుకున్న వారికి తండ్రి ఆస్థిలో హక్కును కల్పించడము, రైల్వేలు యందు అణగారిన వర్గాల వారిని అనుమతించడం కూడ వర్ణ వ్యవస్థను దెబ్బ తీయడమేయని వారు అనుమానించారు. ఈ విధంగా మతసంస్కరణలకు కంపెనీ పాలకులు చేపట్టిన చర్యలు భారతీయుల నమ్మకాన్ని సంపాదించ లేకపోయాయి.

**3. మతపరమైన కారణములు :**

కంపెనీ పాలకులు హిందూమతం పట్ల హిందూ ప్రజల పట్ల వ్యవహరించిన తీరు కూడ భారతీయుల హృదయాలను గెలవలేకపోయింది. హిందూ మత మార్పిడులను లక్ష్యంగా పెట్టుకోవడం, క్రైస్తవ మిషనరీలను హిందూ మత మార్పులకు వాడుకోవడం వారు సహించ లేకపోయారు. భారతీయులందరిని క్రైస్తవ మతంలోనికి మార్చుటే భారతదేశ ఆక్రమణలోని ఆంగ్లేయుల తుది లక్ష్యమని మేజర్ ఎడ్వర్డ్స్ లాంటి వారు తరుచూ ప్రకటించే మాటలు యావత్ హిందూ జాతిని కలవరపెట్టింది.

1813 చార్టర్ చట్టం ద్వారా క్రైస్తవ మిషనరీలను నియమించడం, విద్యా సంస్థలలో బైబిల్ బోధనను నిర్బంధము చేయడం, ఆంగ్ల భాషను రాజభాషగా ప్రకటించడం మొదలగు కంపెనీ చర్యలు హిందూ మతాన్ని భారతదేశంలో కనుమరుగు చేయడానికే అని ప్రజలు అభిప్రాయపడి, కంపెనీ పాలన అంతం కొరకు వేచి చూసిరి.

**4. ఆర్థిక కారణములు :**

భారతదేశ ఆదాయాన్ని మాతృదేశానికి తరలించడమే లక్ష్యంగా కంపెనీ చేపట్టిన ఆర్థిక దోపిడి విధానం భారతదేశంలోని అన్ని వర్గాలను దెబ్బతీసింది. యుద్ధాల ద్వారా అనేక రాజ్యాలను ఆక్రమించడం ద్వారా ఆయా దేశాల సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు నిరాశ్రయులై ప్రభుత్వంపై కక్ష పెంచుకొనిరి. పారిశ్రామిక విప్లవం ద్వారా జరిగిన అధిక ఉత్పత్తికి భారత దేశాన్ని వస్తు మార్కెట్ గా మార్చాలని పూనుకోవడంతో మన దేశంలోని కుటీర పరిశ్రములు కుదేలయ్యాయి. తద్వార లక్షలాది కుటుంబాలు తమ ఆదాయాలు పోగొట్టుకొని నిర్భాగ్యులయినారు. అదేవిధంగా ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు బయలుదేరి ఆహారం కొరతతో గ్రామీణ కుటుంబాలు అల్లాడి పోయినాయి. ఇలాంటి పరిస్థితులలో తరచూ దేశంలో సంభవించిన కరువు కాటకాలు, ప్రకృతి వైపరిత్యాలు సామాన్య ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేశాయి. దీనికి తోడు కంపెనీ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించి పన్నులను బలవంతంగా వసూలు చేయడంతో ప్రజలు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురియై కంపెనీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించారు.

**5. సైనిక పరమైన కారణములు :**

1857 తిరుగుబాటుకు అతి ముఖ్య కారణం సైనికుల పరిస్థితి. కంపెనీ కొలువులో సైనిక ఉద్యోగం చేసే భారతీయులే సిపాయిలు. బ్రిటీష్ సైనికులు, సిపాయిలతోపాటు సైనిక విధులను నిర్వర్తించినప్పటికి జీతభత్యాలు, పదోన్నతుల విషయంలో వీరిద్దరి మధ్య చాలా తేడా ఉంది. సిపాయిలు సైన్యంలో చేరిన స్థితిలోనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. కాని దీనికి పూర్తి భిన్నంగా బ్రిటీష్ సైనికులు తమ సామర్థ్యాన్ని బట్టీ ఏ స్థాయికైన ఎదగవచ్చు. ఈవిధంగా సైనికులకు, సిపాయిలకు మధ్య ఉన్న ఈ తేడాతో సిపాయిలు ప్రభుత్వం పట్ల చాలా కోపంగా ఉన్నారు. అనేక సందర్భాలలో తమ సముచిత సమస్యల కొరకు తిరుగుబాటులను చేశారు. అయితే వాటిని సులభంగా ప్రభుత్వం అణచి వేసింది.

ఇలాంటి నేపథ్యంలో రెండవ బర్మా యుద్ధంలో పాల్గొన వలెనని “సామాన్య సేనాని యుక్త చట్టం” (జనరల్ సర్వీస్ ఎనలిస్ట్ మెంట్ యాక్ట్) చేసి నిర్బంధ్వంగా పాల్గొనాలని నిర్ణయించారు. కాని హిందూధర్మశాస్త్రం ప్రకారం సముద్రయానం నిషేదించడమయింది. అంతేగాక సైనికులందరూ సమానమని, గడ్డం పెంచుట నిషేదమని, తలమీద జుట్టును కత్తిరించమని ఆజ్ఞాపించడం అటు మహ్మదీయుల, శిక్కుల మరియు హిందువుల మతభావాలను గాయపరచినట్లయింది. ఇదే సమయంలో ఆంగ్లేయులు చైనా, క్రిమియా యుద్దాలలో నిమగ్నం కావడం కూడ సిపాయిలను తిరుగుబాటుకు ఊతమిచ్చింది. అందులో భారత్ లో ఉన్న ఎక్కువమంది సైనికులు పంజాబ్ ప్రాంతంలో ఉన్నారు.

ఇలాంటి నేపథ్యంలో సిపాయిలు తుపాకులలో ఉపయోగించే తూటాలపై ఆవు కొవ్వు, పంది కొవ్వు పూయబడినది అనే వదంతి వ్యాపించెను. ఆవు హిందువులకు పవిత్రంకాగా, పంది మహమ్మదీయులకు అసహ్యం. దీనితో హిందూ, ముస్లిం సిపాయిల తుపాకులు వాడటాన్ని నిరశించి తిరుగుబాటుకు సన్నాహాలు ప్రారంభించిరి.

## 2.4 1857 తిరుగుబాటు గమనం :

ఇలాంటి పరిస్థితులలో 34వ జాతీయ పటాలం, బరక్పూర్లోని సైన్యం నూతన ఎన్ఫీల్డ్ రైఫిల్స్ ను ఉపయోగించమని లేని పక్షంలో తీవ్రచర్యలు ఉంటాయని హెచ్చరించింది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన మంగల్పాండే అనే యువకుడు మార్చి 29,1857న బ్రిటీష్ అధికారులపై కాల్పులు జరిపి వారి మరణానికి కారణమయ్యెను. బ్రిటీష్ ప్రభుత్వం ఇతనిని బంధించి ఏప్రియల్ 8,1857 బహిరంగంగా ఉరితీయడంతో విప్లవం ప్రారంభమయ్యెను.

34వ బెటాలియన్ లోని మొత్తం సిపాయిలు తిరుగుబాటు చేసి ఆంగ్ల అధికారులను వధించి మీరట్ లో మే,10,1857న సమావేశమయ్యిరి. అక్కడి నుంచి ఢిల్లీకి చేరి మొగల్ చక్రవర్తి రెండవ బహదూర్ షాను భారతదేశ పాలకునిగా ప్రకటించిరి. దీనితో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో తిరుగుబాట్లు ప్రారంభమయ్యెను.

**ఢిల్లీ :** ఢిల్లీలో జరిగిన తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వాడు రెండవ బహదూర్ షా మరియు అతని మంత్రి మీర్ భక్షి భక్త్ ఖాన్. దీనితో బ్రిటీష్ ప్రభుత్వం జాన్ నికల్సన్ ను తిరుగుబాటు అణచివేతకు నాయకునిగా నియమించెను. అంతట

నికల్సన్ ఎంతో నేర్పరితనంతో సిపాయిల తిరుగుబాటును, అణచడంలో కృతకృత్యుడయినప్పటికి, ఆ పోరాటంలో అతను అశువులుబాయక తప్పలేదు.

అయితే అతని మరణానంతరం నాయకత్వం వహించిన జనరల్ హడ్సన్ తిరుగుబాటుదార్లను తీవ్రంగా అణచి బహదుర్షా, అతని కుటుంబసభ్యులను బందించి రంగూన్ కు ఖైదీగా పంపెను. అక్కడే బహదుర్షా 1862 లో మరణించడంతో మొగల్ పాలన అంతమయ్యెను.

**కాన్పూర్:**

దౌంత్ పంత్ అలియాస్ నానాసాహెబ్, కాన్పూర్లో సిపాయిల తిరుగుబాటుకు నాయకత్వం వహించెను. ఇతను చివరి పీష్వా రెండవ బాజీరావు దత్త పుత్రుడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతం ఇతనికి రావలసిన పెన్షన్ను నిలిపివేసింది. దానితో ఆగ్రహం చెందిన నానాసాహెబ్ అజీముల్లాఖాన్, తాంతియాతోపేల సహాయంతో తిరుగుబాటును కొనసాగించి తీవ్రంగా ప్రతిఘటించెను. అయితే మేజర్ జనరల్ క్యాంప్ బెల్ నాయకత్వంలోని బ్రిటీష్ సైన్యం చేతిలో ఓడిపోయి , నేపాల్ కు పారిపోయాను . కాని తాంతియాతోపే చంబల్ లోయలో గేరిల్లా పద్ధతుల ద్వారా తీవ్రంగా ప్రతిఘటించెను. దురదృష్ట వశాత్తు మాన్ సింగ్ అనే స్థానిక అధికారి లోపాయకారిగా బ్రిటీష్ వారికి సహాయం చేసి ఇతనిని పట్టించెను. 1859లో తాంతియా తోపే ఉరితీయబడ్డాడు.

**అయోధ్య / లక్నో:**

లక్నో ప్రాంతంలో జరిగిన తిరుగుబాటుకు నాయకత్వం వహించింది చివరి అయోధ్య నవాబ్ సతీమణి హజ్రత్ మహల్. తిరుగుబాటు చేసిన సిపాయిల సహాయంతో మహల్ తన మైనర్ కుమారుడు బ్రిజిస్ ఖాదర్ ను నవాబుగా ప్రకటించెను. దీనితో బ్రిటీష్ ప్రభుత్వం హెన్రీ లారెన్స్, హావ్ లాక్ , జనరల్ నీల్ నాయకత్వంలో సైన్యాన్ని పంపి తిరుగుబాటును అణిచివేసింది. హజ్రత్ మహల్ నేపాల్ కు పారిపోయింది.

**ఝాన్సీ:**

1857 తిరుగుబాటు సందర్భంగా బ్రిటీష్ వారిని ఎదిరించిన వీర వనిత ఝాన్సీ పాలకురాలయిన లక్ష్మీభాయ్. రాజ్య సంక్రమణ సిద్ధాంతముతో రాజ్యమును, భరణమును కోల్పోయిన లక్ష్మీభాయి 1857 తిరుగుబాటును పురస్కరించుకొని బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రారంభించెను. డన్లప్ నాయకత్వంలోని బ్రిటీష్ సైన్యాన్ని ఓడించి డన్లప్ ను సైతం వధించడం జరిగింది. దీనితో ఆగ్రహించిన ప్రభుత్వం సర్ హ్యూరోస్ నాయకత్వంలో సైన్యాన్ని పంపింది. లక్ష్మీభాయ్ కు మహారాష్ట్రులు, తాంతియాతోపే, రావు సాహబ్ లు సహాయం అందించగా, ఆమె పురుష దుస్తులు ధరించి యుద్ధభూమిలో అసమాన ధైర్య సాహసములు ప్రదర్శించింది. అయితే దురదృష్టవశాత్తు యుద్ధ భూమిలో వీరమరణం పొందింది. "విప్లవకారులలో అతి ధైర్యవంతురాలు, గొప్ప నిపుణతగల నాయకురాలు, తిరుగుబాటుదార్లలో ధృవతారవంటిది" అని సాక్షాత్తు సర్ హ్యూరోస్ పొగడడం గమనార్హం.

**బీహార్లోని జగదీశ్ పూర్ :**

బీహార్ లో జరిగిన తిరుగుబాటులకు నాయకత్వం వహించిన వాడు, కున్వర్ సింగ్. ఇతనికి ‘ బీహార్ కేసరి ’ అనే బిరుదు కూడా కలదు. జగదీశ్ పూర్ ను బ్రిటీష్ వారు ఆక్రమించడంతో కున్వర్ సింగ్ తిరుగుబాటును లేవదీశాడు. అయితే విలియం టేలర్, విన్సెంట్ అమ్యర్ ల చేతిలో ఇతను మరణించాడు.

**హైదరాబాదు :**

రొహిల్లా నాయకుడయిన తుర్రెబాజ్ ఖాన్ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటును లేవదీయగా హైదరాబాద్ నిజాం అఫ్జదుద్దౌలా, ప్రధానమంత్రి సాలార్జంగ్ లు సులభంగా అణచివేసి అతనిని బందించి బహిరంగంగా ఉరితీశారు.

ఇంకను వారణాసిలో మౌల్వి లియాఖత్ ఆలీ, బరేలిలో ఖాన్ బహదూర్ ఖాన్, ఫైజాబాద్ లో మౌల్వి ఆహ్మదుల్లా లు తిరుగుబాటు చేయగా బ్రిటీష్ వారు వాటిని సులభంగా అణచివేశారు.

## 2.6 తిరుగుబాటు విఫలతకు కారణాలు :

మీరట్ లో బ్రిటీష్ అధికారులను వధించి ఢిల్లీ వరకు విజయవంతంగా నడిచి, ఢిల్లీలో సైతం కంపెనీ వారిని ఓడించి రెండవ బహదూర్ షాను చక్రవర్తిగా ప్రకటించుకున్న తిరుగుబాటుదార్లు తర్వాత విజయం సాధించలేకపోయారు. దీనికి అనేక కారణములు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి.

1. తిరుగుబాటు దేశవ్యాప్తంగా జరుగక, కేవలం ఉత్తరప్రదేశ్, అయోధ్య, రోహిల్ ఖండ్, బీహార్, బెంగాల్లోని పశ్చిమ ప్రాంతాలకు పరిమితమయింది. దానితో బ్రిటీష్ వారు తిరుగుబాటుదారులను అణచడం సులభమయ్యింది. దక్షిణ భారతదేశంపై దీని ప్రభావమే లేదు.

2. తిరుగుబాటుదార్లకు దేశవ్యాప్తంగా మద్దతు దొరకకపోగా, ఎక్కువ మంది ప్రజలు మరియు స్వదేశీ రాజులు బ్రిటీష్ వారికి మద్దతివ్వడం ద్వారా తిరుగుబాటు స్వభావం బలహీనమయ్యింది. రాజపుత్ర వీరులు, శిక్కులు, గుర్ఖాలు మరియు అనేకమంది సంస్థానాధిపతులు ఆంగ్లేయులకు బాసటగా నిలవడంతో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం సైతం నీరుగారింది.

3. తిరుగుబాటుదార్లకు సరియైన నాయకత్వం లేకపోవడం కూడ వారు ఓడిపోవుటకు మరొక కారణంగా తెలియుచున్నది. ఉద్యమంను ప్రారంభించిన సిపాయిలకు నాయకుడే లేకపోగా, కాకతాళీయంగా ఎన్నుకున్న బహదూర్ షా సైతం వయోవృద్ధుడు. ఇతర నాయకులు నానాసాహెబ్, లక్ష్మీభాయి తదితరులకు దేశవ్యాప్తంగా ఉద్యమంను జరిపే సామర్ధ్యములు లేవు.

దానిక భిన్నంగా ఆంగ్లేయ సైన్యం లారెన్స్, సర్ హ్యూరోస్, హావ్ లాక్, నికల్సన్ లాంటి సమర్దులయిన సేనాధిపతుల ఆధ్వర్యంలో సైన్యం ఆంగ్లేయులకు దొరకడం ద్వారా సులభంగా ఉద్యమంను నిర్వీర్యం చేశారు.

**4.** భవిష్యత్తు ఊహించి కంపెనీవారు భారతదేశంలో అభివృద్ధి చేసిన రైల్వే, తంతి, తపాలా సౌకర్యములు, ఆధునిక ఆయుధములు, సైనిక, నౌకాధళముల వలన సులభంగా తిరుగుబాటుదార్ల చర్యలను కట్టడి చేయగలిగారు. సిపాయిలు ఉపయోగించిన సాంప్రదాయ ఆయుధాలు కత్తులు, ఈటెలు, డాలు వంటి వాటితో అజేయులయిన ఆంగ్లేయులను ఓడించడం ఊహకందని విషయం.

**5.** సిపాయిలకు నిర్ణీతమయిన పథకం, నిర్దిష్టమయిన ప్రణాళిక ఆశయం లేకపోవడం కూడ వారి ఓటమికి కారణమని చెప్పవచ్చును. ఢిల్లీలో కంపెనీ వారిని ఓడించేంత వరకు దేశనాయకుని గురించి ఆలోచించలేదు. ఢిల్లీ విజయానంతరం ఏమీ చేయాలనే ఆలోచనే లేదు. అంతలోపల బ్రిటీష్ వారు జోక్యం చేసికొని తిరుగుబాటుదార్లను ఓడించారు. నానాసాహెబ్ పీష్వా పదవి కొరకు, దత్తత అంగీకారం కొరకు లక్ష్మీభాయి, హజ్రత్ మహల్ తమ అయోధ్య కొరకు పోరాడిరి గాని వీరిలో ఐకమత్యం, దేశభక్తి ఎక్కడ కన్పించలేదు.

**6.** తిరుగుబాటు దారులకు ప్రజల నుంచి ఎక్కువ మద్దతు లభించక పోవడానికి మరొక కారణము నాటి వైశ్రాయి లార్డ్ కానింగ్ ఔదార్యం. కానింగ్ సామాన్య ప్రజలను దయార్ద్ర హృదయముతో చూసి 'దయామయుడయిన కానింగ్' అనే బిరుదును పొందెను. దానితో ప్రజలు ఎవ్వరు కానింగ్ కు వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రాలేదు.

**7.** తిరుగుబాటుదార్లు ఆశించినట్లు ఇతర రాజులు ముఖ్యంగా ఆఫ్ఘన్ రాజు, స్వదేశీ రాజుల నుంచి ఊహించిన సహాయం అందలేదు. దానికితోడు సిపాయిల తమ తిరుగుబాటులో భాగంగా సామాన్య ప్రజలపై దాడులు చేశారు. అవి ప్రజలకు నచ్చక వారిని ద్వేషించిరి.

## 2.6 1857 తిరుగుబాటు పరిణామాలు :

1857 మార్చి నుంచి 1858 వరకు జరిగిన తిరుగుబాటు విఫలము చెందినప్పటికి అనేక రంగాలలో ఘణనీయమయిన మార్పులకు శ్రీకారం చుట్టింది. భారతదేశంలోని బ్రిటీష్ పరిపాలన రంగంలో, నిర్మాణం విధానాలలో సమూల మార్పులకు దారి తీసింది. 1857 తిరుగుబాటుకు కంపెనీ అసమర్థ పాలనే యని బ్రిటీష్ పార్లమెంట్ నిర్ధారించి వాటిని అరికట్టుటకు "నిర్దిష్టమయిన హెచ్చరిక విధానమును" (ఎ కాషియస్ పాలసీ) ను రూపొందించెను.

**అందులో ముఖ్యమైనవి :**

**ఎ) పరిపాలన మార్పులు :**

1858 లో బ్రిటీష్ పార్లమెంట్ "1858 భారత ప్రభుత్వ చట్టం"ను రూపొందించెను.

దీని ప్రకారం

- కంపెనీ పరిపాలన అంతమై భారతదేశ పరిపాలన అధికారాలను బ్రిటీష్ రాజరికంనకు (రాజు/ రాణి) అప్పగించబడెను.
- గవర్నర్ జనరల్ పదవిని భారతదేశపు రాజ ప్రతినిధి లేదా వైశ్రాయి గా మార్చడమైనది. ఇతను రాజరికంనకు ప్రత్యక్ష ప్రతినిధి. లార్డ్ కానింగ్ మొదటి రాజ ప్రతినిధిగా మారెను.
- బోర్డ్ ఆఫ్ కంట్రోల్, బోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ రద్దయి వాటిస్థానంలో “భారత రాజ్య వ్యవహారాల మంత్రి” నియమించబడెను. మొదటి కార్యదర్శిగా లార్డ్ స్టాన్లీ నియమించబడెను.
- పరిపాలన చక్కపరుచుటకు 1861లో ఇండిన్ సివిల్ సర్వీస్ చట్టం (1861), జాతీయ పోలీస్ చట్టం (1861) భారత ఉన్నత న్యాయస్థానం చట్టం (1861), మరియు ఇండియన్ కౌన్సిల్ల చట్టం (1861) లను బ్రిటీష్ ప్రభుత్వం జారీ చేసింది.
- భారతదేశ సైన్యంలో హిందువును, ముస్లింలను తొలగించి వారి స్థానంలో శిక్కులు, గుర్ఖాలు నియమించబడ్డారు.
- సైన్యంలో భారతీయ పటాలంలను తగ్గించి బ్రిటీష్ సైన్యంను పెంచారు. సిపాయిలు మరియు బ్రిటీష్ సైన్యంను 6:1 నుంచి 2:1 (బెంగాల్), 3:1 (మద్రాస్, బొంబాయి) నిష్పత్తిలో తగ్గించారు.

**బి) పరిపాలన విధానంలో మార్పులు :**

భవిష్యత్లో 1857 తిరుగుబాటు లాంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదనే ఉద్దేశ్యంతో అనేక విధానములను రూపొందించారు.

**విక్టోరియా ప్రకటన / భారతీయ హక్కుల ప్రకటన :**

మొదటి వైశ్రాయి లార్డ్ కానింగ్ నవంబర్ 1,1858న రాయల్ ప్రకటనను ప్రకటించెను. చరిత్రలో దీనిని విక్టోరియా ప్రకటనయని అందురు. మరికొంతమంది చరిత్రకారులు దీనిని భారతీయుల హక్కుల ప్రకటన (The Magna carta of the Indian People) యని కూడా అందురు. అలహాబాద్ లోని దర్బార్ హాల్ నందు దీనిని ప్రకటించడం జరిగింది. ఇందులోని ముఖ్యాంశములు :

- ➢ తూర్పుఇండియా వర్తక సంగం సామ్రాజ్య కాంక్ష విధానం రద్దయింది. భవిష్యత్ లో ఎలాంటి దురాక్రమణలు భారత్ లో జరగవు. రాజ్య సంక్రమణ సిద్ధాంతం కూడ 1859 లో విరమించడం జరిగింది. 1857 తిరుగుబాటు కాలంలో స్వదేశీ పాలకులు చేసిన సేవను బ్రిటీష్ ప్రభుత్వం గుర్తించారు.

- బ్రిటీష్ ప్రభుత్వం భారతీయుల సాంఘిక, మత సంస్కృతి విషయాలలో జోక్యం చేసుకోదని హామీ ఇచ్చారు.
- తిరుగుబాటు కాలంలో హిందూ – ముస్లిం ల మధ్య కొనసాగిన ఐకమత్యాన్ని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం క్రమపద్ధతిలో వారిమధ్య సఖ్యతను దెబ్బతీయడానికి విభజించి పాలించు విధానంను పాటించిరి.

## 2.7 సంగ్రహంగా :

రాబర్ట్ క్లైవ్, వారెన్ హేస్టింగ్ లు ప్రారంభించిన కంపెనీ విస్తరణ, పరిపాలన విధానమును పూర్తిచేసినవాడు డల్ హౌసీ. రాజ్య సంక్రమణ సిద్ధాంతమును అమలుపరచి పుత్ర సంతానం లేని రాజ్యాలను ఎలాంటి శాస్త్రీయత లేకుండ ఆక్రమించెను. తంతి, తపాల, రైలు మార్గాలను అభివృద్ధి చేసి ఆధునిక భారతదేశ నిర్మాతగా వాసికెక్కెను.

1857లో సిపాయిల నాయకత్వంలో పాల్గొన్న వారంతా రాజ్యసంక్రమణ సిద్ధాంత బాధితులే. కంపెనీ ప్రభుత్వం పాటించిన రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక విధానాలు భారతీయులలో తీవ్ర అసంతృప్తిని మిగిల్చెను.సిపాయిలు తోటి ఆంగ్ల సైనికులతో తమకు సమానమైన గౌరవం, హెూదా, పదోన్నతులు సాంప్రదాయాలలో తలదూర్చడం లాంటి కారణములతో తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. నూతన ఆయుధాల తూటాల వాడకంలో ఆవుకొవ్వు, పంది కొవ్వు పూతలు వారిని తిరుగుబాటుకు ప్రోత్సహించాయి.మంగల్ పాండే తిరుగుబాటుతో ప్రారంభమయి ఢిల్లీలో కంపెనీ ప్రభుత్వాన్ని పడగొట్టి రెండవ బహదూర్ షాను పాలకునిగా నియమించిరి. అప్రమత్తమైన బ్రిటీష్ ప్రభుత్వం జోక్యం చేసుకొని తిరుగుబాటుదారులను పూర్తిగా అణచివేసెను. నానాసాహెబ్, లక్ష్మీభాయి, హజ్రత్ మహల్, తాంతియా తోపే మొదలగు వారు బ్రిటీష్ వారిని తీవ్రంగా ప్రతిఘటించిరి.

1857 తిరుగబాటు అనంతరం కంపెనీపాలన అంతమై, బ్రిటీష్ రాజరికం భారతదేశంలో ప్రారంభమయ్యెను.

పరిపాలన రంగంలో, పరిపాలన విధానంలో అనేక మార్పులు చోటుచేసికొనెను. విక్టోరియా రాణి ప్రకటనను ‘ భారతదేశం మాగ్నా కార్టా’ గా అభివర్ణించవచ్చును.

## 2.8 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 2.8.1 వ్యాసరూప ప్రశ్నలు :

1. డల్ హౌసీ రాజ్యసంక్రమణ సిద్ధాంతము వర్ణించి దాని ఫలితాలను వివరింపుము?
2. సిపాయిల తిరుగుబాటు కారణాలను గమనంను వివరించండి?
3. సిపాయిల తిరుగుబాటు విఫలతకు గల కారణములను వివరించండి?
4. సిపాయిల తిరుగుబాటు పరిణామాలను చర్చించండి?

**2.8.2 లఘుప్రశ్నలు :**

1. రాజ్య సంక్రమణ సిద్ధాంతము
2. అయోధ్య ఆక్రమణ
3. మంగళ్ పాండే
4. ఝాన్సీ లక్ష్మీభాయి
5. విక్టోరియా ప్రకటన
6. నానాసాహెబ్

**2.8.3 బహుళైచ్ఛిక ప్రశ్నలు :**

1) రాజ్యసంక్రమణ సిద్ధాంతమును అమలుపరిచిన గవర్నర్ జనరల్ ?

ఎ) కార్న్ వాలిస్ బి) వెల్లస్లీ సి) డల్ హౌసీ డి) కానింగ్

2) రైల్వేలను భారతదేశలో ఎవరికాలంలో ప్రవేశపెట్టబడినాయి?

ఎ) కార్న్ వాలిస్ బి) వెల్లస్లీ సి) డల్ హౌసీ డి) కానింగ్

3) 1857 తిరుగుబాటును ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా వర్ణించిన చరిత్రకారుడు?

ఎ) రొహిల్లా థాపర్ బి) వి.డి. మహజన్ సి) వి.డి. సావర్కార్ డి) ఎమ్. వేంకటరంగయ్య

4) 1857 తిరుగుబాటు కాలంలో గవర్నర్ జనరల్ ఎవరు?

ఎ) వెల్లస్లీ బి) డల్ హౌసీ సి) కానింగ్ డి) బెంటింగ్

5) కాన్పూర్ 1857 తిరుగుబాటు నాయకుడు అసలు పేరు ఏమి?

ఎ) శివాజీ బి) శంభూజీ సి) దౌంత్ పంత్ డి) రమాకాంత్

6) అయోధ్య తిరుగుబాటు నాయకురాలు ఎవరు?

ఎ) చాంద్ బీబీ బి) దుర్గాభాయి సి) హజ్రత్ మహల్ డి) నూర్ మహల్

7) హైదరాబాద్లో జరిగిన 1857 తిరుగుబాటు నాయకుడు ఎవరు?

ఎ) సాలార్జంగ్ బి) నిజాం అఫ్జుదుద్దౌలా సి) తుర్రేబాజ్ ఖాన్ డి) కున్వర్ సింగ్

8) 1861 లో జారీ అయిన చట్టాలు

ఎ) ఇండియన్ సివిల్ సర్వీస్ బి) నేషనల్ పోలీస్ చట్టం
సి) ఇండియన్ హైకోర్టు చట్టం డి) ఇండియన్ కౌన్సిళ్ళ చట్టం

**జవాబులు : 1 – సి, 2 – సి, 3 – సి, 4 – సి,
5 – సి, 6 – సి, 7 – సి, 8 – సి.**

**2.8.4. జతపరుచుము :**

| | | | |
|---|---|---|---|
| **I)** | 1) డల్హౌసి | ఎ) వి.డి. సావర్కార్ |
| | 2) సతారా | బి) స్మిత్ |
| | 3) ఝాన్సీ | సి) గంగాధర్ రావు |
| | 4) సిపాయిల పితూరి | డి) అప్పాసాహెబ్ |
| | 5) ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం | ఇ) రాజ్య సంక్రమణ సిద్ధాంతము |
| **II)** | 1) సాధారణ సేనా నియుక్త చట్టం | ఎ) దౌంత్ పంత్ |
| | 2) చైనా, క్రిమియా యుద్ధాలు | బి) తిరుగుబాటు ప్రారంభము |
| | 3) నికల్సన్ | సి) ఢిల్లీ |
| | 4) మంగళ్ పాండే | డి) 1857 తిరుగుబాటు |
| | 5) కాన్పూర్ | ఇ) లార్డ్ కానింగ్ |
| **III)** | 1) అయోధ్య | ఎ) చివరి మొఘల్ చక్రవర్తి |
| | 2) ఝాన్సీ | బి) తుర్రేబాజ్ ఖాన్ |
| | 3) బీహార్ | సి) కున్వర్ సింగ్ |
| | 4) హైదరాబాద్ | డి) సర్ హ్యూరోస్ |
| | 5) రెండవ బహదూర్ షా | ఇ) హజ్రత్ మహల్ |

**జవాబులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **I)** | **1 – ఇ,** | **2 – డి,** | **3 – సి,** | **4 – బి,** | **5 – ఎ.** |
| **II)** | **1 – ఇ,** | **2 – డి,** | **3 – సి,** | **4 – బి,** | **5 – ఎ.** |
| **III)** | **1 – ఇ,** | **2 – డి,** | **3 – సి,** | **4 – బి,** | **5 – ఎ.** |

**2.9 ఉపయుక్త గ్రంథాలు :**


1. వెంకట రంగయ్య మామిడిపూడి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర – మొదటి భాగం
2. సరోజినీ రదాని : High lights of Freedom Movement in A.P.
3. అల్లాడి వైదేహి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర
4. సుమిత్ సర్కార్ : Modern India (1885 – 1947) (Englih)
5. తార చంద్ : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Vol. – 3) (Englih)
6. మజుందార్ ఆర్. సి . : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Englih)
7. ముఖర్జీ హరి దాస్, ముఖర్జీ, ఉమ : The Origins of the National Movement (1905 – 1910)
8. దత్త కె. కె . : A Social History of Modern India.
9. బిపిన్ చంద్ర : India's Struggle of Independence
10. దత్ ఆర్. సి .: The Economic History of India in the Victorian Age.


**డా॥ బి. గంగాధర్**

# పాఠం – 3
# భారతదేశంలో వైస్రాయ్ ల పాలన

**లక్ష్యాలు :**

ఈ పాఠం అధ్యయనం తర్వాత విద్యార్థులు క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- వైస్రాయ్ ల కాలంలో భారతీయులు పొందిన పరిపాలన అనుభవం.
- లార్డ్ లిట్టన్ సంస్కరణలు భారతీయులను ఏవిధంగా జాగృతులను చేసింది.
- లార్డ్ రిప్పన్ ఏ విధంగా భారతీయులకు చిరస్మరణీయుడయినాడు.
- లార్డ్ కర్జన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు ఏ విధంగా జాతీయ భావనను ప్రేరేపించాయి.
- వైస్రాయ్ ల పాలన ఏవిధంగా జాతీయ ఉద్యమానికి బీజాలు వేసి బలోపేతం చేసింది.
- భారతదేశ విభజనకు కర్జన్ ఏవిధంగా బీజాలు వేసి ద్విజాతి సిద్ధాంతం అమలుపరిచాడు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


3.1 ఉపోద్ఘాతము

3.2 లార్డ్ లిట్టన్ పాలన విధానాలు

3.3 లార్డ్ రిప్పన్ పాలన – సంస్కరణలు

3.4 లార్డ్ కర్జన్ పాలనలోని ముఖ్య సంఘటనలు

3.5 సంగ్రహంగా

3.6 పరీక్ష నమూన ప్రశ్నలు

3.6.1 వ్యాసరూప ప్రశ్నలు

3.6.2 లఘుప్రశ్నలు

3.6.3 బహులైచ్ఛిక ప్రశ్నలు – సమాధానాలు

3.6.4 జతపరుచు ప్రశ్నలు – సమాధానాలు

3.7 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 ఉపోద్ఘాతము :

1857 తిరుగుబాటు అనంతరం భారతదేశంలో ప్రత్యక్షంగా అధికారం చేపట్టిన బ్రిటీష్ ప్రభుత్వం తమ ప్రతినిధులుగా వైశ్రాయ్ లేదా రాజప్రతినిధులను నియమించి పరిపాలన సాగించారు. అందులో మొదటగా లార్డ్ కానింగ్ ను నియమించి పాలన ప్రారంభించారు. అప్పటి నుంచి 1947 సంవత్సరములో భారతదేశం నుంచి బ్రిటీష్ వారు వెళ్ళేంత వరకు 20 మంది రాజ ప్రతినిధులు నిమయింపబడ్డారు. వారిలో ముఖ్యులు మొదటి వైశ్రాయ్ లార్డ్ కానింగ్, లార్డ్ మేయో, లార్డ్ లిట్టన్, లార్డ్ రిప్పన్, లార్డ్ కర్జన్, లార్డ్ ఇర్విన్, లార్డ్ వేవెల్, చివరి వైశ్రాయ్ లార్డ్ మౌంట్ బాటెన్ లు చాలా ముఖ్యులు. ఈ పాఠ్యాంశములో మనం లార్డ్ లిట్టన్, లార్డ్ రిప్పన్, లార్డ్ కర్జన్ ల కాలంలో జరిగిన ముఖ్య సంఘటనలను గురించి తెలుసుకుందాము.

## 3.2 లార్డ్ లిట్టన్ (1876 – 1880) కాలంనాటి సంఘటనలు :

అఫ్ఘనిస్థాన్ సమస్యకు సంబందించి లార్డ్ నార్త్ బ్రూక్ పదవీ విరమణ చేయడంతో లార్డ్ లిట్టన్ 1876 లో ఆరవ వైశ్రాయ్ గా పదవీ బాధ్యతలు చేపట్టెను. వైశ్రాయ్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆఫ్ఘన్ సంక్షోభం సమస్య పరిష్కారమునకు కృషి చేసి రెండవ ఆఫ్ఘన్ యుద్ధాన్ని 1879 లో ప్రారంభించెను. ఈ యుద్ధంలో ఘన విజయం సాధించి 'గాండమక్ సంధి' కి ఒప్పించి ఆఫ్ఘనిస్తాన్ను బ్రిటీష్ ఆధీనంలోనికి తెచ్చెను. బ్రిటీష్ ప్రభుత్వం 1876 లో రాయల్ టైటిల్స్ చట్టంను రూపొందించి క్వీన్ విక్టోరియాను క్వీన్ ఎంప్రెస్ ఆఫ్ ఇండియా లేదా కైసర్ ఇ హింద్ గా ప్రకటించింది. ఈ విషయాన్ని లార్డ్ లిట్టన్ 1877 లో ఢిల్లీలో దర్బార్ జరిపి ప్రకటించెను. ఈ విషయం తీవ్ర విమర్శలకు గురయ్యేను. అందుకనే ఇతనిని వైశ్రాయ్ అఫ్ రివర్స్ అని అంటారు.

### లిట్టన్ అంతరంగిక విధానము :

బ్రిటీష్ రాజ ప్రతినిధులలో భారతీయుల ప్రజాగ్రహానికి గురైన వారిలో ముఖ్యుడు లార్డ్ లిట్టన్. తాను పాలించిన నాలుగు సం॥ల పాలనాకాలంలో అనేక ప్రజా వ్యతిరేక సంస్కరణలు చేపట్టి ఒకవైపు ప్రజాగ్రహానికి గురికావడమేగాక భారతీయులలో జాతీయ భావం రావడానికి కూడ పరోక్షంగా కారణమయ్యెను.

వాటిలో ముఖ్యమైనవి :

### 1) ప్రాంతీయ భాషా పత్రికల స్వాతంత్ర్య అపహరణ చట్టం :

భారతీయుల ప్రజాగ్రహానికి కారణమయిన చట్టం ఇది. అనేక భారతీయ భాషలలో బ్రిటీష్ వారు చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియ చేయడం ప్రారంభించారు. దీనితో బ్రిటీష్ వారి పట్ల తిరుగుబాటు ధోరణి ప్రారంభమయ్యెను. దీనిని గమనించిన లిట్టన్ "1878 లో ప్రాంతీయభాషా పత్రికల అపహరణ చట్టం" ను అమలులోకి తెచ్చెను. దీని ప్రకారం అన్ని ప్రాంతీయ పత్రికలపై విపరీతమైన ఆంక్షలు అమలులోనికి తెచ్చిరి. దీనితో ప్రముఖ బెంగాల్ పత్రిక – అమృతబజారు పత్రిక, ఆంగ్లంలో ముద్రించడం ప్రారంభించింది. దీనిని స్థాపించిన వాడు శశి కుమార్ ఘోష్.

**2) ఆయుధాగార చట్టం (1878):**

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అప్పుడప్పుడే ప్రారంభమయిన వ్యతిరేకతను అణగదొక్కడానికి చేపట్టిన ప్రక్రియే ' ఆయుధాగార చట్టం '. దీని ప్రధాన ఉద్దేశ్యం భారతీయులను నిరాయుధులను చేయడం ద్వారా బ్రిటీష్ వ్యతిరేకతను నిర్మూలించడము. భారతీయులెవరూ ఆయుధములను ఉత్పత్తి చేయడం గాని, అమ్మడంగాని లేదా వాటిని ఉపయోగించడంగాని జరుగకూడదు. దానికి బ్రిటీష్ వారి పూర్ణ అనుమతి తీసుకోవాల్సి ఉంది. చాలా నిభంధనలు పాటించాల్సి ఉంది.

**3) భారతీయ వ్యతిరేకియైన లార్డ్ లిట్టన్** భారతీయు ఉద్యోగులకు సంబంధించి 1879లో " స్టాట్యుటరీ సివిల్ సర్వీస్ " ను ఏర్పాటు చేశాడు. నమ్మకస్తులైన భారతీయులకు ఉద్యోగ అవకాశం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అర్హులయిన వారికి అనగా తమకు బాగా విశ్వాసం ఉన్న ఉన్నత కుటుంబాల వారిని వైశ్రాయ్ అనుమతితో నియమించుకున్నారు. దానితోపాటు సివిల్ సర్వీస్ పరీక్షల వయోపరిమితిని 21 సం॥ల నుంచి 19 సం॥లకు తగ్గించడమయినది.

లిట్టన్ కాలంలో ఏర్పాటు చేసిన మరొక కమీషన్ ' రిచర్డ్ స్ట్రాచీ ' అధ్యక్షతన నియమించిన " క్షామ నివారణ సంఘము". భారతదేశం నిరంతరం క్షామములకు నిలయం, కావున వాటిని నివారించుటకు క్షామ నిధిని కూడ ఏర్పాటు చేయడం జరిగింది. ఇంకను ' మేయో ' ప్రవేశపెట్టిన ఆర్థిక వికేంద్రీకరణను ప్రోత్సహించెను. దేశవ్యాప్తంగా ఉప్పుపై ఒకే విధమయిన పన్నును విధించడం లిట్టన్ కాలంలోనే జరిగింది.

## 3.3 లార్డ్ రిప్పన్ (1880 – 1884 ):

భారతదేశాన్ని పాలించిన అనేకమంది వైశ్రయ్ లు తమ మాతృ ప్రభుత్వం తృప్తి కొరకో లేదా వ్యక్తిగతంగా వారి ఆకాంక్షమేరకో భారతీయులను పీడించి ప్రజల ఆగ్రహానికి కారణమయ్యారు. అయితే చాలా కొద్దిమంది భారతీయుల కొరకు పాటుపడి నేటికిని వారి హృదయాలలో చెరగని ముద్ర వేసిన వారు ఉన్నారు. అలాంటి కోవకు చెందిన వాడే లార్డ్ రిప్పన్. మేధో సంపన్నుడు మరియు భారతీయుల శ్రేయోభిలాషియైన లార్డ్ రిప్పన్ స్థానిక స్వపరిపాలన పితామహుడుగా ఆధునికి భారతదేశ పితామహుడుగా (Vice Roy known father of modern India) మంచి రాజప్రతినిధి (Good Vice Roy of India) గా భారతీయులు కొనియాడిరి.

రిప్పన్ ముఖ్య ఆశయం భారతీయుల సంక్షేమం. భారతీయులకు వివిధ రంగాలలో స్వేచ్ఛను కల్పించి వారిని "స్వయం పాలన"లో తర్ఫీదు నిచ్చి పాలనానుభవంను కల్పించడము, అందులో భాగంగా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టెను.

**అందులో ముఖ్యమైనవి :**

1) ప్రాంతీయ భాషా పత్రికల అపహరణ చట్టంను రద్దుచేయుట రిప్పన్ ప్రవేశపెట్టిన సంస్కరణలలో ముఖ్యమైనది. "ప్రాంతీయ భాష పత్రికల స్వాతంత్ర్య చట్టం" ను 1881లో ప్రవేశపెట్టిన రిప్పన్, పత్రికలకు

స్వేచ్ఛను ప్రసాదించి ప్రాంతీయ భాషలను ప్రోత్సహించెను. తద్వార వివిధ ప్రాంతీయ భాషలలో అనేక పత్రికలు ఆవిర్భవించి ప్రజలను జాతీయ వాదులను చేయడంలో క్రియాశీలక పాత్రను పోషించెను. తద్వార ప్రజలలో రాజకీయ చైతన్యం సఖ్యత పెరిగి జాతీయ ఉద్యమంలో భాగస్వాములయిరి. ఈ విధంగా ప్రజలలో జాతీయ భావాలు రేకెత్తించడానికి (లార్డ్ రిప్పన్) కారణమయినాడు.

**2)** రిప్పన్ కాలంలో ప్రవేశపెట్టబడిన మరోచట్టం కర్మాగార చట్టం (1881). దీని ముఖ్య ఉద్దేశం కర్మాగారాలలో పని చేయుచున్న కార్మికుల శ్రేయస్సు. చిన్నపిలల (7-12 వయస్సు) పని గంటలు 9గంటలకు మించకుండుట. నెలకు కార్మికులకు 4 రోజులు సెలవులు మంజూరు చేయుట, ప్రతిరోజు గంట విరామ సమయం, ప్రమాదకరమయిన యంత్రములు చుట్టు రక్షణ ఏర్పాటు చేయడం, పిల్లలు, స్త్రీలు, వృద్ధులను ప్రమాద భరితమయిన పనులయందు నియమించకుండుట, నిబంధనల అమలుకు ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల నియామకం తదితర అంశాలను కార్మికచట్టంలో చేర్చి కార్మికుల స్థితిగతులను మెరుగుపరచెను.

**3)** భారతీయులలో రిప్పన్ కు శాశ్వత కీర్తిని (స్థానిక స్వపరిపాలన పితామహుడని) ప్రసాదించినది స్థానిక స్వపరిపాలన సంస్కరణలు.

ఆధునిక భారతదేశ నిర్మాతని పేరు సంపాదించడానికి కారణమయినవి స్థానిక స్వపరిపాలన సంస్కరణలు. 1882 లో జారీచేసిన చట్టం ప్రకారము పట్టణాలు, జిల్లాలు, తాలుకాల స్థాయిలో ఆయా ప్రాంతాల ప్రజలచే ఎన్నిక చేయబడిన బోర్డులు ఏర్పడినాయి. వీరు దాదపు 2/3 మంది కాగా ప్రభుత్వంచే నియమించబడు సభ్యులు 1/3 మించకూడదు. స్థానిక సంస్థలకు తమ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకునే హక్కు ఇచ్చారు. అనగా స్థానిక సంస్థలు పన్నులు విధించుటకు, వారి ఆధీనంలోని ప్రాంతంలో పన్నులు వసూలు చేసుకొనుటకు హక్కు కలదు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కూడ స్థానిక బోర్డులకు ఆర్థిక సహాయం చేయును.

**4)** హంటర్ కమీషన్ ఏర్పాటు :

భారతీయుల అభివృద్ధికి వారి అక్షరాస్యతే ముఖ్యమని భావించి రిప్పన్ 3 ఏప్రిల్, 1882 లో హంటర్ నాయకత్వంలో కమీషన్ నియమించెను. 20 మంది సభ్యులుగల ఈ కమీషన్ తమ నివేదికలో విద్యాభివృద్ధికి ఎన్నో సిఫార్సులను చేసింది. వాటిలో ప్రాథమిక, మధ్యమిక స్థాయిలో విద్యావ్యాప్తి జరగాలని ఉన్నత విద్య ప్రైవేట్ కళాశాలలను నిర్మించడం విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ సహాయం అందించాలని సిఫార్స్ చేయడం జరిగింది. హంటర్ కమీషన్ సిఫార్సులన్నింటిని రిప్పన్ ఆమోదించి, అమలు జరపడం గమనార్హం.

**5)** ఇతర సంస్కరణలు :

లార్డ్ రిప్పన్ ఆర్థిక వికేంద్రీకరణను కొనసాగించి ప్రభుత్వ ఆదాయమును మూడు పద్దుల క్రింద విభజించారు.

i) కేంద్రజాబితా : భూమిశిస్తు, తంతి, తపాలా, రైల్వేల ఆదాయం

ii) రాష్ట్రజాబితా : విద్య, రహదారుల ఆదాయం

iii) ఉమ్మడి జాబితా : అడవులు, ఎక్సైజు సుంకముల, రిజిస్ట్రేషన్ ఆదాయం సమంగా పంచుకోవడం

భారతీయులకు ఉన్నత పదవులను ఇవ్వడం, క్షామ నివారణకు రిచర్డ్ స్ట్రాచీ, కమీషన్ సిఫార్సులను ఆచరణలో పెట్టడం, భూకమతాల చట్టంను రూపొందించి జమీందారుల బారినుండి కౌలుదారులను కాపాడడం, తదితర సంస్కరణల ద్వారా భారతీయుల క్షేమాన్ని ఆకాంక్షించాడు.

ఇంకను ఇండియ సివిల్ సర్వీస్ పరీక్షల వయోపరిమితి వయస్సు 18 నుంచి 21కి పెంచాలి, ఆయుధగార చట్టంను రద్దుచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా వాటిని తిరస్కరించారు.

**6)** ఇల్బర్ట్ బిల్ వివాదము :

లార్డ్ రిప్పన్ కాలంలో జరిగిన మరియొక ముఖ్య సంఘటన ఇల్బర్ట్ బిల్లు వివాదము. 1873వ సంవత్సరమున ప్రవేశపెట్టిన చట్టం ద్వార భారతీయ న్యాయాధిపతులు (మెజిస్ట్రేట్) బ్రిటీష్ మరియు ఐరోపా నేరస్థులను విచారించే అధికారం లేదు. దీనితో బ్రిటీష్ న్యాయస్ధానాలలో తర్ఫీదు పొందిన భారతీయ న్యాయాధిపతులు దీనిని చాలా అవమానకరంగా భావించి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో జాతిపరమైన వివక్షతను తొలగించుటకు నడుము బిగించి న్యాయసభ్యుడయిన సి.పి. ఇల్బర్ట్ నాయకత్వంలో కమీషన్ను నియమించి న్యాయాన్యాయాలను విచారించి ఒక నివేదికను ఇవ్వాలని కోరెను. ఇది చాలా అసమంజసమని తేల్చిన ఇల్బర్ట్ ఈ వివిక్షతను రూపుమాపడమే న్యాయమని సలహానిచ్చెను. దీనికి సంబందించిన బిల్లును కార్యనిర్వాహక సంఘంకూడ అమోదించింది. దీనితో ఐరోపా న్యాయమూర్తులతో సమానంగా భారత న్యాయమూర్తులు కూడ గౌరవం పొంది ఐరోపా నేరస్థులను విచారించే అధికారం సంపాదించిరి.

ఈ నేపథ్యంలో భారతీయ న్యాయమూర్తులు తమతోపాటు పొందే గౌరవాన్ని బ్రిటీష్ న్యాయాధిపతులు వ్యతిరేకించి రిప్పన్ కు వ్యతిరేకంగా తీవ్ర అభ్యంతరం తెలిపిరి. దేశవ్యాప్తంగా రిప్పన్ కు వ్యతిరేకంగా ఐరోపా న్యాయాధిపతులు చేసిన వివిధ రకాల నిరసనలతో బ్రిటీష్ ప్రభుత్వం దిగివచ్చి బిల్లును ఉపసంహరించుకోవాలని ఆదేశించిరి. గత్యంతరం లేని రిప్పన్ ఇల్బర్ట్ బిల్లును సవరించాల్సి వచ్చెను. ఈ విధంగా రిప్పన్ అవమానానికి గురికావడంతో భారతీయులలో బ్రిటీష్ వారిపట్ల తీవ్ర ఆగ్రహం తెప్పించెను.

దీని ఫలితంగా బ్రిటీష్ వారి వివక్షత మరొక్కసారి బహిర్గతమై ఐరోపావాసులకు, భారతీయులకు మధ్య జాతి విద్వేషా పెరిగెను. భారతీయ జానాభాలో అత్యల్ప సంఖ్యాబలము ఉన్న ఆంగ్లేయులు రిప్పన్ ను ఓడించిన తీరు భారతీయులకు ఆదర్శం అయ్యెను. అనగా ఏ విధంగా బ్రిటీష్ వారిని ప్రతిఘటించ వచ్చు అనే గుణపాఠం భారతీయులకు తెలియ వచ్చింది. బ్రిటీష్ వారు తరచూ చెప్పే ‘ చట్టసమానత్వం ’ డొల్లయని, భారతీయులు ఈ చట్టసమానత్వంతో

ప్రయోజనం పొందలేరని అర్ధమయింది. అందువలననే ఈ సంఘటన జరిగిన అతికొద్ది కాలంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఏర్పడడం దీని యొక్క ప్రభావమే అని చెప్పవచ్చును.

ఈ విధంగా అనేక ప్రజాహిత సంస్కరణలు ప్రవేశపెట్టి నిరంతరము భారతీయుల శ్రేయస్సు కొరకు పాటుపడిన మంచి మనిషి రిప్పన్, భారతదేశ ప్రజలంతా ఇతని పదవీ విరమణ భారతీయులకు ఎంతో బాధాకరమని భావించిరి. సంస్కరణలే గాక ఆఫ్ఘన్ విధానం, మైసూర్ రాజ్యంను హిందూ వడయార్కు తిరిగి ఇవ్వడం లాంటి పనుల ద్వారా భారతజాతి ప్రజల 'ఆత్మ బంధువు' గా ప్రజల మదిలో నిలిచెను. ఆచార్య సర్వేపల్లి గోపాల కృష్ణ గారు స్పందిస్తూ "రిప్పన్ భారతీయులచే ఆరాధింపబడినప్పటికి ఆంగ్లేయులచే ద్వేషింపబడెను" అని పేర్కొనెను

## 3.4. లార్డ్ కర్జన్ పాలనలోని సంస్కరణలు :

భారతదేశంలో 12వ వైశ్రాయ్ గా పనిచేసిన లార్డ్ కర్జన్ 1899 నుంచి 1905 వరకు పనిచేసె . అనేక సద్గుణములు ఉన్నత ఆశయాలు కలిగినప్పటికిని భారతీయుల మెప్పును పొందలేని దురదృష్టవంతుడు లార్డ్ కర్జన్. గొప్ప పరిపాలనావేత్త, రాజకీయ దురంధరుడు, రైతు బాంధవుడు అయినప్పటికి భారతీయుల ప్రతిభపై విశ్వాసం లేక వారిని అణగదొక్కాలని ప్రయత్నం చేసి ప్రజల ఆగ్రహానికి కారణమయినాడు. భారతీయ పురాతన సంస్కృతి, నాగరికతలపై శ్రద్ధ వహించి వాటి పరిరక్షణకు పురావస్తు శాఖను ఏర్పాటు చేసిన కర్జన్ నాటి భారతీయులపై విశ్వాసం ఉంచకపోవడం యాదృశ్చికం. దానికితోడు సామ్రాజ్య కాంక్షతో మాతృ దేశాభిమానం పొందాలనుకోవడం కూడ ఇతను విఫలమగుటకు కారణం. అంతేగాక ఇతని ప్రజావ్యతిరేక విధానాలతో " భారతీయులలో జాతీయభావంను రేకెత్తించిన నిరంకుశ పాలకులు గాఢ నిద్రలో ఉన్న జాతీయ వాదులను నిద్రలేపుతారనే " సామెతను ఋజువు చేసెను.

### సామ్రాజ్యవాదిగా లార్డ్ కర్జన్ :

బ్రిటీష్ సామ్రాజ్యానికి చెక్కుచెదరని శాశ్వత రక్షణను సమకూర్చుట వీలైనంత ఇతర ప్రాంతాలను ఆక్రమించుటే లార్డ్ కర్జన్ విదేశాంగ విధానంలో ముఖ్య ఆశయం. అయితే యుద్ధాలకు బదులు రాజకీయ విజ్ఞతతో విదేశాంగ విధానమును అమలు పరచుట కర్జన్ ప్రత్యేకత.

1. వాయువ్య సరిహద్దు ప్రాంతములో ఆటవిక జాతుల వారు తిరుగుబాటును అణచిన విధానం కర్జన్ రాజనీతి చతురతకు తార్కాణమని చరిత్రకారుల వాదన. ఆంగ్లేయ సైన్యం ఆటవిక జాతుల వారి చేతిలో ఓటమి చెందగా రాజకీయ చతురతను ప్రదర్శించి కర్జన్ ఆంగ్లసైన్యం ఉపసంహరించడం ద్వార వారిని సంతృప్తి, పరచి, వారినే నాయకులుగా నియమించడంతో వారు ఆంగ్ల అధికారంనకు వత్తాసు పలికిరి. ఆటవిక జాతుల వారికి ప్రత్యేక కమీషనర్ ను నియమించి రైలు, రహదారులను నిర్మించి మిగతా జాతుల వారితో సత్సంబంధాలను నెలకొల్పెను. అయితే వీటి దుష్ఫలితాలు నేటివరకు భారత్ అనుభవిస్తుంది అనేది మేధావుల అభిప్రాయం.
2. మనదేశానికి సరిహద్దు దేశమయిన టిబెట్, రష్యా ప్రాబల్యంలోనికి వెళుతున్న నేపథ్యంలో కర్జన్ చాలా సమయస్ఫూర్తితో వ్యవహరించి రష్యా సామ్రాజ్య కాంక్ష నుంచి టిబెట్ ను కాపాడాడు. టిబెట్ పాలకుడు 13వ

దలైలామా కాలంలో కర్జన్ టిబెట్ వ్యవహారంలో జోక్యం చేసుకొని 1904 లో ‘ లాసాసంధి ’ కి ఒప్పించెను. దీని ప్రకారం టిబెట్ ఇంగ్లండ్ ఒప్పందం కుదుర్చుకొని రష్యాకు దూరంగా ఉండడం జరిగింది. అయితే ఆఫ్ఘన్ విధానం లాగా టిబెట్ విధానం కూడ లోపభూయిష్టంగా ఉందని, దీనివలన భారతదేశంకంటే కూడ చైనా, బాగా బలపడిందనేది లోవట్ ఫ్రేజర్, లార్డ్ రోస్ బరీలు విమర్శించిరి.

3. కర్జన్ ఇంకను పర్షియా సిందూ శాఖను, ఆఫ్ఘనిస్థాన్ను బ్రిటీష్ వారి ఆధీనంలోనికి తెచ్చెను.

**పరిపాలనా సంస్కరణలు :**

భారతదేశంలోని అనేక శాఖలలో చాలారోజుల నుంచి వ్రేళ్ళూనికొనిపోయిన వాటిని సంస్కరించుటకు పూనుకున్న కర్జన్ అనేక కమీషన్లు నియమించి, కమీషన్ల ల కాలముగా ప్రసిద్ధికెక్కెను. దానితోపాటు అవినీతి, జాప్యం అభివృద్ధికి ప్రధాన ఆటంకములని భావించి వాటిని నిర్మూలించి త్వరితగతిన పనిచేయుటకు ప్రాముఖ్యతనిచ్చి "Do Quick Vice Roy" గా ప్రసిద్ధికెక్కెను. కర్జన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు కొన్ని బహుళ ప్రజాదరణ పొందగా మరికొన్ని సంస్కరణలు ప్రజామోదానికి ఆమడ దూరంలో నిలిచాయి. అందుకనే కర్జన్ భారతీయుల ఆమోదం పొందలేని వారి జాబితాలో మొదటి వరుసలో ఉన్నాడు. అందువలన కర్జన్ సంస్కరణలను రెండు రకాలుగా, అనగా ప్రజాదరణ పొందిన మరియు ప్రజాదరణ పొందలేని సంస్కరణలుగా పేర్కొనవచ్చును.

**ప్రజాదరణ పొందిన సంస్కరణలు :**

### 1) ప్రాచీన శిథిలముల రక్షణ చట్టం (Ancient Monument Preservation Act – 1904):

భారతీయులంటే గిట్టని కర్జన్ భారతీయ సంస్కృతి, చరిత్రను అభిమానించడం విశేషం. భారతీయచరిత్ర, సంస్కృతి పరిరక్షించాలనే సత్సంకల్పముతో వాటిని పదిలంగా భద్రపరుచుటకు 1904 లో ఒక చట్టంను ఆచరణలోనికి తెచ్చెను. అదియే ప్రాచీన శిథిలముల రక్షణ చట్టం. 1902లో పురావస్తు శాఖను స్థాపించి సర్ జాన్ మార్షల్ ను డైరెక్టర్ గా నియమించెను. భారతదేశ చరిత్ర, సంస్కృతి పరిరక్షణే ఈ సంస్థయొక్క ప్రధమవిధి. ఈ శాఖ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాలలోనే హరప్పా నాగరికత – సంస్కృతి బయటపడడం గమనార్హం.

**2) క్షామనివారణ కమీషన్ :** నిరంతరం భారతదేశం క్షామములకు గురికావడం, లక్షలాది మంది ప్రాణాలను పోగొట్టుకోవడం విదితమే. అలాంటి పరిస్థితులలో క్షామాల బారిన ప్రజలు పడకుండ ఉండడానికి క్షామాల నివారణకు ‘ మాక్డొనాల్డ్ కమీషన్ ’ ను నియమించెను. ఆ కమీషన్ సిఫార్స్ చేసిన రైల్వేల అభివృద్ధి, వ్యవసాయ బ్యాంక్ ల స్థాపన, నీటి సౌకర్యాల అభివృద్ధి, అధికారుల సహకారం లాంటి అనేక విషయాలను అమలుపరచి క్షామనివారణకు అనేక చర్యలు గైకొనెను. దానితోపాటు ప్లేగువ్యాధి తీవ్రంగా ప్రబలి లక్షలాదిమంది దాని బారినపడినప్పుడు పాశ్చాత్య వైద్య పద్ధతుల ద్వారా దాని నిర్మూలనకు తీవ్ర కృషి చేసెను.

**3) 1902 లో పోలీస్ వ్యవస్థ** పరిష్టతకు ‘ ఫ్రేజర్ కమీషన్ ’ ను నియమించి, దాని సిఫార్సు మేరకు అనేక చర్యలను చేపట్టెను. పోలీస్ అధికారుల తర్ఫీదుకు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం, పోలీస్ శాఖలో ఉన్నత పదవులను ప్రత్యక్షంగా పరీక్షల ద్వారా ఎంపిక చేయడం, ప్రతిరాష్ట్రంలో 1902 లో అపరాధ పరిశోధన శాఖను (Crime Investigation Department – C.I.D.) ను ఏర్పాటు చేయడం మొదలగున్నవి ఇందులో ముఖ్యమైనవి. నేడు మనదేశంలో అమలులో ఉన్న సి.ఐ.డి శాఖకు పునాదులు వేసినవాడు కర్జన్.

**4) 1901 లో నీటిపారుదల అభివృద్ధికై మాన్ క్రిఫ్ (Moncriff)** నాయకత్వంలో కమీషన్ ను నియమించెను.

**5) మంచి ప్రజాదరణ** పొందిన మరొకచట్టం పంజాబ్ భూమి విడుదల చట్టం (Punjab Land Alienation Act) దీనితో ఋణదాతలు రైతుల భూములను వశపరచుకొను హక్కు కోల్పోవడంతో రైతుకు భూమిపై హక్కు కల్గెను. బెంగాల్లో పూసా నందు వ్యవసాయక పరిశోధన సంస్థను, ఆధునికి శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయాభివృద్ధికి ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ అగ్రికల్చర్ను నియమించి రైతులకు తక్కువ వడ్డీకే ఋణములను, సహకార పరపతి సంఘములను ఏర్పాటు చేసెను. అందుకనే లార్డ్ కర్జన్ ను “ రైతు బాంధవుడి ”గా ప్రజలు కొనియాడిరి.

**6) ఇంకనూ భారతీయ టంకశాల** మరియు పేపర్ కాగితం చట్టం (Inidan Coinage and paper Currency Act of 1899) సహకార సంఘాల ఋణాలు చట్టం (Co-operative Credit Societies Act 1904) ను అమలులోనికి తెచ్చెను.

పబ్లిక్ వర్క్స్ శాఖ నుండి రైల్వే శాఖను వేరుచేసి దాని నిర్వహణకు ముగ్గురు సభ్యులు గల ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసెను. ఈ ప్రతిపాదన “ సర్ థామస్ రాబర్ట్సన్ కమీషన్ ” సూచించింది.

**7) ప్రజాదరణ పొందని సంస్కరణలు :**

లార్డ్ కర్జన్ ఒకవైపు భారతదేశ పురోభివృద్ధికి అనేక చర్యలు గైకొన్నప్పటికీ, భారతీయులపై ఉన్న అపనమ్మకం, సామ్రాజ్య కాంక్షతో అనేక ప్రజామోదం పొందని సంస్కరణలను చేపట్టాడు. అందులో ముఖ్యమైనవి.

* **విశ్వవిద్యాలయ చట్టం (1904) :** భారతీయుల సత్వర అభివృద్ధికి ఉన్నత విద్య ఆవశ్యకతను గుర్తించి విశ్వవిద్యాలయ కమీషన్ ను నియమించి దాని సూచన మేరకు 1904 లో భారతీయ విశ్వవిద్యాలయ చట్టం ను రూపొందించెను. ఇందులో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, సెనెట్ సభ్యులు 80% మందిని ప్రభుత్వమే నిమయించాలనే నిభందనను చేర్చాడు. దానితో విద్యాశాఖ మొత్తం ప్రభుత్వపరమయ్యెను. దీని ఉద్దేశ్యం విద్యావంతులు బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరశించి, వాటిని ప్రజలలో ప్రచారం చేస్తారనే భయం. దీనిని పసికట్టిన భారతీయ మేధావులు ఈ చట్టం ఉపసంహారణకు ఉధ్యమాన్ని కొనసాగించవలసి వచ్చెను. గోపాలకృష్ణ గోఖ్లే, ఫిరోజ్ మెహతాలాంటి మితవాద, జాతీయవాదులు దీనిని వ్యతిరేకించడం గమనార్హం.

**కలకత్తా కార్పొరేషన్ చట్టం 1899 :**

ఈ చట్టం ద్వార కార్పొరేషన్ సభ్యుల సంఖ్యను 78 నుంచి 50కి తగ్గించాడు. ఇందులో 25 మంది ప్రభుత్వంచే నియమింపబడగా మిగతా 25 మంది ప్రజలచే ఎన్నికవుతారు. ఇది గత చట్టంనకు పూర్తిగా భిన్నంగా ఉంది. 78మందిలో 48 మంది ఎన్నికవగా మిగతా 30మంది ప్రభుత్వంచే నియమించబడేవారు. దీనితో కర్జన్ కు రిప్పన్ ప్రవేశపెట్టిన స్థానిక స్వపరిపాలన యందు నమ్మకం లేదనే విషయం స్పష్టమయింది. దీనితో కలకత్తా ప్రాంతంలోనే మొదటిగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తిరుగబాటు ప్రారంభమయింది.

**బెంగాల్ విభజన చట్టం (1905) :**

భారతీయులు ప్రత్యేకించి బెంగాల్ ప్రజలు లార్డ్ కర్జన్ ను, బ్రిటీష్ ప్రభుత్వాన్ని మొదటిసారిగా నేరుగా తలపడడానికి ప్రధాన కారణమయిన సంఘటన ఈ బెంగాల్ విభజన చట్టం. ఈ చట్టంను లార్డ్ కర్జన్ రూపొందించడంలో ఉన్న రహస్య ఎజెండాను బెంగాల్ ప్రజలు పసిగట్టి తీవ్రంగా వ్యతిరేకించి, చివరకు 1911లో బెంగాల్ విభజనల్ రద్దు చేయించి విజయం సాధించారు. కర్జన్ ఉద్దేశం బెంగాల్ రాష్ట్రం పెద్ద రాష్ట్రం, పాలించుట కష్టమని పాలనా సౌలభ్యం కొరకు దీని విభజన అవసరమని భావించాడు. కాని విభజించిన తీరును గమనించినట్లయితే బెంగాల్ ను మత ప్రాతిపదికగా రెండుగా విభజించి, హిందూ, ముస్లింల మధ్య జాతిపరమయిన విద్వేషాన్ని రగల్చడమే అని తెలుస్తున్నది. అందుకనే బెంగాల్ ప్రజలు ఏకతాటిపై కర్జన్ బెంగాల్ విభజనను ముక్త కంఠంతో వ్యతిరేకించి చివరకు లార్డ్ కర్జన్ నే పదవీచ్యుతులను చేశారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా బెంగాల్ రాష్ట్రంలో ప్రారంభమయిన "వందేమాతరం" ఉద్యమం స్వాతంత్రోద్యమానికి ప్రధాన వేదికగా మారింది. అంతవరకు మితవాదులు బ్రిటీష్ వారిని ప్రాధేయ తరహాలో విన్నవించిన స్థానంలో అతివాద తరహా పద్ధతులు ప్రవేశించాయి. దీనితో యువతరం స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములవడం ప్రారంభించారు. కావున బెంగాల్ విభజన స్వాతంత్రోధ్యమంను మలుపు తిప్పిన సంఘటన. దీనికి పరోక్షంగా లార్డ్ కర్జన్ కారకుడు.

**కిచ్నెర్ వివాదం :**

లార్డ్ కర్జన్ తన పాలనలో సర్వసైన్యాధిపతియైన కిచ్నెర్ తో సైనిక అధికారాలకు సంబందించి అభిప్రాయ భేదాలు ఏర్పడెను. సాంప్రదాయంగా మిలిటరీ వ్యవహారాలలో సర్వసైన్యాధిపతికి గాకుండ సివిల్ సభ్యునికే తుది అధికారం ఉండాలని కర్జన్ భావించగా కిచ్నెర్ దానిని వ్యతిరేకించెను. దీనితో వీరిద్దరి మధ్య తగాదా ఏర్పడెను. ఈ విషయంలో మాతృదేశం ప్రతిపాదించిన రాజీ మార్గాన్ని త్రోసిపుచ్చిన కర్జన్, నూతన మిలిటరీ అధికారిని నియమించెను. కాని దానికి మాతృదేశం సైతం విభేదించడంతో, కర్జన్ తన పదవికి రాజీనామ చేసెను.

లార్డ్ కర్జన్ 1904 లో జారీచేసిన భారతీయ అధికారుల రహస్య చట్టం (Indian Official Secrets Act of 1904) సైతం భారతీయులలో తీవ్ర దుమారం లేపెను.

ఈ విధంగా లార్డ్ కర్జన్ భారతీయులు చిరస్మరణీయంగా గుర్తుంచుకునే చట్టాలు మరియు వ్యతిరేకుడుగా గుర్తుంచుకునే చట్టాలను రూపొందించి విశిష్టమైన వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు.

### 3.5. సంగ్రహంగా :

భారతదేశంలో 1858 చట్టం ద్వారా వైశ్రాయ్ వ్యవస్థ ప్రారంభమయింది. 90 సం. ల పాటు దాదాపు 20 మంది రాజ ప్రతినిధులు భారతదేశాన్ని పాలించారు.

1876 నుంచి 1880 వరకు పాలించిన ***లార్డ్ లిట్టన్*** అనేక ప్రజావ్యతిరేక చట్టాలను రూపొందించి భారతీయుల ఆగ్రహానికి కారణమయినాడు. ప్రాంతీయ భాషా పత్రికల అపహరణ చట్టం, ఆయుధాగార చట్టం, స్టాట్యూటరి సివిల్ సర్వీస్ మొదలగున్నవి లిట్టన్ కాలంలో రూపొందించబడినాయి.

1880 నుంచి 1884 వరకు పాలించిన ***లార్డ్ రిప్పన్*** భారతదేశాన్ని పాలించిన రాజప్రతినిధులలో భారతీయుల అభిమానాన్ని పొందిన అగ్రగణ్యుడు. ప్రాంతీయ భాష పత్రికల స్వాతంత్ర్య చట్టం,కర్మాగార చట్టం, హంటర్ కమీషన్ మొదలగు వాటి ద్వార భారతీయుల అభిమానాన్ని పొందాడు. స్థానిక స్వపరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టి భారతీయులకు స్వపరిపాలన పితామహుడు గా ప్రసిద్ధికెక్కెను.

1899 నుంచి 1905 వరకు పాలించిన ***లార్డ్ కర్జన్*** అనేక పాలన సంస్కరణలు చేపట్టి ‘ కమీషన్’ ల రాజప్రతినిధిగా, రైతు బాంధవుడిగా పేరు సంపాదించెను. ప్రాచీన శిథిలముల రక్షణ చట్టం, క్షామ నివారణ చట్టం, ఫ్రేజర్ కమీషన్, పంజాబ్ భూమి విడుదల చట్టం భారతీయుల అభిమానం పొందాయి. కలకత్తా కార్పొరేషన్ చట్టం బెంగాల్ విభజన చట్టం విశ్వవిద్యాలయాల చట్టం భారతీయులలో కర్జన్ పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన వందేమాతర ఉద్యమం జాతీయోద్యమంలో ప్రధాన భూమికను పోషించింది. లార్డ్ కర్జన్ పరోక్షంగా భారతీయులలో జాతీయ భావం రావడానికి దోహదపడినాడు.

### 3.6 పరీక్ష నమూనా ప్రశ్నలు :

#### 3.6.1 వ్యాసరూప ప్రశ్నలు :

1) లార్డ్ లిట్టన్ సంస్కరణలు గురించి వివరించి, ఎందుకు ప్రజామోదం పొందలేక పోయాయో చర్చించుము?

2) భారతదేశంలోని రాజప్రతినిధులందరిలోను అగ్రగణ్యుడు లార్డ్ రిప్పన్ వివరింపుము.

3) లార్డ్ కర్జన్ భారతీయులలో జాతీయభావాన్ని రేకెత్తించినాడు. వివరింపుము.

4) లార్డ్ కర్జన్ ‘ కమీషన్ ల వైశ్రాయ్ ’ ఎట్లు? వివరింపుము?

**3.6.2 లఘు ప్రశ్నలు :**

1) ప్రాంతీయ భాష పత్రికల స్వాతంత్ర్య అపహరణ చట్టం.

2) రిప్పన్ స్థానిక స్వపరిపాలనా సంస్కరణలు.

3) ఇల్బర్ట్ బిల్ వివాదము.

4) ప్రాచీన శిథిలముల రక్షణ చట్టం.

5) బెంగాల్ విభజన చట్టం.

6) కిచ్నెర్ వివాదము.

**3.6.3 బహుళైచ్ఛిక ప్రశ్నలు :**

1) విక్టోరియా రాణిని భారతీయ రాణిగా ప్రకటించినది?

ఎ) లార్డ్ లిట్టన్, ఢిల్లీదర్బార్ బి) లార్డ్ రిప్పన్ సి) లార్డ్ కర్జన్ డి) దల్ హౌసీ

2) ‘ Vice Roy riverse ’ గా పేరొందినది ఎవరు?

ఎ) లార్డ్ లిట్టన్ బి) లార్డ్ రిప్పన్ సి) లార్డ్ కర్జన్ డి) దల్ హౌసీ

3) ఆయుధాగార చట్టంను ఎవరికాలంలో రూపొందించడమైనది.

ఎ) లార్డ్ లిట్టన్ బి) హార్డింగ్ సి) కానింగ్ డి) దల్ హౌసీ

4) స్థానిక స్వపరిపాలన పితామహుడుగా పేరొందిన వైశ్రాయ్ ఎవరు?

ఎ) రిప్పన్ బి) లిట్టన్ సి) కర్జన్ డి) డఫ్రిన్

5) ఇల్బర్ట్ బిల్ వివాదంతో సంబంధమున్న వైశ్రాయ్?

ఎ) రిప్పన్ బి) లిట్టన్ సి) కర్జన్ డి) డఫ్రిన్

6) హంటర్ కమీషన్ దేనికి సంబంధించి నియమించబడినది?

ఎ) విద్య బి) ఆరోగ్యం సి) వైద్యం డి) అడవులు

7) కమీషన్ ల వైశ్రాయ్ పేరొందిన వైశ్రాయ్?

ఎ) కర్జన్ బి) రిప్పన్ సి) డఫ్రిన్ డి) లిట్టన్

8) DO QUICK VICE ROY గా పేరొందిన వారు?

ఎ) కర్జన్ బి) రిప్పన్ సి) డఫ్రిన్ డి) లిట్టన్

9) రైతు బాంధవుడిగా ప్రసిద్ధికెక్కిన వైశ్రాయ్?

ఎ) కర్జన్ బి) రిప్పన్ సి) డఫ్రిన్ డి) లిట్టన్

10) పురావస్తుశాఖను ఏర్పాటు చేసిన వైశ్రాయ్ ఎవరు?

ఎ) కర్జన్ బి) మింటో సి) హార్డింగ్ డి) చెమ్స్ఫర్డ్

11) ప్రాచీన శిథిలాల రక్షణ చట్టం ఎవరికాలంలో జారీచేయబడింది?

ఎ) లిట్టన్ బి) కర్జన్ సి) లార్డ్ వేవెల్ డి) లార్డ్ ఇర్విన్

12) కిచ్నెర్ వివాదంతో సంబంధమున్న వైశ్రాయ్ ఎవరు?

ఎ) లిట్టన్ బి) కర్జన్ సి) లార్డ్ వేవెల్ డి) లార్డ్ ఇర్విన్

**జవాబులు :**

**1 – ఎ, 2 – ఎ, 3 – ఎ, 4 – ఎ, 5 – ఎ, 6 – ఎ,**

**7 – ఎ, 8 – ఎ, 9 – ఎ, 10 – ఎ, 11– బి, 12 – బి.**

**3.6.4 క్రింది వాటిని జతపరుచుము.**

| | | |
|---|---|---|
| **I** | 1) రిచర్డ్ స్ట్రాచీ | ఎ) హంటర్ కమీషన్ |
| | 2) వెర్నాకులర్ ప్రెస్ యాక్ట్ | బి) రిప్పన్ |
| | 3) వైశ్రాయ్ ఆఫ్ రివర్స్ | సి) లార్డ్ లిట్టన్ |
| | 4) కర్మాగార చట్టం | డి) లార్డ్ లిట్టన్ |
| | 5) లార్డ్ రిప్పన్ | ఇ) క్షామ నివారణ సంఘము |

| | | | |
|---|---|---|---|
| II | 1) ఇల్బర్ట్ బిల్ వివాదం | | ఎ) కరువులు |
| | 2) లార్డ్ రిప్పన్ | | బి) లార్డ్ కర్జన్ |
| | 3) లాసా సంధి | | సి) టిబెట్ |
| | 4) రైతు బాంధవుడు | | డి) భారతీయుల ఆత్మ బంధువు |
| | 5) మాక్ డోనాల్డ్ కమీషన్ | | ఇ) రిప్పన్ |

**జవాబులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **I :** | **1– ఇ,** | **2 – డి,** | **3 – సి,** | **4 – బి,** | **5 – ఎ.** |
| **II :** | **1– ఇ,** | **2 – డి,** | **3 – సి,** | **4 – బి,** | **5 – ఎ.** |

## 3.7 ఉపయుక్త గ్రంథాలు :


1. వెంకట రంగయ్య మామిడిపూడి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర – మొదటి భాగం
2. సరోజినీ రదాని : High lights of Freedom Movement in A.P.
3. అల్లాడి వైదేహి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర
4. సుమిత్ సర్కార్ : Modern India (1885 – 1947) (Englih)
5. తార చంద్ : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Vol. – 3) (Englih)
6. మజుందార్ ఆర్. సి . : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (Englih)
7. ముఖర్జీ హరి దాస్, ముఖర్జీ, ఉమ : The Origins of the National Movement (1905 – 1910)
8. దత్త కె. కె . : A Social History of Modern India.
9. బిపిన్ చంద్ర : India's Struggle of Independence
10. దత్ ఆర్. సి . : The Economic History of India in the Victorian Age.


**డా॥ బి. గంగాధర్**

# పాఠం – 4
# బ్రహ్మసమాజం – రాజారామమోహన్ రాయ్

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల 19, 20 శతాబ్దాలలో భారతదేశంలో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో భాగంగా రాజారామ మోహన్ రాయ్ చేసిన కృషి, ఆయన స్థాపించిన బ్రహ్మ సమాజం దాని ద్వారా సాగిన సంస్కరణలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


4.1 పరిచయం

4.2 బ్రహ్మ సమాజం

4.2.1 రాజారామమోహన్ రాయ్

4.2.1.1 స్త్రీ జనోద్ధరణ

4.2.1.2 ఆంగ్ల విద్య

4.2.2 బ్రహ్మసమాజ సిద్ధాంతాలు

4.3 రాజారామమోహన్ రాయ్ అనంతరం బ్రహ్మసమాజం

4.3.1 దేవేంద్రనాథ్ ఠాగోర్

4.3.2 కేశవచంద్ర సేన్

4.4 బ్రహ్మ సమాజ ప్రభావం

4.5 సమీక్ష

4.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

4.6.1 ఐదు మార్కుల ప్రశ్నలు

4.6.2 పది మార్కుల ప్రశ్నలు

4.6.3 ఒక్క మార్కు ప్రశ్నలు

4.7 ఉపయుక్త గ్రంధాలు

## 4.1 పరిచయం :

ఆంగ్లేయులు భారత దేశానికి వచ్చి, అధికారం హస్తగతం చేసుకున్న వారు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానము, ఆంగ్లేయ సంస్కృతీ వంటి వాటి ప్రభావం వల్ల భారతీయులలో క్రీ.శ. 19, 20వ శతాబ్దములో అనేక నూతన భావాలు, ఆలోచనలు జనించాయి. వాటిపట్ల ఆకర్షితులైన వారు మతం మార్చుకోవడం ప్రారంభించారు. ఇలాంటి స్థితిలో హైందవ సంస్కృతివిమర్శలకు లోను అయింది. ఇటువంటి స్థితిలో హిందూ మతంలో వున్న ఆచార సాంప్రదాయాలను సంస్కరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో కొందరు ప్రవక్తలు, సంస్కర్తలు అందుకు నడుం బిగించారు. అందుకోసం కొన్ని సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసి సంఘ, మత సంస్కరణకు పూనుకున్నారు. అటువంటి వారిలో రాజారామమోహన్ రాయ్ అగ్రగణ్యులు కాగా, ఆయన స్థాపించిన బ్రహ్మసమాజం ప్రధానమైంది.

## 4.2 బ్రహ్మ సమాజం :

క్రీ.శ. 19,20 శతాబ్దాలలో జరిగిన సంఘ సంస్కరణోద్యమలో ప్రధాన పాత్ర పోషించిన సంస్థ – బ్రహ్మసమాజం. దీనిని 1828 వ సంవత్సరంలో బెంగాల్ లో రాజారామమోహన్ రాయ్ స్థాపించాడు.

### 4.2.1 రాజారామమోహన్ రాయ్ :

భారతీయ సమాజాన్ని అచేతనత్వం నుంచి చేతనత్వం వైపు –

మూఢనమ్మకాలు, వివక్షతల నుంచి ఆధునిక వ్యవస్థవైపు నడిపించేందుకు కృషి చేసిన మహనీయుడు –

భారత సంస్కరణోద్యమ వేగుచుక్క –

నవ భారత వైతాళికుడు –

**రాజారామమోహన్ రాయ్!!**

రాజారామమోహన్ రాయ్ 1772వ సంవత్సరం మేనెల 22వ తేదీన బెంగాల్ లోని రాధానగర్ లో తరణి, రమాకాంత్ దంపతులకు జన్మించారు. చిన్న వయస్సులోనే సంస్కృతం, పార్సీ, గ్రీకు, అరబ్బీ భాషలను నేర్చుకున్నారు. రాజారామమోహన్ రాయ్ 16 సంవత్సరాల వయస్సులో ఇల్లు వదిలి ఉత్తర భారత దేశమంతా పర్యటించారు. బౌద్ధ సిద్ధాంతాన్ని అధ్యయనం చేశారు. ఇస్లాం సిద్ధాంతాలు తెలుసుకున్నారు. అప్పటికే హైందవ సిద్ధాంతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

తండ్రి మరణానంతరం 1893లో ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఈ సమయంలో ఆంగ్లవిద్యను అభ్యసించారు. ఈ సమయంలోనే క్రైస్తవమతాన్ని గురించి తెలుసుకున్నారు. క్రైస్తవ ప్రచారకులు, క్రైస్తవ మతాధిపతులతో చర్చలు జరిపారు. అన్ని మతాలలోని సారాన్ని గ్రహించిన రాజారామమోహన్ రాయ్ ఈ సమయంలోనే ఇతర మతాలకంటే హిందూమతం ఎందులోనూ తక్కువ కాదనీ, భారతీయులు తమ మతాన్ని వదిలి క్రైస్తవ మతాన్ని స్వీకరించవలసిన అవసరంలేదని ప్రచారం చేశారు.

భారతీయ సమాజంలోని లోపాలను సరిదిద్దేందుకు, హిందూమతాన్ని సంస్కరించేందుకు పూనుకునా . అందుకు క్రీ.శ. 1815వ సంవత్సరంలో "ఆత్మీయసభ" ను స్థాపించి దానినే క్రీ.శ. 1828వ సంవత్సరంలో "బ్రహ్మసమాజం" గా మార్పు చేశారు. దాని ద్వారా సంస్కరణలకోసం కృష్ణ చేశారు. ఈ సమాజం ద్వారా హిందుమత ఉద్దరణకు, సాంఘిక ఉద్దరణకు, సంస్కరణలకు, స్త్రీ జనోద్ధరణకు కృషి చేశారు.

స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకుని బాల్యవివాహాలు చేసుకుని భర్త చనిపోగా వితంతువులైన స్త్రీలకు తిరిగి వివాహాలు జరిపించేందుకు కృషి ప్రారంభించారు. పసుపు కుంకుమలను కోల్పోయిన మహిళలకు తాను ముత్తైదువుగా మారి వాటిని తిరిగి యిచ్చేందుకు కృషి చేశారు. బాల్యవివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలను అధికారికంగా రద్దు చేయించేందుకు తీవ్ర కృషి చేసి సఫలీకృతులయ్యారు.

తన సిద్ధాంతాలను ప్రచారం చేసేందుకు "సంవాదకౌముది" అనే బెంగాలీ పత్రికను, "మిరాత్ ఉల్ అక్బర్" అనే పర్షియన్ పత్రికలను స్థాపించి నడిపారు.

### 4.2.1.1 స్త్రీ జనోద్ధరణ :

రాజారామమోహన్ రాయ్ స్త్రీ జనోద్దరణకు నడుం బిగించారు. ఆ కాలంలో సతీ సహగమనం అమల్లో వుండేది. భర్త మరణిస్తే భర్త మృతదేహంతో పాటు భార్య కూడా చితిలోపడి మరణించడంను సతీ సహగమనం అని పిలుస్తారు. దీనివల్ల అనేకమంది మహిళలు బలవంతంగా ప్రాణాలు కోల్పోవలసి వచ్చేది. అందులోనూ బాల్య వివాహాలు అమల్లో వుండడం వల్ల చిన్న వయస్సులోనే మహిళలు ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. ఇలాంటి స్థితిలో ప్రధానంగా "సతీసహగమనం" ను నిషేధింప చేసేందుకు రాజారామమోహన్ రాయ్ తీవ్రంగా కృషిచేశారు. వీరి కృషి ఫలితంగా ఆంగ్ల ప్రభుత్వం 1823లో సతీసహగమన నిషేధ చట్టాన్ని చేసింది.

అంతేకాకుండా బాల్యవివాహాల రద్దుకు తీవ్రంగా కృషి చేసిన రాజారామమోహన్ రాయ్ వితంతు వివాహాలను ప్రోత్సహించారు.. అందుకు తీవ్ర కృషి సలిపారు. వీరి కృషితోనే కందుకూరి వీరేశలింగంపంతులు గారు ఆంధ్రదేశంతో తొలి వితంతు పునర్వివాహాన్ని జరిపించారు.

స్త్రీలు విద్యావంతులు కావాలని భావించిన రాజారామమోహన్ స్త్రీలకోసం ప్రత్యేక పాఠశాలనును స్థాపింప చేశారు. ఈ విధంగా రాజారామమోహన్ స్త్రీ జనోద్దారకుడి చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందారు.

### 4.2.1.2 ఆంగ్ల విద్య :

రాజారామమోహన్ రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించారు. ఆంగ్లమును భారతదేశ విద్యవిషయాల్లో ప్రవేశపెట్టించేందుకు కృషి చేశారు. బెంటింక్ ద్వారా ఆ కార్యక్రమాన్ని నెరవేర్చారు. ఇది భారతీయులకు ఎంతోమేలు చేసింది. ఆంగ్ల విద్యను అభ్యసించిన భారతీయులు ఆంగ్లంలో వున్న వివిధ దేశాల చరిత్రను, విప్లవాలను అధ్యయనం చేశారు. ఫలితంగా వారిలో స్వాతంత్ర్య కాంక్ష కలుగింది. అది ఉద్యమానికి దారి తీసింది.

ఈ విధంగా సంఘ సంస్కరణకు పూనుకుని ఎన్నో విజయాలు సాధించిన రాజారామమోహన్ రాయ్ కి రాజా, ఆధునిక భారతదేశ పితామహుడు, పయనీర్ ఆఫ్ న్యూ ఇండియా వంటి బిరుదులు అందుకున్నారు. రాజారామమోహన్ రాయ్ క్రీ.శ. 1833 వసంవత్సరం సెప్టెంబర్ నెల 26 వ తేదిన మరణించారు.

ఇలా భారతీయ సమాజంలో శాశ్వతస్థానాన్ని పొందిన రాజారామమోహన్ రాయ్ గురించి –

" అజ్ఞానంలో వున్న హిందూ సమాజము అన్నిటినీ తగులపెట్టి చితిమంటలు పెట్టక జ్ఞానమనే జ్యోతిని మాత్రము వెలిగించెను. అది రాజారామమోహన్ రామ్ గొప్పతనం" అని విశ్వకవి రవీంద్రనాథ ఠాగోర్ పేర్కొన్నారు.

### 4.2.2 బ్రహ్మసమాజ సిద్ధాంతాలు :

సనాతన ఆచారాలు సంప్రదాయాలతో మూడ విశ్వాసాలతో వున్న హిందూ మతంలో మార్పు అనివార్యమని భావించిన రాజారామమోహన్ రాయ్ తానూ స్థాపించిన బ్రహ్మ సమాజం ద్వారా కొన్ని సిద్ధాంతాలను బోధించాడు.

1. భగవంతుడు ఒక్కడే.
2. ఉపనిషత్తులలో పేర్కొన్నట్లుగా భగవంతుడు సర్వాంతర్యామి.
3. విగ్రహారాధన పనికిరాదు.
4. నిర్గుణం నిరాకారం అయిన ఆ బ్రహ్మ స్వరూపాన్ని మానసికంగా ఆంధించవలెను.
5. భగవంతుడి దృష్టిలో మానవులందరూ ఒకటే.
6. సర్వమత సారాంశం ఒక్కటే.
7. పరమత సహనాన్ని కలిగివుండవలెను.
8. ఉపనిషత్తులలోని ఆధ్యాత్మిక భావమే మోక్షానికి మార్గం.

ఈ విధంగా రాజారామమోహన్ రాయ్ బ్రహ్మ సమాజం ద్వారా హిందూమతంలోని భారతీయ సమాజంలోని లోపాలను సరిదిద్ది నవచైతన్యాన్ని కలలిగించడమే కాకుండా భారతీయులతో స్వాతంత్ర్య కాంక్ష కలిగించడానికి పరోక్షంగా కారకులయ్యారు.

### 4.3 రాజారామమోహన్ రాయ్ అనంతరం బ్రహ్మసమాజం :

రాజారామమోహన్ రాయ్ అనంతరం కూడా బ్రహ్మసమాజ కార్యకలాపాలు కొనసాగాయి. రాజారామమోహన్ రాయ్ అనంతరం బ్రహ్మసమాజ నాయకత్వ బాధ్యతలను దేవేంద్రనాథ్ ఠాగోర్, కేశవచంద్రసేన్ లు స్వీకరించి కార్యకలాపాలను కొనసాగించారు.

## 4.3.1 దేవేంద్రనాథ్ ఠాగోర్ (1817-1905):

దేవేంద్రనాథ్ ఠాగోర్ రాజారామమోహన్ రాయ్ అనంతరం బ్రహ్మసమాజ నాయకత్వ బాధ్యతలను స్వీకరించి సంస్కరణలు తేవడానికి ప్రయత్నించాడు. దేవేంద్రనాథ్ ఠాగోర్ 1817వ సంవత్సరం మే నెల 15 వ తేదిన బెంగాల్ లో జొరాసంకోలో జన్మించారు. ఆయన తండ్రి ద్వారకానాథ్ ఠాగోర్. ద్వారకానాథ్ ఠాగోర్ కు రాజా రామమోహనరాయ్ తో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయన సంస్కరణాభిలాషను ద్వారకానాథ్ అభినందించేవారు. ద్వారకానాథ్ బ్రహ్మసమాజానికి, రాజారామమోహన రాయ్‌కి ప్రధాన సహాయకునిగా ఉండేవారు. ఠాగూరు కుటుంబపు జాగీరైన జాకోసంకోలోని ఒక భవనంలో బ్రహ్మసమాజపు మొదటి ప్రార్థనాలయాన్ని నిర్మించారు. దానికి **ఆది బ్రహ్మసమాజం** అని పేరుపెట్టారు.

దేవేంద్రనాథ్ ఠాగోర్ పై తండ్రి మరియు బ్రహ్మసమాజ ప్రభావం చిన్న తనం నుంచే వుండేది. రాజా రామ మోహన్ రాయ్ స్థాపించిన పాటశాలలో విద్యను అభ్యసించి బ్రహ్మసమాజ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్నాడు. దేవేంద్రనాథ్ ఠాగోర్ తత్వబోధినీ సభ అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి దాని ద్వారా బ్రహ్మసమాజ సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. అంతేకాకుండా తత్వబోధిని అనే పత్రికను స్థాపించాడు. తర్వాతి కాలంలో ఈ పత్రిక బ్రహ్మసమాజ అధికార పత్రిక అయింది. వేదాలను, ఉపనిషత్తులను తత్వబోధిని సభద్వారా ప్రచారం చేశాడు. వేదాలు అపౌరుషేయాలని, అవి బ్రహ్మసమాజ సిద్ధాంతాలకు ఏకైక పునాది అని, దేవేంద్రనాథ్ ఠాగోర్ ప్రగాఢంగా నమ్మాడు. బ్రహ్మసమాజ సిద్ధాంతాన్నిప్రచారం చేయడానికి అనేకమందిని నియమించాడు. దేవేంద్రనాథ్ ఠాగోర్ 1843 వ సంవత్సరంలో బ్రహ్మసమాజాన్ని పునర్వ్యవస్థీకరించి నూతనంగా చైతన్యాన్ని కలిగించాడు.

దేవేంద్రనాథ్ ఠాగోర్ నాయకత్వంలోని బ్రహ్మసమాజం ఈ క్రింది వాటిని సాధించేందుకు తీవ్రంగా కృషి చేసింది.

1. వితంతు పునర్వివాహ ఉద్యమానికి పూర్తి మద్దతునిచ్చింది.
2. బహు భార్యాత్వాన్ని నిషేధించాలని కోరింది.
3. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రయత్నిచింది.
4. స్త్రీ విద్యను ప్రోత్సహించింది.

దేవేంద్రనాథ్ ఠాగోర్ నాయకత్వంలోని బ్రహ్మసమాజంలో పనిచేసిన అక్షయ కుమార్ దత్తా ఏకేశ్వరోపాసనను సమర్ధించడానికి దత్తా ఉపనిషత్తులలోని ప్రత్యేక భాగాలను సంకలనం చేశాడు. సహజ విశ్వవ్యాప్త ఆస్తికవాద సిద్ధాంతాన్ని మూర్తీభవింప చేస్తూ మత వ్యవస్థను పటిష్టం చేయడానికి ఒక కొత్త ఒప్పందాన్ని రూపొందించాడు.

ఈ విధంగా రాజారామమోహన్ రాయ్ అనంతరం బ్రహ్మసమాజ నాయకత్వ బాధ్యతలను స్వీకరించిన దేవేంద్రనాథ్ ఠాగోర్ విజయవంతగా పనిచేసి చివరిదశలో ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. చివరకు ఆయన 1905 వ సంవత్సరం జనవరి నెల 19 వ తేదిన మరణించాడు.

## 4.3.2 కేశవచంద్ర సేన్ (1838–1884) :

కేశవ చంద్ర సేన్ 1838 నవంబరు 19 న కలకత్తా లో జన్మించాడు. కేశవ చంద్ర సేన్ బెంగాలీ పాఠశాలలోనూ తరువాత 1845 లో హిందూ కళాశాలలోనూ చదివాడు. కేశవ చంద్ర సేన్ 1854 లో కొంతకాలం పాటు ఏషియాటిక్ సొసైటీ కార్యదర్శిగా పనిచేశాడు. కొంతకాలం తర్వాత సేన్ బ్యాంక్ ఆఫ్ బెంగాల్ లో గుమస్తాగా పనిచేశాడు. కాని సాహిత్యం, తత్వశాస్త్రాలకు పూర్తిగా అంకితమయ్యేందుకు తన పదవికి రాజీనామా చేశాడు. 1855వ సంవత్సరంలో శ్రామికుల పిల్లల కోసం ఒక సాయంకాల పాఠశాలను స్థాపించాడు. ఇది 1858 వరకు కొనసాగింది. 1855వ సంవత్సరంలో "బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్"ను స్థాపించాడు. ఈ సమయంలో అతను బ్రహ్మ సమాజ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యాడు.

కేశవ చంద్ర సేన్ 1859లో బ్రహ్మ సమాజంలో చేరాడు. బ్రహ్మ సమాజ సంస్థాగత పనులకు అంకితమయ్యాడు. కలకత్తా బ్రహ్మ సమాజ వారపత్రిక అయిన ఇండియన్ మిర్రర్ కోసం వ్యాసాలు రాశాడు. దీనిలో సామాజిక, నైతిక విషయాలను చర్చించేవారు. కేశవ చంద్ర సేన్ ప్రాచీన హిందూ వనరులను ఉపయోగించడం ద్వారా, వేదాల అధికారం ద్వారా హిందూ మతాన్ని పునరుజ్జీవింపచేయడానికి బ్రహ్మ సమాజం ఉద్దేశించినట్లు ఉపన్యాసాలు చేస్తూ దేశమంతా పర్యటించాడు. సేన్ కృషి ఫలితంగా బ్రహ్మ సమాజ్ ఉద్యమం జనాదరణ పొందింది. కేశవచంద్ర సేన్ చైతన్యవంతమైన వ్యక్తిత్వం, అకుంఠిత దీక్ష, భావావేశంతో కూడిన ఉత్సాహం, వాక్చాతుర్యాలవల్ల ఉద్యమం ప్రజాదరణను పొందింది.

కేశవచంద్ర సేన్ సాంఘిక సంస్కరణల పట్ల చాలా ఉత్సాహాన్ని ప్రదర్శించాడు. సంస్కరణలు అమలు పరచడానికి తనశక్తిని ధారపోయడానికి సిద్ధమయ్యాడు. కేశవచంద్ర సేన్ నాయకత్వంలోని బ్రహ్మసమాజం ఈ క్రింది వాటిని సాధించేందుకు తీవ్రంగా కృషి చేసింది.

1. వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు.
2. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు.
3. పరదా పద్ధతిని తొలగించాలనే ఉద్యమాన్ని నడిపాడు.
4. సహపంక్తి భోజనాలను ప్రోత్సహించాడు.
5. స్త్రీ విద్య కోసం కృషి చేశాడు.
6. బాల్యవివాహాలను బహుభార్యాత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.

1878లో కేశవచంద్ర సేన్, మతపరమైన కారణాలవల్ల బ్రహ్మ సమాజం నుంచి విడిపోయారు. అంతేకాకుండా సేన్ తన 14 సంవత్సరాల కుమార్తెను కూచ్ – బీహార్ హిందూ మహారాజుకు ఇచ్చి బాల్యవివాహం చేయడంతో సేన్ పై

నమ్మకం సడలి, అనుచరులు తిరుగబడ్డారు. కేశవచంద్ర సేన్ ను వ్యతిరేకించిన వారు "సాధారణ బ్రహ్మ సమాజం అనే కొత్త సంస్థను స్థాపించారు. చివరకు సేన్ 1884వ సంవత్సరం జనవరి 8 వ తేదిన మరణించారు.

## 4.4 బ్రహ్మ సమాజ ప్రభావం :

బ్రహ్మ సమాజం తన కార్యక్రమాల ద్వార తీవ్ర ప్రభావాన్ని కనబరిచింది. మూఢ విశ్వాసాల సంకెళ్ళ నుంచి వ్యక్తికి స్వేచ్ఛను కలిగించాలనేదే బ్రహ్మ సమాజ ప్రధాన లక్ష్యం. అయినా వ్యక్తి స్వేచ్ఛ, జాతీయ సమైక్యత, సమగ్రత, సహకారం, సామాజిక సంస్థల ప్రజాస్వామ్యీకరణ, సమాజంలో సంబంధాలు వంటి వాటిని గురించి భారతీయులలో చైతన్యాన్ని కలిగించి భారతీయ సమాజంలో నూతన శకానికి నాంది పలికింది. స్కరణోద్యమాలకు ప్రజాదరణను పెంపొందించి బాల్య వివాహాలు, సతీసహగమనం, బహుభార్యాత్వం, కుల నియంతృత్వంవంటి దురాచారాలను అణచివేయడానికి చాలా కృషి చేసింది. మతపరమైన సంస్కరణలను అమలు పరచడంతో బ్రహ్మ సమాజం తృప్తి పడలేదు. సాంఘిక, రాజకీయ సంస్కరణల కార్యక్రమాలను కూడా అనుసరించి, భారతీయులలో జాతీయ భావం వృద్ధి చెందడంలో ప్రధాన పాత్ర పోషించింది.

## 4.5 సమీక్ష :

హిందూ మతం భారతీయ సమాజం మూఢ విశ్వాసాలతో నిండిపోయిన సమయంలో ఆంగ్ల విద్య, విదేశీ సంస్కృతీ ప్రభావం మతమార్పిడులను ప్రోత్సహించాయి. ఈ సమయంలో హిందూ మతాన్ని సమాజంలోని ఆచారాలను సంస్కరించాలనే ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఈ సమయంలో బెంగాల్ కు చెందిన రాజా రామమోహన్ రాయ్ బ్రహ్మ సమాజం స్థాపించి అందుకు పూనుకున్నారు. సతీసహ గమనం, బాల్యవివాహాలను రాద్దుచేయించడంతో పాటు వితంతు వివాహాలను ప్రోత్సహించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించడంతో పాటు స్త్రీ జనోద్ధరణకు కృషి చేసి హిందూ మతానికి, భారతీయ సమాజానికి నూతన జవసత్వాలను సమకూర్చాడు. రాయ్ తర్వాత కూడా కృషి కొనసాగింది.

## 4.6 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 4.6.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. బ్రహ్మసమాజ సిద్ధాంతాలను వివరించండి.
2. కేశవ చంద్ర సేన్ .

### 4.6.2 పది మార్కుల ప్రశ్నలు :

1. "భారత దేశ సంస్కరణోద్యమ పితామహుడు రాజారామమోహన్ రాయ్" వివరించండి.
2. బ్రహ్మసమాజ సిద్ధాంతాలను వివరించి రాజారామమోహన్ రాయ్ సేవను గురించి రాయండి.

### 4.6.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. బ్రహ్మసమాజ స్థాపకులు ఎవరు.
2. రాజారామమోహన్ రాయ్ నడిపిన బెంగాలీ పత్రిక ఏది

3. బ్రహ్మసమాజ స్థాపన జరిగిన సంవత్సరం ఏది.
4. బ్రహ్మసమాజానికంటే ముందు రాజారామమోహన్ రాయ్ స్థాపించిన సంస్థ ఏది.
5. ఆది బ్రహ్మసమాజం ఎవరు స్థాపించారు..
6. బ్రహ్మసమాజ వార పత్రిక ఏది.

## 4.7 ఉపయుక్త గ్రంధాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహి అల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ జి. సోమశేఖర్**

★★★★★

# పాఠం – 5
# ఆర్యసమాజం – రామకృష్ణ మిషన్

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల 19.20 శతాబ్దాలలో భారతదేశంలో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో భాగంగా స్వామి దయానంద సరస్వతీ చేసిన కృషి, ఆయన స్థాపించిన ఆర్య సమాజం దాని ద్వారా సాగిన సంస్కరణలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

5.1 పరిచయం

5.2 ఆర్యసమాజం

5.2.1 స్వామి దయానంద సరస్వతి

5.2.1.1 శుద్ధిఉద్యమం

5.2.2 ఆర్య సమాజ సిద్ధాంతాలు

5.2.3 స్వామిదయానందసరస్వతి అనంతరం ఆర్య సమాజం

5.3 రామకృష్ణమిషన్

5.3.1 స్వామివివేకానంద

5.3.1. 1 స్వామి వివేకానందబోధనలు

5.3.2 రామకృష్ణమిషన్ లక్ష్యాలు

5.4 సమీక్ష

5.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

5.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు

5.5.2 పది మార్కుల ప్రశ్నలు

5.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు

5.6 ఉపయుక్త గ్రంథాలు

## 5.1 పరిచయం :

ఆంగ్లేయులు భారత దేశానికి వచ్చి, అధికారం హస్తగతం చేసుకున్న వారు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానము, ఆంగ్లేయ సంస్కృతీ వంటి వాటి ప్రభావం వల్ల భారతీయులలోక్రీ.శ. 19, 20వ శతాబ్దములో అనేక నూతన భావాలు, ఆలోచనలు జనించాయి. వాటిపట్ల ఆకర్షితులైన వారు మతం మార్చుకోవడం ప్రారంభించారు. ఇలాంటి స్థితిలో హైందవ సంస్కృతి విమర్శలకు లోను అయింది. ఇటువంటి స్థితిలో హిందూ మతంలో వున్న ఆచార సాంప్రదాయాలను సంస్కరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో కొందరు ప్రవక్తలు, సంస్కర్తలు అందుకు నడుం బిగించారు. అందుకోసం కొన్ని సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసి సంఘ, మత సంస్కరణకు పూనుకున్నారు. అటువంటి వారిలో స్వామి దయానంద సరస్వతి ప్రసిద్ధులు. ఆయన స్థాపించిన ఆర్యసమాజం ప్రధానమైంది.

## 5.2 ఆర్యసమాజం :

క్రీ.శ. 19,20 శతాబ్దాలలో జరిగిన సంఘ సంస్కరణోద్యమలో బ్రహ్మసమాజం తర్వాత ప్రధాన పాత్ర పోషించిన సంస్థ – ఆర్య సమాజం. దీనిని 1875వ సంవత్సరం ఏప్రిల్10వ తేదీన, బొంబాయి నగరంలో స్వామి దయానంద సరస్వతి స్థాపించాడు.

### 5.2.1 స్వామి దయానంద సరస్వతి :

స్వామి దయానంద సరస్వతి అసలు పేరు మూల శంకర్. ఆయన 1824వ సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన లో గుజరాత్ లోని టంకార అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి ఒక మహా శివ భక్తుడు. మూల శంకర్ కు పద్నాలుగు సంవత్సరాల వయస్సు వున్న సమయంలో శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషికాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు అని అనుకుని 1846లో ఇల్లు వదిలి భగవంతుడిని అన్వేశించదానికి బయలుదేరాడు.

వివిధ ప్రాంతాలలో తిరుగుతూ ఎందరో యోగులను కలుసుకుని వారితో కొంతకాలం గడిపాడు. ఈ సమయంలోనే ఆయనకు దయానంద అనే పేరును పొందాడు. భగవంతుని దర్శించాలనే తపనతో వివిధ ప్రాంతాలలో తిరుగుతూ మథురకు చేరుకున్నాడు. అక్కడ వున్న స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరాడు. ఆయన వద్ద వున్న సమయంలో దయానంద వేదాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేశాడు. అనంతరం గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలుదేరాడు.

ఈ విధంగా దేశ పర్యటన చేస్తూ వున్న సమయంలో దేశంలోని స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు దీనంగా వున్న హిందు సమాజంపై అవగాహన పెంచుకున్నాడు. భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉండడం, ధర్మానికి ఉన్నత సంస్కృతికి నిలయమైన భారతదేశం దారిద్ర్యంలో స్వయం వినాశనానికి పరుగులెదుతుండడం చూసి శోకించాడు. హిందు సమాజం

ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో వున్న హిందూ సమాజం, మూఢ విశ్వాసాలు, అంటరానితనం, సతీ సహగమనం , బాల్య వివాహాలు వంటి దురాచారాలు చూసిచలించిపోయి వాటిని ఛేదించడానికి సిద్ధమయ్యాడు.

అందుకోసం స్వామిదయానందసరస్వతి1875వ సంవత్సరంలో ఆర్యసమాజాన్నిస్థాపించాడు. 1876లో లాహోర్లో ఈ సమాజం తన కార్యక్రమాలను ప్రారంభించింది. స్వామి దయానంద సరస్వతి వేదాలకు "సత్యార్థ ప్రకాష్" అనే భాష్యాన్ని రచించాడు. దీని ద్వారా హిందూ మాట ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు. ఏకేశ్వరోపాసనను ప్రచారం చేసాడు. విగ్రహారాధనను, ఛాందసత్వాన్ని, వర్ణవ్యవస్థను, అస్పృశ్యతను ఖండించాడు. సాంఘిక సంస్కరణలను సమర్ధించాడు. మహిళాభ్యుదయాన్ని సమర్ధించాడు. బాల్యవివాహాలను రద్దు చెయ్యాలని కోరాడు. వితంతు పునర్వివాహాన్ని సమర్ధించాడు. వేదాలకు దయానందసరస్వతి వ్రాసిన భాష్యం సత్యార్థప్రకాష్, హిందూ మతానికి అవసరమైన శక్తిని పెంపొందించింది. దయానంద తన సందేశాన్ని సామాన్య ప్రజానీకంలో ప్రచారం చేసాడు. ఆయన సందేశం వైజ్ఞానిక వర్గానికి మాత్రమే పరిమితంకాలేదు.

### 5.2.1.1 శుద్ధిఉద్యమం :

జాతీయ, సాంఘిక, మతరంగాల్లోభారతదేశసమైక్యతనుసాధించాలనేఆశయాలతో 'శుద్ధి' ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ కార్యక్రమం ద్వారా హిందూ మతం నుంచి వెళ్ళిపోయి ఇతర మతాలలో చేరినవారిని తిరిగి హిందూ మతంలోకి ఆహ్వానించాడు. హిందూ మత ద్వారాలను హిందూమతం నుంచి వెళ్ళిపోయి క్రైస్తవ, ముస్లిం మతంలోకి వెళ్ళి పోయిన వారు తిరిగి రావడం కోసం తెరిచి వున్నట్లు గా ప్రకటించాడు. స్వామిదయానందసరస్వతి, ఆయన శిష్యుడు స్వామిశ్రద్ధానంద్ 'శుద్ధి' ఉద్యమానికి గట్టి ప్రోత్సాహాన్నిచ్చారు. చాలామంది హైందవేతరులను హిందూమతంలోకి చేర్చుకున్నారు. దయానందసరస్వతి హిందూ మతాన్ని, సంస్కృతిని గాఢంగా సమర్ధించారు. ప్రాచీన మత పునరుద్ధరణలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తోంది. దయానందసరస్వతి గోసంరక్షణకు కృషి చేసాడు.

ఈ విధంగా సాంఘిక మాట సంస్కరణోద్యమం లో ప్రధాన పాత్ర పోషిచిన స్వామి దయానంద సరస్వతి 1883వ సవత్సరం అక్టోబరునెల 30వ తేదీన మరణించారు.

### 5.2.2 ఆర్య సమాజ సిద్ధాంతాలు :

1. దేవుడుఒక్కడే
2. వేదం విశ్వజ్ఞానికిమూలం
3. స్త్రీ, పురుష, వర్ణవిచక్షణ లేకుండాఅందరూ వేదాధ్యయనం చేయవచ్చు
4. భగవంతుడునిరాకారుడు
5. విగ్రహారాధన పనికిరాదు

స్వామి దయానంద సరస్వతి, ఆయన సహచరుల కృషిఫలితంగా సాంఘిక సంస్కరణలకు, జాతీయవిద్యకు చాలా ప్రచారం లభించింది.

### 5.2.3 స్వామిదయానం దసరస్వతి అనంతరం ఆర్య సమాజం :

దయానంద సరస్వతి మరణానంతరం, ఆర్య సమాజ కార్యకలాపాలను లాలాహన్సరాజ్, లాలాలజపతిరాయ్, స్వామిశ్రద్ధానంద, పండితగురుదత్ మొదలైనవారు కొనసాగించారు. ఆర్యసమాజం పాశ్యాత్య విద్యా ప్రయోజనాలను గుర్తించింది. లాలాహన్సరాజ్, లాలాలజపతిరాయ్ ల ప్రోత్సాహంతో పాశ్చాత్యవిద్యను ప్రచారంచెయ్యడానికి దయానంద్ ఆంగ్లో వేదిక్ ధర్మకర్తృత్వ సంస్థనుస్థాపించాడు. ఈ సంస్థ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలలో పాఠశాలలు, కళాశాలలు స్థాపించి వాటి ద్వారా పాశ్చాత్య విద్యను ప్రజలకందించాయి. ప్రాశ్చాత్య విద్యాభ్యాసం మాత్రమేకాకుండా సంస్కృతి, తత్వశాస్త్రాలను కూడా ఈ విద్యా సంస్థలలో బోధించడం విశేషం. అంతేకాకుండా గురుకులాలను స్థాపించి ప్రాచీనపద్ధతిలో వేదవిద్యను బోధించారు.

ఈ విధంగా ఆర్య సమాజం భారతదేశ సమాజం, మతం ఉద్ధరణకు ఎనలేని కృషి చేసింది.

## 5.3 రామకృష్ణమిషన్ :

క్రీ.శ. 19,20 శతాబ్దాలలో జరిగిన సంఘ సంస్కరణోద్యమలో బ్రహ్మసమాజం తర్వాత ప్రధాన పాత్ర పోషించిన సంస్థ – రామకృష్ణ మిషన్. దీనిని 1897వ సంవత్సరంలో కలకత్తా సమీపమున బేలూరులో స్వామి వివేకానంద స్థాపించాడు.

### 5.3.1 స్వామివివేకానంద :

వికాసమేజీవనం... సంకోచమేమరణం... మనపై మనకు విశ్వాసం, భగవంతుడిపై విశ్వాసం అనేవి పరిపూర్ణ వికాస మంత్రాలు. ముప్పైమూడు కోట్లపౌరాణిక దేవతలపైన మీకు నమ్మకం వున్నా.. మీపై మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే నిష్కృతి వుండదు." వంటి సార్వజనీనమైన బోధనలు చేసిన నిత్యచైతవ్యస్ఫూర్తి – స్వామివివేకానంద !

ప్రపంచ ప్రసిద్ధి చెందిన తత్వవేత్తలలో అగ్రగణ్యదుగా పేరుపొందిన స్వామివివేకానంద బోధనలు నిత్యమై... నిఖిలమై.. సర్వకాలాలకు, సర్వవ్యవస్థలను స్ఫూర్తిని నింపుతూనేవున్నాయి. అటువంటి స్వామివివేకానంద 1863 వసంవత్సరం జనవరి నెల 12వ తేదీన బెంగాల్ రాష్ట్రంలో భువనేశ్వరీ దేవి, విశ్వనాధదత్త దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు ఆయనకు పెట్టినపేరు "నరేంద్రనాథ్ దత్తా". చిన్నతనంలో నరేన్ అని పిలిచేవారు. నరేంద్రనాథ్ దత్తా తాత దుర్గాచరణ్ దత్త ఆధ్యాత్మిక సంపన్నత కలిగినవ్యక్తి. తనకు కుమారుడు విశ్వనాథ దత్త జన్మించగానే 25 సంవత్సరాల వయస్సులోనే వైరాగ్యంతో సర్వసంగ పరిత్యాగం చేసి సన్యాసం స్వీకరించారు. అంటే స్వామి వివేకానంద పూర్వీకులనుంచే ఆధ్యాత్మిక సంపన్నత కలిగిన కుటంబం.

నరేంద్రనాథ్ దత్తా చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తిని కనబరిచేవారు. పూజ, ధ్యానం చేస్తూవుండేవారు. కళాశాలస్థాయిలోపాశ్చాత్యభావాలను చదివిన నరేన్ లో అవి విమర్శనాత్మక ఆలోచనలకు కారణమయ్యాయి. ఒకవైపు పురాతన మత సంప్రదాయాలు, విశ్వాసాల పట్ల గౌరవం, ఇంకోవైపు విమర్శనాత్మక వాదించేతత్వం ఆయనలో చోటుచేసుకోవడంతో ఆయనలో సంఘర్షణ ప్రారంభమైంది. అంతేకాకుండా భగవంతుడి

ఊనికిని గురించి ప్రశ్నలు తలెత్తాయి. ఎందరినో కలిశాడు. తనకు సమాధానం లభించలేదు. దీనితో ఆయనలో తపన మరింత అధికమైంది.

ఇలాంటిస్థితిలో తనప్రొఫెసర్ విలియం హేస్టీ రామకృష్ణ పరమహంసను గురించి వివరించారు. అంతేకాకుండా రామకృష్ణ పరమహంస ను గురించి తనబంధువైన రామచంద్ర దత్తాకూడా చెప్పి రామకష్ణుల వారిని కలవమని నరేన్ కు సలహా ఇచ్చాడు. దీనితో 1881వ సంవత్సరంలో తొలిసారిగా రామకృష్ణ పరమహంస గారిని నరేన్ కలిశారు.

రామకృష్ణ పరమహంస గారిని కలిసిన నరేన్ –

"మీరు దేవుణ్ణి చూశారా?"అని సుటిగా ప్రశ్నించారు.

అందుకు – "అవునుచూశాను నాముందు వున్న నిన్ను చూస్తున్నట్లుగా ఆయన్ను చూశాను." అని రామకృష్ణ పరమహంస సమాధానం ఇచ్చారు.

దీనితో నరేన్ రామకృష్ణ పరమహంస శిష్యులు అయ్యారు. 1886 లో రామకృష్ణ పరమహంస తనువు చాలించాక నరేన్ అనేక ఆలోచనలు చేశాడు. సహచరులతో చర్చలు జరిపారు. 1888 లో మఠం నుంచి బయటకు వచ్చారు. 1990 నుంచి ఆశ్రమం నుంచి బయటకు వచ్చి సమాజంలో వివిధ పేర్లతో సంచరిస్తూ సమాజాన్ని అధ్యయనం చేశారు. అనేక మందిని కలిశాడు. 1893 మే 31 వ తేదిన అమెరికాకు బదులుదేరారు. జులైనాటికి చికాగో చేరుకున్నారు. 1893 సెప్టెంబర్ 11న చికాగోలోని ఆర్ట్ ఇనిస్టూట్ విశాలభవనంలో సర్వమత మహాసభ జరిగింది. ఇందులో 7000 మంది పాల్గొన్నారు. ఆ సమావేశంలో ఆయన విశ్వజనీనమైన ప్రసంగం చేశారు. ఇతర ప్రతినిధులందరూ తమ తమ మతాలను గురించే మాట్లాడితే స్వామీజీ మాత్రం సనాతన మతం గురించి మాట్లాడారు. అందరినీ ఆకట్టుకున్న ఆయన ప్రసంగం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉపన్యాసాలు చేసేలాగా చేసింది. ప్రపంచంలోని అనేక దేశాలలో పర్యటించారు. 1897లో రామకృష్ణ మిషన్ ను ప్రారంభించారు. 1899, 1900లలో ప్రపంచ పర్యటన చేశారు. ప్రపంచ పర్యటన, హిమాలయాల్లోనూ పర్యటించి 1901 మే 2వ వారంలో వివేకానంద స్వామి మఠానికి చేరారు. అప్పటి నుంచి వీరు మఠం లోనే గడిపేవారు. ఒక్కసారి శాస్త్ర అధ్యయనం చేస్తూ... మఠవాసులకు బోధనలు చేస్తూ.. ఇంకోసారి భక్తిగీతాలను భక్తులతో కలిసి ఆలపిస్తు వుండేవారు. బేలూరు మఠం, దీనికి చెందిన ఆస్తులన్నింటినీ సన్యాసుల పేరిట మార్చివేశారు. దానిని ధర్మసంస్థగా తయారుచేశారు.

1902 వ సమత్సరం జూలై నెల 4 వ తేదిన తనువు చాలించారు.

### 5.3.1.1 స్వామి వివేకానందబోధనలు :

1. ఈ లోకం మన మాతృదేశానికి ఎంతో ఋణపడివుంది. గ్రీకుదేశం భూమిమీద లేనికాలంలో.. రోమ్ నగరం లేనిరోజుల్లో ఐరోపాజాతుల పూర్వీకులు అడవుల్లో సంచరించే ప్రాచీన కాలంలో భారతదేశం చైతన్య వంతమై ధర్మప్రచారాలు చేస్తూ వెలుగొందింది. చరిత్రకు అందనికాలం నుండి నేటి వరకు భారతదేశంనుండి దివ్యభావ పరంపరలు ప్రచారమయ్యాయి . ఈ భావప్రచారంలోని ప్రతిమాటకు ముందు శాంతిసందేశం, వెనుక శుభాశీస్సులు సహచరులుగా ప్రవర్ధిల్లాయి.

2. మానవుడిలో సహజంగా వున్నపరిపూర్ణత్వాన్ని ప్రకటించడమేవిద్య... విద్య అంటే మానస్సును ఏకాగ్రమొనర్చడమే! మంచి పౌరులుగా తయారుకావడానికీ, మానసికబలాన్ని, బుద్ధిని వికసింపజేయడంతో పాటు మానవుడు తనకాళ్ళమీద తామ నిలబడేటట్లు చేయగల విద్య అవసరం.

3. మృగాన్నిమానవుడిగా.. మానవుణ్ణి దైవంగా ఉన్నత స్థితికితీసుకు వెళ్ళే భావమే మతం. మానవుడికి శాంతిని సుఖాన్ని కల్పించమే మత ప్రధానలక్ష్యం. మతం శాంతిని అవలంబించేలా కృషిచేయాలి కానీ మనిషిని ఆవేశపూరితుడిని చేయకూడదు.

4. మానవ సేవే మాధవసేవ. ప్రతివ్యక్తి దైవస్వరూపుడు. పవిత్రంగావుండడం, పరులకు మంచి చేయడం, పేదల్లో, బలహీనుల్లో,రోగులలో దైవాన్ని దర్శిస్తూ వారిని సేవించే వ్యక్తి పరమశివుడిభక్తుడు.

5. సర్వమానవ సౌభ్రాతృత్వమే మానవాళిలక్ష్యం.

6. కులవ్యవస్థ, బాల్యవివాహాలు , అంటరానితనం సమాజ అభివృద్ధి నిరోధకాలు. వాటిని పాటించరాదు.

7. ఇతరులను గుడ్డిగా అనుకరించుట వల్ల ప్రగతిని సాధింపలేము.

8. పాశ్చాత్యమార్గానుకరణ నాగరికతకాదు. గుడ్డిగా ఇతరులను అనుకరించుట వల్ల ప్రగతిని సాధింపలేము.

9. విదేశాల నుండి ఏమి నేర్చుకోవద్దని నేను చెప్పను. కాని నీవు విదేశీయుడవు కావద్దు. నీవు నీ దేశమునకు దూరము కావద్దు.

వివేకానంద స్వామి బోధనలు హిందువులకు తమ మతము, సంస్కృతిపై ఎనలేని విశ్వాసము కలిగించాయి., వారిలో ఆత్మవిశ్వాసమును, ఆత్మాభిమానమును కలిగించాయి. తిలక్, అరవింద్ ఘోష్, సుభాష్ చంద్రబోస్ వంటినా యకులు వివేకానందుని భావాలకు ప్రభావితులయ్యారు.

### 5.3.2 రామకృష్ణమిషన్ లక్ష్యాలు :

మానవసేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో రామకృష్ణ మిషన్ దేశవ్యాప్తంగా విస్తరించి మహత్తరమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

1. సర్వ మతసామరస్య సాధనకై రామకృష్ణ పరమహంస నడిపిన ఉద్యమాన్ని కొనసాగించడం.
2. ప్రజలకు నిజజీవితంలో ఉపయోగపడేవి ద్యలు నేర్పడానికి కృషిచేయడం.
3. కళలను, పరిశ్రమలను ప్రోత్సహించడం.
4. రామకృష్ణుని వేదాంత, మత అభిప్రాయాలను సామాన్య ప్రజలకు అందచేయడం
5. సన్యాసులకు, సంఘ కార్యక్రమాల్లో పాల్గొనేవారికి అవసరమైనశిక్షణనివ్వడానికి దేశంలోని వివిధప్రాంతాల్లో మఠాలను, ఆశ్రమాలనుస్థాపించడం.
6. విదేశాలకు, భారతదేశానికి సన్నిహితసంబంధం ఏర్పరచి, సామరస్య భావాన్ని పెంచటానికి కృషిచేయటం.

7. అనాధల, వితంతువుల, వెనుకబడినవర్గాల సంక్షేమానికి కృషిచేయడం.
8. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద ల బోధనలు ప్రచారం చేయడంతో పాటు వాటిని పుస్తక రూపంలో ప్రచురించి అందరికీ అందుబాటులో వుంచడం.
9. యువతలో దేశభక్తిని పెంపొందించడం.

ఈ విధమైన లక్ష్యాలతో రామకృష్ణ మిషన్ నేటికీ విజయవంతంగా కృషి చేస్తూ వుంది.

## 5.4 సమీక్ష :

హిందూ మతం భారతీయ సమాజం మూఢ విశ్వాసాలతో నిండిపోయిన సమయంలో ఆంగ్ల విద్య, విదేశీ సంస్కృతీ ప్రభావం మతమార్పిడులను ప్రోత్సహించాయి. ఈ సమయంలో హిందూ మతాన్ని సమాజంలోని ఆచారాలను సంస్కరించాలనే ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఈ సమయంలో స్వామి దయానంద సరస్వతీ ఆర్య సమాజం స్థాపించి సాంఘిక మత ఉద్ధరణకు కృషి చేశారు. స్వామి వివేకానంద ఎన్నో బోధనలు చేసి భారతీయులను చైతన్య వంతులను చేయడంతో పాటు రామకృష్ణ మిషన్ స్థాపించారు. అది నేటికీ వారి బోధనలకు అనుగుణంగా కృషి చేస్తోంది.

## 5.2.5 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 5.2.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. ఆర్యసమాజ సిద్ధాంతాలను వివరించండి.
2. స్వామి వివేకానంద బోధనలు ఏవి .

### 5.5.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశ సంస్కృతీ రక్షణకు వివేకానంద స్వామి చేసిన సేవను వివరించండి..
2. ఆర్య సమాజ సిద్ధాంతాలను వివరించి స్వామి దయానంద సరస్వతి సేవను గురించి రాయండి.

### 5.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. ఆర్యసమాజ స్థాపకులు ఎవరు.
2. స్వామి దయానంద సరస్వతి రాసిన గ్రంథం ఏది
3. ఆర్యసమాజ స్థాపన జరిగిన సంవత్సరం ఏది.
4. స్వామి వివేకానంద గురువు ఎవరు.
5. రామకృష్ణ మిషన్ ఎవరు స్థాపించారు..
6. రామకృష్ణ మిషన్ ప్రధాన కార్యాలయం ఎక్కడ వుంది.

## 5.6 ఉపయుక్త గ్రంధాలు :

1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C

2. Modern India – Bipan Chandra

3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C

4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C

5. Modern India – Sumit Sarkar

6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ

7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి

8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర

**డాక్టర్ జి. సోమశేఖర్**

★★★★★

# పాఠం – 6
# కులనిర్మూలన – ఆత్మగౌరవ ఉద్యమాలు

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల 19.20 శతాబ్దాలలో భారతదేశంలో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో భాగంగా జరిగిన కులనిర్మూలన, ఆత్మ గౌరవ ఉద్యమాల గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


6.1 పరిచయం

6.2 కులనిర్మూలన ఉద్యమం

6.2.1 జ్యోతిబా పూలే

6.2.1.1 స్త్రీజనోద్ధరణ

6.2.1.1.1 విద్య

6.2.1.1.2 వితంతువుల ఉన్నతికి కృషి

6.2.1.1.3 సత్యశోధక్ సమాజ్

6.2.1.1.4 రచనలు

6.2.2 నారాయణ గురు

6.2.2.1 ఆత్మగౌరవ ఉద్యమం

6.22..2 రామస్వామి

6.3 సమీక్ష

6.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

6.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు

6.4.2 పది మార్కుల ప్రశ్నలు

6.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు

6.5 ఉపయుక్త గ్రంథాలు

## 6.1 పరిచయం :

ఆంగ్లేయులు భారత దేశానికి వచ్చి, అధికారం హస్తగతం చేసుకున్న వారు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానము, ఆంగ్లేయ సంస్కృతీ వంటి వాటి ప్రభావం వల్ల భారతీయులలో క్రీ.శ. 19, 20వ శతాబ్దములో అనేక నూతన భావాలు, ఆలోచనలు జనించాయి. వాటిపట్ల ఆకర్షితులైన వారు మతం మార్చుకోవడం ప్రారంభించారు. ఇలాంటి స్థితిలో హైందవ సంస్కృతివిమర్శలకు లోను అయింది. ఇటువంటి స్థితిలో హిందూ మతంలో వున్న ఆచార సాంప్రదాయాలను సంస్కరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో కొందరు ప్రవక్తలు, సంస్కర్తలు అందుకు నడుం బిగించారు. అందుకోసం కొన్ని సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసి సంఘ, మత సంస్కరణకు పూనుకున్నారు. అదే సమయంలో హిందూ సమాజం లో వున్న కులవివక్షత, అంటరానితనం వంటి వాటికి వ్యతిరేకంగా కూడా ఆలోచనలు ప్రారంభం కాగా కొందరు అటువంటి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. వారు కొన్ని సంఘాలను స్థాపించి కృషి చేశారు. వారిలో జ్యోతిబా పూలే, నారాయణ గురు, పెరియార్ రామస్వామి అగ్రగణ్యులు.

## 6.2 కులనిర్మూలన ఉద్యమం :

క్రీ.శ. 19, 20వ శతాబ్దములో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో భాగంగా కుల నిర్మూలన కోసం కూడా ఉద్యమాలు సాగాయి. ప్రధానంగా ఈ ఉద్యమాలను మహారాష్ట్ర కు చెందిన జ్యోతిబా పూలే, కేరళకు చెందిన నారాయణ గురు నడిపారు.

### 6.2.1 జ్యోతిబా పూలే :

కులభేదాలు లేని సమాజ స్థాపన కోసం, కులవ్యవస్థ నిర్మూలన కోసం కృషిచేసిన మహనీయుడు–
స్వేచ్ఛ, సమానత్వం, సహోదరభావం గల సమాజ స్థాపన కోసం ప్రయత్నించిన సంస్కర్త –
స్త్రీ జనోద్ధరణకు కృషిచేసిన స్త్రీ జనోద్ధారకుడు–

జ్యోతిబా పూలే

జ్యోతిబా పూలే అసలు పేరు – జ్యోతీరావ్ గోవిందరావ్ ఫులే. జ్యోతిబా పూలే 1827వ సంవత్సరం ఏప్రిల్ 11వ తేదిన మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో మాలి కులానికి చెందిన కుటుంబంలో జన్మించాడు. ఆయన తండ్రి గోవిందరావు. వీరి పూర్వీకులు పీష్వా పరిపాలనాకాలంలో పూల వ్యాపారం చేయడంవల్ల వారి ఇంటి పేరు పూలే గా మార్పు చెందినట్లు చెబుతారు. జ్యోతిబా పూలే చిన్నతనంలోనే తల్లి మరణించింది.

జ్యోతిబా పూలే ఏడు సంవత్సరాల వయస్సులో మరాఠీ పాఠశాలలో చేరి ప్రాథమిక విద్యనభ్యసించాడు. తరువాత చదువు మానివేసి వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉండేవాడు. అతి తక్కువ కాలం పాఠశాలకు వెళ్ళినప్పటికీ పూలేకి పుస్తక పఠనం పట్ల ఆసక్తి ఏర్పడింది. 13 ఏళ్ళ ప్రాయంలో జ్యోతిబా పూలే కు తొమ్మిది సంవత్సరాల వయస్సు వున్న సావిత్రితో వివాహం జరిగింది.

ప్రతిరోజూ వ్యవసాయం పనులు పూర్తి అయి రాత్రి పడుకునేముందు చిన్న దీపం వెలుగులో లభించిన పుస్తకాలు చదివేవాడు. దీనిని చూసిన పక్కింటి క్రైస్తవ పెద్దమనిషి, ఒక మహమ్మదీయ ఉపాధ్యాయుడు పూలే తండ్రితో మాట్లాడి తిరిగి చదువుకునేందుకు ఒప్పించారు. పూలే 1841లో పూణేలో స్కాటిష్ మిషన్ నడుపుతున్న పాఠశాలలో చేరాడు. ఈ సమయంలో అనేక పుస్తకాలను చదివాడు. మానవ హక్కులను గురించి, ప్రాథమిక హక్కులను గురించి అవగాహనను పెంచుకున్నాడు. థామస్ రచించిన 'మానవ హక్కులు' అనే పుస్తకం పూలే ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేసింది. మహారాష్ట్ర పాలకుడైన ఛత్రపతి శివాజీ అంటే చిన్నప్పటి నుంచి అభిమానం వున్న పూలే శివాజీ చరిత్ర చదివి తీవ్ర ప్రభావానికి లోనయ్యాడు. అలాగే అమెరికా దేశ తొలి అధ్యక్షుడైన జార్జ్ వాషింగ్ టన్ జీవిత చరిత్ర తో పాటు అమెరికా స్వాతంత్ర్య సమరం గురించి తెలుసుకుని తీవ్ర ప్రభావానికి లోనయ్యాడు. వీటివల్ల పూలేలో నాయకత్వ లక్షణాలు దేశభక్తి అలవడింది. దీనికి తోడు సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడైన సదాశివ భిల్లాల్ గోవింద్‌తో పూలే పరిచయం జీవితకాల స్నేహంగా మారడంతో పాటు అనేక ఆలోచనలకు కారణం అయింది. వీటన్నింటికీ తోడు 1848లో జరిగిన తన ఉన్నత కులస్తుడైన తన స్నేహితుడి వివాహంలో తనకు ఎదురైన కులవివక్ష పూలేలో అనేక ఆలోచనలకు కారణమై పూలేను కుల వివక్షపైన పోరాటానికి సిద్ధం చేసింది. దీనితో పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు స్త్రీజనోద్ధరణకు కృషి చేసాడు.

### 6.2.1.1 స్త్రీజనోద్ధరణ :

జ్యోతిబా పూలే స్త్రీజనోద్దరణ కోసం నడుంబిగించి అనేక కార్యక్రమాలను చేపట్టాడు. స్త్రీ, పురుషుల మధ్య లింగవివక్షను పూలే విమర్శించాడు.

#### 6.2.1.1.1 విద్య :

జ్యోతిబా పూలే మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించేందుకు తీవ్రంగా కృషి చేశాడు. అందుకు ఆయన భార్య సావిత్రిబాయి ఫులే కూడా ఎంతో సహకారాన్ని అందించింది. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడు. అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మాడు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపాడు. సావిత్రిబాయి ఫులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. పూలే తన భార్య తో కలిసి బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడు. భారతదేశ బాలికల కోసం పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ దంపతులు పూలే మరియు ఆయన భార్య సావిత్రీబాయి పూలే కావడం విశేషం. ఈ పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించడం, అంటరానివారికి కూడా బోధించాల్సి ఉండడంతో అందులో పనిచేసేందుకు ఉపాధ్యాయులెవరూ ముందుకు రాలేదు. ఇలాంటి స్థితిలో జోతిరావ్‌పూలే తనభార్య సావిత్రి తో పిల్లలకు పాఠాలు బోధించేలా చేశాడు. పాఠశాల నిర్వహణలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. కొంతకాలం పాఠశాలను నిర్వహించలేక మూసివేశాడు. అయినా పట్టు వదలక తన మిత్రులైన గోవింద్, వల్వేకర్‌ల సహాయంతో పాఠశాలను పునఃప్రారంభించాడు. క్రమంగా ఆదరణ

పెరగడంతో 1851-52లో మరో రెండు పాఠశాలలు స్థాపించాడు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడాన్ని పూలే విమర్శించేవాడు.

### 6.2.1.1.2 వితంతువుల ఉన్నతికి కృషి :

ఆనాడు సమాజంలో బాల్య వివాహాలు సర్వసాధారణంగా జరిగేవి. ముసలివారికిచ్చి పెళ్ళి చేయడంవల్ల చిన్నతనంలోనే మహిళలు వితంతువులయ్యేవారు. వీరు మళ్ళీ వివాహం చేసుకోవడానికి సమాజం అంగీకరించేదికాదు. అందువల్ల వితంతు పునర్వివాహాల గురించి పూలే ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడు. స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించాడు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" స్థాపించి, వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. 1872లో ఈ కేంద్రంలో జన్మించిన ఒక బ్రాహ్మణ వితంతువు కుమారుణ్ణి పూలే దత్తత తీసుకున్నాడు. పులే వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. 1853లో వితంతు మహిళల అనాథ శిశువుల కోసం సేవాసదనం ప్రారంభించాడు.

### 6.2.1.1.3 సత్యశోధక్ సమాజ్ :

జ్యోతిబా పూలే 1873 సెప్టెంబరు 24న, పులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను సాధించెందుకోసం కి సత్యశోధక్ సమాజ్ అనే సంఘాన్ని ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు. శూద్రులను ఉన్నతకులాల చెర నుండి కాపాడటమే ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశం. ఈ సంఘం ద్వారా ఉన్నతకులాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించవలసినదిగా సామాన్యుల్ని ప్రోత్సహించాడు. కుల విధానంలో ఆయన ఉన్నతకులాల వారిని విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞాన సముపార్జనకు అందరికీ అవకాశం ఇవ్వక పోవడాన్ని జ్యోతిబా పూలే వ్యతిరేకించాడు. ఈ సంస్థ సభ్యులు పురోహితుల అవసరం లేకుండానే దేవుణ్ణి పూజించేవారు. వేదాలను పవిత్రంగా భావించడాన్ని పూలే వ్యతిరేకించాడు. విగ్రహారాధనను ఖండించాడు. ఈ సంస్థ ద్వారా పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి నడిపాడు. అగ్రవర్ణాల వారి అన్యాయాలను ఈ పత్రికద్వారా వెలుగెత్తి చాటడంతో పాటు వెనుకబడిన వారిని చైతన్య వంతులను చేశాడు.

### 6.2.1.1.4 రచనలు :

జ్యోతిబా పూలే అనేక గ్రంధాలను రచించారు. గులాంగిరి, పూణే సత్య సోధక సమాజ నివేదిక, తృతీయ రత్న, ఛత్రపతి శివాజీ, రాజ్‌భోంస్లే యాంచ, విద్యాకాథాతిల్, బ్రాహ్మణ్ పంతోజి, సార్వజనిక్ ధర్మపుస్తక్, కల్టివేటర్స్ విప్‌కార్డ్, సార్వజనిక్ సత్యధర్మ మొదలైనవి పూలే ముఖ్య రచనలు.

ఈ విధంగా వెనుకబడిన కులాల అభివృద్ధికి కులనిర్మూలన కోసం విశేషంగా కృషి చేసిన పూలేను తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. సమాజంలో వెనుకబడినవర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతికోసం చేసిన కృషికి

ఆయనకు 'మహాత్మ' బిరుదు ఇచ్చారు. దీర్ఘకాల జబ్బుతో బాధపడుతూ నిరంతరం సమసమాజ స్థాపన కోసం పరితపించిన 1890 నవంబరు 28న మరణించాడు.

### 6.2.2 నారాయణ గురు :

కుల తత్వాన్ని నిరసించి కులభేదాలు లేని సమాజ స్థాపన కోసం, కులవ్యవస్థ నిర్మూలన కోసం కృషిచేసిన మహనీయుడు –

సమాజంలోని మూఢ విశ్వాసాలను వ్యతిరేకించిన సంఘ సంస్కర్త –

నారాయణ గురు.

నారాయణ గురు 1856లో కేరళ లోని తిరువనంతపురం సమీపంలోని చెంపళంతి అనే గ్రామంలో మదన్ ఆసన్, కుట్టియమ్మ అనే వ్యవసాయదారుల కుటుంబంలో జన్మించాడు. ఈయన వెనుకబడిన కులం అయిన ఎజవా కులంలో జన్మించాడు. నారాయణన్ కు ఐదేళ్ళ వయసులో పక్కనే ఉన్న గురుకుల పాఠశాల లో తన విద్యాభ్యాసాన్ని ప్రారంభించాడు. అయితే గురుకుల పాఠశాల లోనే తనను కులం పేరుతొ తక్కువగా చూడడం కలిచి వేసింది. దీనితో నారాయణ గురులో అనేక ఆలోచనలు తలెత్తి చివరకు కులనిర్మూలన ఉద్యమానికి పూనుకున్నాడు. కులం కారణంగా కొన్ని వర్గాలకు చెందిన ప్రజలు అన్యాయానికి గురవుతున్నారనీ, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్ర్యం ఉండాలని నారాయణ గురు భావించాడు. అందుకు 1903 వ సంవత్సరంలో శ్రీ నారాయణ ధర్మ పరిపాలనా యోగం అనే సంస్థను స్థాపించాడు. దీని ద్వారా వెనుకబడ్డ వారిని ఉద్ధరించడానికి ఆలయాలు, పాఠశాలలు మొదలైన సంస్థలు నెలకొల్పడు. నారాయణ గురు 1928 సెప్టెంబరు 20న మరణించాడు.

నారాయణ గురు చేసిన కృషివల్ల కేరళ లో ఆధ్యాత్మిక మత పునరుజ్జీవం జరిగి కుల వైషమ్యాలు నశించి రాజకీయ చైతన్యం కలిగింది.

#### 6.2.2.1 ఆత్మగౌరవ ఉద్యమం :

క్రీ.శ. 19, 20వ శతాబ్దములో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో ఆత్మగౌరవ ఉద్యమాలు సాగాయి. ప్రధానంగా ఈ ఉద్యమాలను తమిళనాడు కు చెందిన పెరియార్ రామస్వామి నడిపారు.

#### 6.2.2.2 రామస్వామి :

సాంఘిక సమానత్వం కోసం ఆత్మగౌరవ ఉద్యమాన్ని నడిపిన నాయకుడు –

కులవ్యవస్థ నిర్మూలన కోసం కృషిచేసిన మహనీయుడు –

రామస్వామి.

రామస్వామి పూర్తి పేరు **పెరియార్** ఈరోడ్ వేంకట రామస్వామి **నాయకర్.** ఇ. వి. రామస్వామి నాయకర్ గా, పెరియార్ రామస్వామిగా ప్రసిద్ధుడైన రామస్వామి 1879 వ సంవత్సరం సెప్టెంబర్ 17 వ తేదీన తమిళనాడు

రాష్ట్రంలోని ఈరోడ్ పట్టణంలో జన్మించారు. ఈయన పెరియార్ గా, తంద్రై పెరియార్ గా, రామస్వామిగా, ఇ.వి.ఆర్.గా కూడా సుప్రసిద్ధులు.

ఈయన నాస్తికవాది. సంఘ సంస్కర్త. తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం, ద్రావిడ ఉద్యమ నిర్మాత. 1904లో ఈయన కాశీ లోని విశ్వనాథుడి దర్శనార్థం వెళ్ళినపుడు అచట జరిగిన అవమానంతో ఈయన నాస్తికుడిగా మారాడని చెప్తారు. హేతువాదిగా మారి హిందూ మతాన్ని అందులోని కులవ్యవస్థను వ్యతిరేకించాడు.

ఈయన 1919 నుండి 1925 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడాడు. తదనంతర కాలంలో ఈయన, ఇతని అనుచరులు దేశ స్వాతంత్ర్యం కన్నా సాంఘిక సమానత్వం కొరకు ఎక్కువగా పోరాడారు. అన్ని కులాల వారికీ సమానంగా దేవాలయ ప్రవేశార్హత ఉండాలని కోరారు, అందుకు కృషి చేశారు వాదించారు. 1937 వ సంవత్సరంలో రాజాజీ నేతృత్వంలోని మద్రాస్ ప్రెసిడెన్సీ కాంగ్రెస్ ప్రభుత్వం హిందీ భాషను మద్రాసు రాష్ట్ర పాఠశాలల్లో ప్రవేశపెట్టినపుడు పెరియార్ తన జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో హిందీ వ్యతిరేకోద్యమాన్ని పెద్దయెత్తున చేపట్టి చివరికి హిందీ బోధనను విరమింపచేశాడు.

తరువాత ఈయన పార్లమెంటరీ రాజకీయాల మీద విశ్వాసం కోల్పోయి జస్టిస్ పార్టీని ద్రావిడర్ కళగం అనే సామాజికోద్యమ సంస్థగా మార్చాడు. రామస్వామి 24 డిసెంబరు 1973 న కన్నుమూశారు.

## 6.3 సమీక్ష :

హిందూ మతం భారతీయ సమాజం మూఢ విశ్వాసాలతో నిండిపోయిన సమయంలో ఆంగ్ల విద్య, విదేశీ సంస్కృతీ ప్రభావం మతమార్పిడులను ప్రోత్సహించాయి. ఈ సమయంలో హిందూ మతాన్ని సమాజంలోని ఆచారాలను సంస్కరించాలనే ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఇదే సమయంలో హిందూ మతంలో ఉన్న కులవ్యత్యాసాలు, అంటరానితనం కులవివక్షత మీద కూడా ఉద్యమాలు జరిగాయి.అందులో కులనిర్మూలన, ఆత్మ గౌరవ ఉద్యమాలు ప్రధానమైనవి.

## 6.4 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 6.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. నారాయణ గురు .
2. పెరియార్ రామస్వామి.

### 6.4.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశంలో జరిగిన కులనిర్మూలన, ఆత్మగౌరవ ఉద్యమాలను వివరించండి.

2. జ్యోతిరావు పూలే సేవను గురించి రాయండి.

**6.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు :**

1. సత్యశోధాక్ సమాజ్ స్థాపకులు ఎవరు.
2. జ్యోతిబా పూలే నడిపిన పత్రిక ఏది.
3. జ్యోతిబా పూలే భార్య పేరు ఏమి.
4. నారాయణ గురు స్థాపించిన సంస్థ పేరు ఏమి.
5. నారాయణ గురు ఏ రాష్ట్రంలో ఉద్యమం నడిపాడు.
6. ఆత్మగౌరవ ఉద్యమ నాయకుడు ఎవరు.

**6.5 ఉపయుక్త గ్రంధాలు :**


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహి అల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ జి. సోమశేఖర్**

★★★★★

# పాఠం – 7

# అంతరానితన నిర్మూలన – డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం వల్ల 19.20 శతాబ్దాలలో భారతదేశంలో జరిగిన సాంఘిక మత సంస్కరణోద్యమలో భాగంగా జరిగిన అంటరాని తన నిర్మూలన కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

7.1 పరిచయం

7.2 డాక్టర్ బి అంబేద్కర్ .ఆర్.డాక్టర్ బిఅంబేద్కర్ .ఆర్.

7.2.1 బహిష్కృత హితకారిణి

7.2.2 మూక్ నాయక్ వారపత్రిక

7.2.3 రాజకీయ కార్యకలాపాలు

7.2.4 రాజ్యాంగ సభలో

7.2.5 నిమ్న జాతుల సమాఖ్య

7.2.6 బౌద్ధ మత స్వీకారం

7.2.7 రచనలు

7.3 . సమీక్ష

7.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

7.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు

7.4.2 పది మార్కుల ప్రశ్నలు

7.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు

7.5 ఉపయుక్త గ్రంథాలు

## 7.1 పరిచయం :

ఆంగ్లేయులు భారత దేశానికి వచ్చి, అధికారం హస్తగతం చేసుకున్న వారు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానము, ఆంగ్లేయ సంస్కృతీ వంటి వాటి ప్రభావం వల్ల భారతీయులలో క్రీ.శ. 19, 20వ శతాబ్దములో అనేక నూతన భావాలు, ఆలోచనలు జనించాయి. వాటిపట్ల ఆకర్షితులైన వారు మతం మార్చుకోవడం ప్రారంభించారు. ఇలాంటి స్థితిలో హైందవ సంస్కృతివిమర్శలకు లోను అయింది. ఇటువంటి స్థితిలో హిందూ మతంలో వున్న ఆచార సాంప్రదాయాలను సంస్కరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో కొందరు ప్రవక్తలు, సంస్కర్తలు అందుకు నడుం బిగించారు. అందుకోసం కొన్ని సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసి సంఘ, మత సంస్కరణకు పూనుకున్నారు. అదే సమయంలో హిందూ సమాజం లో వున్న కులవివక్షత, అంటరానితనం వంటి వాటికి వ్యతిరేకంగా కూడా ఆలోచనలు ప్రారంభం కాగా కొందరు అటువంటి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. వారిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అగ్రగణ్యులు. అంతరానితన నిర్మూలనకోసం నడుంబిగించారు.

## 7.2 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ :

దళిత జాతుల వారి సాంఘిక సమానత్వం కోసం, వారి ఉద్ధరణ కోపం కృషి సలిపిన నిమ్న జాతుల వైతాళికుడు –
రాజ్యాంగ నిర్మాత –
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

బి.ఆర్. అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అంబవాడలో రాంజీ, భీమాబాయిలకు జన్మించారు. 1900 సంవత్సరంలో సతారాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేరాడు. అక్కడ అందరూ అంటరానివాడిగా చూశారు. ఇది ఆ బాలుని మనసులో చెరగని ముద్ర వేసింది. 5వ తరగతిలో వున్నప్పుడు బి.ఆర్. అంబేద్కర్ బొంబాయి చేరుకున్నాడు. అక్కడ కాస్త స్వేచ్ఛ లభించింది. 1907లో మెట్రిక్ పాస్ అయ్యాడు. ఎలిఫిస్టన్ కళాశాలలో బరోడా మహారాజు శయాజిరావు ఆర్థిక సహకారంతో చదివి 1912లో బి.ఎ. ఉత్తీర్ణుడై అయి కొంతకాలం బరోడా సంస్థాన రక్షణ శాఖలో పనిచేశాడు. 1913లో ఉన్నత విద్యాభ్యాసానికై అమెరికా వెళ్ళి కొలంబియా విశ్వవిద్యాలయంలో 1915 జూన్ లో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ.లో ఉత్తీర్ణులు అయ్యారు. 1917 జూన్ 8వ కొలంబియా విశ్వవిద్యాలయం "భారత జాతీయాదాయం దాన చారిత్రక విశ్లేషణ" అన్న సిద్ధాంత గ్రంధానికి అంబేద్కరకు పి.హెచ్.డి. ఇచ్చింది.

అమెరికా నుంచి తిరిగి వచ్చాక బరోడా సంస్థానంలో రక్షణ శాఖ కార్యదర్శిగా ఆయన ఉద్యోగంలో చేరారు. అంటరానివాడని కనీసం గుమాస్తాలు కూడా ఫైళ్ళు చేతికి ఇచ్చేవారు కాదు. వుండడానికి ఇల్లు కూడా ఎవరూ ఇవ్వలేదు. పార్సీ సత్రంలో కొన్నాళ్ళు గడిపారు. కానీ అంటరానివాడని తెలిశాక అక్కడి మంచి వెళ్ళిపొమ్మన్నారు. ఇలా ఎన్నో అవమానాల్ని చవిచూసిన అంబేద్కర్ కు కులతత్వంపైన, మనిషిని మనిషిగా చూడలేని సంప్రదాయాల మీద వ్యతిరేకత కలిగింది. అవంతరం బరోడా సంస్థానంలో ఉద్యోగం మామకుని బొంబాయిలో కొంతకాలం ట్యూషన్లు చెప్పుకున్నారు. ఆ తరువాత సైడన్ హామ్ కళాశాలలో రాజకీయ ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసర్ గా 1918 నవంబర్ లో చేరారు. 1920 వరకూ

అంబేద్కర్ అక్కడ పని చేశారు. ఆ సమయంలో బానిసత్వంలో మూలుగుతున్న దళిత జాతులను మేల్కొలపాలని విశ్వసించి అందుకు ఆహోరాత్రులు కృషి చేశారు. –1920 మే నెలలో వాగపూర్లో అఖిల భారత నిమ్నజాతుల మహాసభలో ఉపన్యసించారు.

1920 సెప్టెంబర్ లో లండన్ వెళ్ళి అక్కడ ఉన్నత విద్యాభ్యాసం చేసి 1921 జూన్ లో "ప్రొవెన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా" అనే పరిశోధనా గ్రంథానికి పట్టాను పొందారు. 1922 అక్టోబర్ లో డి.ఎస్.సి. పట్టా కోసం "ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ" అనే సిద్ధాంతం గ్రంథాన్ని సమర్పించారు. అదే సమయంలో బారిష్టర్ పరీక్షలో కూడా ఉత్తీర్ణులయ్యారు. దానితో 1923 జూన్ లో లండన్ నుంచి బొంబాయి చేరుకొని న్యాయవాదిగా కొత్త జీవితం ప్రారంభించారు.

## 7.2.1 బహిష్కృత హితకారిణి :

చిన్నతనం నుంచి అంటరానితనం వల్ల తీవ్ర అవమానాలకు గురైన అంబేద్కర్ నిమ్న జాతుల ఉద్ధరణ కోసం నడుం బిగించారు. ఉద్యమానికి సిద్ధమయ్యాడు. అందుకోసం ఒక సంస్థను స్థాపించారు. నిమ్న జాతుల సాంఘిక దాస్య విముక్తి కోసం జరిగే ఉద్యమంలో భాగంగా సంఘ సంస్కరణాభిలాషులందరిని కూడగట్టుకుని 1924 జులైలో "బహిష్కృత హితకారిణి" అనే సంస్థను స్థాపించారు. దీనికి విమల్ తల్వార్ ఆధ్యక్షులు కాగా అంబేద్కర్ కార్యనిర్వాహక అధ్యక్షులు. ఈ సంఘం పాఠశాలలు, హాస్టల్లు స్థాపించడం, విన్న జాతులలో నాగరికతను పెంచడం, సాంకేతిక శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలను చేపట్టింది. బహిష్కృత హితకారిణి సంఘం కార్యక్రమాల ప్రచారం కోసం"సరస్వతీ విలాప్" 'బహిష్కృత భారతి' పత్రికలను ప్రారంభించారు. వీటి ద్వారా నిమ్నజాతుల వారికి జరుగుతూ వున్న అన్యాయాలను ప్రశ్నించడంతో పాటు వారిని చైతన్య వంతులను చేయడానికి తీవ్రంగా కృషి చేశాడు.

## 7.2.2 మూక్ నాయక్ వారపత్రిక :

నోరుండి అన్యాయాలను, అక్రమాలను, దురాచారాలను ఎదిరించి మాట్లాడలేవి నిమ్న జాతులను చైతన్యవంతుల్ని చేయడం కోసం అంబేద్కర్ 1920 వ సంవత్సరం జనవరి నెల 31న "మూక్ నాయక్" వారపత్రికను ఆయన స్థాపించారు. అది అనేక మంది ఆదరాభిమానాలను చూరగొంది. కొంతమంది అగ్ర వర్ణాలవారు ఆ స్థితిని చూసి భయపడ్డారు. ఈ పత్రిక దళిత జాత జాగృతి గా పేరు పొందింది. అయినా "మూక్ నాయక్" కొంతకాలం మాత్రమే వడిచింది.

## 7.2.3 రాజకీయ కార్యకలాపాలు :

నిమ్న జాతుల సాంఘిక దాస్య విముక్తి కోసం ఉద్యమం ప్రారంభించి తీవ్రంగా కృషి చేసిన అంబేద్కర్ రాజకీయాలలో ప్రవేశించి అందుకు కృషి చేశారు. బొంబాయి శాసన సభలో సభ్యునిగా అంబేద్కర్ నియమించబడ్డారు. అంబేద్కర్ సైమన్ కమిషన్ ను కలుసుకుని నిమ్న జాతులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని కోరారు. దేశ మంతా వివిధ సంఘాలచే తీర్మానాలు చేయించారు. దీనితో గాంధీ, అంబేద్కర్ మధ్య అభిప్రాయ బేధాలు ప్రారంభం

అయ్యాయి. "అస్పృశ్యుల ఉద్ధరణకు కాంగ్రెస్ కృషి చేయడం వల్ల వేరే రాజకీయ రక్షణ అవసరం లేదని" గాంధీజీ అంబేద్కర్ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు.

1930లో రౌండ్ టేబుల్ సమావేశంలో నిమ్నజాతుల ప్రతినిధిగా పాల్గొని వారి అభివృద్ధి కోసం కృషి సల్పారు.

1932లో అంబేద్కర్ సూచించినట్టు నిమ్న జాతులకు ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీరించడంతో అంబేద్కర్ కృషికి ఫలితం దక్కింది. అయితే గాంధీ దీనిని వ్యతిరేకిస్తూ ఎరవాడ జైలులో విరాహారదీక్ష ప్రారంభించారు. అనంతరం అనేక మంది నాయకుల కృషివల్ల ఇద్దరి మధ్య ఒడంబడిక కుదిరి గాంధీజీ దీక్ష విరమించారు.

1936లో అంబేద్కర్ "ఇండిపెండెంట్ లేబర్ పార్టీ" ని స్థాపించారు. 1937 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికలలో మొత్తం 17 స్థానాలకు పోటీ చేసి 13 స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది. 1942 జూన్ లో వైశ్రాయి నూతన కారనిర్వాహక వర్గంలో అంబేద్కర్ సభ్యుడయ్యారు. వైశ్రాయి కౌన్సిల్ లో కార్మిక శాఖా సభ్యునిగా కార్మిక ప్రగతికి కృషి చేశారు. సెలవు దినాలలో వేతనం ఇవ్వాలన్న బిల్లును రూపొందించారు. కనీస వేతన చట్టాన్ని, బోనస్ చట్టాన్ని ఆధునికం చేశారు.

### 7.2.4 రాజ్యాంగ సభలో.. :

అంబేద్కర్ బెంగాల్ మంచి రాజ్యాంగ సభకు సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1947లో దేశ విభజన జరిగింది. దేశ విభజన ఫలితంగా మంత్రివర్గం పునర్నిర్మితం కాగా అంబేద్కర్ న్యాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1947 ఆగస్ట్ 29 స్వతంత్ర భారత రాజ్యాంగ ముసాయిదారచనా సంఘం ఏర్పడింది. అంబేద్కర్ ఈ సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు.

అంబేద్కర్ 1948 నవంబర్ 4వన జరిగిన రాజ్యాంగ సభ సమావేశంలో అనేక విమర్శలకు సవివరంగా సమాధానం ఇచ్చారు. అంబేద్కర్ హిందూ ధర్మ శాస్త్రానికి అనేక సవరణలు రూపొందించారు. దీనిని అనేక మంది వ్యతిరేకించారు. చివరకు పార్లమెంట్ వాటిని అనేక మార్పులు చేసి ఆమోదించింది. అందుకు మనసొప్పని అంబేద్కర్ 1951లో మంత్రి పదవికి రాజీనామా చేశారు.

### 7.2.5 నిమ్న జాతుల సమాఖ్య :

అనంతరం అంబేద్కర్ నిమ్న జాతుల సమాఖ్యను ఏర్పాటు చేశారు. ఈ నిమ్నజాతుల సమాఖ్య 1952 సాధారణ ఎన్నికలలో పోటీ చేసింది. అయితే చివరకు అంబేద్కర్ కూడా గెలవలేదు. అయితే 1952లోనే ఆయన రాజ్యసభ సభ్యుడయ్యారు. 1954 మేలో లోక్ సభ ఉప ఎన్నికలలో పోటీ చేసి మళ్ళీ ఓడిపోయారు.

### 7.2.6 బౌద్ధ మత స్వీకారం :

అంబేద్కర్ 1956వ సంవత్సరం అక్టోబర్ నెల 14వ తేదీన నాగపూర్ లో బౌద్ధ మతాన్ని స్వీకరించారు. 1956 నవంబర్ 20వ నేపాల్ రాజధాని ఖాట్మాండులో బౌద్ధ మహాసభలో పాల్గొని "బుద్ధిజమ్ – కమ్యూనిజం" అన్న అంశంపై ప్రసంగించారు. అనంతరం భారతదేశంలో బౌద్ధమత వ్యాప్తికి కృషి సల్పారు.

### 7.2.7 రచనలు :

డాక్టర్ అంబేద్కర్ సంస్కర్త, విద్యావంతుడు, పత్రికాదు సంపాదకుడే కాదు, గొప్ప రచయిత కూడా. ఆయన రచించిన గ్రంథాలలో 'ది ప్రాబ్లం అఫ్ రూపీ', 'హూ ఆర్ ది సూద్రాస్ అండ్ హౌ దే కేమ్ టూ బి ది ఫోర్త్ వర్ణ ఇన్ ది ఇండో ఆర్యన్ సొసైటి', 'బుద్ధ అండ్ హిజ్ ధర్మ', 'బుద్ధ అండ్ కార్ల్ మార్క్స్', 'థాట్స్ ఆఫ్ పాకిస్తాన్', అస్పృశ్యులెవ్వరు? వంటి ఎన్నో గ్రంధాలు రచించారు. ఇవి ఎంతోమంది మేధావుల ప్రశంసలు అందుకున్నాయి.

ఈ విధంగా అస్పృశ్యుల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6వ తేదీన మరణించారు.

భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అన్నట్లు –

"మానవ మేధస్సులను జాగృతం చేసి దీర్ఘకాలంగా అణచివేయ బడిన వర్గాలకు పోరాటపటిమనిచ్చిన మహా మనీషి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్.

## 7.3 సమీక్ష :

హిందూ మతం భారతీయ సమాజం మూఢ విశ్వాసాలతో నిండిపోయిన సమయంలో ఆంగ్ల విద్య, విదేశీ సంస్కృతీ ప్రభావం మతమార్పిడులను ప్రోత్సహించాయి. ఈ సమయంలో హిందూ మతాన్ని సమాజంలోని ఆచారాలను సంస్కరించాలనే ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. ఇదే సమయంలో హిందూ మతంలో ఉన్న కులవ్యత్యాసాలు, అంటరానితనం కులవివక్షత మీద కూడా ఉద్యమాలు జరిగాయి. అందులో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అస్పృశ్యత నివారణ కోసం, నిమ్న జాతులవారి ఉద్ధారణ కోసం తీవ్రంగా కృషి చేశారు.

## 7.4 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 7.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. బహిష్కృత హితకారిణి.
2. అంబేద్కర్ రచనలు .

### 7.4.2 పది మార్కుల ప్రశ్నలు :

1. నిమ్నజాతుల వారి అభివృద్ధికోసం డాక్టర్ అంబేద్కర్ చేసిన కృషిని వివరించండి.

### 7.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. బహిష్కృత హితకారిణి స్థాపకులు ఎవరు.
2. అంబేద్కర్ నడిపిన పత్రిక ఏది.
3. అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఏ హోదాలో పని చేశారు.

4. ది ప్రాబ్లం ఆఫ్ రూపి గ్రంథ రచయిత ఎవరు.
5. అంబేద్కర్ స్థాపించిన రాజకీయ సంస్థ ఏది.
6. అంబేద్కర్ స్వీకరించిన మతం ఏది.

## 7.5 ఉపయుక్త గ్రంధాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహి అల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర
9. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ (జీవిత చరిత్ర) –వెంకట్రామ అండ్ కో ప్రచురణ.


**డాక్టర్ జి. సోమశేఖర్**

★★★★★

# పాఠం – 8
# జాతీయభావం అభివృద్ధి

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం భారత జాతీయోద్యమానికి దోహదం చేసిన కారణాలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


8.1 పరిచయం

8.2 జాతీయభావం అభివృద్ధి

8.3 జాతీయభావం అభివృద్ధి చెందడానికి కారణాలు

8.3.1 సాంఘిక మత సంస్కరణోద్యమాలు

8.3.2 విదేశీ పాలన

8.3.3 ఆంగ్లేయుల జాత్యహంకారం

8.3.4 ఆంగ్ల భాష – ఆంగ్ల విద్య

8.3.5 రాజకీయ ఐక్యత

8.3.6 జాతీయ సాహిత్యం

8.3.7 పత్రికలు

8.3.8 ప్రాచీన భారతదేశ వైభవ ఆవిష్కరణ

8.3.9 వైస్రాయి లిట్టన్ విధానాలు

8.3.10 ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు

8.3.11 ఇల్బర్ట్ బిల్

8.4 సమీక్ష

8.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు

8.5.2 పది మార్కుల ప్రశ్నలు

8.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు

8.6 ఉపయుక్త గ్రంధాలు

## 8.1 పరిచయం :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి అది ఆనాటి కాలంలోనే అభివృద్ధి చెందింది. అది జాతీయోద్యమానికి దారి తీసింది. పరాయి పాలనకు స్వస్తి పలికి స్వాతంత్ర్య సంపాదనకు భారత ప్రజలు పోరాటం చేసేందుకు ఆ జాతీయ భావం దోహదం చేసింది.

## 8.2 జాతీయభావం అభివృద్ధి :

1498లో వాస్కోడాగామ భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొనడంతో ఐరోపా ఖండానికి చెందిన వివిధ దేశాలవారు వ్యాపారం కోసం భారతదేశానికి రావడం ప్రారంభించారు. పోర్చుగల్, హాలెండ్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలకు చెందిన వారు వ్యాపారం కోసం వచ్చినా ఇంగ్లాండ్ ఫ్రాన్స్ దేశాలకు చెందిన వ్యాపార కంపెనీలు స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకున్నాయి. చివరకు ఆంగ్లేయులది పైచేయి అయింది. 1757 ప్లాసీ యుద్ధంలో విజయం సాధించిన ఆంగ్లేయ కంపెనీ ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారాన్ని పొందింది. అప్పటి నుంచి క్రమంగా వివిధ విధానాల ద్వారా, యుద్ధాల ద్వారా భారతదేశంలో అధికారాన్ని విస్తరించుకుంది. కంపెనీ అనుసరించిన విధానాలకు వ్యతిరేకంగా 1857లో తిరుగుబాటు జరిగింది. దీనికి సిపాయిల తిరుగుబాటు, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అని పేర్లు. సిపాయిల తిరుగుబాటు అనంతరం బ్రిటీష్ రాణి అధికారాన్ని కంపెనీ నుంచి హస్తగతం చేసుకుంది. ఈ సందర్భంగా 1858 వ సంవత్సరంలో విక్టోరియా మహారాణి అనేక హామీలను ఇచ్చింది. అయితే అవి అమలు కాలేదు. దీనితోభారతీయుల్లో రానురాను ప్రభుత్వం పట్ల అసంతృప్తి అధికమైంది. ఈ అసంతృప్తి జాతీయభావం ఏర్పడి వృద్ధి చెందెందుకు దోహదం చేయడంతో పాటు ఉద్యమానికి దారితీసింది.

## 8.3 జాతీయభావం అభివృద్ధి చెందడానికి కారణాలు :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి తద్వారా జాతీయభావం వృద్ధి చెంది చివరకు అది ఉద్యమ రూపం ధరించింది. భారత దేశంలో జాతీయ భావం వృద్ధి చెందడానికి అనేక కారణాలు దోహదం చేశాయి.

### 8.3.1 సాంఘిక మత సంస్కరణోద్యమాలు :

క్రీ.శ. 19వ శతాబ్దం లో ప్రారంభమయిన సాంఘిక మత సంస్కరణోద్యమాలు జాతీయాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. కాంగ్రెస్ స్థాపన కంటే ముందే బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, రామకృష్ణ మిషన్ వంటి సంస్థలు ఏర్పడి సాంఘిక మత సంస్కరణలకు కృషి చేయడమే కాకుండా దేశం యొక్క గొప్పతనాన్ని చాటిప్పాయి. సంస్కర్తలైన రాజారామ మోహన్ రాయ్, స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకనందలు తమ ప్రబోధాలతో ప్రజలలో దేశభక్తిని

పెంపొందించారు. భారతీయులలో పాశ్చాత్యులకు ఎందులోనూ తక్కువ కాదు అనే ఆత్మవిశ్వాసాన్ని కలిగించారు. భారతదేశం గత వైభవాన్ని, గొప్పతనాన్ని గుర్తుచెయ్యడమే కాకుండా స్వయంపాలనకు మరేదీ సాటి కాదని వారు ప్రచారం చేశారు. స్వామి వివేకానంద మాతృదేశాన్ని సేవించడం పరమోత్కృష్టమైనదని అని అంటూ ప్రజలకు ధైర్యసాహసాలను నూరిపోశాడు. మాతృభూమి వైభవాన్ని పెంపొందించడానికి నిరంతరం కృషిచేయాలని స్వామి వివేకనంద పిలుపునిచ్చాడు. ఈ విధంగా సాంఘిక మత సంస్కరణోద్యమాలు ప్రజలలో జాతీయ భావాన్ని వృద్ధిచేయడంలో ప్రధాన పాత్ర పోషించాయి.

### 8.3.2 విదేశీ పాలన :

భారతదేశ ప్రజలలో జాతీయ భావం పెంపొందడానికి విదేశీ పాలన కారణమయ్యింది. వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు భారతదేశాన్ని తమ దేశంగా భావించలేదు. ఆంగ్లేయులు తాం విదేశీయులము అనే భావంతోనే భారతదేశంలో నివసించారు. వ్యాపారం కోసం వచ్చి అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆంగ్లేయులు పాలనలో కూడా వ్యాపార ధోరణి, లాభాపేక్షనే కాంక్షించి భారతదేశాన్ని దోపిడికి గురిచేశారు. భారత దేశ సంపదనంతా తమ మాతృదేశానికి తరలించడం తమ హక్కు అని వారు భావించారు. ఈ విధానాల వల్ల కుల, మత, ప్రాంత విచక్షణ లేకుండా భారతీయులందరూ ఆంగ్లేయుల పాలనలో కష్టాలను అనుభవించి వారి పట్ల వ్యతిరేకత పెంచుకున్నారు. ఈ వ్యతిరేకత భారతీయులలో జాతీయ భావం దేందుకు దోహదం చేసింది.

### 8.3.3 ఆంగ్లేయుల జాత్యహంకారం :

ఆంగ్లేయులు జాత్యహంకారంతో కుల, మత, వర్గ ప్రాంత విచక్షణ లేకుండా భారతీయులందరినీ చిన్న చూపు చూసేవారు. భారతీయులు తమకంటే తక్కువ వారని భావించేవారు. అదే భావాన్ని ప్రదర్శించే వారు. భారతీయులను ద్వితీయ శ్రేణి పౌరులుగా ముద్ర వేశారు. ఆంగ్లేయులకు మాత్రమే ప్రత్యేకమైన క్లబ్బులను ఏర్పాటు చేసుకుని అందులో భారతీయులకు ప్రవేశార్హత లేకుండా చేశారు. రైళ్లలో ఐరోపా ప్రయాణికులతో పాటు ఒకే పెట్టెలో ప్రయాణించడానికి వీలులేదు. ఆంగ్లేయుల జాత్యహంకారంవల్ల భారతీయులకు తమ దేశంలోనే విదేశీయులకు బానిసలుగా జీవించాల్సిన దుస్థితి భారతీయులకు ఏర్పడింది. దీనిని తమజాతి మొత్తానికి జరిగిన అవమానంగా భారతీయులు భావించారు. ఆంగ్లేయుల ముందు భారతీయులమంతా ఒక్కటే అని భావన ఏర్పడడానికి ఆంగ్లేయుల జాత్యహంకారం దోహదం చేసింది. ఇది జాతీయభావం వృద్ధి చెందేందుకు కారణమైంది.

### 8.3.4 ఆంగ్ల భాష – ఆంగ్ల విద్య :

బెంటింక్, మెకాలే, రాజరామ్మోహన్ రాయ్ వంటి వారి కృషివల్ల ఆంగ్లభాష విద్యాసంస్థలలో బోధనా భాషగా చేయబడింది. ఆంగ్లభాష రాజభాష అయింది. ప్రజలలో అనేక భాషలు మాట్లాడేవారు వున్నప్పటికీ ఆంగ్లభాష జాతీయ భాష అవటంవల్ల క్రమంగా ఇది జాతీయ స్థాయిలో అనుసంధాన భాషగా మారి, ఒకరి భావాలను మరొకరు తేలికగా అర్థం చేసికొనటానికి, ప్రభుత్వ విధానాలపట్ల తమకున్న బాధలు మరియు ఇబ్బందులు చర్చించడానికి అవకాశం ఏర్పడింది. మరొక రకంగా చెప్పాలంటే భారతదేశంలో అన్నీ భాషా ప్రాంతాలమధ్య ఆంగ్ల భాష వారధి గా పనిచేసింది. ఆంగ్లేయ విద్యావిధానం వల్ల ఆసక్తిగల విద్యావంతులు విదేశాలకు పోయి ఉన్నత విద్యనభ్యసించేందుకు వీలు కలిగింది. ఈ పాశ్చాత్య

విద్యవల్ల భారతీయులలో స్వేచ్ఛాభావాలు, జాతీయతా భావాలు వ్యాప్తి చెందాయి. విదేశీయులు మన జాతిని పరిపాలించుట అన్యాయమని, అసమంజసమని విద్యావంతులయిన భారతీయులు భావించసాగారు. ఆంగ్ల విద్యవల్ల భారతీయులు ఇంగ్లాండ్, అమెరికా,ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ దేశాలలో జరిగిన విప్లవాలు, ఏకీకరణ ఉద్యమాలను అధ్యానం చేసే అవకాశం ఏర్పడింది. ఈ ఉద్యమాలు విద్యావంతులైన భారతీయులలో ఆలోచనలు రేకెత్తించి జాతీయభావ వృద్ధికి తద్వారా స్వాతంత్రోద్యమానికి పురికొల్పాయి.

### 8.3.5 రాజకీయ ఐక్యత :

ఆంగ్లేయులు భారతదేశంలోఅధికారాన్ని హస్తగతం చేసుకుని తాము ఆక్రమించిన ప్రాంతాలన్నింటినీ ఒకే పరిపాలనా భాగంగా ఏర్పాటు చేసి ఒకే విధమైన పరిపాలనా విధానాన్ని అనుసరించారు. దేశమంతటా ఒకే విధమైన ఆధునిక పాలనా వ్యవస్థను ప్రవేశపెట్టి, పాలనాపరంగా దేశం మొత్తాన్ని ఒక్కటిగా చేశారు. వారు ప్రవేశపెట్టిన ఒకేవిధమైన చట్టాలు దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలను ఏకంచేశాయి. ఈ రాజకీయ ఐక్యతా విధానం భారతీయులలో జాతీయ ఐక్యత పెంపొందడానికి దోహదం చేసింది. దీనికితోడు ఆధునిక సౌకర్యాలు, తంతి, తపాలా సౌకర్యాలు వంటివి మన దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను దగ్గరకు చేర్చాయి. ప్రజలమధ్య సంబంధాల్ని వృద్ధిచేశాయి. ఇది వివిధ ప్రాంతాల నాయకులు జాతీయ భావాలను ప్రచారం చేయడానికి దోహదం చేశాయి. ఆంగ్లేయులు అనుసరించిన రాజకీయ ఐక్యతా విధానం భారత దేశంలో జాతీయ భావ వృద్ధికి ఎంతగానో దోహదం చేసింది. తిలక్ చెప్పినట్లు "బ్రిటీష్ పరిపాలనా ప్రభావ పరిణామమే భారత జాతీయవాదం".

### 8.3.6 జాతీయ సాహిత్యం :

19వ శతాబ్దిలో భారతదేశంలో వెలువడిన సాహిత్యం భారతీయుల్లో జాతీయభావాలను వృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించింది. వివిధ భారతీయ భాషలలో రచింపబడ్డ నవలలు, నాటకాలు, కథలు ప్రజలలో జాతీయాభిమానాన్ని, చైతన్యాన్ని రేకెత్తించడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. హిందీలో హరీష్ చంద్ర, బెంగాలీ భాషలో బకించంద్ర చటర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్, భరతేందు, మరాఠీలో విష్ణుశాస్త్రి చెప్తాంకర్, తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, ఉర్దూ భాషలో అల్తాఫ్ హుస్సేన్ ఆలీ చేసిన రచనలు ప్రజలలో దేశభక్తి భావాలను రేకెత్తించాయి. ప్రఖ్యాత బెంగాల్ రచయిత బకించంద్ర చటర్జీ రచించిన 'ఆనంద్ మఠ్' నవల భారతీయులలో స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని రగిలించడంలో ప్రముఖ పాత్ర పోషించింది. ఈ నవలలో 'వందేమాతరం' గేయం ఉద్యమకారులకు జాతీయగీతమైంది.

### 8.3.7 పత్రికలు :

వార్తాపత్రికలు ప్రజాచైతన్యానికి, దేశభక్తి భావాలను పెంపొందించడానికి శక్తివంతమైన సాధనాలుగా ఉపయోగపడ్డాయి. 1905 నాటికి భారతదేశంలో ఏడువందల వార్తా పత్రికలు, అంతే సంఖ్యలో పీరియాడికల్స్ వెలువడుతుండేవి. ఆనాటి ఇండియన్ మిర్రర్, అమృత్ బజార్ పత్రిక, బాంబే సమాచార్, కేసరి, మరాఠీ, ఆంధ్రపత్రిక, ఆంధ్ర ప్రకాశిక, కృష్ణాపత్రిక, అజాద్ వంటి పత్రికలు ప్రజలలో దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఎంతగానో దోహదం చేశాయి. పరాయి పాలనలోని లోపాలను పత్రికాసంపాదకులు నిర్భయంగా ఎత్తి చూపారు. లాలా లజపతిరాయ్ నాయకత్వంలో వెలువడిన 'వందేమాతరం', 'ది పీపుల్స్', బాల గంగాధర్ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కేసరి',

'మరాఠా' పత్రికలు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. 'యుగంధర్' పత్రికా సంపాదకులైన ఐదుగురిని ప్రభుత్వం నిర్బంధించింది. ఈ పత్రికలన్నీ జాతీయ భావాలను వృద్ధి చేయడంతో పాటు ప్రజలను స్వాతంత్రోద్యమానికి సిద్ధం చేశాయి.

### 8.3.8 ప్రాచీన భారతదేశ వైభవ ఆవిష్కరణ :

మాక్స్ ముల్లర్, మోనియర్ విలియమ్స్, జాన్ మార్షల్, దయారామ్ సహానీ, వీలర్, ఆర్.జి. భండార్కర్, రాజేంద్రలాల్ మిత్ర వంటి చరిత్రకారులు, పురాతత్వవేత్తలు భారతీయ సంస్కృతీ వైభవాన్నీ తమ రచనల ద్వారా వెలుగులోకి తెచ్చారు. సింధు నాగరికతను భారత దేశ విశిష్ట గౌరవానికి గుర్తుగా భావించారు. భారతదేశం ఘనమైన చరిత్ర కలిగి ఉందని చరిత్రకారులు వివరిస్తూ సాంస్కృతికంగా వెనుకబడి ఉందనే పాశ్చాత్యుల విమర్శలను తిప్పికొట్టి ఇంగ్లాండ్ ప్రాచీన చరిత్రలో చిన్నచిన్న తెగల సముదాయంగా ఉండేదని చాటి చెప్పారు. అశోకుడు, చంద్రగుప్త, విక్రమాదిత్యుడు, అక్బర్ వంటి భారత సామ్రాట్ల రాజకీయ, సాంస్కృతిక విషయాలను వారు గుర్తుచేశారు. వారన్ హేస్టింగ్ స్థాపించిన 'ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్' ప్రచురణలు భారతీయుల గత వైభవాన్ని ప్రజల ముందుంచాయి. వీటివల్ల భారతీయులకు తమ జాతి, సంస్కృతులపట్ల గౌరవం, విశ్వాసం ఏర్పడి అది జాతీయభావ అభివృద్ధికి కారణమైంది.

### 8.3.9 వైస్రాయి లిట్టన్ విధానాలు :

వైస్రాయి లిట్టన్ అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలు ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను, జాతీయభావాన్ని వృద్ధి చేశాయి. లిట్టన్ 1876 నుండి 1880 వరకు వైస్రాయిగా పని చేశాడు. దేశంలో క్షామం సంభవిస్తుండగా, ఆయన ఢిల్లీలో దర్బార్ నిర్వహించడం, ఆయన చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనం. రెండో ఆఫ్ఘన్ యుద్ధానికి దేశ ఖజానా నుండి 30 కోట్ల రూపాయలు వ్యయం చేయడం, విదేశీ పాలన పట్ల ప్రజలలో వ్యతిరేక భావాన్ని పెంచింది. దేశభాషా పత్రికలపై ఆయన విధించిన ఆంక్షలు పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించాయి. భారతీయులు ఆయుధాలు ధరించరాదనే ఆంక్ష తీవ్ర విమర్శకు గురైంది. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక కాకూడదనే ఉద్దేశంతోనే లిట్టన్, సివిల్ సర్వీస్ పరీక్ష వయస్సు పరిమితిని 21 నుంచి 19 సంవత్సరాలకు తగ్గించాడు. భారతదేశంలోని విద్యావంతుల పట్ల లిట్టన్ అనుసరించిన విధానం దేశంలోని ప్రజల మనస్సులలో జాతీయ స్ఫూర్తిని రగిలించింది. ఆంగ్లేయ ప్రభుత్వం నేపాల్, టిబెట్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలతో చేసిన యుద్ధాల ఖర్చును భారతదేశ ప్రజల నుండి వసూలు చేయడం భారతీయుల్లో ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను పెంచింది.

### 8.3.10 ఆంగ్లేయుల ఆర్థిక విధానాలు :

వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు మొదట్లో భారతదేశంలో తయారైన వస్తువులను తమ దేశానికి తీసుకుని వెళ్ళేవారు. అయితే పారిశ్రామిక విప్లవం జరిగిన తర్వాత ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. తమ పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకులను అతి చౌకగా భారతదేశంలో కొనుగోలు చేసి తమ దేశంలో తక్కువ ఖర్చుతో వస్తువులను ఉత్పత్తి చేసి, వాటిని భారతదేశానికి దిగుమతి చేసి, అతి తక్కువ పన్నులు వసూలు చేసి భారతదేశ మార్కెట్లలో అమ్మేవారు. దీనితో దేశంలోని కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. దీనికితోడు కుటీర, చేతి పరిశ్రమలలో తయారైన దేశీయ వస్తువులపై అధిక పన్నులు విధించడం వల్ల వాటి ధర పెరిగి, మార్కెట్లలో అమ్మకం తగ్గిపోయింది. ఆంగ్లేయులు అనుసరించిన స్వేచ్ఛావ్యాపార విధానం వల్ల, దేశంలోని కుటీర పరిశ్రమలు నశించాయి. భూమిశిస్తు విధానాల వల్ల రైతులు అప్పులలో కూరుకుపోయారు.

ఆంగ్లేయులు తమ పరిశ్రమలకవసరమైన వాణిజ్య పంటలను రైతుల చేత బలవంతంగా పండించేవారు. అందువల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోయి, తరుచూ క్షామాలు సంభవించి, జన నష్టం జరిగినా ప్రభుత్వం పట్టించుకొనేది కాదు. ఈ విధంగా దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీసిన ఆంగ్లేయ ఆర్థిక విధానాలు దేశ ప్రజలలో జాతీయతను పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషించాయి.

### 8.3.11 ఇల్బర్ట్ బిల్ :

ఆంగ్ల విద్యనభ్యసించిన భారతీయులెందరో, న్యాయశాస్త్ర పట్టాలు పుచ్చుకొని, న్యాయాధికారులయ్యారు. అప్పటికి ఉన్న న్యాయ విధానం విచక్షణతో కూడుకొని ఉంది. ఆంగ్లేయ న్యాయమూర్తులు తమ పరిధిలో ఎవరినైనా, ఎటువంటి కేసునైనా విచారించి, నేరస్తులను శిక్షించే అధికారం కలిగి ఉండేవారు. అయితే భారత న్యాయమూర్తులకు భారతీయ నేరస్తులు మినహా, ఐరోపా నేరస్తులను విచారించడానికి గానీ, శిక్షించడానికి గానీ అధికారం ఉండేది కాదు. ఈ వివక్ష విధానం వైశ్రాయి రిప్పన్ కాలం వరకు కొనసాగింది. అయితే న్యాయ వ్యవస్థలోని ఈ లోపాన్ని గుర్తించిన వైశ్రాయి రిప్పన్ దానిని తొలగించడానికి ప్రయత్నించాడు. రిప్పన్ తన న్యాయ విషయాల సలహాదారు ఇల్బర్ట్ సంప్రదించి, న్యాయ పాలనలో తేడాలు తొలగించడానికి ఇల్బర్ట్ బిల్లును ప్రవేశపెట్టాడు. దీనివల్ల భారత న్యాయమూర్తులకు ఆంగ్లేయ న్యాయమూర్తులతో సమానంగా భారత, ఐరోపానేరస్తులను విచారించి, శిక్షించే అవకాశం కలిగింది. ఆంగ్లేయులతో భారతీయులను సమానం చేసిన ఇల్బర్ట్ బిల్లును ఆంగ్లేయులు వ్యతిరేకించి, సంఘటితంగా పోరాడి బిల్లును ఉపసంహరించేటట్లు చేయగలిగారు. ఇల్బర్ట్ బిల్లును వ్యతిరేకించి, ఆంగ్లేయులు విజయం సాధించిన విధానం భారతీయులలో ఆలోచనలను రేకెత్తించింది. ఐక్యతతో, జాతీయ భావంతో ఉద్యమం జరపవలసిన ఆవశ్యకతను భారతీయులు గుర్తించారు.

ఈ కారణాలన్నింటి వల్ల భారతీయులలో జాతీయ భావం చిగురించి అనతి కాలలోనే వృద్ధి చెంది అది ఉద్యమ రూపాన్ని ధరించింది.

## 8.4 సమీక్ష :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి అది ఆనాటి కాలంలోనే వివిధ కారణాల వల్ల అభివృద్ధి చెందింది. అది జాతీయోద్యమానికి దారి తీసింది. పరాయి పాలనకు స్వస్తి పలికి స్వాతంత్ర్య సంపాదనకు భారత ప్రజలు పోరాటం చేసేందుకు ఆ జాతీయ భావం దోహదం చేసింది.

## 8.5 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 8.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. ఆంగ్లేయ ఆర్థిక విధానాలు వివరించండి.
2. ఇల్బర్ట్ బిల్లు.

### 8.5.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశంలో జాతీయ భావం వృద్ధి చెందడానికి దోహదం చేసిన కారణాలను వివరించండి.

### 8.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. భారతదేశానికి సముద్ర మార్గం కనుగొన్నది ఎవరు.
2. ది పీపుల్స్ పత్రికను నడిపిన వారు ఎవరు.
3. కేసరి పత్రికను నడిపిన వారు ఎవరు.
4. లిట్టన్ భారతీయులపై ఎటువంటి విధానాన్ని అనుసరించాడు.
5. ఇల్బర్ట్ బిల్ వివాద సమయంలో వైస్రాయ్ ఎవరు.
6. ఆనంద్ మఠ్ రచయిత ఎవరు.

### 8.6 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ బి.ఆర్. ప్రసాద రెడ్డి**

★★★★★

# పాఠం – 9
# భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం భారత జాతీయోద్యమాన్ని నడిపి విజయం సాధించిన భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం, దాని మొదటి సమావేశం, కాంగ్రెస్ లక్ష్యాలు మొదలైన విషయాలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

9.1 పరిచయం

9.2 భారత జాతీయ కాంగ్రెస్

9.3 భారత జాతీయ కాంగ్రెస్ కంటే ముందు ఏర్పడిన సంస్థలు

- 9.3.1 ఇండియన్ అసోసియేషన్

9.4 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన

- 9.4.1 భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం
- 9.4.2 జాతీయ కాంగ్రెస్ ఆశయాలు
- 9.4.3 కాంగ్రెస్ మొదటి సమావేశ తీర్మానాలు

9.5 ప్రభుత్వం పట్ల కాంగ్రెస్ వైఖరి

9.6 రక్షక కవాట సిద్ధాంతం

9.7 సమీక్ష

9.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

- 9.8.1 ఐదు మార్కుల ప్రశ్నలు
- 9.8.2 పది మార్కుల ప్రశ్నలు
- 9.8.3 ఒక్క మార్కు ప్రశ్నలు

9.9 ఉపయుక్త గ్రంధాలు

### 9.1 పరిచయం :

దేశంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఆలోచనలు ప్రారంభమై జాతీయ భావం అధికమైంది. భారతీయుల్లో కలిగిన ఈ రాజకీయ చైతన్యంవల్ల ప్రభుత్వం నుంచి సంస్కరణలు, రాజకీయ హక్కులు, ఆర్థిక ప్రయోజనాలను సాధించేందుకు 19వ శతాబ్దంలో దేశంలో రాజకీయ సంస్థలను స్థాపించడం మొదలైంది.ఈ సందర్భంలో స్థాపింపబడినదే – భారత జాతీయ కాంగ్రెస్.

### 9.2 భారత జాతీయ కాంగ్రెస్ :

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం ప్రధాన ఘట్టం. వ్యాపారం కోసం వచ్చిన ఇంగ్లాండ్ ఫ్రాన్స్ దేశాలకు చెందిన వ్యాపార కంపెనీలు స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకున్నాయి. చివరకు ఆంగ్లేయులది పైచేయి అయింది. 1757 ప్లాసీ యుద్ధంలో విజయం సాధించిన ఆంగ్లేయ కంపెనీ ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారాన్ని పొందింది. అప్పటి నుంచి క్రమంగా వివిధ విధానాల ద్వారా, యుద్ధాల ద్వారా భారతదేశంలో అధికారాన్ని విస్తరించుకుంది.

కంపెనీ అనుసరించిన విధానాలకు వ్యతిరేకంగా 1857లో తిరుగుబాటు జరిగింది. దీనికి సిపాయిల తిరుగుబాటు, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అని పేర్లు. సిపాయిల తిరుగుబాటు అనంతరం బ్రిటీష్ రాణి అధికారాన్ని కంపెనీ నుంచి హస్తగతం చేసుకుంది. ఈ సందర్భంగా 1858 వ సంవత్సరంలో విక్టోరియా మహారాణి అనేక హామీలను ఇచ్చింది. అయితే అవి అమలు కాలేదు. దీనితో భారతీయుల్లో రానురాను ప్రభుత్వం పట్ల అసంతృప్తి అధికమైంది.

అదే సమయంలో బ్రిటీష్ అనుసరించిన సామ్రాజ్యవాద విధానాలు, ఆంగ్ల విద్యాప్రభావం, సాంస్కృతిక పునరుజ్జీవనం, పత్రికలు వంటివాటివల్ల ప్రజల్లో జాతీయ భావం అధికమైంది. భారతీయుల్లో రాజకీయ చైతన్యం కలిగించేందుకు 19వ శతాబ్దంలో దేశంలో రాజకీయ సంస్థలను స్థాపించడం మొదలైంది. ఈ సందర్భంలో స్థాపింపబడినదే భారత జాతీయ కాంగ్రెస్.

### 9.3 భారత జాతీయ కాంగ్రెస్ కంటే ముందు ఏర్పడిన సంస్థలు :

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించడానికి ముందే వివిధ రాష్ట్రాల్లో రాజకీయ సంఘాలు ఆవిర్భవించాయి. వాటిల్లో డిరోజియా కలకత్తాలో స్థాపించిన విజ్ఞాన సభ, 1839లో ఏర్పడిన భూకామందుల సొసైటీ, 1839 లోనే ఏర్పడిన బ్రిటిష్ ఇండియా సొసైటీ, 1843లో థామ్సన్, ద్వారకనాథ్ ఠాగూర్ స్థాపించిన బెంగాల్ బ్రిటిష్ ఇండియా సొసైటీ , 1852లో గాజుల లక్ష్మీనరసు చెట్టి స్థాపించిన మద్రాసు నేటివ్ అసోసియేషన్, 1552 లో ప్రారంభమైన బొంబాయి సంఘం, 1870 లో రనాడే నాయకత్వంలో పూనాలో స్థాపింపబడిన పూనా సార్వజనిక సభ, 1875 లో అమృత బజార్ పత్రిక సంపాదకుడు శశి కుమార్ ఘోష్ బెంగాల్లో స్థాపించిన ఇండియా లీగ్, 1884లో పి ఆనందాచార్యులు స్థాపించిన మద్రాస్ మహాజన సభ,

ఇంగ్లాండులోని భారతీయులు 1865లో స్థాపించిన లండన్ ఈస్టిండియా సంఘం, దాదాబాయి నౌరోజి 1866లో స్థాపించిన తూర్పు ఇండియా సంఘం, త్యాబ్జీ, ఫిరోజ్ షా మెహతాలు 1885 లో స్థాపించిన బొంబాయి ప్రెసిడెన్సీ సంఘం,1876 లో సురేంద్రనాథ్ బెనర్జీ ఆనందమోహన్ బోస్ స్థాపించిన ఇండియన్ అసోసియేషన్ వంటివి ప్రధానమైనవి.

ఇవన్నీ కూడా దేశంలో ప్రజలను చైతన్య పరచడంతో పాటు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడంలో విశేషమైన కృషి చేశాయి. అయితే ఈ సంస్థలన్నీ ఒక నగరానికో ఒక రాష్ట్రానికో పరిమితమై స్థానిక సమస్యల పట్ల దృష్టి సారించడం మాత్రమే చేశాయి.

### 9.3.1 ఇండియన్ అసోసియేషన్:

కాంగ్రెస్ కంటే ముందు ఏర్పాటైన జాతీయ సంస్థలలో అతి ప్రధానమైంది – ఇండియన్ అసోసియేషన్ బెంగాల్ యువజన జాతీయవాదులు ప్రజానీకానికి సంబంధించిన సమస్యల మీద నిర్వరామ రాజకీయ ఆందోళన సాగించాలని భావించారు. సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్ ల నాయకత్వంలో యువజన బెంగాల్ జాతీయవాదులు 1876 జూలై నెలలో ఇండియన్ అసోసియేషన్ ను స్థాపించారు. ఉమ్మడి రాజకీయ కార్యక్రమాలతో భారత ప్రజలను సమైక్యపరచడం, హిందూ, ముస్లింల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని ఏర్పరచడం, దేశంలో బలమైన ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం, నాటి ప్రజా ఉద్యమాలలో ప్రజాసమూహాన్ని భాగస్వాములను చేయడం వంటివి ఈ సంస్థ ముఖ్య ఆశయాలు. ప్రజాబాహుళ్యాన్ని ఎక్కువ సంఖ్యలో ఈ సంస్థ పరిధిలోకి తెచ్చేందుకు, పేద వర్గాలకోసం అతి తక్కువ సభ్యత్వ రుసుమును ఏర్పాటుచేసింది. బెంగా బెంగాల్ వెలుపల సైతం ఈ సంస్థ తన శాఖలను ఏర్పాటు చేసింది. సంస్థకు స్పూర్తివంతమైన నాయకత్వం అందించిన సురేంద్రనాథ్ బెనర్జీ భారత దేశమంతా పర్యటించాడు. దేశ రాజకీయ రంగంలో బెనర్జీ ప్రధానపాత్ర నిర్వహించాడు. సివిల్ సర్వీస్ పరీక్షల వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలకు తగ్గించడాన్ని ఇండియన్ అసోసియేషన్ వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇల్బర్ట్ బిల్లు వివాదం సందర్భంగా ఈ సంఘం దృఢంగా వ్యవహరించింది. బిల్లును సమర్థిస్తూ ఈ సంస్థ నిర్వహించిన ఆందోళనా పటిమను చూసి ఆంగ్లేయ అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. దేశీయ పత్రికలకు వ్యతిరేకంగా ఆమోదించిన శాసనాన్ని ఘాటుగా విమర్శించింది. రిప్పన్ పరిపాలనా కాలంలో ఈ సంస్థ ప్రజాసమస్యలపై చర్చావేదిక అయింది.

సురేంద్రనాథ్ బెనర్జీ ప్రారంభించినది ప్రాంతీయ సంస్థ అయినా దాని కార్యక్రమాల వల్ల అది జాతీయ సంఘంగా రూపాంతరం చెందింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 1883లో కలకత్తాలో మొదటి అఖిల భారత సదస్సు నిర్వహించారు. సమావేశానికి దేశం నలుమూలల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. 1885లో రెండో సదస్సు జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత 1886 వ సంవత్సరంలో ఈ సంస్థ భారత జాతీయ కాంగ్రెస్ లో విలీనమయ్యింది.

## 9.4 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన :

జాతీయ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే సంస్థ యొక్క అవసరం పెరుగుతున్న సమయంలో ఆ అవసరాల్ని తీరుస్తూ ఏర్పడినటువంటిదే భారత జాతీయ కాంగ్రెస్.

భారత జాతీయ కాంగ్రెస్ 1885 సంవత్సరంలో స్థాపించబడింది. దీనిని స్థాపించిన వారు ఏ.ఓ. హ్యూమ్. ఏ.ఓ. హ్యూమ్ స్కాటిష్ కుటుంబానికి చెందినవారు. 1849లో ఐపీఎస్ హోదాలో భారతదేశానికి వచ్చారు. ఆయనకు విద్యావంతులైన భారతీయులంటే సానుభూతి ఉండేది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నానాటికీ పెరుగుతోందని ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చాడు. భారతదేశంలో సివిల్ సర్వీస్

ఉద్యోగిగా దీర్ఘకాలం పని చేసి పదవీ విరమణ చేసిన హ్యూమ్ భారతీయుల సంక్షేమాన్ని కాంక్షించి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించాడు.

### 9.4.1 భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం :

1985వ సంవత్సరం డిసెంబర్ 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు బొంబాయి నగరంలోని తేజ పాల్ సంస్కృత కళాశాలలోని గోకుల్ దాస్ భవనంలో భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం ప్రారంభం అయింది. సమావేశాలు1885 డిసెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. మొదట్లో పూనా నగరంలో ఈ సమావేశాలు జరపాలని అనుకున్నారు. కానీ అక్కడ ప్లేగు వ్యాధి ప్రబలడం వల్ల, సమావేశం బొంబాయికి మార్చడం జరిగింది. ఈ సమావేశానికి ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షత వహించారు. ఏ. ఓ. హ్యూమ్, కె.టి. తెలాంగ్ లు కార్యదర్శులు గా ఎన్నికయ్యారు.

ఈ సమావేశానికి 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అందులో బొంబాయి నగరం నుంచి 38 మంది మద్రాసు నుంచి 21 మంది బెంగాల్ నుంచి ముగ్గురు, అయోధ్య నుంచి ఏడుగురు, పంజాబ్ నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో న్యాయవాదులు, పత్రికా సంపాదకులు, వాణిజ్యవేత్తలు, భూస్వాములు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో విదేశీయులైన ఎ.ఓ. హ్యూమ్, వెడ్డర్ బర్న్, హెన్రీ కాటన్ లు కూడా పాల్గొన్నారు. దాదాబాయ్ నౌరోజి, కె.టి. తెలాంగ్, ఫిరోజ్ షా మెహతా, మహాదేవ్ గోవింద రనడే, వీరరాఘవాచారి, ఆనందాచార్యులు, రంగయ్య నాయుడు, కేశవ పిళ్ళై, సుబ్రహ్మణ్య అయ్యర్, బద్రుద్దీన్ త్యాబ్జీ లు కాంగ్రెస్ మహాసభలలో పాల్గొన్నవారిలో ప్రముఖులు. ఇండియన్ మిర్రర్, ది హిందూ, కేసరి వంటి పత్రికా సంపాదకులు సైతం ఈ సమావేశంలో ప్రతినిధులుగా పాల్గొన్నారు.

### 9.4.2 జాతీయ కాంగ్రెస్ ఆశయాలు :

భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశానికి అధ్యక్షత వహించిన డబ్ల్యు, సి. బెనర్జీ, కాంగ్రెస్ ఆశయాలను వివరించాడు.

1. జాతీయవాదంవల్ల ప్రభావితులైన కార్యకర్తల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం,
2. కుల, మత, ప్రాంతీయ దురభిమానాలకు అతీతంగా, ప్రజలలో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడం, దానిని దృఢతరం చేయడం
3. మనస్ఫూర్తిగా చర్చలు జరిపిన తర్వాత, విద్యావంతులైన భారతీయులు ముఖ్య సమస్యలపై తీసుకున్న నిర్ణయాలను తీర్మానించడం,
4. తదుపరి సంవత్సరంలో అమలుపరచవలసిన కార్యక్రమాన్ని వివరించడం.

### 9.4.3 కాంగ్రెస్ మొదటి సమావేశ తీర్మానాలు :

భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు వివిధ ప్రజా సమస్యలపై చర్చించి, తీర్మానాలను ఆమోదించారు. వాటిలో ప్రధానమైనవి –

1. భారత పరిపాలన వ్యవస్థ పనిచేసే తీరు గురించి సమీక్షించడానికి రాయల్ కమీషన్ ను ఏర్పాటు చెయ్యడం.
2. కేంద్ర, ప్రాంతీయ శాసన సభల్లో అధిక సంఖ్యలో భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించి, ఎక్కువ అధికారాలివ్వడం.
3. సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలు ఇంగ్లాండ్ దేశంతో పాటు భారతదేశంలో కూడా ఒకే సమయంలో నిర్వహించడం.
4. సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు వయోపరిమితి పెంచడం.
5. భారతీయులకు ఉద్యోగ అవకాశాలు పెంచడం,
6. భారతీయులను జాతి వివక్షతో చూడకుండా ఆంగ్లేయులతో సమానంగా చూడడం.
7. కరువు వచ్చినప్పుడు ఋణ సౌకర్యాలు కల్పించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం.
8. న్యాయశాఖను కార్యనిర్వాహక శాఖ నుండి వేరుపరచడం.
9. వాయువ్య సరిహద్దు రాష్ట్రం, అయోధ్య, పంజాబ్ రాష్ట్రాలలో కౌన్సిళ్ళను ఏర్పాటు చెయ్యడం.

## 9.5 ప్రభుత్వం పట్ల కాంగ్రెస్ వైఖరి :

మొదటి కాంగ్రెస్ సమావేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం పట్ల, సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటిస్తూ, చర్చలు మొదలయ్యాయి. ఆ విధంగా ఉదారవాద రాజకీయవాదులు ప్రారంభించి, వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ సభ ఆమోదించిన తీర్మానాలు నమ్రతతో వున్నట్లు కనిపిస్తాయి. తీర్మాణాలన్నీ పరిపాలనా సంస్కరణలకు, శాసనసభలో ఎన్నిక సిద్ధాంతానికి మాత్రమే పరిమితమయ్యాయి. వీటికి తోడు హ్యూమ్ కాంగ్రెస్ తరపున విక్టోరియా మహారాణికి అభినందనలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు. దీన్ని బట్టి కాంగ్రెస్ విశ్వాసపూరిత వైఖరిని అవలంభించినట్లు చెప్పవచ్చు.

## 9.6 రక్షక కవాట సిద్ధాంతం :

భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించిన ఎ.ఓ. హ్యూమ్ భారతీయుల సంక్షేమాన్ని కాంక్షించి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించినట్లుగా చెప్పబడుతూ వున్నా, భారతీయులలో అసంతృప్తి పెరుగుతోందని అది బహిర్గతం కావడానికి ఒక వేదిక అవసరమని లేకుంటే ఆ అసంతృప్తి అధికమై ఆంగ్లేయ ప్రభుత్వంపై తిరుగుబాటుకు దారితీస్తుందని గుర్తించే హ్యూమ్ దానిని నివారించడం కోసం జాతీయ కాంగ్రెస్ ను స్థాపించాడు అనే అభిప్రాయం కూడా ఉంది. జాతీయ కాంగ్రెస్ రక్షక కవాటంలా పనిచేస్తుందని భావించాడు. ఈ విషయం రక్షక కవాట సిద్ధాంతం ఆవిర్భవించడానికి దారితీసింది.

రక్షక కవాట సిద్ధాంతం ప్రకారం, రాజప్రతినిధి డఫ్రిన్ సలహా, సూచనలతో పాటు అధికార ఆదేశాలతో ఎ.ఓ. హ్యూమ్ ఇతర ఆంగ్లేయ అధికారులతో కలిసి జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు. ప్రజలలో ప్రజ్వరిల్లుతున్న అసంతృప్తి హింసా రూపం ధరించకుండా ఒక సురక్షితమైన, శాంతియుతమైన రాజ్యాంగ పరంగా ప్రజాభిప్రాయం వ్యక్తం చేసే "రక్షక కవాట" సంస్థను జాతీయ కాంగ్రెస్ స్థాపన ద్వారా అందించడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే ఈ సిద్ధాంతం ప్రకారం సమీప కాలంలో జరగనున్న తిరుగుబాటు, రక్తపాత విప్లవాన్ని, జాతీయ కాంగ్రెస్ స్థాపన ద్వారా నిరోధించారు. అనగా 1885 సంవత్సరంలో ఒక రక్షక కవాటంగా మాత్రమే జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు తప్ప భారతీయులపై ప్రేమతో కాదు.

ఈ సందర్భంగా ప్రముఖ జాతీయ నాయకుడైన లాలా లజపతిరాయ్ అభిప్రాయం ప్రకారం "లార్డ్ డఫ్రిన్" ఆలోచనల మేరకు భారతదేశంలోని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ప్రమాదం నుంచి రక్షించేందుకు జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది". మరో సందర్భంలో లజపతి రాయ్ –

"హ్యూమ్, బ్రిటీష్ పాలనకు భారతదేశంలో పొంచివున్న ప్రమాదం విషయంలో లభించిన ఆధారాలు ప్రాతిపదికగా, అసంతృప్తికి ఒక రక్షక కవాటం సృష్టించేందుకు నిర్ణయించుకొన్నాడు" అని పేర్కొన్నాడు.

ఆర్. పాల్మ్ దత్ – "రాజ ప్రతినిధి డఫ్రిన్ చేసుకొన్న రహస్య ఒప్పందం ప్రకారమే కాంగ్రెస్ ఆవిర్భవించింది" అని వ్యాఖ్యానించాడు.

రాష్ట్రీయ సేవక్ సమాజ్ నాయకుడైన యమ్.యస్. గోల్వాల్కర్ అభిప్రాయంలో –

"ఆంగ్లేయులు కాంగ్రెసు ఒక రక్షక కవాటంగా స్థాపించారు. ఈ స్థాపనలో వారి ప్రధాన ఉద్దేశ్యం భారతదేశంలో ప్రజ్వరిల్లుతున్న జాతీయత భావాలను అదుపులో ఉంచడం, జాతీయ దృక్పథాన్ని నాశనం చేయడం".

ప్రముఖ జాతీయ నాయకుడైన డబ్ల్యుసి, బెనర్జీ "కాంగ్రెస్, డఫ్రిన్ ప్రభువు సృష్టి" అన్నారు. అంతేకాకుండా –

“ప్రతి సంవత్సరం భారతదేశ ప్రముఖ నాయకులందరిని సమావేశపరిచి సామాజిక విషయాలు చర్చించాలనేది హ్యూమ్ ఆలోచన అయితే డఫ్రిన్ ఆదేశాల ప్రకారం "ఒక సంస్థను నెలకొల్పి రాజకీయ విషయాలు చర్చిస్తే, దేశంలోని ప్రజల అభిప్రాయం తెలుసుకొనేందుకు వీలుపడుతుందని హ్యూమ్ అలాచేయవలసి వచ్చిందని" పేర్కొన్నాడు.

అయితే ఆచార్య బిపిన్ చంద్ర రక్షక కవాట సిద్ధాంతాన్ని ఒక కట్టుకథగా పేర్కొన్నాడు.

ఏమైనప్పటికీ 1885 వ సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. దీనిని స్థాపించడంలో హ్యూమ్ ఆలోచన ఏమైనప్పటికీ కాంగ్రెస్ స్థాపన భారతీయులకు మేలు చేసింది. భారతీయులందరినీ ఏకం చేసి స్వాతంత్రోద్యమం జరపడంలో కీలక పాత్ర పోషించింది.

## 9.7 సమీక్ష :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి అది ఆనాటి కాలంలోనే వివిధ కారణాల వల్ల అభివృద్ధి చెందింది. అది జాతీయోద్యమానికి దారి తీసింది. దేశ వ్యాప్తంగా

ప్రజాభిప్రాయాన్ని వెల్లడించే సంస్థలు ఏర్పడ్డాయి. అయితే అవి ఒక ప్రాంతానికి పరిమితం అయ్యాయి. ఇలాంటి స్థితిలో దేశ వ్యాప్తంగా ఒక సంస్థ ఉంటే బావుంటుంది అనే భావం ఏర్పడింది. ఇలాంటి స్థితిలో ఏర్పడినదే భారత జాతీయ కాంగ్రెస్. హ్యూమ్ అనే ఆంగ్లేయ రిటైర్డ్ ఉద్యోగి ఏర్పాటు చేయగా దీని మొదటి సమావేశం 1885 లో జరిగింది.

## 9.8 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 9.8.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. ఇండియన్ అసోసియేషన్ .
2. రక్షణ కవాటసిద్ధాంతం

### 9.8.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావాన్ని గురించి వ్యాసం రాయండి.

### 9.8.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. మద్రాస్ నేటివ్ అసోసియేషన్ స్థాపకులు ఎవరు.
2. ఇండియన్ అసోసియేషన్ ఎక్కడ ప్రారంభింప బడింది.
3. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకులు ఎవరు.
4. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం ఎక్కడ జరిగింది.
5. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన సమయంలో వైస్రాయ్ ఎవరు.
6. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశ అధ్యక్షులు ఎవరు.

## 9.9 ఉపయుక్త గ్రంధాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ బి.ఆర్. ప్రసాద రెడ్డి**

★★★★★

# పాఠం – 10
# మితవాదయుగం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం భారత జాతీయ కాంగ్రెస్ నడిపిన జాతీయోద్యమ తొలిదశ అంటే 1885నుండి 1905 వరకు వున్న మితవాద యుగాన్ని గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

10.1 పరిచయం

10.2 మితవాద యుగం

10.3 కాంగ్రెస్ కోరిన సంస్కరణలు

10.4 రాజకీయ యాచకత్వం

10.5 ఆంగ్లేయ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలపై విమర్శ

10.6 సంపద తరలింపు సిద్ధాంతం

10.7 కాంగ్రెస్ పట్ల ఆంగ్లేయ అధికారుల వైఖరి

10.8 జాతీయోద్యమ వృద్ధికి మితవాదుల కృషి

10.9 సమీక్ష

10.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

10.10.1 ఐదు మార్కుల ప్రశ్నలు

10.10.2 పది మార్కుల ప్రశ్నలు

10.10.3 ఒక్క మార్కు ప్రశ్నలు

10.11 ఉపయుక్త గ్రంధాలు

## 10.1 పరిచయం :

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపింపబడిన అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే వరకూ స్వాతంత్ర్య పోరాటం కాంగ్రెస్ నాయకత్వం లోనే జరిగింది. ఇతరులు ఉద్యమాలు నడిపినా ప్రధానమైన ఉద్యమం మాత్రం

కాంగ్రెస్ నాయకత్వం లోనే సాగిందని చెప్పవచ్చు. ఈ సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు 1885 నుంచి 1905 వరకు ఉన్న కాలానికి మితవాద యుగం అని పేరు. 1905 నుంచి 1920 వరకు ఉన్న ఉద్యమ కాలానికి అతివాద యుగం అని పేరు. 1920వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ సాగిన ఉద్యమం గాంధీజీ నాయకత్వంలో జరిగింది. ఈ కాలానికి గాంధి యుగం అని పేరు.

## 10.2 మితవాద యుగం :

1885-1905 సంవత్సరాల మధ్యకాలాన్ని మితవాద, జాతీయవాద యుగంగా చెప్పవచ్చు. ఈ కాలంలో మితవాదులు భారత పాలనా యంత్రాంగంలో సంస్కరణలను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ యుగంలో కాంగ్రెస్ మితవాదుల నాయకత్వంలో నడిచింది. దాదాబాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, ఫిరోజ్ షా మెహతా, బద్రుద్దీన్ త్యాబ్జీ, ఉమేష్ చంద్ర బెనర్జీ, మహాదేవ గోవింద రనడే, గోపాలకృష్ణ గోఖలే, ఆనందమోహన్ బోస్, రాస్ బిహారీ ఘోష్ వంటివారు మితవాద యుగంలో ప్రధానమైన పాత్ర పోషించారు. ఈ దశలో కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం వహించిన మితవాద నాయకులు రాజ్యాంగ పద్ధతుల ద్వారా ఆందోళనను జరిపి తమ రాజకీయ ఆశయాలను సాధించగలమని గట్టిగా నమ్మారు. వీరు ఆంగ్లేయ సామ్రాజ్యవాద దుష్పరిణామాలను విమర్శించినా ఆంగ్లేయ పరిపాలనను మెచ్చుకుంటూ, వారి పాలనవల్ల భారతదేశం వెనుకబాటుతనం నుండి బయట పడుతుందని, ఆంగ్లేయ పరిపాలన భారతదేశానికి వరప్రసాదమని భావించారు. మితవాద నాయకులు ఆంగ్లేయులు న్యాయబుద్ధి గలవారని నమ్మారు.

ఈ యుగంలో ఆంగ్లేయులకు, భారతీయులకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం, .భారతదేశంలోని వివిధ వర్గాలప్రజలను సంఘటితమైన జాతిగా రూపొందించడం, దేశ పరిపాలనలో భారతీయుల సంఖ్య పెంచాలని కోరటం వంటి ఆశయాలతో కాంగ్రెస్ పనిచేసింది.

కాంగ్రెస్ మొదటి సమావేశం 1885 లో బొంబాయి లో జరుగగా 1886 లో భారత జాతీయ కాంగ్రెస్ రెండో సమావేశం కలకత్తాలో జరిగింది. దాదాబాయ్ నౌరోజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 436 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

1886వ సంవత్సరం డిసెంబర్ నెలలో కలకత్తాలో కాంగ్రెస్ రెండవ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దాదాబాయి నౌరోజీ అధ్యక్షత వహించాడు. వివిధ సంస్థలు ఎన్నుకున్న 436 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో సురేంద్రనాథ్ బెనర్జీ ప్రముఖ పాత్రను పోషిస్తూ తాను స్థాపించిన "ఇండియన్ అసోసియన్" ను భారత జాతీయ కాంగ్రెస్ లో విలీనం చేసాడు. ఈ సమావేశం నుంచి కాంగ్రెస్ జాతీయతా భావాలు రూపొందించుకున్న అఖిల భారత సంస్థగా పేరు పొందింది. కాంగ్రెస్ మొదటి సమావేశంలోనే సివిల్ సర్వీస్ పరీక్షలు ఇంగ్లండ్ తో పాటు మనదేశంలో కూడా ఇండియాలలో ఒకేసారి నిర్వహించాలని కోరింది. రెండవ సమావేశంలో పరీక్షల నిర్వహణ గురించిన వివరాలను రూపొందించేందుకు ఉప సంఘాన్ని నియమించింది. అంతేకాకుండా న్యాయశాఖను కార్యనిర్వాహక శాఖ నుంచి విభజించాలని ప్రభుత్వాన్ని కోరుతూ కాంగ్రెస్ తీర్మానం చెసింది.

1887వ సంవత్సరం డిసెంబర్ నెలలో కాంగ్రెస్ సమావేశం మద్రాసులో జరిగింది. బద్రుద్దీన్ త్యాబ్జీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించాడు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 607 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రకంగా రోజురోజుకు కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనే ప్రతినిధుల సంఖ్య అధికం అవుతూ వచ్చింది. ఈ సమావేశాలకు హాజరయ్యే ప్రతినిధుల్లో చాలామంది ఆంగ్ల విద్యను అభ్యసించిన లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, పత్రికా సంపాదకులు వంటివారు అధికంగా ఉండేవారు.ఆంగ్లేయ సార్వభౌమత్వం పట్ల భారతదేశం విశ్వాసాన్ని ప్రకటించడంవల్ల, సైన్యంలో ఉన్నత పదవులలో భారతీయులను నియమించమని కోరుతూ ఈ సమావేశంలో తీర్మానాన్ని చేశారు. మద్రాస్ గవర్నర్ ఈ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ప్రతినిధులను ప్రభుత్వ అతిథి భవనంలో భోజనానికి ఆహ్వానించారు. అంతేకాకుండా 1888 వ సంవత్సరంలో ఆంగ్లేయుడైన జార్జ్ మూల్ కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించారు.

మితవాద యుగంలో జాతీయ కాంగ్రెస్ నాయకులలో ఎక్కువమంది నాయకులు తమ ఇబ్బందులకు ముఖ్య కారణం ఆంగ్లేయ ప్రభుత్వ ఉద్యోగులు, వారి పాలనా విధానం మాత్రమేనని, ఈ విషయాలు ఇంగ్లాండ్ పార్లమెంట్ కు గానీ, రాణికిగానీ ఇంగ్లాండ్ ప్రజలకు గానీ తెలియవని నమ్మారు. దీనితో తమ విన్నపాలను తెలియజేయడానికి భారతీయులతో కూడిన ఒక బ్రిటీష్ కమిటీని భారత జాతీయ కాంగ్రెస్ లండన్ లో 1888లో ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ద్వారా "ఇండియన్" అనే వారపత్రికను స్థాపించి భారతీయుల స్థితి, దేశంలో జరుగుతున్న పాలన, ప్రజలు, కాంగ్రెస్ కోరుతూ వున్న సంస్కరణలను ఇంగ్లాండ్ ప్రజలకు, ఇంగ్లాండ్ పార్లమెంట్ కు తెలియజేస్తూ ప్రచారం చేయాలని భావించారు. దీనికోసం దాదాబాయి నౌరోజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు.

## 10.3 కాంగ్రెస్ కోరిన సంస్కరణలు :

ఈ మితవాద యుగంలో జాతీయ కాంగ్రెస్ ఆంగ్లేయ ప్రభుత్వం నుండి కొన్ని పరిపాలనా సంస్కరణలను మాత్రమే కోరుకుంది తప్ప దేశానికి స్వాతంత్ర్యం కోరలేదు.

ఈ దశలో జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరిన సంస్కరణలు .

1. భారతీయులను శాసనసభలలో, పరిపాలనలో భాగస్వాములను చేయడం.
2. సివిల్ సర్వీస్ ఉద్యోగాలలో భారతీయులను తీసుకోవడం,
3. సివిల్ సర్వీస్ పరీక్షలను ఇండియాలో, ఇంగ్లండ్ లో ఒకే సమయంలో నిర్వహించడం.
4. భారతీయులకు పౌర హక్కులను కల్పించడం,
5. న్యాయశాఖను కార్యనిర్వాహక శాఖనుండి వేరుచేయడం.
6. సైన్యంపై ఖర్చు తగ్గిచడం,
7. విద్యాభివృద్ధికి ఎక్కువ ఖర్చు పెంచమనడం,
8. ఆంగ్లేయ సామ్రాజ్యంలోని దక్షిణాఫ్రికాలో నివశిస్తున్న భారతీయుల స్థితిగతులను మెరుగుపరచడం.

9. భారతదేశం ఆర్థికంగా, పారిశ్రామికంగా వెనుకబాటుతనానికి కారణం అన్వేషించడం

వీటన్నింటిని కూడా రాజ్యాంగ పద్ధతులలో విన్నపాలు, అర్జీల ద్వారానే విన్నవించుకొన్నారు. తప్ప ఆంగ్లేయ ప్రభుత్వం పై విమర్శలు చేయలేదు. వాటికోసం పోరాటం చేయలేదు.

## 10.4 రాజకీయ యాచకత్వం :

భారత జాతీయ కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం వహిస్తున్న మితవాద నాయకులు కాంగ్రెస్ సమావేశాలను ప్రతి సంవత్సరం నిర్వహించి దేశ రాజకీయ, ఆర్థిక, పరిపాలనా సమస్యల గురించి తీర్మానాలను ఆమోదించారు. ఆంగ్లేయ న్యాయవైఖరిపై అచంచల విశ్వాసం, ఆంగ్లేయ రాజకీయ భావాలను గౌరభావం తో చూడడం ద్వారా చట్టబద్ధమైన ఆందోళనను ప్రారంభించారు. వారి నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ పరిపాలనా రంగంలో సంస్కరణలను కోరింది. ఈ సంస్కరణలవల్ల విద్యావంతులకు అవకాశాలు లభిస్తాయని భావించారు. ఈ కాలంనాటి మితవాద నాయకులు భావుకులే కానీ, కార్యవాదులు కాదు. ప్రతినిధి వర్గాలను తీసుకువెళ్ళి విజ్ఞాపన పత్రాలను సమర్పించి, తమ కోర్కెలు న్యాయమైనవని ప్రభుత్వాన్ని నమ్మించడానికి ప్రయత్నించారు. మితవాదులు ప్రభుత్వంతో సంఘర్షణ పెట్టుకోలేదు. చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా సంస్కరణలను సాధించాలన్నదే వారి విధానం. ఈ విధానాన్నే "రాజకీయ యాచకత్వం" అని అంటారు.

## 10.5 ఆంగ్లేయ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలపై విమర్శ :

యుగంలో కాంగ్రెస్ నాయకులు మితవాద ధోరణితో రాజ్యాంగబద్ధమైన అర్జీలు పెట్టుకొనే రాజ్యంగా పద్ధతులు మాత్రమె అనుసరించినప్పటికి ఆంగ్లేయ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాలేదు. దీనితో వారు ఆంగ్లేయ ఆర్థిక విధానాలను విమర్శించడంతో పాటు భారతదేశ ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గతంలో ఎందరో విదేశీయులు దండయాత్రికులుగా వచ్చి తమ రాజ్య స్థాపన చేసి, భారతదేశ జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆ తరువాత వచ్చిన ముస్లింలు భారతీయ ఇక్కడే స్థిరపడి, ఇక్కడ సంపాదించింది ఇక్కడే ఖర్చు చేస్తూ స్థానికులుగా మారారు కానీ, నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థలలో మార్పు చేయలేదు. అయితే ఆంగ్లేయ పాలకులు అలాకాకుండా భారతదేశానికి వ్యాపారం కోసం వచ్చి ఇక్కడ సంపాదించింది తమ స్వదేశం తీసుకుపోవాలనుకున్నారే తప్ప భారతదేశంలో స్థిరపడాలనే ప్రయత్నం చేయలేదు. ఆ విధంగా భారతదేశంలో వారు విదేశీయులుగానే మిగిలిపోయారు. ఆంగ్లేయ పాలన శాంతిభద్రతలను నెలకొల్పి ప్రాణాలకు, ఆస్తికి రక్షణ కల్పించింది. కానీ వారు కల్పించిన శాంతి వారి సామ్రాజ్యవాద విజృంభణకు మాత్రమే ఉపయోగపడింది తప్ప భారతదేశ అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదు.

మితవాద యుగం నాటి జాతీయవాదుల ప్రధాన రాజకీయ కార్యక్రమం ఆంగ్లేయ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాన్ని ప్రజలకు అర్థమయ్యే ధోరణిలో వివరించి చైతన్యవంతులను చేయడం. ఆంగ్లేయ సామ్రాజ్యవాదులు వ్యాపారం, పరిశ్రమలు, పెట్టుబడి విధానాల ద్వారా ఒక నిర్ణీత వ్యూహం ప్రకారం దేశాన్ని కొల్లగొట్టారు. రాజకీయ, పరిపాలనా సమైక్యతవల్ల భారత ఆర్థిక వ్యవస్థపై వారు పూర్తి ఆధిపత్యాన్ని సాధించారు. ఈ విషయాలను జాతీయనాయకులు ప్రజలకు వివరిస్తూ భారతీయ ఆర్థిక వ్యవస్థను ఆంగ్లేయ ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడేలా చేయటమే ఆంగ్లేయుల ఆశయం అని స్పష్టం చేసారు.

ఇంగ్లాండ్ భారతదేశాన్ని ముడిపదార్థాలు సరఫరా చేసే దేశంగా, ఆంగ్లేయ వస్తువులకు మార్కెట్టు గా, చేసే విధానాన్ని జాతీయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆంగ్లేయ పాలకుల కొల్లగొట్టే విధానంవల్ల భారతదేశం తన ప్రత్యేకతను పూర్తిగా కోల్పోయి, ఆంగ్లేయ ఆర్థిక వ్యవస్థకు అనుబంధమైందిఅందువల్లనే ఈ విధానాన్ని గురించి దాదాబాయి నౌరోజీ ఆంగ్లేయ పాలన శాశ్వతంగా పాతుకుపోయి, నిత్యమూ పెరుగుతూపోయే ఒక విదేశ దురాక్రమణ" అని పేర్కొన్నాడు. ఆంగ్లేయ పాలన ఈ దేశాన్ని నిదానంగా సర్వనాశనం చేస్తుందని చాటి చెప్పాడు. ప్రభుత్వ ఆర్థిక విధానం భారతీయ హస్తకళలను ధ్వంసం చేసిందని, పెద్దఎత్తున యంత్రాలమీద తయారైన వస్తువుల పోటీకి భారతీయ చేతివృత్తుల వస్తువులు నిలువలేక భారతీయ చేతివృత్తులు పతనం చేదాయనీ, అందువల్ల నిరుద్యోగసమస్య అధికమిందని విమర్శించారు.

తేయాకు తోటలు, భారతీయ రైల్వేలు, పరిశ్రమలలో విదేశీ పెట్టుబడి దిగుమతి విధానాన్ని నాయకులు వ్యతిరేకించారు. ప్రభుత్వ విధానంవల్ల, స్వదేశీ పెట్టుబడిని అణిచివేయడం జరుగుతుందని, భారత ఆర్థిక, రాజకీయ వ్యవస్థపై ఆంగ్లేయ ప్రభావం అధికమవుతుందని నాయకులు భావించారు. విదేశీ పెట్టుబడిని నిరోధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని రంగాలలో భారతీయ జీవన ఆధునికీకరణ ఆవశ్యకతను వివరించారు. పేదరికాన్ని అంతమొందించడానికి ఆధునిక పరిశ్రమలను ఏర్పాటుచేయాలని కోరారు.

అంతేకాకుండా ఆనాటి నాయకులు భూమిశిస్తును తగ్గించాలని ఎడతెగకుండా ఆందోళనలను చేశారు. తేయాకు తోటలలో పనిచేసే కూలీల జీవన పరిస్థితులు మెరుగుపరచాలని, పేద, మధ్య తరగతి వర్గాన్ని వేధిస్తున్న ఉప్పు పన్ను, ఇతర పన్నులను రద్దు చేయాలని కోరారు. ముడి పదార్థాల ఎగుమతిని, విదేశీ వస్తువుల దిగుమతిని ప్రోత్సహించే ప్రభుత్వ వాణిజ్య విధానాన్ని, రైలు మార్గాల అభివృద్ధిని ఈ నాయకులు విమర్శించారు. భారతదేశ అంతరంగిక ఆర్థికాభివృద్ధికి సరిపడే వాణిజ్య, రవాణా విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 10.6 సంపద తరలింపు సిద్ధాంతం :

సామ్రాజ్యవాద వ్యతిరేక విమర్శలో జాతీయవాదుల ప్రధాన ఆయుధం సంపద తరలింపు సిద్ధాంతం. భారతదేశ సంపద ఆంగ్లేయుల విధానంవల్ల ఇంగ్లండుకు తరలిపోతుందని వివరించిన మొదటి భారతీయ నాయకుడు దాదాబాయి నౌరోజీ. ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడంలో ఆయన తన జీవిత సర్వస్వాన్ని ధారపోశాడు. ఆంగ్లేయ పరిపాలనా దమనకాండకు ప్రధాన కారణం సంపద తరలింపు విధానమని ఆయన భావించారు. తన అభిప్రాయాలను 'పావర్టీ అండ్ అన్ బ్రిటీష్ రూల్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో ప్రకటించారు. ఈ విధానాల వల్ల భారతదేశం అనేక విధాల బాధలు పడుతోందని, పేదరికంలో మ్రగ్గుతోందని నౌరోజీ ప్రకటించారు. భారతదేశం నుంచి సంపద ఇంగ్లండుకు నిరంతరం తరలుతోందని ఈ సిద్ధాంతం వివరించింది. భారతదేశం దిగుమతులను ఎక్కువగా చేసుకోవడంవల్ల అంటే విదేశీ వ్యాపారంలో లోటువల్ల సంపద తరలిపోతోంది. భారతదేశం నుంచి ఎక్కువ పెట్టుబడి మొత్తాలు, సంపద, ఇంగ్లాండ్ దేశానికి ఎగుమతి అయ్యాయి. దీనివల్ల భారతదేశానికి ఎలాంటి ప్రతిఫలం లభించలేదు. ఎలాంటి ప్రతిఫలం లభించకపోగా, భారతదేశంలో పనిచేస్తున్న ఆంగ్లేయ పౌర, సైనికాధికారుల జీతభత్యాలకు అయ్యే ఖర్చునంతా మనదేశమే భరించాలి. సంపద తరలింపు సిద్ధాంత దుష్పరిణామాలను రనడే, రమేశ్చంద్ర దత్ వంటి ప్రఖ్యాత నాయకులు

వివరించారు. తొలి జాతీయవాదులు సంపద తరలింపు విధానాన్ని ఘాటుగా విమర్శించి, సామాన్య మానవునికి వలస రాజ్యాల దోపిడీ స్వభావం తేలికగా అర్థం అయ్యేలా వివరించారు.

## 10.7 కాంగ్రెస్ పట్ల ఆంగ్లేయ అధికారుల వైఖరి :

ఈ మితవాద యుగంలో కాంగ్రెస్ నాయకులు మితవాద ధోరణితో రాజ్యాంగబద్ధమైన అర్జీలు పెట్టుకొనే రాజ్యాంగా పద్ధతులు మాత్రమే అనుసరించినప్పటికి ఆంగ్లేయ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాలేదు. కాంగ్రెస్ ఏర్పడిన ప్రారంభ దశలో నాటి గవర్నర్ జనరల్ లార్డ్ డఫ్రిన్ 1886లో జరిగిన కలకత్తా సమావేశానికి హాజరైన ప్రతినిధులకు, మద్రాస్ గవర్నర్ 1887లో హాజరైన కాంగ్రెస్ ప్రతినిధులకు భోజనాలు, వసతులు ఏర్పాటు చేసి ఆహ్వానించి గౌరవించారు. అంతేకానీ సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టలేదు.

దీనితో ఆంగ్లేయ ప్రభుత్వం, ఆంగ్లేయ అధికారులతో కాంగ్రెస్ స్నేహపూరిత వాతావరణం ఎక్కువకాలం కొనసాగలేదు. భారత జాతీయ కాంగ్రెస్ కొద్దిమంది రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయుల చర్చా వేదికగా మాత్రమే ఉంటుందని ఆంగ్లేయ అధికారులు భావించారు. అయితే ప్రభుత్వం నుంచి కాంగ్రెస్ కోరిన సంస్కరణలను గురించి కానీ కాంగ్రెస్ కోర్కెల గురించి కానీ ఎటువంటి స్పందన, ఫలితం లేకపోవడంతో ఆనతి కాలంలోనే కాంగ్రెస్ వైఖరిలో మార్పు వచ్చి కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. సమావేశాలను నిర్వహించి, కరపత్రాలను పంచిపెట్టారు.

ఈ పరిణామాలను ఆంగ్లేయ అధికారులు దేశద్రోహ చర్యగా భావించారు. అప్పటినుంచి ఆంగ్లేయ అధికారులు కాంగ్రెస్ కు వ్యతిరేకంగా, తీవ్ర పదజాలంతో దుష్ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులను "విశ్వాసం లేని బాబులని", "రాజద్రోహపూరిత బ్రాహ్మణులు" అని "తీవ్రభావాలు గల దుర్మార్గుల"ని ఆంగ్లేయ అధికారులు విమర్శించారు. లార్డ్ డఫ్రిన్ కాంగ్రెస్ దేశద్రోహాన్ని ప్రోత్సహించే సంస్థ అని, అందులోని నాయకులు స్వీయ ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు తప్ప దేశంకోసం కాదని విమర్శించాడు. కాగా, క్రీ.శ.1900లో కర్జన్ – "కాంగ్రెస్ పతనం కావడానికి సిద్ధంగా ఉంది. నేను భారతదేశంలో ఉండగానే అది ప్రశాంతంగా కన్ను మూయడానికి సహాయ పడాలని నా కోరిక" అని ప్రకటించాడు.

కాంగ్రెస్ నాయకులలో వచ్చిన మార్పును చూసి ఆంగ్లేయ అధికారులు భారతీయ ప్రజలలో సమైక్యత తమ పరిపాలనకు ప్రమాదం అని గుర్తించారు. కాంగ్రెస్ సంస్థ ప్రభావాన్ని తగ్గించడానికి, బలహీనపరచడానికి అధికారులు విభజించి పాలించే విధానాన్ని ఆంగ్లేయ అధికారులు అనుసరించారు. దీనికోసం సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్, బెనారస్ రాజా శివప్రసాద్ వంటి ఆంగ్లేయ అనుకూల శక్తులచేత కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమాన్ని మొదలుపెట్టించి ప్రోత్సహించారు. అయినా జాతీయ కాంగ్రెస్ అనతికాలంలోనే తన పేరు ప్రఖ్యాతుల ప్రభావం ప్రజలలో నలుదిశలా విస్తరించింది.

## 10.8 జాతీయోద్యమ వృద్ధికి మితవాదుల కృషి :

క్రీ.శ.1885-1905 మధ్యకాలంలో భారత జాతీయత మొలకెత్తింది. ఎన్నో లోపాలున్నప్పటికీ మితవాద జాతీయనాయకులు జాతీయోద్యమం బలపడడానికి గట్టి పునాదులు వేశారు. ప్రతి సంవత్సరం కాంగ్రెస్ సమావేశాలు

నిర్వహించేవారు. భారతదేశ రాజకీయ, ఆర్థిక, పరిపాలనా అవసరాలను ఆ సమావేశాలలో చర్చించి, తీర్మానించి, అర్జీల ద్వారా విన్నవించుకొంటూ ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని కలుగజేసారు. రానురాను ఆంగ్లేయ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను విమర్శిస్తూ, ఆంగ్లేయులతో ఘర్షణ పడకుండా ముందుకు సాగుతూ.. కాంగ్రెస్ సంస్థను దేశమంతటికి కావల్సిన ఒక బలమైన సంస్థగా తీర్చిదిద్దారు. అన్నివర్గాల ప్రజలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ రాజకీయ చైతన్యాన్ని కలుగజేసారు. కాంగ్రెస్ సంస్థను దేశమంతా వ్యాప్తి చేసి గట్టి పునాదులు వేసారు. అలాగాకుండా ఆంగ్లేయ ప్రభుత్వంతో గొడవకు దిగినట్లయితే కాంగ్రెస్ ను మొదట్లోనే కూకటివేళ్ళతో ప్రభుత్వం అంతం చేసి ఉండేది. అనేక వైఫల్యాలు ఎదుర్కున్నప్పటికీ మితవాద జాతీయవాదుల నాయకత్వంలోని కాంగ్రెస్ అనుసరించిన విధానం సరియైనదని, ప్రజా సమీకరణకు, చైతన్యానికి ఇది గట్టి పునాది వేసిందని చెప్పవచ్చు.

క్రీ.శ.1885లో భారత జాతీయ కాంగ్రెసు సంస్థ ఆవిర్భావంతో, మితవాదుల నాయకత్వంలో దేశ స్వాతంత్ర్య సాధనకోసం సంఘటిత మార్గంలో స్వల్పస్థాయిలో ప్రారంభమైన పోరాటం క్రమక్రమంగా బలపడి ప్రజా మద్దతును కూడగట్టుకొని ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకంగా గట్టి ప్రజా ఉద్యమానికి పునాది వేసింది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 10.9 సమీక్ష :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి అది ఆనాటి కాలంలోనే వివిధ కారణాల వల్ల అభివృద్ధి చెందింది. అది జాతీయోద్యమానికి దారి తీసింది. భారత జాతీయ కాంగ్రెస్ ను హ్యూమ్ అనే ఆంగ్లేయ రిటైర్డ్ ఉద్యోగి 1885 ఏర్పాటు చేయగా భారత స్వాతంత్రోద్యమం దాని నాయకత్వంలోనే జరిగింది. అందులోని మొదటి దశ మితవాద యుగం. కేవలం ప్రభుత్వంతో సఖ్యతగా వుండడం ద్వారా దేశానికి అవసరమైన వాటిని ప్రభుత్వం నుంచి సాధించుకునేందుకు ఈ యుగంలో ప్రయత్నించారు. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు ఫలితం లేకపోవడంతో భవిష్యత్తులో కాంగ్రెస్ వైఖరిలో మార్పు వచ్చింది.

## 10.10 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 10.10.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. రాజకీయ యాచకత్వం.
2. సంపద తరలింపు సిద్ధాంతం

### 10.10.2 పది మార్కుల ప్రశ్నలు :

1. మితవాద యుగంలో భారత జాతీయ కాంగ్రెస్ చేసిన ఉద్యమాన్ని గురించి రాయండి.

### 10.10.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. 1886 లో కాంగ్రెస్ సమావేశం ఎక్కడ జరిగింది.
2. 1887వ సంవత్సరంలో జరిగిన కాంగ్రెస్ సమావేశ అధ్యక్షులు ఎవరు.

3. కాంగ్రెస్ 1888 వ సంవత్సర సమావేశానికి అధ్యక్షత వహించిన ఆంగ్లేయుడు ఎవరు.

4. సంపద తరలింపు సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు.

5. భారత జాతీయ కాంగ్రెస్ అంతమైపోవాలని కోరిన వైస్రాయ్ ఎవర

## 10.11 ఉపయుక్త గ్రంధాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C

2. Modern India – Bipan Chandra

3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C

4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C

5. Modern India – Sumit Sarkar

6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ

7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి

8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ బి.ఆర్. ప్రసాద రెడ్డి**

★★★★★

# పాఠం – 11
# అతివాద యుగం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం భారత జాతీయ కాంగ్రెస్ నడిపిన జాతీయోద్యమ అతివాద యుగం అంటే 1905నుండి 1920 వరకు జరిగిన ఉద్యమాలు అయిన వందేమాతర, హోం రూల్ ఉద్యమాల గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

11.1 పరిచయం

11.2 వందేమాతర ఉద్యమం

11.2.1 బెంగాల్ విభజన

11.2.2 వందేమాతర ఉద్యమ ప్రారంభం

11.2.3 లాల్, బాల్, పాల్

11.2.3.1 లాలాలజపతిరాయ్

11.2.3.2 బాలగంగాధర తిలక్

11.2.3.3 బిపిన్ చంద్రపాల్

11.2.4 ఉద్యమ కార్యక్రమాలు

11.2.4.1 విదేశీ వస్తు బహిష్కరణ

11.2.4.2 జాతీయ విద్యా విధానం

11.2.4.3 ఉద్యమంలో విద్యార్థుల పాత్ర – రాజమండ్రి కళాశాల సంఘటన

11.2.4.4 ఉద్యమంలో స్త్రీల పాత్ర

11.2.5 ప్రభుత్వ అణచివేత చర్యలు

11.3 సూరత్ చీలిక

11.4 హోంరూల్ ఉద్యమము

11.4.1 అనీబిసెంట్

11.4.2 బాలగంగాధర తిలక్

11.4.3 ఉద్యమ ఫలితములు

11.5 అతివాద యుగంలో ప్రభుత్వం చేసిన సంస్కరణలు – చట్టాలు

11.5.1 మింటో మార్లే సంస్కరణలు (1909)

11.5.2 మాంటేగ్ – చెమ్స్ ఫర్డ్ సంస్కరణలు:

11.6 సమీక్ష

11.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

11.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు

11.7.2 పది మార్కుల ప్రశ్నలు

11.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు

11.8 ఉపయుక్త గ్రంధాలు

## 11.1 పరిచయం :

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపింపబడిన అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే వరకూ స్వాతంత్ర్య పోరాటం కాంగ్రెస్ నాయకత్వం లోనే జరిగింది. ఇతరులు ఉద్యమాలు నడిపినా ప్రధానమైన ఉద్యమం మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లోనే సాగిందని చెప్పవచ్చు. ఈ సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. 1885 నుంచి 1905 వరకు ఉన్న కాలానికి మితవాద యుగం అని పేరు. 1905 నుంచి 1920 వరకు ఉన్న ఉద్యమ కాలానికి అతివాద యుగం అని పేరు. 1920వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ సాగిన ఉద్యమం గాంధీజీ నాయకత్వంలో జరిగింది. ఈ కాలానికి గాంధి యుగం అని పేరు. మితవాద యుగంలో భారత జాతీయ కాంగ్రెస్ కేవలం సంస్కరణల కోసం ప్రయత్నం చేసింది. విజ్ఞాపనలు సమర్పించదానికి. సంస్కరణలను కోరడానికే పరిమితం కాగా అతివాద యుగంలో అది ఉద్యమ రూపం దాల్చింది. నాయకుల్లో వచ్చిన భావ పరిణామం అతివాద ఉద్యమానికి దోహదం చేసింది. బాలగంగాధర తిలక్ వంటి వారు **బిచ్చమెత్తి అని కాదు శివమ్ ఎత్తాలి** అని పిలుపునిచ్చారు. అతివాద యుగం లో ప్రధానంగా రెండు ఉద్యమాలు జరిగాయి.

ఆ ఉద్యమాల్లో వందేమాతర ఉద్యమం ఒకటికాగా రెండవది హోం రూల్ ఉద్యమం.

## 11.2 వందేమాతర ఉద్యమం (1905 – 1911):

వందేమాతర ఉద్యమం జరగడానికి ప్రధానమైన కారణం బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజించడం.

### 11.2.1 బెంగాల్ విభజన :

బెంగాల్ ఆంగ్లేయుల పాలనలో ఉన్నటువంటి ప్రాంతాలలో పెద్ద రాష్ట్రం. రాజకీయంగా, సాంస్కృతికంగా చైతన్యవంతమైన రాష్ట్రం. వీటన్నింటికిమించి హిందూ ముస్లింలు సఖ్యతగా కలిసి జీవిస్తూ ఉన్న రాష్ట్రం. ఇటువంటి రాష్ట్రాన్ని విభజించడం ద్వారా తమలో తాము కలహించుకునేలా చేస్తే ప్రజలు తమ వైపు దృష్టి సారించరు అనే భావంతో ప్రభుత్వం బెంగాల్ ను రెండుగా విభజించింది.

1903లో బెంగాల్ విభజించాలనే అభిప్రాయాన్ని వైస్రాయి కర్జన్ వెలిబుచ్చిన్నప్పటి నుంచి ప్రజలు ఆందోళనలు ప్రారంభించారు. 1903 డిసెంబర్ నుంచి 1905 అక్టోబరు వరకు సుమారు 300కు పైగా బహిరంగ సభలు నిర్వహించారు. రాజకీయ సంఘాలు, వార్తాపత్రికలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. సుమారు 70 వేల మంది ప్రజలు సంతకం చేసిన వినతిపత్రాన్ని భారత రాజ్య కార్యదర్శికి సమర్పించారు. ఈ విధంగా బెంగాల్ విభజనను ప్రజలు వ్యతిరేకిస్తున్నా వైస్రాయ్ ఏమాత్రం లెక్కచేయకుండా 1905వ సంవత్సరం అక్టోబర్ 16 వ తేదీన బెంగాల్ ను పరిపాలనా సౌలభ్యం అనే పేరుతో రెండుగా విభజించారు. బెంగాల్ లోని విద్యావంతులు ఐకమత్యాన్ని దెబ్బతీసి హిందూ ముస్లింల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించడమే బెంగాల్ విభజన యొక్క ప్రధాన ఉద్దేశం.

### 11.2.2 వందేమాతర ఉద్యమ ప్రారంభం :

బెంగాల్ విభజనను బెంగాల్ వాసులతో పాటు భారతదేశ వ్యాప్తంగా వ్యతిరేకించారు. బెంగాల్ విభజనను రద్దు చేయాలంటూ బెంగాల్లో సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలోని పెద్దఎత్తున ప్రారంభమైంది. బెంగాల్ విభజనను రద్దు చేయాలంటూ సాగిన ఉద్యమమే వందేమాతర ఉద్యమం.

ఈ ఉద్యమ కాలంలో బకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం అనే గేయం బహుళ ప్రజాదరణ పొందింది. నమస్కారానికి వందేమాతరం ప్రతిరూపం అయింది. వందేమాతరం ఉద్యమ నినాదం అయి మారుమ్రోగింది. ప్రతి సమావేశం ప్రారంభంలో వందేమాతరం గీతం ఆలపించడం పరిపాటి అయింది. వందేమాతర ఉద్యమంలో భాగంగా స్వరాజ్, స్వదేశి, విదేశీ ఆర్థిక బహిష్కరణ, జాతీయ విద్యా విధానం మొదలైనటువంటివి సాగాయి. సభలు సమావేశాలు నిర్వహించడంతో పాటు వందేమాతరం అని నినాదాలు చేస్తూ బ్రహ్మాండమైన ఊరేగింపులు నిర్వహించారు.

### 11.2.3 లాల్, బాల్, పాల్ :

బెంగాల్ విభజన భారత జాతీయ ఉద్యమానికి ఒక కొత్త రూపం ఇచ్చింది అని చెప్పవచ్చు. వందేమాతర ఉద్యమంలో లాల్, బాల్, పాల్ త్రయంగా ప్రసిద్ధులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్ లతోపాటు అరవింద ఘోష్ ప్రధాన పాత్ర పోషించారు. వీరు జాతీయరంగంలో వచ్చిన స్వరాజ్యం అనే గొప్ప భావాన్ని ప్రజలలో వ్యాపించడంలో ప్రధాన పాత్ర పోషించారు.

#### 11.2.3.1 లాలాలజపతిరాయ్ :

పంజాబ్ కేసరిగా పేరుపొందిన లాలాలజపతిరాయ్ పంజాబ్ ప్రాంతంలో జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించాడు. భారీ ఎత్తున పంజాబ్ లో వందేమాతరం ఉద్యమం జరగడానికి లాలాలజపతిరాయ్ ఎంతగానో కృషి చేశాడు. స్వదేశీ ఉద్యమాన్ని తీవ్రతరం చేయడంతో పాటు జాతీయ విద్యావ్యాప్తికి కృషి చేశాడు.

### 11.2.3.2 బాలగంగాధర తిలక్ :

బాల గంగాధర తిలక్ మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో గొప్ప పాత్ర నిర్వహించాడు. లోకమాన్య తిలక్ గా ప్రసిద్ధుడైన తిలక్ గణపతి ఉత్సవాలు, శివాజీ ఉత్సవాలను నిర్వహించి ప్రజలను చైతన్య వంతులను చేయడంతో పాటు ఉద్యమంలో పాల్గొనేలా చేశారు. మరాఠా, కేసరి అనే పత్రికలను స్థాపించి ప్రజలను చైతన్య పరిచారు. స్వరాజ్యం నా జన్మ హక్కు అని చాటిచెప్పి బాల గంగాధర తిలక్ ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించడానికి తీవ్రంగా కృషి చేశాడు.

### 11.2.3.3 బిపిన్ చంద్రపాల్ :

బిపిన్ చంద్రపాల్ దేశవ్యాప్తంగా పర్యటన చేసి ప్రజలను చైతన్యవంతం చేశాడు. ప్రధానంగా వందేమాతర ఉద్యమం ప్రాధాన్యాన్ని వివరిస్తూ దక్షిణభారతదేశమంతా ఆయన పర్యటనలు చేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడంలో తీవ్రమైన కృషి చేశాడు.

ఈ ముగ్గురితో పాటు అరవింద్ ఘోష్ కాళీమాత ఉత్సవాలను నిర్వహించి ఆ ఉత్సవాలకు విచ్చేసిన ప్రజలకు స్వాతంత్ర కాంక్ష కలిగేలా చేశాడు.

### 11.2.4 ఉద్యమ కార్యక్రమాలు :

ఈ జాతీయ నాయకుల ప్రభావంతో వందేమాతరం ఉద్యమం ఉధృతంగా సాగింది.

### 11.2.4.1 విదేశీ వస్తు బహిష్కరణ :

విదేశీ వస్తు, వస్త్ర బహిష్కరణ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. స్వదేశీ వస్తువుల, వస్త్రాల వాడకం ప్రోత్సహించబడింది. విదేశీ వస్తువులను వస్త్రాలను అమ్మే దుకాణాల ముందు ధర్నాలు చేయడం సర్వసాధారణం అయిపోయింది. విదేశీ వస్త్ర బహిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూణేలో విదేశీ వస్త్ర బహిష్కరణ కార్యక్రమానికి బాలగంగాధరతిలక్ నాయకత్వం వహించడంతో పాటు స్వదేశీ వస్తువుల వస్త్రాల దుకాణాలను తిలక్ పూణే లో స్థాపించాడు. అంతేకాకుండా స్వదేశీ పరిశ్రమల స్థాపనకు కూడా ప్రయత్నాలను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా బట్టలమిల్లులు, అగ్గిపెట్టెలు, సబ్బులు, పాదరక్షలు తయారు చేసే కర్మాగారాలు స్థాపించబడ్డాయి. పి.సి.రే బెంగాల్ లో ఈ సమయంలోనే కెమికల్ కర్మాగారాన్ని స్థాపించగా, రవీంద్రనాథ్ టాగూర్ స్వదేశీ స్టోర్ ను తెరిచాడు.

బ్యాంకులను, భీమా కంపెనీలను స్థాపించేందుకు చాలామంది జమీందార్లు, వ్యాపారులు రాజకీయ నాయకులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశం నుంచి యువకులను పెన్సిళ్ళు, అగ్గిపెట్టెలు తయారీలో శిక్షణ కోసం జపాన్ దేశానికి పంపించడం జరిగింది.

### 11.2.4.2 జాతీయ విద్యా విధానం :

బాలగంగాధర్ తిలక్ లాలాలజపతిరాయ్ లు జాతీయ విద్యా విధానాన్ని విస్తరించారు. 1906 సంవత్సరం నుంచి 1909 వ సంవత్సరం మధ్యకాలంలో జాతీయ విద్యా సంస్థలను స్థాపించేందుకు తీవ్ర కృషి జరిగింది. 1960లో అరవింద ఘోష్ కళాశాల అధ్యక్షుడిగా కలకత్తాలో జాతీయ కళాశాల స్థాపింపబడడింది. అలాగే 1909వ సంవత్సరంలో మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కళాశాల ఏర్పాటు చేయబడింది.

### 11.2.4.3 ఉద్యమంలో విద్యార్థుల పాత్ర – రాజమండ్రి కళాశాల సంఘటన :

ఉద్యమంలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా విదేశీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కళాశాలల బహిష్కరించి స్వదేశీ విద్యాసంస్థల్లో చేరారు. రాజమండ్రిలో 1907లో బిపిన్ చంద్రపాల్ ఐదు రోజులు గడిపి, ఐదుసార్లు సభలను నిర్వహించి ఉపన్యసించారు. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాన్ని చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారు తెలుగులోకి అనువదించారు. బిపిన్ చంద్రపాల్ పర్యటనలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు తో పాటు అనేక మంది విద్యార్థులు విరివిగా పాల్గొన్నారు. బిపిన్ చంద్రపాల్ పర్యటన విద్యార్థులలో తీవ్ర ప్రభావాన్ని కనబర్చింది. ఉద్యమంలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. రాజమండ్రిలో టీచర్ ట్రైనింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులపై బిపిన్ చంద్ర పాల్ ఉపన్యాసాలు తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. వందేమాతరం బ్యాడ్జీలను ధరించడం, వందేమాతరం అని ఒకరినొకరు పలకరించుకోవడం, వందేమాతరం అని నినదించడం వంటి వాటి ద్వారా విద్యార్థులు తమ జాతీయ భావాన్ని ప్రకటించేవారు.

ఇలాంటి స్థితిలో రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ హంటర్ వందేమాతరం బాడ్జీలను ధరించకూడదని ఆంక్షలు విధించాడు. 1907వ సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన పరీక్షకు హాజరైన విద్యార్థులు వందేమాతరం బ్యాడ్జీలు ధరించి ఉండడం చూసి ప్రిన్సిపల్ హంటర్ వాటిని తొలగించవలసిందిగా ఆదేశించాడు. అయితే విద్యార్థులు అందుకు అంగీకరించలేదు. వందేమాతరం బ్యాడ్జీలు తీసి వేయకపోతే పరీక్ష రాసే వీలులేదని ప్రిన్సిపాల్ హెచ్చరించాడు. విద్యార్థులు పరీక్షలు బహిష్కరించారు. దీనితో తన ఆదేశాలను ధిక్కరించిన విద్యార్థులపైన చర్య తీసుకునేందుకు సిద్ధమైన హంటర్ కాలేజీలోని 222 మంది విద్యార్థులలో 138 మంది విద్యార్థులను పరీక్షలు రాయడానికి అనర్హులుగా ప్రకటించారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు ను ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటించాడు. ఇది విద్యార్థుల చైతన్యానికి ప్రధాన సంఘటనగా చెప్పవచ్చు. ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా అనేకం జరిగాయి.

### 11.2.4.4 ఉద్యమంలో స్త్రీల పాత్ర :

స్త్రీలు అనేక మంది ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఊరేగింపులు, ధర్నాలు వంటి వాటిల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణాలలో మధ్యతరగతి స్త్రీలు సైతం జాతీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ఒకవైపు ఈ విధంగా శాంతియుతమైన వాతావరణంలో ఉద్యమం సాగుటూ వుంటే మరోవైపు కొందరు యువకు అనుశీలనసమితి, యుగంధర్ వంటి రహస్య సంఘాలను స్థాపించి విప్లవ ఉద్యమాలను కూడా ఇందులో భాగంగా నిర్వహించారు.

### 11.2.5 ప్రభుత్వ అణచివేత చర్యలు :

ఈ విధంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం తీవ్రమైన చర్యలను చేపట్టింది. వేలాది మంది ప్రజలను నిర్బంధించింది. లాఠీచార్జీలు చేసింది. విద్యార్థులపై కఠినమైన చర్యలను చేపట్టారు. ప్రజలలో భయానక వాతావరణాన్ని సృష్టించి ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేశారు.

ఉద్యమానికి నాయకత్వం వహించిన బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్ వంటి నాయకులను జైళ్లలో బంధించడంతో పాటు పత్రికా సంపాదకుల మీద అనేక చర్యలు తీసుకుంది. ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో మింటో మార్లే సంస్కరణలను ప్రవేశపెట్టి ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేసింది. అయినా ఉపయోగం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో చేసేదేమీలేక 1911 డిసెంబర్ 11 వ తేదిన బ్రిటీష్ ప్రభుత్వం బెంగాల్ విభజనను రద్దు చేయడంతో వందేమాతరం ఉద్యమం విజయవంతంగా ముగిసింది.

ఈ విధంగా తొలిరోజుల్లో జరిగిన వందేమాతర ఉద్యమం విజయవంతమై ఉద్యమిస్తే విజయం తథ్యం అని నిరూపించి, భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేయడంలో ప్రధాన పాత్ర పోషించింది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 11.3 సూరత్ చీలిక :

వందేమాతర ఉద్యమ ఫలితంగా జాతీయ కాంగ్రెస్ మితవాద, అతివాద అనే పక్షాలుగా చీలిపోయింది.. ఈ చీలిక 1907 సూరత్ కాంగ్రెస్ సమావేశంలో జరగడంవల్ల దీనికి సూరత్ చీలిక అని పేరు. మితవాదుల మెతకవైఖరి నచ్చని కొందరు జాతీయ వాదులు మాటల ద్వారా కాక చేతల ద్వారా సంస్కరణలు సాధించాలని భావించారు. 1905 లో కర్జన్ బెంగాల్ విభజన చేసిన సమయంలో మితవాదులు విభజన రద్దును బహిష్కరణ, శాంతియుత సహాయ నిరాకరణ, స్వదేశ ఉద్యమం వంటి వాటి ద్వారా సాధించాలని ఉద్యమం ప్రారంభించారు. ఇది కాంగ్రెస్ లోని కొందరికి నచ్చలేదు. వారు ఉద్యమం చేపట్టాలని భావించారు. 1905 బెనారస్ కాంగ్రెస్ సమావేశంలో తీవ్ర చర్చలు వాదోపవాదాలు జరిగాయి. 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి బాలగంగాధర తిలక్ ను అధ్యక్షున్ని చేయాలని అతివాదులు భావిస్తే మితవాదులు అడ్డుకుని దాదాబాయ్ నౌరోజీ ని అధ్యక్షుడిని చేశారు. ఈ సమావేశంలో అతివాదులు ప్రవేశపెట్టిన బహిష్కరణ, స్వదేశీ తీర్మానాలు మితవాదులు ఆమోదించక తప్పలేదు. అతివాదులది పై చేయి అయింది. అయితే 1907 నాటికి మితవాదులది పై చేయి అయింది. అతివాదులు లాల లజపతి రాయ్ అధ్యక్షతన నాగపూర్ లో కాంగ్రెస్ సమావేశాన్ని జరపాలని భావించారు. అయితే మితవాదులు అందుకు అంగీకరించక సూరత్ లో రాస్ బిహారీ బోస్ అధ్యక్షతన జరిపారు. దీనిని అతివాదులు నిరసించారు. ఈ సమావేశం లో తిలక్ ను మితవాదులు మాట్లాడనీయలేదు. చివరకు దాదాబాయి నౌరోజి చేసిన రాజీ ప్రయత్నములు ఫలింపక కాంగ్రెస్ అతివాదులు తిలక్ నాయకత్వమున, మితవాదులు గోఖలే నాయకత్వమున చీలిపోయారు.

## 11.4 హోంరూల్ ఉద్యమము :

అతివాద యుగంలో జరిగిన రెండవ ఉద్యమం – హోంరూల్ ఉద్యమము

హోంరూల్ ఉద్యమం బాలగంగాధర తిలక్, అనీబిసెంట్ ల నాయకత్వంలో జరిగింది. ఈ ఉద్యమం ద్వారా వారు బ్రిటీష్ సామ్రాజ్యములో అంతర్భాగముగా వుంటూనే భారతదేశానికి రాజ్యాంగ పద్ధతుల ద్వారా స్వయంపాలన కావలని కోరారు.

### 11.4.1 అనీబిసెంట్ :

అనీబిసెంట్ ఐర్లాండ్ దేశానికి చెందిన మహిళ. దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత దేశానికి వచ్చి భారతీయ సాంప్రదాయాలు, హిందూ మంతం పట్ల ప్రభావితురాలై భారతదేశాన్ని తన మాతృభూమి గా చేసుకుని ఇక్కడే ఉండిపోయింది. భారతీయులు రాజకీయ రంగంలో స్వయంపాలనను సాధింపనిదే వారి స్థితిగతులు మెరుగుపడవని అనీబిసెంట్ విశ్వసించింది. అందువల్ల ఐర్లండ్ పద్ధతిలో భారతదేశంలో హోంరూల్ ఉద్యమాన్ని చేపట్టాలని భావించింది.. 1916వ సంవత్సరం సెప్టెంబరునెల 15వ తేదీన మద్రాసులో హోంరూల్ లీగ్ ను స్థాపించారు. అనంతరం హోం రూల్ లీగ్ శాఖలను బొంబాయి, కాన్పూర్, బెనారస్, అలహాబాద్, కాలికట్ మొదలైన ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. హోం రూల్ ప్రాధాన్యతను తెలుపుతూ దేశమంతా పర్యటించి ప్రజలను చైతన్య వంతులను చేశారు. అందుకోసం ఆమె రెండు పత్రికలను ప్రారంభించారు. కామన్వెల్తు, న్యూఇండియా అనేవి అనీబిసెంట్ స్థాపించి నడిపిన పత్రికలూ. ఈ పత్రికలద్వారా హోంరూల్ ఉద్యమము ప్రచారాన్ని విస్తృతంగా చేసి ప్రజలను చైతన్యవంతులను చేశారు.

### 11.4.2 బాలగంగాధర తిలక్ :

అనీబిసెంట్ హోంరూలీగ్ స్థాపించిన కొన్ని నెలల తర్వాత 1916వ సంవత్సరం డిసెంబరునెల 28వ తేదిన తిలక్ పూనాలో హోంరూల్ లీగ్ ను స్థాపించారు. దీని మొదటి సమావేశానికి బొంబాయి, మధ్య పరగణాలు, బీహార్ మొదలైన అనేక ప్రాంతాలనుంచి జాతీయ నాయకులు హాజరయ్యారు. లీగ్ స్థాపించిన తిలక్ మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ మొదలైన ప్రాంతాలలో పర్యటించి, తన గంభీరోపన్యాసము ద్వారా స్వయంపాలన అనేది ఆంగ్ల సామ్రాజ్యములోని అంతర్భాగమనీ, ప్రజాస్వామ్య పద్ధతిద్వారా బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనే ఉద్యమ లక్ష్యమని ప్రచారం చేశారు. బాలగంగాధర తిలక్ కేసరి, మరాఠ అనే పత్రికలను నడిపి హోం రూల్ ప్రాధాన్యతను ప్రచారం చేశారు.

హోంరూల్ ఉద్యమాన్ని అనీబిసెంట్, బాలగంగాధర తిలక్ లు వేరు వేరు గా ప్రారంభించినా తర్వాత ఇద్దారు పరస్పర సహకారం తో ఉద్యమాన్ని నడిపారు. తిలక్ పశ్చిమ భారత దేశంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేయగా అనీబిసెంట్ ఉత్తర భారత దేశంతో పాటు దక్షిణ భారత దేశంలో కూడా పర్యటించి ప్రజలను చైతన్య వంతులను చేశారు. వీరిద్దరి కృషి వల్ల ప్రజలు ఉద్యమంలో పాల్గొన సాగారు. ఉద్యమం ఉదృతంగా సాగింది.

అనీబిసెంట్ జాతీయ కాంగ్రెస్ లోని అతివాదులకు, మితవాదులకు మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించి ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఫలితంగా 1916లో లక్నో సమావేశంలో వారు ఏకమయ్యారు. 1916లో లక్నో సమావేశానంతరము అనీబిసెంట్, తిలక్ లు దేశ పర్యటనలు చేసినపుడు జాతీయ కాంగ్రెస్ సభ్యులు తమ భేదాలను విస్మరించి వీరిని ఆహ్వానించారు. జిన్నాకూడా ఈ ఉద్యమంలో భాగస్వామి కావడం విశేషం.

### 11.4.3 ఉద్యమ ఫలితములు :

హోం రూల్ ఉద్యమం వెంటనే ఫలితాలు సాధించ లేకపోయినా అనేక సుదూర ఫలితాలకు కారణం అయింది. బాలగంగాధర తిలక్ రాకతో జాతీయ కాంగ్రెస్ లో మితవాదుల ప్రాబల్యం అంతరించింది. ఈ ఉద్యమాన్ని గమనించిన అమెరికా, ఇంగ్లాండులలోని అనేకమంది భారత దేశం పట్ల సానుభూతి ప్రదర్శించి భారతదేశానికి స్వయంపాలన ఇవ్వడం ఇంగ్లాడ్ బాధ్యత అని పేర్కొన్నారు. ఇంగ్లాండ్ లోని లేబర్ పార్టీ కూడా భారతీయులకు స్వయంపాలనను ఇవాలని తీర్మానం

చేసింది. దీనికితోడు జాతీయ కాంగ్రెస్ సమైక్యమగుటకు కాంగ్రెసు–ముస్లింలీగ్ ఏర్పాటు చేసుకొన్న లక్నో ఒడంబడిక జాతీయ నాయకులందరినీ ఒకే తాటిపైకి తేవడంలో విజయవంతమై..భవిష్యత్తు ఉద్యమాలు సమైక్యంగా సాగేందుకు అవకాశాన్ని ఇచ్చింది.

## 11.5 అతివాద యుగంలో ప్రభుత్వం చేసిన సంస్కరణలు – చట్టాలు :

అతివాద యుగంలో ఉద్యమాలు జరగడం చూసి భారతీయులలో అసంతృప్తి అధికమైందని గుర్తించిన ఆంగ్ల ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, ఉద్యమాన్ని అణచి వేసేందుకు కొన్ని నిరంకుశ చట్టాలను చేసింది.

### 11.5.1 మింటో మార్లే సంస్కరణలు (1909):

వందేమాతర ఉద్యమం ఉధృతి చూసిన ఆంగ్ల ప్రభుత్వం విభజించు పాలించు అనే విధానాన్ని అనుసరించాలని భావించారు. అందుకు వీలుగా 1909 వ సంవత్సరంలో ఇండియన్ కౌన్సిల్ చట్టము ప్రకారము రాజ్యాంగ సంస్కరణలను చేసింది.. ఈ సంస్కరణలకే 1909 మింటో మార్లే సంస్కరణలు అని పేరు. అతివాదలనుంచి మితవాదులను, మహమ్మదీయులను వేరుచేసి వారిని తమ వైపు ఉంచుకునేందుకు గవర్నర్ జనరల్ మింటో అప్పటి భారత మంత్రియగు మార్లేతో కలిపి చేసిన సంస్కరణలే –1909 భారత కౌన్సిల్ చట్టం లేదా మింటో మార్లే సంస్కరణలు.

**ముఖ్యాంశాలు :**

ఈ చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర శాసనసభలలో అదనపు సభ్యుల సంఖ్యను పెంచడంతో పాటు అధికారాన్ని విస్తృతం చేయబడింది. కేంద్ర రాష్ట్ర శాసనసభలలో ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయబడ్డాయి.

(1) ఈ చట్టం కేంద్రశాసన సభ పేరును ఇంపీరియల్ శాసనసభగా మార్చింది. ఇంపీరియల్ శాసనసభలోని సభ్యుల సంఖ్య 69 మందికి పెంచబడింది. వీరిలో 37 మంది అధికారులు, 32 మంది అనధికారులు వుంటారు. 37 మంది అధికారసభ్యులలో 9 మంది కార్యనిర్వాహక మండలి సభ్యులు, మిగిలిన 28 మందిని గవర్నరు జనరల్ నియమిస్తాడు. 32 మంది అనధికార సభ్యులలో 5 గురు గవర్నర్ జనరలే నియమిస్తాడు. మిగిలిన 27 మంది పరోక్షపు ఎన్నికల ద్వారా అనగా భూస్వాములు, వాణిజ్య మండలాలు, విశ్వవిద్యాలయాలు, ప్రత్యేక నియోజక వర్గాలు, మహమ్మదీయులు, రాష్ట్రశాసనమండలి అనధికార సభ్యులు ఎన్నుకుంటారు.

(2) రాష్ట్ర శాసనమండలిలోని సభ్యుల సంఖ్య పెంచబడింది. పెద్ద రాష్ట్రాలైన బొంబాయి, మద్రాసు, బెంగాల్ రాష్ట్రాల శాసన సభ సభ్యుల సంఖ్య 50 మందికి, చిన్న రాష్ట్రాలైన పంజాబ్, బర్మా, అస్సాం వంటి వాటిలో 30 మందికి పెంచబడింది.ఈ శాసన మండలిలో అనధికార సభ్యులు ఎక్కువ, అధికార సభ్యులు తక్కువ. రాష్ట్రాల శాసన సభలలో అనధికార సభ్యులెక్కువగా వున్నా అందులో ప్రభుత్వ నియమితుల సంఖ్యే ఎక్కువ.

(3) కేంద్ర, రాష్ట్ర శాసనసభలలోని సభ్యులకు ఆదాయ వ్యయ పట్టికలోని అంశములపై చర్చించుటకు, ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించు తీర్మానాలు ప్రవేశపెట్టుటకు, ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు వేయుటకు అవకాశము కల్పించబడింది.

ఇందులో భారతీయులకు అవకాశాలు కల్పించినట్లు కనిపిస్తూ వున్నా ప్రభుత్వం నియమించే వారు అధికంగా ఉండడంవల్ల భారతీయులకు ఒరిగింది ఏమీ లేదు. పైగా వివిధ వర్గాల వారికి ప్రత్యేక నియోజకవర్గాల వల్ల సమైక్యత లోపించే ప్రమాదం ఏర్పడింది.

## 11.5.2 మాంటేగ్ – చెమ్స్ ఫర్డ్ సంస్కరణలు :

1909లో చేసిన మింటో మార్లే సంస్కరణలు కాంగ్రెస్ ముస్లింలీగ్ లను తృప్తిపరచలేదు. 1916లో కాంగ్రెస్ ముసింలీగ్ లక్నో ఒడంబడిక చేసుకొనడంతో జాతీయవాదుల మధ్య సమైక్యతఏర్పడి వారి బలం పెరిగింది. భారతీయుల సహకారం లేకుండా మొదటి ప్రపంచ యుద్ధంలో గెలవడం కష్టమని భావించిన ప్రభుత్వం ప్రజల అసంతృప్తిని తొలగించడానికి 1917లో భారత వ్యవహారాల మంత్రి మాంటెగ్ ప్రభుత్వ లక్ష్యాన్ని వివరిస్తూ ఒక ప్రకటన చేశాడు. దీని ప్రకారం మాంటేగ్ వైస్రాయి చెమ్స్ ఫర్డ్ తో చర్చించి నివేదిక సమర్పించాడు. దీని ప్రకారం చేయబడిందే 1919 సంస్కరణలు.

**ముఖ్యాంశాలు :**

(1) ఇంతవరకు భారత ప్రభుత్వం భరిస్తున్న భారత రాజ్యాంగ కార్యదర్శి, కౌన్సిల్ వేతనాలను ఇంగ్లాండ్ ప్రభుత్వం ప్రభుత్వం భరిస్తుంది.

(2) భారత వ్యవహారాల మంత్రి అధికారం రాష్ట్ర ప్రభుత్వం లోని ట్రాన్సుఫర్డు శాఖపై తగ్గించబడింది.

(3) ఇంగ్లండులో ఇండియన్ హై కమీషనర్ ను నియమించి అతని ద్వారా ఇండియా నుండి ఇంగ్లండుకు వెళ్ళి వ్యాపారము చేసేవారికి, విద్యార్థులకు తగిన సౌకర్యాలు కలిగించుట.

(4) ఈ చట్టము భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలమధ్య వివిధ శాఖలను విభజించింది. దేశ రక్షణ, తంతితపాలా, రైల్వే, విదేశీ వ్యవహారాలు, ఆదాయం పన్ను వంటివి కేంద్ర శాఖలుగాను, పోలీసు, న్యాయ, విద్య, స్థానిక సంస్థలు, భూమిశిస్తు, ఆరోగ్యం వంటివి రాష్ట్రశాఖలుగాను విభజించింది. ఎవరి అంశాలపై వారు శాసనాలు చేస్తారు.

(5) కేంద్రంలో ద్విసభా పద్ధతి ప్రవేశ పెట్టింది. రెండు సభలలో ఒకటి రాజ్యసభ. రెండవది భారత శాసనసభ. రాజ్యసభలో 60 మంది సభ్యులుంటారు. అందులో 26 మందిని గవర్నరు జనరల్ నామినేట్ చేయునుస్తాడు. మిగిలినవారు ఎన్నుకోబడతారు. వీరి పదవీకాలం ఐదు సంవత్సరములు. భారత శాసనసభ 145 మంది సభ్యులుంటారు. అందులో 130 మంది ఎన్నుకోబడతారు. మిగిలినవారు గవర్నరు జనరల్ నియమిస్తాడు. వారి పదవీకాలము మూడు సంవత్సరములు. ఈ రెండు సభల సభ్యులను ఎన్నుకొనే ఓటు హక్కు కొద్దిమందికి మత్రమే ఇవ్వబడింది. ఇన్కంటాక్సు చెల్లించేవారు, విద్యావంతులు, స్థానిక సంస్థలు, వాణిజ్య మండలాలలో పదవులు నిర్వహించే వారికి మాత్రమే ఓటుహక్కు ఉంటుంది. స్త్రీలకు, బీదలకు ఓటు హక్కు లేదు. పైగా మత ప్రాతిపదికలపై నియోజక వర్గములు ఏర్పరచబడ్డాయి.

(6) కేంద్రశాసనసభకు శాఖలన్నింటిపై శాసనములు చేయు అధికారం, ఆర్థిక బిల్లులు ప్రవేశపెట్టి చర్చించే అధికారం, వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టె అధికారం వున్నప్పటికీ వాస్తవముగా విస్తృత అధికారాలు గవర్నర్ జనరల్ కు ఇవ్వడం వల్ల ఈ అధికారాలు నామమాత్రమయ్యాయి. కేంద్ర కార్యనిర్వాహక మండలిలో ఎంతమందినైనా నియమించే అధికారం భారతవ్యవహారాల మంత్రికే ఇవ్వబడింది.

(7) రాష్ట్రాలలో ద్వంద్వ పరిపాలన నెలకొల్పబడింది. పరిపాలనా శాఖలు రెండుగా విభజింపబడ్డాయి. రిజర్వుడు, ట్రాన్సుఫర్డు అనేవి రెండు శాఖలు. రిజర్వుడు శాఖకు పోలీసు, న్యాయం, భూమి శిస్తు, ఆర్థిక వ్యవహారాలు, అటవీశాఖ వంటివి కేటాయించబడ్డాయి. ఈ శాఖలను గవర్నరు తన కౌన్సిల్ సభ్యుల సహకారంతో నిర్వహిస్తాడు. ఈ శాఖ రాష్ట్ర శాసనసభ కు బాధ్యత వహించదు. వీరు గవర్నరుకు మాత్రమే బాధ్యులు. దీనికి అధికారములు ఎక్కువ. బాధ్యతలు తక్కువ. ట్రాన్సుఫర్డు శాఖకు స్థానిక స్వపరిపాలన, విద్యా, ఆరోగ్యం వంటివి కేటాయించబడ్డాయి. దీనిని గవర్నరు ఒక మంత్రిమండలి సహాయముతో నిర్వహిస్తాడు. ఈ మంత్రి మండలి సభ్యులను మెజారిటీ పార్టీ నుండి గవర్నరు నియమిస్తాడు. వీరందరూ భారతీయులే. పైగా వీరు రాష్ట్ర శాసనసభకు బాధ్యత కలిగివుంటారు... దీనికి బాధ్యతలు ఎక్కువ. అధికారములు తక్కువ. ఈ శాఖకు ఆర్థిక వ్యయం అధికంగా వుండే శాఖలు కేటాయించబడ్డాయి.

(8) శాసనసభలు ఆమోదించిన బిల్లులను తిరస్కరించే, సభలో చర్చలోవున్న బిల్లులను ఆపే, ఆర్డినెన్సులను జారీచేసే కేంద్ర శాసనసభను సమావేశపరిచే , వాయిదా వేసే, రద్దు చేసే అవసరమనిపిస్తే తానే చట్టం చేయడం వంటి నిరంకుశ అధికారాలు గవర్నర్ జనరల్ ఇవ్వబడ్డాయి.

ఈ చట్టం కూడా భారతీయులకు సంతృప్తిని కలిగించ లేదు. దానికి తోడూ ఆంగ్ల ప్రభుత్వం పై వ్యతిరేకత అధికమైంది.

## 11.6 సమీక్ష :

భారతదేశంలో క్రీ.శ. 19వ శతాబ్ది రెండవ అర్థభాగంలో జాతీయ రాజకీయ చైతన్యం ఏర్పడి అది ఆనాటి కాలంలోనే వివిధ కారణాల వల్ల అభివృద్ధి చెందింది. అది జాతీయోద్యమానికి దారి తీసింది. భారత జాతీయ కాంగ్రెస్ ను హ్యూమ్ అనే ఆంగ్లేయ రిటైర్డ్ ఉద్యోగి 1885 ఏర్పాటు చేయగా భారత స్వాతంత్రోద్యమం దాని నాయకత్వంలోనే జరిగింది. అందులోని రెండవ దశ అతివాద యుగం. కేవలం ప్రభుత్వంతో సఖ్యతగా వుండడం ద్వారా దేశానికి అవసరమైన వాటిని ప్రభుత్వం నుంచి సాధించుకునేందుకు మితవాద యుగంలో ప్రయత్నిచారు. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన మేరకు ఫలితం లేకపోవడంతో ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమయ్యారు. దీనితో అతివాద యుగం ప్రారంభం అయింది. ఈ యుగంలో ప్రధానంగా రెండు ఉద్యమాలు జరిగాయి. 1905 లో బెంగాల్ విభజనతో వందేమాతర ఉద్యమం ప్రారంభమై ఉధృతంగా సాగింది. చివరకు 1911 లో ఆంగ్ల ప్రభుత్వం బెంగాల్ విభజనను రద్దు చేయడంతో వందేమాతర ఉద్యమం విజవంతంగా ముగిసింది. తర్వాత అనీబిసెంట్, బాలగంగాధర తిలక్ ల సారధ్యంలో స్వయం పాలన కోరుతూ హోం రూల్ ఉద్యమం జరిగింది.

## 11.7 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 11.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. సూరత్ చీలిక
2. మింటో మార్లె సంస్కరణలు

### 11.7.2 పది మార్కుల ప్రశ్నలు :

1. వందేమాతర ఉద్యమాన్ని గురించి రాయండి.
2. మాంటేగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను వివరించండి.

### 11.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. వందేమాతర గీత రచయిత ఎవరు
2. బెంగాల్ విభజన ఏ సంవత్సరంలో జరిగింది.
3. బెంగాల్ విభజన చేసిన వైశ్రాయ్ ఎవరు.
4. అనీబిసెంట్ ఏ దేశానికి చెందిన మహిళ.
5. కామన్ వీల్ పత్రికా స్థాపకులు ఎవరు
6. మాంటేగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలు ఏ సంవత్సరంలో చేయబడ్డాయి.

## 11.8 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ బి.ఆర్. ప్రసాద రెడ్డి**

★★★★★

# పాఠం -12
# గాంధీజీ – తొలి ఉద్యమాలు

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన గాంధీ జీవితం, జాతీయోద్యమానికంటే ముందు ఆయన నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు, స్వాతంత్రోద్యంలో ఆయన ప్రవేశించేందుకు దోహదం చేసిన రౌలత్ చట్టం, జలియన్ వాలాబాగ్ సంఘటనలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

12.1 పరిచయం

12.2 మహాత్మా గాంధీ

12.3 దక్షిణాఫ్రికాలో గాంధీ

12.4 స్వాతంత్రోద్యమానికంటే ముందు గాంధీ నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు

12.4.1 చంపారన్ సత్యాగ్రహం

12.4.2 అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె

12.4.3 ఖేడా సత్యాగ్రహం

12.5 రౌలత్ వ్యతిరేకోద్యమం

12.5.1 రౌలత్ చట్టం

12.5.2 జలియన్ వాలాబాగ్ హింసాకాండ

12.6 సమీక్ష

12.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

12.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు

12.7.2 పది మార్కుల ప్రశ్నలు

12.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు

12.8 ఉపయుక్త గ్రంధాలు

## 12.1 పరిచయం :

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపింపబడిన అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే వరకూ స్వాతంత్ర్య పోరాటం కాంగ్రెస్ నాయకత్వం లోనే జరిగింది. ఇతరులు ఉద్యమాలు నడిపినా ప్రధానమైన ఉద్యమం మాత్రం కాంగ్రెస్ నాయకత్వం లోనే సాగిందని చెప్పవచ్చు. ఈ సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. 1885 నుంచి 1905 వరకు ఉన్న కాలానికి మితవాద యుగం అని పేరు. 1905 నుంచి 1920 వరకు ఉన్న ఉద్యమ కాలానికి అతివాద యుగం అని పేరు. 1920వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ సాగిన ఉద్యమం గాంధీజీ నాయకత్వంలో జరిగింది. ఈ కాలానికి గాంధి యుగం అని పేరు. ఈ ఉద్యమానికంటే ముందే గాంధీ నాయకత్వంలో కొన్ని ఉద్యమాలు విజయం సాధించాయి.

## 12.2 మహాత్మా గాంధీ :

ఆధునిక ప్రపంచ చరిత్రలో భారత స్వాతంత్ర్యోద్యమం అతిపెద్ద ప్రజా ఉద్యమం.

అత్యంత శక్తివంతమైన సామ్రాజ్యవాద బ్రిటన్ దేశ ఇనుప కౌగిలినుంచి విముక్తం కావడానికి దేశంలోని అన్ని వర్గాల, వర్ణాల, మతాల ప్రజలు ఉద్యమించిన అపూర్వ సంఘటన. దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించిన ప్రజా విప్లవం. అత్యధిక భాగం శాంతియుతంగా, ప్రజాస్వామ్యంగా సాగిన ఈ పోరాటం వలస పాలనలో మగ్గుతున్న అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలకు స్ఫూర్తిగా నిలిచింది.

ఈ స్వాతంత్ర్యోద్యమం గాంధీ ప్రవేశంతో నిర్ణీత లక్ష్యాన్ని సంతరించుకుంది. ప్రజా ఉద్యమమై ఎగిసిపడి విజయ తీరాన్ని చేరుకుంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ నిర్వహించిన పాత్ర అజరామరమైనది.

మహాత్ముడిగా, జాతిపితగా, మహాత్మా గాంధీగా గౌరవాన్ని పొందుతున్న మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1869 వ సంవత్సరం అక్టోబర్ నెల రెండవ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్ లో జన్మించారు. ప్రాథమిక, మాధ్యమిక విద్యను గుజరాత్ లోనే ముగించాక బారిస్టర్ చదువు కోసం 19 సంవత్సరాల వయసులో ఇంగ్లాండ్ వెళ్లి న్యాయశాస్త్ర విద్యనభ్యసించి బారిస్టర్ పట్టా అందుకొన్నారు. తిరిగి భారతదేశానికి వచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టారు.

## 12.3 దక్షిణాఫ్రికాలో గాంధీ :

1893లో దాదా అబ్దుల్లా వ్యాపార సంస్థకు న్యాయ సలహాదారుగా దక్షిణాఫ్రికాకు చేరుకున్నారు. అప్పటికే దక్షిణాఫ్రికాలో వ్యాపారం కోసం, బతుకు తెరువు కోసం వెళ్లిన భారతీయులు ఉండేవారు. వారు జాతి వివక్షతకు గురి కావడం చూసి చలించిపోయిన మహాత్ముడు సత్యాగ్రహం సాధనంగా 20 సంవత్సరాలపాటు ఉద్యమం నడిపారు. దీనికి తోడూ అనేక సందర్భాలలో స్వయంగా అవమానాలను ఎదుర్కొన్నారు. భారతీయులకోసం నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ అనే రాజకీయ సంస్థను ఏర్పరచారు. నేటాల్ ప్రభుత్వం భారతీయులకు ఓటింగ్ హక్కు తీసివేస్తూ శాసనం చేయడమేగాక, భారతదేశం నుంచి వచ్చిన కార్మికులపై తలసరి వార్షిక పన్ను విధించింది. దీనికితోడూ ట్రాన్సవాల్ లోని భారతీయులు పదివేల మంది తమ 'వేలిగుర్తులను' ముద్రిస్తూ ప్రభుత్వ రికార్డులలో రిజిస్టర్ చేయాలి అని దక్షిణాఫ్రికా ప్రభుత్వం శాసనం చేసింది.

ఈ శాసనం అన్యాయమని భావించిన గాంధీజీ శ్వేత జాతీయులతో పోరాటం చేశారు. ఈ శాసనానికి విరుద్ధంగా గాంధీ ప్రప్రథమంగా సత్యాగ్రహమనే అస్త్రాన్ని ప్రయోగించారు. భారతీయులను వేలి ముద్రలు ఇవ్వవద్దని, రిజిస్టర్ చేయించుకోవద్దని, అవసరమైతే జైలుకు వెళ్ళడానికి, చావడానికి కూడా సిద్ధం కావలని పిలుపునిచ్చాడు. గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించి, 150 మంది అనుచరులతో ఆరెస్టు అయ్యారు. ప్రభుత్వం రాజీకి వచ్చింది. ట్రాన్సవాల్ లోకి భారతీయులను అనుమతించకుండా 1907లో చేసిన శాసనానికి విరుద్ధంగా, గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్నే నడిపారు. కొంతమంది అనుచరులతో చట్టవిరుద్ధంగా ట్రాన్సవాల్ సరిహద్దులలో ప్రవేశించి, మరోసారి జైలుకు వెళ్ళారు. క్రైస్తవ పద్ధతులలో వివాహాలు జరుగకుండా, రిజిష్టర్ కాని వివాహాలు చెల్లనేరవని దక్షిణాఫ్రికా సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. భారతీయుల వివాహాలను చట్టబద్ధం చేస్తూ ప్రత్యేక శాసనం చేయవలసిందిగా గాంధీ ప్రభుత్వాన్ని కోరారు. మహిళలతో సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించగా గాంధీ, ఆయన భార్య కస్తూరిబాయి నిర్బందింపబడ్డారు.

భారత జాతీయులకు సానుభూతిగా 'న్యూకాజిల్'లోని ఆరువేల మంది గని కార్మికులు సమ్మె చేసారు. వారిని నివాస గృహాల నుంచి బలవంతంగా తొలగించారు. అయినా వారు లొంగ లేదు. గాంధీ రెండువేల మందితో సత్యాగ్రహం ప్రారంభించారు. గాంధీని అరెస్ట్ చేసి, తొమ్మిది నెలల కారాగార శిక్ష విధించారు. సమ్మె చేస్తున్న వారిని దారుణంగా హింసించారు. అయినా వారు ధైర్యంగా అన్ని బాధలను సహించారు. చివరకు ప్రభుత్వం కాల్పులు సాగించింది. భారత జాతీయులు, శ్వేత జాతీయుల నిరంకుశత్వాన్ని ప్రతిఘటిస్తూ, ఒకటిగా నిలిచారు. చివరకు, బ్రిటిష్ గవర్నర్ గాంధీజీని సంప్రదింపులకు ఆహ్వానించక తప్పలేదు. సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేస్తూ, ప్రభుత్వం శాసనాన్ని చేసింది. హిందూ, మహమ్మదీయ, పారశీకుల వివాహాలను చట్టబద్ధంగా అంగీకరించారు. 1920 నుంచి భారతదేశం నుంచి కార్మికులను కొనుగోలు పద్ధతిలో తీసుకురావడం నిషేధింపబడింది. స్వేచ్ఛ పొందిన దక్షిణాఫ్రికాలోని భారతీయ కార్మికుల భార్యాబిడ్డలు, వారిని చేరవచ్చు. 1906లో మొదలైన సత్యాగ్రహ పోరాటం 1914లో జారీ చేయబడిన 'రిలీఫ్' చట్టంతో ముగిసింది. ఇది గాంధీ సాధించిన గొప్ప విజయం.

తర్వాత 1915 లో భారత దేశానికి తిరిగి వచ్చి సత్యాగ్రహ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టారు. 1915లో ఆఫ్రికా నుంచి భారతదేశానికి చేరుకున్న గాంధీ అలహాబాద్ సమీపంలో సబర్మతి నది ఒడ్డున ఒక ఆశ్రమాన్ని స్థాపించు కొన్నారు. దానికి సబర్మతి ఆశ్రమం అని పేరు. గోపాలకృష్ణ గోఖలే సలహామేరకు దేశవ్యాప్తంగా పర్యటన జరిపి దేశ పరిస్థితులను అవగాహన చేసుకున్నారు. గాంధీ తర్వాతి కాలంలో గోపాలకృష్ణ గోఖలే ను తన రాజకీయ గురువుగా ప్రకటించాడు.

## 12.4 స్వాతంత్రోద్యమానికంటే ముందు గాంధీ నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు :

1915లో ఆఫ్రికా నుంచి భారతదేశానికి చేరుకున్న గాంధీ 1917, 18 సంవత్సరాల మధ్య కాలంలో చంపారన్ సత్యాగ్రహాన్ని, అహ్మదాబాద్ మిల్లు కార్మికుల ఉద్యమాన్ని, ఖేడా సత్యాగ్రహాన్ని నిర్వహించి విజయాన్ని సాధించారు. ఈ ఉద్యమాల్లో సత్యం, అహింసలతో కూడుకున్న సత్యాగ్రహ విధానాన్ని అనుసరించారు. తర్వాత ఆ విధానంతోనే గాంధీ భారత స్వాతంత్ర్యోద్యమంలోకి ప్రవేశించారు.

### 12.4.1 చంపారన్ సత్యాగ్రహం :

బీహార్ లోని చంపారన్ జిల్లా బాగా వెనుకబడింది. ఇక్కడ రైతులు ఎక్కువగా 'నీలిమందు' పండించేవారు. ఈ నీలిమందు తోటలు ఆంగ్లేయుల ఆధీనంలో ఉండడం వల్ల వారు రైతులను పీడించేవారు. రైతులు తమభూములలో తప్పనిసరిగా 3/20 వంతులో నీలిమందు పండించి, ఆంగ్లేయులు చెప్పిన ధరకు అమ్మాలి. ఇట్టి పరిస్థితులు బెంగాల్ రాష్ట్రంలో కూడా ఉంటే అక్కడి రైతులు 1859–1861 మధ్య రైతులు తిరుగుబాటు చేసి విముక్తులయ్యారు. దీనికి "నీలి విప్లవం" అని పేరు.

గాంధీ గారిని గురించి తెలిసిన చంపారన్ రైతులు తమను కాపాడమని కోరారు. పదవలసిందిగా ఆయనను అర్థించినారు. గాంధీ బాబూ రాజేంద్రప్రసాద్, మహాదేశాయ్, మజహర్–ఉల్–హక్ లను వెంటబెట్టుకుని 1917లో చంపారన్ సందర్శించిన, భారతదేశంలోని రైతుల కష్టాలను స్వయంగా చూశారు. వీరు 'మోతీహారీ' చేరేసరికి వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోవలసిందిగా ప్రభుత్వం ఆదేసించింది. గాంధీ ప్రభుత్వ ఆదేశాన్ని ధిక్కరించి విచారణను ఎదుర్కొని – తాను ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించానని అంగికరించి, తనకు ప్రభుత్వం పట్ల గౌరవం ఉన్నా, అంతకుమించి ఉన్నతమైన మానవ న్యాయంపట్ల అంతఃకరణ పిలుపువల్ల ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించవలసి వచ్చింది గాంధీ పలికాడు. వేలాదిమంది ప్రజలు గాంధీని అనుసరించారు. ప్రభుత్వం గాంధీపై మోపిన కేసును రద్దుచేసి, రైతులు ఇబ్బందులను పరిశీలించ దానికి ఒక సంఘాన్ని నియమించింది. దీనితో చంపారన్ సత్యాగ్రహం విజయవంతంగా ముగిసింది.

### 12.4.2 అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె :

అహ్మదాబాద్ లోని మిల్లులో పనిచేస్తున్న నేత కార్మికులు వేతనాల పెంపు కోసం సమ్మె చేపట్టారు. గాంధీ నేత కార్మికులకు మద్దతు తెలుపుతూ సమస్యల పరిష్కారానికి కంకణం కట్టుకున్నారు. గాంధీ ఈ సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ మొట్టమొదటిసారిగా నిరాహారదీక్ష చేశారు. దీనితో మిల్లు యాజమాన్యం దిగివచ్చి 35 శాతం పెంచడానికి అంగీకరించారు.

### 12.4.3 ఖేడా సత్యాగ్రహం :

గుజరాత్ లోని 'ఖేడా' ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా పంటలు పండలేదు. అక్కడ సాలుసరి దిగుబడి 25 శాతానికి పడిపోయింది. రైతులు భూమి శిస్తు చెల్లించలేని స్థితి ఏర్పడింది. రైతులు ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీనితో గాంధీ వల్లభాయ్ పటేల్, తదితర నాయకులు వెంట రాగా ఖేడా చేరుకొని ఉద్యమం ప్రారంభించారు. గాంధీని బలపరచినారు. మొదట్లో భూమి శిస్తు రద్దుకు అంగీకరించని ప్రభుత్వం చివరకు సత్యాగ్రహ ఉద్యమ ప్రభావంవల్ల, రైతుల కోరికలను మన్నించి పన్నులు రద్దు చేయడంతో ఖేడా సత్యాగ్రహం విజవంతంగా ముగిసింది.

చంపారన్ సత్యాగ్రహం సమయంలో బాబు రాజేంద్ర ప్రసాద్ గాంధీ అనుచరుడుగా మరగా, ఖేడా సత్యాగ్రహ సమయంలో వల్లభాయ్ పటేల్ గాంధీ అనుంగు శిష్యుడుగా మారాడు. ఈ మూడు ఉద్యమాలు గాంధీని దేశంలో గొప్ప నాయకున్ని చేశాయి. గాంధీ సత్యాగ్రహ ఉద్యమం, సత్యాగ్రహ విధానం దేశంలో చాలామందికి అంగీకారమైంది. ఎట్టి విషమం పరిస్థితి నుంచైనా సత్యాగ్రహం అనేది బయట పడవేయగలదనే నమ్మకం ప్రజలకు ఏర్పడింది.

## 12.5 రౌలత్ వ్యతిరోకోద్యమం :

ప్రభుత్వం 1919 మార్చిలో రౌలత్ శాసనాన్ని ఆమోదించింది. ఈ అణచివేత చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించిన తర్వాత మహాత్మాగాంధీ రాజకీయ జీవనంలో మౌలికమైన మార్పు వచ్చింది. ఆయనలో ఓర్పు నశించింది. బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిపట్ల, గాంధీజీకి గతంలో ఉండే భ్రమలన్నీ తొలగిపోయాయి. రౌలత్ చట్టాలను సత్యాగ్రహం చేసి, వ్యతిరేకించాలని నిశ్చయించారు.

### 12.5.1 రౌలత్ చట్టం :

భారతదేశములో అతివాద యుగంలో జరిగిన ఉద్యమాలను, భారతీయుల స్వరాజ్య కాంక్షను చూసి వాటిని నిరంకుశంగా అణచివేయాలని భావించింది అందుకు అవసరమైన చట్టాన్ని చేసేందుకు తగిన సూచనలు ఇమ్మని ఆంగ్లన్యాయాధిపతి ఎస్.ఎ. టి. రౌలత్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం తమ నివేదికను 1918లో ప్రభుత్వానికి సమర్పించింది. రౌలత్ సూచనల మేరకు చేయబడిన చట్టమే రౌలత్ చట్టం. దీనిని ఢిల్లీలోని ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ 1919 మార్చి 18న ఆమోదించింది.

ఈ చట్టంలో పోలీసులకు విశేషమైన అధికారాలు ఇవ్వబడ్డాయి. ఈ చట్టం ప్రకారం విప్లవవాదులు అని అనుమానం ఉన్నవారిని అరెస్ట్ చేసి విచారణ లేకుండా రెండుసంవత్సరాల వరకు నిర్బంధంలో ఉంచవచ్చు. అటువంటి వారిని విచారించడానికి ముగ్గురు న్యాయ మూర్తులతో ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసి సత్వరమే విచారణ చేయవచ్చు.

### 12.5.2 జలియన్ వాలాబాగ్ హింసాకాండ :

రౌలత్ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకించడంచేత, అనేక సంఘటనలు జరిగాయి. ఈ సమయంలోనే ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగని ఘోరమైన మారణకాండ జలియన్ వాలాబాగ్ వద్ద జరిగింది.

కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సత్యపాల్, డాక్టర్ సైపుద్దీన్ కిచ్లుల నిర్బంధాన్ని వ్యతిరేకించడానికి 1919 ఏప్రిల్ 13వ తేదీన కాంగ్రెస్ నాయకులు పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్ పట్టణంలోని జలియన్ వాలాబాగ్ లో శాంతియుతంగా సమావేశం జరిపారు నిర్వహించారు. సమావేశం జరిగిన ప్రదేశాన్ని, బ్రిటీష్ సైనికులు చుట్టుముట్టారు. సమావేశం జరిగే ప్రదేశం నుంచి బైటకు పోవడానికి ఒక వైపు మాత్రమే దారి ఉంది. దానిని జనరల్ డయ్యర్ సైనికులతో మూసివేశాడు. ప్రజలు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకపోయినా, జనరల్ డయ్యర్ నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో కాల్పులు జరిపించాడు. వేలాది ప్రజలు గాయపడ్డారు మరణించారు. ఈ విధంగా ప్రజానీకం, పైశాచిక హింసాకాండకు గురైంది. జలియన్ వాలాబాగ్ జరిగిన దారుణ మారణ హింసాకాండ ప్రజలలో తీవ్రమైన విద్వేషాన్ని, అసంతృప్తిని, పెంపొందించాయి.

జలియన్ వాలాబాగ్ దారుణ హింసాకాండను, దేశ ప్రజలు ముక్త కంఠంతో గర్హించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 'నైట్ హుడ్' బిరుదును పరిత్యజించాడు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపడానికి, కాంగ్రెస్ విచారణా సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో మోతిలాల్ నెహ్రూ, జయకర్ , సి.ఆర్.దాస్, అబ్బాస్ త్యాబ్జీ, మహాత్మాగాంధీ సభ్యులు. ఈ

సంఘం తన నివేదికలో ఈ దారుణ హింసాకాండకు పూర్తి బాధ్యత జనరల్ డయ్యర్ అని ప్రకటించింది. జలియన్ వాలాబాగ్ మారణకాండ తర్వాత పంజాబ్ లో కొనసాగిన భయానక భీభత్స పరిపాలనను, తీవ్రంగా ఖండించింది. మరణించిన లేదా గాయపడిన కుటుంబాలకు నష్టపరిహారాన్ని చెల్లించాలని, ఈ కమిటి ప్రభుత్వాన్ని కోరింది. ఈ కోర్కెలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. జలియన్ వాలాబాగ్ హింసాకాండ దేశాన్ని కదిలించివేసింది. జలియన్ వాలాబాగ్ ఊచకోత సంఘటన మహాత్మాగాంధీలో సంపూర్ణమైన మార్పును తెచ్చింది. ఈ సంఘటనే, మహాత్మాగాంధీ యొక్క సహాయ నిరాకరణోద్యమానికి కారణమైంది.

1919 డిసెంబర్ వరకు బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించాలనే గాంధీజీ భావించాడు. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ అనంతరం 1920 సెప్టెంబర్ లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి నాయకత్వం వహించాడు.

స్వాతంత్ర్యోద్యమంలో 1920 నుంచి స్వాతంత్ర్యం సిద్ధించే వరకూ జరిగిన ఉద్యమం గాంధీ నాయకత్వంలోనే జరిగింది. ఉద్యమంలో ఆయన అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకున్నారు. అహింస ఆశయం మాత్రమే కాదు ఆయుధం కూడా అని గాంధీ రుజువు పరిచారు. సత్య సాధనకు అహింస పరమ సాధనమనీ, భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించడం అంటే సత్యాన్ని సాధించుకోవడమే అని ప్రకటించారు. హింసకు అహింసకు జరిగే పోరాటంలో హింస చేసే దానికి సమాధానంగా అహింస అనుసరించడం ద్వారా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. సత్యాన్ని సాధించడానికి అహింసే ఆయుధంగా చేసే ప్రతిఘటనే సత్యాగ్రహం అని చెప్పిన గాంధీ ఆ సత్యాగ్రహాన్ని అనుసరిస్తూ భారత స్వాతంత్ర్యోద్యమాన్ని విజయ తీరాల వైపు నడిపించారు.

స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1948 సంవత్సరం జనవరి 30వ తేదీన గాంధీ గారు గాడ్సే కాల్పుల వల్ల మరణించారు.

గాంధీ అహింస, సత్యాగ్రహం అనే ఆయుధంతో స్వాతంత్ర్యం సాధించి యుద్ధానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించి మానవ ఇతిహాసంలో ఒక అద్వితీయ మూర్తిగా చరిత్రలో శాశ్వత స్థానాన్ని పొందారు.

## 12.6 సమీక్ష :

భారతదేశంలో అతివాద యుగంలో జరిగిన ఉద్యమాలను, ప్రజల చైతన్యాన్ని, స్వరాజ్య కాంక్షను చూసి ఆంగ్ల ప్రభుత్వం భీతిల్లింది. ఉద్యమాలను నిరంకుశంగా అణచివేసేందుకు 1919 లో రౌలత్ చట్టాన్ని చేసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో గాంధీ పాల్గొని భారత స్వాతంత్రోద్యమ తెరపై నాయకుడు గా ఆవిర్భవించారు. అంతకముందు దక్షిణాఫ్రికాలోనూ భారత దేశంలో జరిగిన చంపారన్, అహమ్మదాబాద్, ఖేడా లలో ఉద్యమాలకు నాయకత్వం వహించి అహింసా మార్గంలో ఉద్యమాలను నడిపి విజయం సాధించారు.

## 12.7 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 12.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. చంపారన్ సత్యాగ్రహం.

2. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ

**12.7.2 పది మార్కుల ప్రశ్నలు :**

1. గాంధీ జీవితాన్నివివరించి 1920 కంటే ముందు ఆయన చేపట్టిన ఉద్యమాలు వివరించండి.

**12.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు :**

1. గాంధీ ఏ కంపనీ తరుపున దక్షిణాఫ్రికా వెళ్ళారు.
2. చంపారన్ ఏ రాష్ట్రంలో వుంది.
3. రౌలత్ చట్టం ఎప్పుడు చేశారు.
4. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ ఎప్పుడు జరిగింది.
5. జలియన్ వాలాబాగ్ హత్యాకాండ కు కారకుడైన ఆంగ్లేయ సైనికాధికారి ఎవరు

**12.8 ఉపయుక్త గ్రంధాలు :**


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం – 13

# 1920 – 29 మధ్య స్వాతంత్రోద్యమం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన గాంధీ జీవితం, జాతీయోద్యమానికంటే ముందు ఆయన నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు, స్వాతంత్రోద్యంలో ఆయన ప్రవేశించేందుకు దోహదం చేసిన రౌలత్ చట్టం, జలియన్ వాలాబాగ్ సంఘటనలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

13.1 పరిచయం

13.2 హిందూ ముస్లింల సఖ్యత – ఖిలాఫత్ ఉద్యమం

13.3 సహాయ నిరాకరణోద్యమం

13.3.1 సహాయనిరాకరణ కార్యక్రమం

13.3.1.1 చీరాల పేరాల సత్యాగ్రహం

13.3.1.2 నిర్మాణాత్మక కార్యక్రమం

13.3.2 ప్రభుత్వ అణచివేత చర్యలు

13.3.3 చౌరీచౌరా సంఘటన

13.4 సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమం:

13.5 సమీక్ష

13.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

13.6 .1 ఐదు మార్కుల ప్రశ్నలు

13.6.2 పది మార్కుల ప్రశ్నలు

13.6.3 ఒక్క మార్కు ప్రశ్నలు

13.7 ఉపయుక్త గ్రంధాలు

## 13.1 పరిచయం :

1920వ సంవత్సరం నుంచి స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ సాగిన ఉద్యమం గాంధీజీ నాయకత్వంలో జరిగింది. ఈ కాలానికి గాంధి యుగం అని పేరు. ఈ ఉద్యమానికంటే ముందే గాంధీ నాయకత్వంలో కొన్ని ఉద్యమాలు విజయం సాధించాయి. ఈ ఉద్యమాల ఫలితంగా దేశవ్యాప్తంగా గాంధీ నాయకత్వం మీద విశ్వాసం వృద్ధి చెందింది. దీనితో 1920 వ సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమాన్ని చేపట్టే అధికారాన్ని గాంధీ కి అప్పజెప్పగా గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు.

గాంధీ నాయకత్వంలో మొదటగా దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమం సహాయ నిరాకరణోద్యమం.

## 13.2 హిందూ ముస్లింల సఖ్యత – ఖిలాఫత్ ఉద్యమం :

సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమయ్యే సమయానికి భారత దేశంలోని హిందూ ముస్లిం ల మధ్య సఖ్యత ఏర్పడింది. ఈ విధమైన సఖ్యత సాధించడంలో గాంధీ కీలకమైన పాత్ర పోషించగా సఖ్యతకు ఖిలాఫత్ ఉద్యమం దోహదం చేసింది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఇస్లామిక్ ఉద్యమం బలాన్ని పుంజుకుంది. మొదటి ప్రపంచ యుద్దంలో టర్కీ పరాజయంపట్ల అన్ని దేశాలలోని ముస్లింలు ఆందోళన చెందారు. టర్కీ సుల్తాన్ ఖలీఫా ముస్లిం మత వ్యవస్థకు అధినేత. అందువల్ల ప్రపంచంలోని ముస్లింలందరూ టర్కీ సుల్తాన్ ను గౌరవిస్తారు. మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ ఓడిపోయిన తర్వాత, బ్రిటన్ టర్కీ పట్ల ప్రవర్తించిన విధానానికి, భారతదేశంలోని ముస్లింలు తీవ్రంగా బాధపడ్డారు. వారిలో బ్రిటీష్ ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఏర్పడి అది అధికమైంది. మహమ్మదాలీ, సౌకతాలీ, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నాయకత్వంలో ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. సుల్తాన్ ప్రతిష్టను, గౌరవాన్ని పునరుద్ధరించడమే ఈ ఉద్యమ ఆశయం. ఖిలాఫత్ ఆందోళన సందర్భంగా గాంధీజీ, భారతదేశ రాజకీయాలలో ప్రముఖ పాత్రను పోషించారు. 1919 నవంబర్ నెలలో, మహాత్మాగాంధీ అధ్యక్షతన ఆలిండియా ఖిలాఫత్ సమావేశం జరిగింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, హిందూ–ముస్లిం సమైక్యతను సాధించి, సమష్టిగా స్వాతంత్ర్యోదమంలో పాల్గొనడానికి ఈ ఉద్యమం దోహదం చేస్తుందని గాంధీజీ భావించారు. ఖిలాఫత్ ఉద్యమానికి కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతునిస్తుందని ప్రకటించారు. హర్తాళ్లు, నిరసన సమావేశాలను సమష్టిగా నిర్వహించారు. దేశం వివిధ ప్రాంతాలలో హిందూ–ముస్లిం సమైక్యత స్పష్టంగా కనిపించింది. యుద్ధానంతరం టర్కీ భవిష్యత్తును గురించి గతంలో భారత ముస్లింలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం ఉల్లంఘించడాన్ని గాంధీజీ నిరసించాడు. ఖిలాఫత్ ఉద్యమంలో హిందువులను పాల్గొనమని కోరారు. ఈ విధంగా ఖిలాఫత్ ఉద్యమం భారత దేశంలో హిందూ ముస్లిం సమైఖ్యతకు దోహదం చేసింది.

## 13.3 సహాయ నిరాకరణోద్యమం :

1920వ సంవత్సరం సెప్టెంబర్ లో కలకత్తాలో కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం జరిగింది. లాలాలజపతిరాయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గాంధీ సహాయనిరాకరణ ఉద్యమ తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు. ఈ సమావేశంలో తీర్మానం ఆమోదింపబడింది. తర్వాత 1920 డిసెంబర్ లో నాగపూర్ లో విజయ రాఘవాచారి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశం సహాయ నిరాకరణోద్యమం తీర్మానాన్ని ధృవీకరించడంతో గాంధీ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

సహాయ నిరాకరణోద్యమంలో రెండు విధానాలను గాంధీ అనుసరించారు. అందులో

1. సహాయనిరాకరణ కార్యక్రమం.
2. నిర్మాణాత్మక కార్యక్రమం.

ఇందులో మొదటిది రాజకీయ రంగానికి సంబంధించినది కాగా, రెండవది సామాజిక రంగానికి సంబంధించినది.

### 13.3.1 సహాయనిరాకరణ కార్యక్రమం :

భారతదేశంలో ఆంగ్ల ప్రభుత్వం పరిపాలన చేయగలుగుతోంది అంటే అందుకు భారతీయులు సహకరిస్తూ ఉండడమే ప్రధాన కారణం కనుక వారికి సహాయ నిరాకరణ చేయడం ద్వారా ప్రభుత్వం దిగి వచ్చేలాగా చేయడమే సహాయ నిరాకరణ ప్రధానలక్ష్యం.

సహాయ నిరాకరణ కార్యక్రమాల్లో బహిష్కరణ ప్రధానమైన అంశం. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులను గౌరవ ఉద్యోగాలను త్యజించడం, ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు, దర్బారులకు, సన్మానాలకు హాజరు కాకుండా ఉండడం, విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలను బహిష్కరించి జాతీయ పాఠశాలలో చేరడం, ప్రభుత్వ న్యాయస్థానాలను బహిష్కరించి వాటి స్థానంలో స్వదేశీ న్యాయస్థానాలను ఏర్పరచడం, విదేశీ వస్త్రాలను వస్తువులను బహిష్కరించి ఖద్దరు వస్త్రాలు, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం , కొత్త శాసనసభ ఎన్నికలలో అభ్యర్థులు పోటీ చేయకుండా ఉండడంతో పాటు పోటీలో ఉన్న వారు ఉపసంహరించుకోవడం అనేవి సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా చేపట్టబడ్డాయి.

ఈ పిలుపుకు దేశవ్యాప్తంగా విశేషమైన స్పందన లభించింది. 24 మంది ప్రభుత్వం ఇచ్చిన బిరుదులను త్యజించారు. గాంధీ ప్రభుత్వం ఇచ్చిన కైజర్–ఇ–హింద్ అనే బిరుదును తిరిగి ఇచ్చివేశాడు. అనేక మంది ఉన్నతోద్యోగాలకు రాజీనామా చేశారు. ప్రధానంగా సుభాష్ చంద్రబోస్ సివిల్ సర్వీస్ కు ఎంపికై ఉద్యోగాన్ని వదులుకునడం అందుకు ఉదాహరణ. చిత్తరంజన్ దాస్, మోతిలాల్ నెహ్రూ, బాబు రాజేంద్ర ప్రసాద్, వల్లభాయ్ పటేల్, చక్రవర్తి రాజగోపాలాచారి, టంగుటూరి ప్రకాశం వంటి వారు న్యాయవాద వృత్తిని వదిలివేశారు. అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదిలివేయగా వారి కోసం దేశ వ్యాప్తంగా జాతీయ పాఠశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రధానంగా సహాయ నిరాకరణ ఉద్యమకాలంలో ఏర్పాటు చేయబడిన జాతీయ పాఠశాలలు, కళాశాలల్లో కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్, ఢిల్లీ జామియామిలియాలు ప్రధానమైనవిగా చెప్పుకోవచ్చు.

విదేశీ వస్తు వస్త్ర బహిష్కరణ భారీగా సాగింది. విదేశీ వస్త్రాలను, వస్తువులను అమ్మే దుకాణాల ముందు పికెటింగ్ చేయడమే కాకుండా విదేశీ వస్త్రాలను గుట్టలు గుట్టలుగా పోసి తగల పెట్టడం చేశారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్, పంజాబ్, ఆంధ్ర ప్రాంతంలో రైతులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం మానివేశారు. ఈ ఉద్యమ కాలంలో ఎన్నో సంఘటనలు, ఉద్యమాలు చోటు చేసుకున్నాయి. వాటిల్లో ఆంధ్రదేశంలో జరిగిన చీరాల పేరాల సంఘటన ప్రధానమైంది.

#### 13.3.1.1 చీరాల పేరాల సత్యాగ్రహం :

చీరాల పేరాల అనేవి బాపట్ల తాలూకాలో పక్కపక్కనే ఉన్న రెండు గ్రామాలు. 1921 వ సంవత్సరం నాటి జనాభా లెక్కల ప్రకారం ఈ రెండు గ్రామాల్లో దాదాపు 15 వేల జనాభా ఉండేది. ఈ రెండు గ్రామాలతోపాటు సమీపంలో ఉన్న

జాంద్రపేట, వీర రాఘవ పేట గ్రామాలను కలిపి చీరాల యూనియన్ హా ఏర్పాటు చేశారు. చీరాల యూనియన్ నుండి సంవత్సరానికి నాలుగు వేల రూపాయలు పన్నుల రూపంలో వసూలు అవుతూ ఉండేది. ఇది ఇలా ఉండగా 1919 వ సంవత్సరంలో మద్రాసు ప్రభుత్వం చీరాల–పేరాల గ్రామాలను కలిపి పురపాలక సంఘంగా ఏర్పాటు చేసింది. జాంద్రపేట, వీర రాఘవ పేట గ్రామాలను చీరాల యూనియన్ గానే కొనసాగించింది.

పురపాలక సంఘంగా ఏర్పడడంతో చీరాల పేరాల ప్రజలపై 40 వేల రూపాయల పన్నుల భారం పడింది. అయితే అందుకు తగ్గట్టుగా చీరాల పేరాలలో సౌకర్యాలను కూడా కల్పించలేదు. చీరాల పేరాలలోని ప్రజలలో అధికమంది నేతపనివారు కాగా మరికొంతమంది చిన్న చిన్న రైతులు.వారి ఆదాయం అంతంత మాత్రంగానే ఉండేది. కనుక వీరందరికీ, పురపాలక సంఘంగా మారిన తర్వాత విధించిన పన్నులు భారంగా కనిపించాయి. దీనితో ప్రజలు తమ చీరాల–పేరాల గ్రామాలను చీరాల యూనియన్ లోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరుతూ విజ్ఞాపన పత్రాలను సమర్పించారు. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జస్టిస్ పార్టీకి చెందిన రాజా రామరాయనింగారు 1921 వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో చీరాలను సందర్శించారు. ఈ సమయంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో ప్రజలు ముఖ్యమంత్రిని కలిసి పురపాలక సంఘాన్ని రద్దు చేయమని కోరారు. అయితే ముఖ్యమంత్రి ప్రజల కోరికను తిరస్కరించాడు.

పురపాలక సంఘాన్ని రద్దు చేయమని, పన్నులు తగ్గించమని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకపోవడంతో చీరాల పేరాల ప్రజలు పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు.

చీరాల పేరాల ఉద్యమానికి నాయకత్వం వహించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కృష్ణాజిల్లా నందిగామ తాలూకా లోని పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 సంవత్సరం జూన్ నెల 2వ తేదీన జన్మించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గోపాలకృష్ణయ్యను పినతండ్రి శివరామయ్య పెంచి పెద్దచేశారు. గోపాలకృష్ణయ్య కూచిపూడిలోనూ, గుంటూరులోనూ విద్యాభ్యాసం చేశారు. 1905 – 11 మధ్య కాలంలో జరిగిన వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న గోపాలకృష్ణయ్య మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత బాపట్లలోని తాలూకా ఆఫీస్ లో కొన్ని నెలల పాటు గుమాస్తాగా పని చేశారు. తరువాత గుంటూరులోని క్రైస్తవ మిషన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1911లో ఉన్నత విద్యకై ఇంగ్లండు వెళ్ళి ఎడింబరో విశ్వవిద్యాలయంలో చేరి 1916లో ఆర్థికశాస్త్రంలో ఎం ఏ హానర్స్ డిగ్రీ పుచ్చుకున్నారు. ఇంగ్లాండ్ లో ఉన్న సమయంలో ఎడింబరో ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేశారు. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత గోపాలకృష్ణయ్య రాజమండ్రిలోని ప్రభుత్వ ట్రైనింగ్ కాలేజీలో ఆచార్యుడిగా కొంతకాలం పనిచేశారు. తర్వాత మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ గా కొంతకాలం పని చేశారు. అనంతరం చీరాల వద్ద ఆంధ్ర విద్యాపీఠ గోష్ఠి అనే సంఘాన్ని గోపాలకృష్ణయ్య ప్రారంభించారు.

ఈ సమయంలోనే చీరాల–పేరాలను మున్సిపాలిటీగా మార్చడంతో పన్నుల నిరాకరణ ఉద్యమానికి ఆయన నాయకత్వం వహించారు.

చీరాల–పేరాల ప్రజలు పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి తమపై విధించిన పురపాలక పన్నులను కట్టకుండా తిరస్కరించారు. దీనితో 1921 వ సంవత్సరం మార్చి నెలలో పన్నులను చెల్లించేందుకు నిరాకరించిన 12 మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రజల అవసరాలు చూసేందుకు, ఉద్యమ కార్యాచరణను నిర్వహించేందుకు రామదండు అనే స్వచ్ఛంద సేవా దళాన్ని ఏర్పాటు చేశారు. రామదండు సైన్యం ఎర్ర చొక్కా,ఎర్రని తలగుడ్డ, ఎర్రని కుంకుమ బొట్టును ధరించేవారు. ఎర్ర చొక్కాల దళంగా గుర్తింపు పొందిన రామదండులో సుమారు వెయ్యి మంది వాలంటీర్లు ఉండేవారు.

ఇలా ఉండగా 1921 వ సంవత్సరం మార్చి నెల 31, ఏప్రిల్ 1 తేదీలలో విజయవాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహాత్మాగాంధీతో పాటు జవహర్ లాల్ నెహ్రూ, బాబు రాజేంద్రప్రసాద్, సరోజిని నాయుడు మోతీలాల్ లాల్ నెహ్రూ, మహమ్మదాలీ మొదలైన జాతీయ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశాలకు ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశాల్లోనే గాంధీ ఆదేశాల మేరకు తెలుగువాడైన పింగళి వెంకయ్య త్రివర్ణ పతాకాన్ని రూపొందించారు.విజయవాడలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రామదండు విశేషమైన కృషి చేసింది రామదండు సేవలను మహాత్మాగాంధీ ప్రశంసించారు.

విజయవాడ కాంగ్రెస్ సమావేశంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గాంధీజీ గారిని కలిసి చీరాల పేరాల పురపాలక సంఘం విశేషాలను వివరించారు. దీనితో గాంధీజీ ఏప్రిల్ 6వ తేదీన చీరాలను సందర్శించారు. పన్నుల నిరాకరణోద్యమాన్ని శాంతియుతంగా సాగించమని గాంధీజీ చీరాల–పేరాల ప్రజలకు ఉద్బోధించాడు. అవసరమైతే ప్రజలు తమ ఇళ్లను కూడా ఖాళీ చేసినట్లయితే పురపాలక సంఘం కనిపించకుండా పోతుందని గాంధీజి సలహా ఇచ్చారు.

ఈ సలహాను చీరాల–పేరాల ప్రజలు పాటించారు. 1921 వ సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీన అర్ధరాత్రి చీరాల–పేరాల ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేసి గ్రామ శివారులో రామనగర్ అనే పేరుతో గృహ సముదాయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 15,326 మంది గల మొత్తం జనాభాలో 13,752 మంది

గ్రామస్తులు తమ ఇళ్లను ఖాళీ చేసి రామ్ నగర్ లో నిర్మించుకున్న గుడిసెలలో నివాసం ఏర్పాటు చేసుకోవడం ఉద్యమ తీవ్రతకు నిదర్శనంగా చెప్పవచ్చు. తర్వాత 11 నెలల పాటు వారు రామనగర్ లోనే ఉండి పోయారు. రామనగర్ లో రామదండు సేవకులు ప్రజలకు అండగా నిలిచారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. పంచాయితీ ఏర్పడి న్యాయపాలన చక్కగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల సాంఘిక బహిష్కరణ పూర్తిగా అమలు జరిగింది. రామ నగర్ ప్రత్యామ్నాయ ప్రభుత్వం గురించిన వార్తలు దేశం మొత్తం వ్యాపించాయి.

ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. పోరంబోకు భూములలో గుడిసెలు వేసుకున్నారని ప్రజలపై కేసులుపెట్టింది. ప్రజలను ఆర్థికంగా ఇబ్బందుకు గురి చేసింది.

ఈ సమయంలో చీరాలను సందర్శించడానికి వచ్చిన గవర్నర్ ను పలకరించే దిక్కు లేకుండా పోయింది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన ఒక పత్రికా సంపాదకుడు– "చీరాలకు వెల్లింగ్టన్ గవర్నర్ కాదు గోపాలకృష్ణయ్య చీరాల గవర్నర్" అని పేర్కొనడం ఉద్యమ తీవ్రత కు నిదర్శనంగా చెప్పవచ్చు.

1921లో వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంకావడం, జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు అధికంగా కురవడం వంటి వాటివల్ల రామనగర్ లో ప్రజలు తీవ్రంగా ఇబ్బందుల పాలయ్యారు. అంతేకాకుండా ప్రజలు చీరాల–పేరాల లో తమ ఇళ్లను వదిలి రావడం వల్ల వారి వ్యాపారం కూడా దెబ్బతినింది. ఫలితంగా ఆర్థిక పరమైన సమస్యలు కూడా ఎదురయ్యాయి. కొందరు ఇచ్చిన విరాళాలతో ఉద్యమం కొంతకాలం సాగింది.

ఇలాంటి స్థితిలో 1921 సెప్టెంబర్ నెలలో బరంపురంలో జరిగిన ఆంధ్ర మహాసభ సమావేశానికి గోపాలకృష్ణయ్య హాజరయ్యారు. హాజరు కావడమే కాకుండా చందాలు వసూలు చేయాలని సంకల్పించారు. అయితే ప్రభుత్వం గోపాలకృష్ణయ్యను అరెస్టు చేసి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే నేరంపై విచారించి ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధించింది. దీనితో నాయకుడు లేని ప్రజలలో నైతిక బలం దెబ్బతినింది. అంతేకాకుండా గోపాలకృష్ణయ్య స్థానంలో నాయకత్వం వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీనితో ప్రజలు రామనగర్ నుంచి తిరిగి చీరాల పేరాల గ్రామాలకు చేరుకోవడం ప్రారంభించారు.

దీనితో 11 నెలల పాటు సాగిన ఉద్యమం ఆగిపోయింది. ఏమైనప్పటికీ చీరాల పేరాల వారు తమ అభిమతానికి వ్యతిరేకంగా పరాయి ప్రభుత్వం విధించిన మునిసిపాలిటీని 11 నెలల పాటు కొనసాగ నీయకుండా చేయడంలో విజయం సాధించి భారత స్వాతంత్రోద్యమం చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలారు.

ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా అనేకం జరిగాయి.

### 13.3.1.2 నిర్మాణాత్మక కార్యక్రమం :

సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో నిర్మాణాత్మక కార్యక్రమాల్లో భాగంగా రాట్నాలపై నూలు వడకడం, ఖద్దరు వస్త్రాలను ఉత్పత్తి చేయడం, అస్పృశ్యతను నిర్మూలించడం కల్లు తాగడం మాన్పించడం, హిందూ ముస్లింల మధ్య ఐక్యతను సాధించటం వంటి అనేక కార్యక్రమాలను గాంధీ చేపట్టారు. వీటన్నింటికీ కూడా విశేషమైన స్పందన లభించింది.

### 13.3.2 ప్రభుత్వ అణచివేత చర్యలు :

ఈ విధంగా సహాయ నిరాకరణ ఉద్యమ కార్యక్రమాలు ఉధృతంగా సాగగా, ప్రభుత్వం అణచివేత చర్యలను చేపట్టింది మోతిలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్, జవహర్ లాల్ నెహ్రూ, ఆలీ సోదరులు వంటి 30 వేల మంది ఉద్యమకారులను ప్రభుత్వం నిర్బంధించి జైళ్లలో పెట్టింది.

### 13.3.3 చౌరీచౌరా సంఘటన :

ఈ రకంగా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే గోరఖ్ పూర్ జిల్లాలో ఉన్న చౌరీచౌరా లో 1922 వ సంవత్సరం ఫిబ్రవరి ఐదవ తేదీన ఊరేగింపు చేస్తున్న ప్రజల పైన పోలీసులు కాల్పులు జరిపారు.

దీనితో ఆగ్రహానికి లోనైన ప్రజలు పోలీసులుపై తిరగబడ్డారు. పోలీసులు పారిపోయి పోలీస్ స్టేషన్లో తలదాచుకున్నారు. రెచ్చిపోయిన ఉద్యమకారులు పోలీస్ స్టేషన్ కు నిప్పు పెట్టడంతో 22 మంది పోలీసులు సజీవదహనమయ్యారు.

ఈ రకంగా అహింసాయుతంగా సాగుతున్న ఉద్యమంలో హింస చోటుచేసుకోవడం గాంధీజీని తీవ్రంగా కలిచివేసింది. దీనితో అహింసాయుత ఉద్యమానికి ప్రజలు ఇంకా సన్నద్ధం కాలేదు అని భావించిన గాంధీ 1922 సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన ఉద్యమాన్ని నిలిపివేసి ఈ సంఘటనకు ప్రాయశ్చిత్తంగా ఐదు రోజులు నిరాహార దీక్ష చేపట్టారు.

గాంధీ ఉద్యమాన్ని నిలిపివేయడం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదించింది కానీ అనేక మంది నాయకులు ప్రధానంగా చిత్తరంజన్ దాస్, మోతిలాల్ నెహ్రూ, లాలా లజపతి రాయ్, సుభాష్ చంద్రబోస్ మొదలైనటువంటి వారు వ్యతిరేకించారు. దీనిని ఆసరాగా తీసుకుని ప్రభుత్వం గాంధీని అరెస్టు చేసే కారాగార శిక్ష విధించింది.

## 13.4 సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమం :

1919 మాంటేగు, చెమ్స్ ఫర్డ్ రాజ్యాంగ సంస్కరణ చట్టం చేసిన సమయంలో తదుపరి 10 సంవత్సరముల తరువాత ఇంకా రాజ్యాంగసంస్కరణలు చేయవలసిన అవసరం ఉంటుందేమోనని, అప్పుడు నిర్ణయిస్తామని బ్రిటిష్ పార్లమెంటులో ప్రకటించబడింది. దీని ప్రకారం 1927 వ సంవత్సరం నవంబరు 8వ తేదీన జాన్ సైమన్ అధ్యక్షతన ఇంగ్లాండ్ ప్రభుత్వం ఒక కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కు జాన్ సైమన్ అధ్యక్షుడు కావడం వల్ల దీనికి సైమన్ కమిషన్ అని పేరు వచ్చింది. సైమన్ కమిషన్ నే వైట్ కమిషన్ అని కూడా అంటారు. ఇందులో ఒక అధ్యక్షుడు, ఆరు మంది సభ్యులు నియమింపబడ్డారు. వీరంతా బ్రిటన్ దేశానికి చెందినవారే. జాన్ సైమన్ అధ్యక్షుడు కాగా క్లెమెంట్ అట్లీ, హ్యారీ లెవీలాసన్, ఎడ్వర్డ్ కెడొగన్, వెర్నాన్ హట్సన్, జార్జి లెనాక్స్, డొనాల్డ్ హోవార్డులు సభ్యులు. ఒక్కరు కూడా ఈ కమిషన్ లో భారతీయులు లేరు. 1919 భారత ప్రభుత్వ చట్టం ఏ విధంగా అమలు అవుతోంది, నూతన రాజ్యాంగ సంస్కరణలు ఎలా ఉండాలి అనే విషయాలను తెలుసుకొని నివేదిక సమర్పించడం సైమన్ కమీషన్ ప్రధాన విధి అని చెప్పినప్పటికీ భారతదేశానికి స్వతంత్ర పరిపాలన ఇచ్చే అవకాశం లేదు అని చెప్పే ఉద్దేశ్యంతోనూ, స్వతంత్ర పరిపాలన ఇవ్వకుండా కాలయాపన చేసేందుకు, భారతీయులకు కన్నీటి తుడుపు చర్యగా సైమన్ కమీషన్ ను ఆంగ్లేయ ప్రభుత్వం నియమించింది.

వాస్తవానికి బ్రిటిష్ వారి వలస రాజ్యాలలోకెల్లా భారతదేశం అమూల్యమైన ఆభరణ మనీ గతంలో బెంగాల్ గవర్నర్ రాబర్ట్ క్లైవ్ పేర్కొనడం, అలాగే 1905 సంవత్సరంలో వైస్రాయ్ కర్జన్

అదే అభిప్రాయాన్ని వెల్లడించడంతో భారతదేశాన్ని వదులుకొనడం ఇష్టం లేని ఆంగ్లేయులు భారతీయులకు స్వపరిపాలన చేసుకునే శక్తి లేదు అని చెప్పడం కోసం సైమన్ కమీషన్ ను ఏర్పాటు చేశారు.

సైమన్ కమిషన్ లో భారతీయులు ఎవరూ సభ్యులుగా లేకపోవడంతో 1927 వ సంవత్సరంలో మద్రాసు లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభ సైమన్ కమిషన్ ను బహిష్కరించాలని తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని హిందూ మహాసభ, మహమ్మద్ ఆలీ జిన్నా నాయకత్వంలోని ముస్లింలీగ్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి

పార్టీలు కూడా సమర్ధించాయి. 1927 డిసెంబర్ లో కలకత్తాలో మహమ్మద్ యాకుబ్ అధ్యక్షతన జరిగిన ముస్లిం లీగ్ సమావేశం సైమన్ కమిషన్ బాయ్ కాట్ కు తీర్మానం చేసింది.

దీనితో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చిన సమయంలో బహిష్కరణ ఉద్యమం జరపాలని సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా ప్రతి ఊరిలో ధర్నాలు, నల్లజెండాలతో ప్రదర్శనలను చేయాలని తీర్మానించారు. ఈ కమిషన్ భారతదేశానికి వచ్చిన సమయంలో ఇర్విన్ వైస్రాయిగా ఉండేవాడు.

సైమన్ కమీషన్ భారతదేశానికి 1928 వ సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన వచ్చింది. ఈ కమిషన్ సభ్యులు బొంబాయిలో నౌక దిగిన రోజు అంటే 1928 వ సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాలతోపాటు అనేక ప్రాంతాలలో కమిషన్ కు వ్యతిరేకంగా ధర్నాలు, నల్లజెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు.

సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమంలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాలలో జరిగిన ఉద్యమానికి కాంగ్రెస్ ప్రధాన నాయకులు అనేకమంది నాయకత్వం వహించారు.

లాహోర్ లో జరిగిన వ్యతిరేక ఉద్యమానికి లాలాలజపతిరాయ్, లక్నోలో జరిగిన ఉద్యమానికి మోతిలాల్ నెహ్రూ, అలహాబాద్ లో జరిగిన ఉద్యమానికి జవహర్ లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంతులు, మద్రాసులో జరిగిన ఉద్యమానికి టంగుటూరి ప్రకాశం పంతులు,

ఆంధ్రప్రాంతంలో బులుసు సాంబమూర్తి, విజయవాడలో అయ్యదేవర కాళేశ్వరరావు ల నాయకత్వంలో సైమన్ వ్యతిరేక ఉద్యమాలు నడిచాయి.

సైమన్ కమీషన్ కొన్ని నగరాలను సందర్శించింది. సైమన్ కమీషన్ వివిధ నగరాలు పట్టణాలు సందర్శించిన సమయంలో సైమన్ కమిషన్ కు "సైమన్ గో బ్యాక్" ,"సైమన్ వెనక్కి వెళ్ళిపో" ఇండియా ఈజ్ ఫర్ ఇండియన్స్, భారతదేశం భారతీయులకే అనే నినాదాలు వినిపించాయి. నల్ల జెండాలు, నిరసన ప్రదర్శనలు సైమన్ కమిషన్ సభ్యులకు ఎదురయ్యాయి.

పంజాబ్ లో జరిగిన సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమానికి లాలాలజపతిరాయ్ నాయకత్వం వహించారు. సైమన్ కమిషన్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన లాలాలజపతిరాయ్ సైమన్ కమీషన్ ను బహిష్కరించాలన్నతీర్మానాన్ని పంజాబ్ శాసనసభలో ప్రవేశ పెట్టారు. సైమన్ కమీషన్ సభ్యులు 1928వ సంవత్సరం అక్టోబర్ 30వ తేదీన లాహోర్ లో పర్యటించారు. ఈ సమయంలో లాలాలజపతిరాయ్ నాయకత్వంలో సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాకుండా ప్రదర్శన చేస్తున్న వారి పైన లాఠీఛార్జి చేశారు. పోలీస్ అధికారి అయిన సాండర్స్ లాఠీతో లాలాలజపతిరాయ్ ని తీవ్రంగా కొట్టాడు. ఈ లాఠీచార్జిలో లాలాలజపతిరాయ్ తలకు గాయమైంది. అయినా లాలాలజపతిరాయ్ ఏమాత్రం వెనుకాడకుండా నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. తర్వాత జరిగిన బహిరంగ సభలో "సైమన్ గోబ్యాక్....నాకు తగిలిన ప్రతి లాఠీదెబ్బ బ్రిటిష్ సామ్రాజ్య శవపేటిక కు ఒక శిల

వంటిది" అంటూ ప్రసంగించారు. లాలాలజపతిరాయ్ లాఠీ దెబ్బల నుంచి కోలుకోలేక జబ్బు పడి చివరకు 1928 వ సంవత్సరం నవంబర్ 17 వ తేదీన మరణించారు. తర్వాత లాలాలజపతిరాయ్ మరణానికి కారకుడైన సాండర్స్ పై ప్రతీకార చర్య చేస్తామని ప్రతిజ్ఞ చేసిన భగత్ సింగ్ 1928 డిసెంబర్ నెలలో సాండర్స్ ను హత్య చేశాడు.

లాహోర్ లో జరిగిన ఈ సంఘటన భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో ప్రముఖ సంఘటనగా మిగిలింది.

సైమన్ కమిషన్ అలహాబాద్, లక్నో నగరాలను సందర్శించిన సందర్భంలో కూడా ఇదే విధంగా నిరసనలే సైమన్ కమిషన్ కు ఎదురయ్యాయి.

ఉత్తర భారతదేశం తోపాటు దక్షిణ భారతదేశంలో కూడా సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం తీవ్రంగా జరిగింది. తిరుపతి, కర్నూలు, విజయవాడ, ఏలూరు, శ్రీకాకుళం, గుంటూరు, ఒంగోలు పురపాలక సంఘాలు సైమన్ కమిషను బహిష్కరించాలని తీర్మానం చేశాయి.

అందుకనుగుణంగా 1928 ఫిబ్రవరి మూడవ తేదీన ఆంధ్ర ప్రాంతంలోని అన్ని పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఆంధ్ర దేశంలో గుంటూరు, ఒంగోలు పట్టణాలను సైమన్ కమిషన్ సందర్శించేందుకు నిర్ణయించారు. టంగుటూరి ప్రకాశం పంతులు. రామదాసు. పీవీ జోగయ్య వంటి జాతీయ నాయకులు సైమన్ కమిషన్ ను బహిష్కరించాలని ఆంధ్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

సైమన్ కమిషన్ బృందం గుంటూరు వెడుతూ విజయవాడ రైల్వే స్టేషన్ లో ఆగి ఉన్న సమయంలో పురపాలక సంఘ బహిష్కరణ తీర్మానాన్ని కలిగి ఉన్న ఒక కవర్ ను, సైమన్ గో బ్యాక్ అని రాసి ఉన్న ఒక కాగితాన్ని మున్సిపాలిటీకి చెందిన ఉద్యోగి సైమన్ కు అందజేశాడు. కమిషన్ కు గుంటూరు, ఒంగోలు పట్టణాల్లో నల్లజెండాలు ఎదురయ్యాయి.

సైమన్ కమిషన్ 1928 సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీన మద్రాసు నగరాన్ని సందర్శించడానికి నిర్ణయించుకుంది. అందువల్ల మద్రాస్ నగరంలో రాజకీయ ప్రచారాలు ఏవీ చేపట్టకూడదని మద్రాస్ చీఫ్ ప్రిసైడింగ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. మద్రాసులోని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించడానికి నిర్ణయించింది.

మద్రాసులో సైమన్ కమిషన్ ఉన్నన్ని రోజులు పూర్తిగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు కాంగ్రెస్ నిర్వహించింది. ముందుగానే టంగుటూరి ప్రకాశం పంతులు గారు మద్రాస్ నగరంలో సైమన్ కమిషన్ ను వ్యతిరేకించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో మద్రాసులో సైమన్ వ్యతిరేక ఉద్యమం తీవ్రంగా జరిగింది. మద్రాసులో సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా అక్కడ అక్కడ కొన్ని అలజడులు కూడా చెలరేగాయి. సైమన్ కమిషన్ వ్యతిరేకంగా జరిగిన అలజడిలో పోలీసులు కాల్పులు కూడా జరిపారు. పోలీసు కాల్పుల్లో ఒక వ్యక్తి మరణించాడు. మరణించిన వ్యక్తిని చూసేందుకు టంగుటూరి ప్రకాశం పంతులు తన అనుచరులతో బయలుదేరారు. అయితే మార్గ మధ్యంలో పోలీసులు టంగుటూరి

ప్రకాశం పంతులు గారిని అడ్డుకున్నారు. ప్రకాశం పంతులు వెనుకకు తగ్గకపోవడంతో పోలీసులు తుపాకులను ఎక్కుపెట్టారు.

దీనితో రెచ్చిపోయిన టంగుటూరి ప్రకాశం పంతులు చొక్కా గుండీలు విప్పి గుండె చూపిస్తూ –

"మేము ముందుకు సాగిపోయి మా సోదరుడి శవాన్ని చూడడానికే నిర్ణయించాం... కావాలంటే నన్ను కాల్చుకోండి" అని గర్జించాడు.

దీనితో పోలీసులు వెనక్కు జరిగి టంగుటూరి ప్రకాశం పంతులు గారిని ముందుకు సాగనిచ్చారు. ఇలా ధైర్యసాహసాలు ప్రదర్శించిన టంగుటూరి ప్రకాశం పంతులు గారిని ప్రజలు "ఆంధ్రకేసరి" అని కీర్తించారు.

ఈ విధంగా సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం భారతదేశంలో అత్యంత తీవ్రంగా జరిగింది. చివరికి 1930వ సంవత్సరం మే నెలలో సైమన్ కమిషన్ నివేదిక సమర్పించింది. ఏమైనప్పటికీ భారతీయులకు సైమన్ కమిషన్ వల్ల ఒరిగిందేమీ లేకపోయినా అనిబిసెంట్ అన్నట్లు – "సైమన్ కమిషన్ నియామకం పుండుపైన కారం చల్లి నట్లు ఉంది" అన్న మాటలు వాస్తవం.

సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమం సామాన్యున్ని సైతం ఆకర్షించి భవిష్యత్తు లో జరిగే ఉద్యమాలకు ప్రజలను సమాయాత్తం చేసిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 13.5 సమీక్ష :

1920 వ సంవత్సరంలో స్వాతంత్ర్యం కోసం ఉద్యమాన్ని నడిపే బాధ్యతను గాంధీ కి కాంగ్రెస్ అప్పగించగా ఆయన సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు. అహింసా మార్గంలో సాగిన ఈ ఉద్యమంలో ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేయడం, నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టడం అనే కార్యక్రమాలను నిర్వహించారు. అయితే చౌరీ చౌరా లో హింసాత్మక సంఘటన జరగడంతో నిలిపివేశారు. తర్వాత 1919 చట్టం అమలును గురించి ఏర్పాటు చేసిన సైమన్ కమీషన్ ను కూడా బహిష్కరిస్తూ ఉద్యమం సాగింది.

## 13.6 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 13.6.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. ఖిలాఫత్ ఉద్యమం
2. చీరాల పేరాల ఉద్యమం

### 13.6.2 పది మార్కుల ప్రశ్నలు :

1. గాంధీ నాయకత్వంలోజరిగిన సహాయనిరాకరాణ ఉద్యమాన్ని గురించి రాయండి.
2. సైమన్ కమీషన్ వ్యతిరేకోద్యమాన్ని వివరించండి.

### 13.6.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. సహాయనిరాకరణోద్యమ తీర్మానాన్ని ఏ కాంగ్రెస్ సమావేశంలో ఆమోదించారు.
2. సహాయనిరాకరణోద్యమ కాలంలో ఐ సి ఎస్ ఉద్యోగాన్ని వదిలివేసిన నాయకుడు ఎవరు.
3. సైమన్ కమీషన్ ఎప్పుడు ఏర్పడింది..
4. సైమన్ కమీషన్ వ్యతిరేక ఉద్యమానికి పంజాబ్ లో నాయకత్వం వహించింది ఎవరు.
5. ఆంధ్రకేసరి అనే బిరుదు ఎవరికీ వుంది.

### 13.7 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం –14
# శాసనోల్లంఘన ఉద్యమం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమంలో భాగంగా సాగిన శాసనోల్లంఘన ఉద్యమాన్ని గురించి, ఈ సమయంలో జరిగిన గాంధీ ఇర్విన్ ఒప్పందం, రౌండ్ టేబుల్ సమావేశాలను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


14.1 పరిచయం

14.2 శాసనోల్లంఘనోద్యమం

14.3 లాహోర్ కాంగ్రెస్

14.4 ఉప్పు సత్యాగ్రహం – దండి యాత్ర

14.4.1 ఉద్యమ అణచివేత చర్యలు

14.5 మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

14.6 గాంధీ–ఇర్విన్ ఒప్పందం 1931

14.7 రెండవ రౌండ్ టేబుల్ సమావేశం

14.8 మూడవ రౌండ్ టేబుల్ సమావేశం

14.9 శాసనోల్లంఘన ఉద్యమం రెండవ దశ

14.9.1 ఉద్యమ అణచివేత చర్యలు

14.9.2 శాసనోల్లంఘనోద్యమ ముగింపు

14.10 సమీక్ష

14.11 పరీక్ష నమూనా ప్రశ్నలు

14.11.1 ఐదు మార్కుల ప్రశ్నలు

14.11 .2 పది మార్కుల ప్రశ్నలు

14.11 .3 ఒక్క మార్కు ప్రశ్నలు

14.12 ఉపయుక్త గ్రంధాలు

## 14.1 పరిచయం :

భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో 1930లో ప్రారంభమైన శాసనోల్లంఘనోద్యమం ఒక ప్రధాన ఘట్టం. దీనికే ఉప్పుసత్యాగ్రహం అని పేరు. 1929 లాహోర్ కాంగ్రెస్ శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించాలని తీర్మానించింది. గాంధీజీ నాయకత్వంలో జరిగిన ఉద్యమాల్లో ప్రధానమైన ఈ ఉద్యమం లో ప్రజలు దేశవ్యాప్తంగా ఉధృతంగా పాల్గొన్నారు.

## 14.2 శాసనోల్లంఘనోద్యమం :

శాసనోల్లంఘనోద్యమం నిర్వహించడానికి 1929 లో లాహోర్ లో జరిగిన కాంగ్రెస్ సమావేశం తీర్మానించింది.

## 14.3 లాహోర్ కాంగ్రెస్ :

1929వ సంవత్సరం డిసెంబర్ 29వ తేదీన అఖిల భారత కాంగ్రెస్ సమావేశం లాహోర్ లో జరిగింది. ఈ సమావేశానికి యువకుడైన జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షత వహించాడు. కాంగ్రెస్ సభ్యులు కేంద్ర, రాష్ట్ర శాసనసభల నుంచి రాజీనామా చేయాలని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ రానున్న ఎన్నికలలో పాల్గొనకూడదని స్పష్టం చేయబడింది. కాంగ్రెస్ వాదులు నిర్మాణాత్మక కార్యక్రమాలలో పాల్గొంటూ, అవసరమనుకున్నప్పుడు ఏ క్షణంలోనైనా పన్నుల నిరాకరణతో సహా ఎలాంటి శాసనోల్లంఘన ఉద్యమానికైనా సంసిద్ధులు కావలని పిలుపునిచ్చారు. సంపూర్ణ స్వరాజ్యమే లక్ష్యంగా ఉద్యమం జరగాలని తీర్మానించారు. అందుకు ప్రతిసంవత్సరం జనవరి 26 వ తేదినాడు సంపూర్ణ స్వరాజ్య దినాన్ని జరుపుకోవాలని నిర్ణయించారు. శాసనోల్లంఘనోద్యమాన్ని నిర్వహించడానికి, నాయకత్వం వహించడానికి అంగీకరించిన గాంధీ హింసాయుత చర్యలు పునరావృతం కాకుండా యువశక్తిని అహింసాయుతం నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలని కోరుతూ తీర్మానం చేయించారు.

లాహోర్ కాంగ్రెస్ పిలుపు మేరకు కాంగ్రెస్ సభ్యులు తమ శాసనసభా సభ్యత్వాలకు రాజీనామా చేసారు. 1930 జనవరి 26 వ తేదినాడు సంపూర్ణ స్వరాజ్య దినాన్ని దేశమంతటా ఉత్సాహంగా జరిపారు. దీనితో పెక్కుమంది నిర్బందింపబడి, శిక్షలకు గురయ్యారు.

## 14.4 ఉప్పు సత్యాగ్రహం – దండి యాత్ర :

గాంధీ శాసనోల్లంఘన ఉద్యమం లో గుజరాత్ పశ్చిమ కోస్తాలో వున్న 'దండి' గ్రామంలో ఉప్పు తయారు చేసి శాసన ఉల్లంఘన చేయాలని నిర్ణయించారు. ఈ విషయం వైస్రాయి కి తెలిపి, సంభాషణలకు రాగలనని తెలిపారు. గాంధీ చర్య చట్టవిరుద్ధమే కాక, శాంతి భద్రతలకు ముప్పుగా పరిణమించగలదన వ్యాఖ్యానిస్తూ వైస్రాయి సంప్రదింపులను నిరాకరించాడు.

1930 మార్చి 12వ తేదీన గాంధీ 72 మంది అనుచరులతో సబర్మతి ఆశ్రమం నుంచి రెండు వందలా నలభై ల మైళ్ళ దూరంలో వున్న 'దండి'కి, కాలినడకన బయలుదేరారు. వేలాది గ్రామస్తులు, దారిపొడవునా ఘన స్వాగతం పలికారు. ఏప్రిల్ 5వ తేదీన దండి చేరిన గాంధీ, మరునాడు అంటే 1930 వ సంవత్సరం ఏప్రిల్ 6 వ తేదిన సముద్రతీరంలో ఉప్పు ను తయారుచేసి శాసనాలను ఉల్లంఘించారు.

దేశవ్యాప్తంగా సముద్ర తీరాల్లో నాయకులు, ప్రజలు శాసనాలను ఉల్లంఘించి ఉప్పు తయారు చేయడం ద్వారా

శాసనోల్లంఘన ఉద్యమాన్ని నిర్వహించారు.

ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్రాలు, వస్తువుల బహిష్కరణ విస్తృతంగా జరిగింది. అనేక ప్రాంతాలలో భూమిశిస్తు, తదితర పన్నుల చెల్లింపు నిరాకరణోద్యమం ప్రారంభమైంది. ఉత్తర సరిహద్దు రాష్ట్రంలో గాంధీగా ప్రసిద్ధిచెందిన అబ్దుల గఫార్ ఖాన్ అహింసాయుత ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించాడు. కొద్దికాలంలోనే, శాసనోల్లంఘనోద్యమం ఊపందుకుంది.

సూరత్ జిల్లాలోని దరసన వద్ద ఉప్పు కొటారు వశం చేసుకోగలనని గాంధీ ప్రకటించారు. దీనితో గాంధీ అక్కడకు బయలుదేరకముందే అరెస్ట్ చేశారు. దీనితో గుజరాత్ లోని పలువివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు దరసనకు చేరుకొని ఉప్పు కొటారులపై దాడి చేశారు. ఈ ప్రజలను పోలీసులు అమానుషంగా కొట్టి, జైలులో వేసారు. 1930 ఏప్రిల్ నెలలో పికెటింగ్ లు చేయడం, నూలు వడకడం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టామని గాంధీ మహిళలను కోరారు. వారి కోర్కెను మన్నించి వేలాది మహిళలు ఉద్యమంలో పాల్గొన్నారు. అనేక మంది మహిళలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. అయ్యారు.

### 14.4.1 ఉద్యమ అణచివేత చర్యలు :

ఈ ఉద్యమాన్ని అణచి వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తూ, ప్రభుత్వం ఆర్డినెన్స్ ల ద్వారా నిరంకుశ అధికారాలను పొందింది. అత్యవసర పత్రికా చట్టంచేసి, 1930లో ధరావత్తు చెల్లింపలేదని తొమ్మిది పత్రికల ప్రచురణను నిలిపివేశారు. దేశం నలుమూలలా ఎంతోమంది ప్రజలు నిర్బంధింపబడ్డారు. దొంగతనం, దోపిడీ వంటి దొంగ కేసులను ప్రజలపై పెట్టారు. సుమారు 15వేల మంది జైలుకు వెళ్ళారు. నెహ్రూతో సహా కాంగ్రెస్ నాయకులు నిర్బంధింపబడ్డారు. 1930 మే నెల 4వ తేదీన గాంధీని అరెస్ట్ చేసారు.

## 14.5 మొదటి రౌండ్ టేబుల్ సమావేశం :

నూతన రాజ్యాంగం ప్రకారం వీలున్నంత వీలైనమేరకు సమ్మేళన రాజ్యాంగం రూపొందించి, రాష్ట్రాలకు శాంతి భద్రతలతో సహా అన్ని అధికారాలలో స్వయంపాలన ఇవ్వాలని, గవర్నర్ కు శాసనసభ చేసే శాసనాలను రద్దుచేసే అధికారాలు ఇవ్వాలని, రాష్ట్ర శాసన మండలులను విస్తృతం చేయాలని కాబినెట్ మంత్రులను గవర్నర్ జనరల్ ఎన్నికచేసి నియమించాలని భారతదేశంలో ఐరోపా అధికారాలు, సైనికులు దీర్ఘకాలం ఉండవలసిన ఆవశ్యకత వుందని ... ఇలాంటి ప్రతిపాదనలతో 1930 జూన్ నెలలో సైమన్ సంఘ నివేదిక సమర్పించింది. వీటన్నింటినీ చర్చించేందుకు మొదటి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఇంగ్లాండ్ ప్రభుత్వం ఏర్పాటు చేసి కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీలు, నాయకులను ఆహ్వానించింది. కాంగ్రెస్ హాజరు కావడానికి నిరాకరించింది. కాగా అంబేద్కర్ ఈ సమావేశానికి హాజరై నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలని కోరారు. 1931 జనవరిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మొదటి రౌండ్ టేబుల్ సమావేశం, దాని నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది.

## 14.6 గాంధీ-ఇర్విన్ ఒప్పందం 1931 :

మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు గాంధీ, కాంగ్రెస్ తమ బహిష్కరణ విధానాన్ని వదిలి

వైస్రాయిని కలవాలని కోరారు. అందుకు అంగీకరించి గాంధీ 1931 ఫిబ్రవరిలో వైస్రాయి ఇర్విన్ ను కలిశారు. వైస్రాయి తో చర్చలు జరిపే అంధకారాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గాంధీకి ఇచ్చింది. చర్చలు జరిగి చివరకు ఒక ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం పై 1931 మార్చి 5 వతేదిన ఇరువురు సంతకాలు చేసారు. ఈ ఒప్పందం ప్రకారం –

1. శాసనోల్లంఘనోద్యమం నిలుపుదల చేయబడుతుంది.
2. రాజ్యాంగ విషయాల గురించి చర్చించేందుకు మరో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొంటారు.
3. ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులన్నింటిని ఉపసంహరించుకుంటుంది.
4. అత్యవసర శాసనాలను రద్దుచేయడానికి ప్రభుత్వం అంగీకరించింది.
5. శాసనాలను ధిక్కరించకుండా విదేశీ వస్తువులు బహిష్కరణ, శాంతియుత పికెటింగ్ లు వంటివి చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది.
6. సముద్రతీరం లో నివశిస్తున్న ప్రజలు తమ ఉపయోగానికి ఉప్పు తయారు చేసుకోవచ్చు. కాని అమ్మకానికి చేయకూడదు.

ఈ విధంగా గాంధీ ఇర్విన్ ఒప్పందం కుదిరిన తర్వాత ఉప్పు సత్యాగ్రహం తాత్కాలికంగా నిలుపుదల చేసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావడానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ ఒప్పందం వల్ల ఆంగ్ల ప్రభుత్వం బారత జాతీయ కాంగ్రెస్ ను తమ రాజకీయ ప్రత్యర్థిగా గుర్తించినట్లు అయింది.

తర్వాత కరాచీలోజరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీ–ఇర్విన్ ఒప్పందాన్ని గురించి చర్చించి ఆమోదించడంతో పాటు ఈ ఒప్పందం వల్ల పూర్ణ స్వరాజ్య లక్ష్యాన్ని కాంగ్రెస్ వదిలిపెట్టదు అని ప్రకటించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధిగా గాంధీ ని పంపాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది.

ఈలోగా వైశ్రాయి గా ఇర్విన్ స్థానంలో వచ్చిన వెల్లింగ్టన్ గాంధీ–ఇర్విన్ ఒప్పందంలోని షరతులను లెక్కచేయక అణచివేత పద్ధతులను కొనసాగించాడు. దీనితో గాంధీ తాము రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు లండన్ వెళ్ళడంలేదని ప్రకటించినాడుచారు. దీనితో గాంధి వైస్రాయిల మధ్య సమావేశం జరిగి వైస్రాయి కాంగ్రెస్ చేసిన ఫిర్యాదులను విచారిస్తామని హామీ ఇచ్చాడు. గాంధీ రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు అంగీకరించారు.

## 14.7 రెండవ రౌండ్ టేబుల్ సమావేశం :

1931 సెప్టెంబర్ నెలలో లండన్ లో ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రతినిధిగా గాంధీగారు సమావేశంలో

పాల్గొన్నారు. ఆయన లండన్ నగర సందర్శన, వివిధ వర్గాల ప్రజలలో సంచలనం కల్గించింది. శాంతి, సుహృద్భావాల ఆవశ్యకతలను వివరిస్తూ, వారు పెక్కు ఉపన్యాసాలు చేసి భారత స్వాతంత్ర్య పోరాటానికి ఆంగ్ల ప్రజల మద్దతును, సానుభూతిని కోరారు. ఇందులో ఇంగ్లాండ్ ప్రధాని మాక్ డొనాల్డ్ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కేంద్రంలోను, రాష్ట్రాలలోను తక్షణమే బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు చేయాలని గాంధీ కోరడంతో పాటు భారత జాతికి ప్రాతినిధ్యం వహింపగల ఏకైక సంస్థ కాంగ్రెస్ మాత్రమే" అని పేర్కొన్నారు. మత ప్రాతినిధ్యంపై చర్చ జరిగింది. అయినా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం రూపొందించలేకపోయారు. నిమ్నజాతులకు శాసనసభలలో కొన్ని స్థానాలు ప్రత్యేకంగా కేటాయించాలని డాక్టర్ అంబేద్కర్ ప్రతిపాదించారు. గాంధీ దీనికి అంగీకరించలేదు. రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడింది. రాజ్యాంగ రచన అనే ముఖ్య సమస్యను వదిలి, అల్పసంఖ్యాక ప్రాతినిధ్య సమస్యను చర్చించడం మంచిది కాదని గాంధీ వాదించారు. రెండో రౌండ్ టేబుల్ సమావేశం సమైక్య రాజ్యాంగ శాసనాధికారాలకు, న్యాయాధికారాలకు తుదిరూపమిచ్చింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ జరిగింది. సమాఖ్య రాజ్యంలో సంస్థానాలు చేరే పద్ధతికూడా వివరింపబడింది. అంతకు మించి ఎట్టి రాజ్యాంగ ప్రగతి సాధింపబడలేదు. ఫలితంగా రెండవ రౌండ్ టేబుల్ సమావేశం విఫలమైంది.

## 14.8 మూడవ రౌండ్ టేబుల్ సమావేశం :

1932 నవంబర్ లో మూడవ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. ఈ సమావేసంలో ప్రధానంగా ఓటింగ్ అర్హత, సమాఖ్య విధులు వంటి అంశాలను గురించి చర్చించారు.,. మహిళలకు ఓటింగ్ హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యులు సమాఖ్య ఎగువ సభ ప్రతినిధులను ఎన్నుకోవడం వంటివి ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు. అయితే అప్పటికీకే, సంస్థానాధిపతులకు సమాఖ్య రాజ్యం పట్ల సానుభూతి తగ్గిపోయింది. 1932 లో మూడవ రౌండ్ టేబుల్ సమావేశం ముగిసేటప్పటికి రాజ్యాంగం పట్ల భారతదేశ ప్రజలలో ఇంతకు ముందున్న ఆసక్తి క్షీణించింది.

## 14.9 శాసనోల్లంఘన ఉద్యమం రెండవ దశ :

గాంధీ–ఇర్విన్ ఒప్పందం ఒప్పందం మేరకు కాంగ్రెస్ శాసనోల్లంఘన ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమించింది. సూరత్ జిల్లాలో భూమిశిస్తు వసూలు చేయడంలో పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. దీనిపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కాని, విచారణ న్యాయంగా జరుగలేదు. కాంగ్రెస్, విచారణ సంఘం నుంచి వైదొలగింది. 1931లో ఉత్తరప్రదేశ్ లో తీవ్ర ఆర్థిక దుస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పన్నుల నిరాకరణను ఇక్కడ ప్రారంభించి, గాంధీ–ఇర్విన్ ఒప్పందం మేరకు ఉద్యమాన్ని విరమించింది. భూమిశిస్తు మాఫీ చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసినప్పటికీ అమలు చేయక పోగా వెంటనే పన్నుల బకాయిలు చెల్లింపమని నిర్బంధించింది. ఈ సమయంలో భూమిశిస్తు చెల్లింపవద్దని కాంగ్రెస్ రైతులను కోరింది. ఫలితంగా, కాంగ్రెస్ నాయకులు జవహర్ లాల్ నెహ్రూ, పురుషోత్తందాస్ టాండన్ అరెస్ట్ చేయబడ్డారు. ప్రభుత్వం ఉత్తర సరిహద్దు రాష్ట్రంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలోని "రెడ్ షర్ట్స్" సంస్థ ను నిషేధించింది. వేలాది మంది ప్రజలు నిర్బంధింపబడ్డారు. ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా జరిగాయి.

గాంధీ లండన్ నుంచి తిరిగి భారత దేశానికి వచ్చేటప్పటికి ఆంగ్ల ప్రభుత్వం బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తర సరిహద్దు రాష్ట్రం మొదలైన ప్రాంతాలలో అణచివేత శాసనాలు అమలులోకి తెచ్చింది. ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపట్టడం వల్ల సుహృద్భావవైఖరి నశించిందని గాంధీ వైస్రాయికి తంతి పంపగా, ప్రభుత్వ తన చర్యలను సమర్ధిస్తూ వైస్రాయి సమాధానమిచ్చాడు. అంతేకాకుండా కొత్తగా అమలు చేసిన శాసనాల విషయమై బహిరంగ, నిష్పాక్షిక విచారణ జరిపించమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. దీనికి ప్రభుత్వం సమాధానం ఇవ్వకుంటే శాసనోల్లంఘన ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తామని హెచ్చరించినారు. దీనికి శాసనోల్లంఘన బెదిరింపుల మధ్య గాంధీకి తనను కలిసే అవకాశమివ్వనని వైస్రాయి తెలిపాడు. దేనికితోడూ ప్రభుత్వం తన విధానాన్ని సమర్ధించుకుంటూ, మరికొన్ని నిరంకుశ శాసనాలు చేసింది. ప్రభుత్వం గాంధీ, వల్లభాయ్ పటేల్ లను అరెస్ట్ చేసింది. అంతకముందే జవహర్ లాల్ నెహ్రూ, గఫార్ ఖాన్ లను అరెస్ట్ చేసింది. ఇలాంటి పరిస్థితులలో శాసనోల్లంఘనోద్యమ రెండవదశ ప్రారంభమైంది.

ఉద్యమం ఉధృతంగా జరిగింది. అనతి కాలంలోనే ఉద్యమం దావానలం దేశం మొత్తం వ్యాపించింది. ప్రజలు పెద్ద ఎత్తున పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పికెటింగ్, హర్తాల్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాలలో, పట్టణాలలో విదేశీ వస్త్రాల దహనం పెద్ద ఎత్తున జరిగింది. సారాదుకాణాలముందు పికెటింగ్, ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పూరేగింపులు, అధికారులు ఆమోదించని కరపత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా జరిగాయి.

## 14.9.1 ఉద్యమ అణచివేత చర్యలు :

ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచి వేసేందుకు అనేక నిరంకుశ, దారుణ, అమానుష, చర్యల ను చేపట్టింది. సమన్యాయ సిద్ధాంతానికి తిలోదకాలు ఇచ్చింది. చివరకు స్త్రీలను, పిల్లలను కూడా పోలీసులు కొట్టారు. రాళ్ళు విసిరినారనే నెపంపై, తరచూ కాల్పులు సాగించారు. ఇండ్లపై దాడులు చేయడం. ఇండ్లలో ప్రవేశించి సోదాలు చేయడం దేశవ్యాప్తంగా జరిగాయి. పోలీషులు ప్రజలను నిర్బందించి కొట్టడంతో పాటు చిత్ర హింసలు పెట్టడం చేశారు. గ్రామాలలో భీతావహ పరిస్థితులను సృష్టించారు. గ్రామీణుల ఆస్తులను దోపిడి చేసారు.

## 14.9.2 శాసనోల్లంఘనోద్యమ ముగింపు :

శాసనోల్లంఘన ఉద్యమం, ప్రభుత్వ ఆణచివేత చర్యలు ఉధృతంగా సాగుతున్న సమయంలో అత్యున్నత గాంధీ అకస్మాత్తుగా ప్రత్యేక నియోజక వర్గాలను వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. సంయుక్త నియోజక వర్గాలను పునరుద్ధరించనిదే తాను దీక్ష మానని ప్రకటించారు. దీనితో దేశం యావత్తు కలవరపడింది. శాసనోల్లంఘనోద్యమం వెనుక పడిపోయింది. చర్చలు కొద్దికాలంపాటు ఆందోళనకర స్థితిలో జరిగాయి. చివరకు, 18 శాతం సీట్లు నిమ్నజాతులకు కేటాయించాలనే అంబేద్కర్ వాదం నెగ్గింది. గాంధీ నిరాహార దీక్ష విరమించాడు.

అప్పటినుంచి శాసనోల్లంఘన ఉద్యమ ఉధృతం తగ్గిపోయింది. గాంధీ కి ఉద్యమంపై ఆసక్తి తగ్గింది. గాంధీ అస్పృశ్యతానివారణలో నిమగ్నమైనామయ్యారు. శాసనోల్లంఘన ఉద్యమాన్ని ఆరువారాలపాటు నిలుపుదల చేయమని గాంధీ కాంగ్రెస్ అధ్యక్షులను కోరారు. గాంధీ నిర్బంధంలో ఉన్న వారిని విడుదలచేసి, అత్యవసర శాసనాలను రద్దుచేయమని ప్రభుత్వాన్ని కోరారు. అయితే వైస్రాయి గాంధీజీ కోరికను తిరస్కరించాడు.

పూనాలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో సామూహిక శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించింది. నాటి నుంచి శాసనోల్లంఘన ఉద్యమం క్రమంగా ఆగిపోయింది.

ఈ ఉద్యమం ప్రత్యక్షంగా సాధించిన ఫలితాలు కనిపించక పోయినా ప్రభుత్వం కాంగ్రెస్ తమకు సమానమైన పక్షం అని గుర్తించింది. ఈ ఉద్యమం లో సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం భవిష్యత్తు లో ఉద్యమాలు చేపట్టేందుకు ఆశలను చిగురింప చేసింది.

## 14.10 సమీక్ష :

1929 వ సంవత్సరంలో లాహోర్ లో జరిగిన కాంగ్రెస్ సమావేశం సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమోదించడం తో పాటు స్వాతంత్యం కోసం మరో ఉద్యమాన్ని నడిపే బాధ్యతను గాంధీ కి కాంగ్రెస్ అప్పగించగా ఆయన శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించారు. అహింసా మార్గంలో సాగిన ఈ ఉద్యమంలో ప్రభుత్వ శాసనాలను ఉల్లంఘించి ఉప్పును తయారు చేయడంతో పాటు విదేశీ వస్త్ర, వస్తు బహిష్కరణ, ఊరేగింపులు, హార్తాల్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యమం జరుగుతూ ఉన్న సమయంలో సైమన్ కమీషన్ నివేదికను అనుసరించి రాజ్యాంగ తయారీ విషమై మొదటి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని కాంగ్రెస్ బహిష్కరించింది. తర్వాత గాంధీ, వైస్రాయి ఇర్విన్ మధ్య ఒప్పందం కుదురి శాసనోల్లంఘన ఉద్యమం తాత్కాలికంగా నిలుపుదల చేసి గాంధీ రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. ఆ సమావేశం విఫలం కావడంతో తిరిగి శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభమైంది. ఉదృతంగా సాగింది. అయితే గాంధీ అంతరానితన నిర్మూలన పై దృష్టి సారించడంతో ఉద్యమం క్రమంగా నిలిచి పోయింది.

## 14.11 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 14.11.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. లాహోర్ కాంగ్రెస్ సమావేశం
2. రెండవ రౌండ్ టేబుల్ సమావేశం

### 14.11.2 పది మార్కుల ప్రశ్నలు :

1. గాంధీ నాయకత్వంలోజరిగిన శాసనోల్లంఘన ఉద్యమాన్ని గురించి రాయండి.

### 14.11.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. పూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఏ కాంగ్రెస్ సమావేశంలో ఆమోదించారు.
2. లాహోర్ కాంగ్రెస్ సమావేశ అధ్యక్షులు ఎవరు.
3. రెండవ రౌండ్ టేబుల్ సమావేశ సమయంలో ఇంగ్లాండ్ ప్రధాని ఎవరు.
4. దండి యాత్ర ఏ సంవత్సరం జరిగింది.
5. గాంధీ-ఇర్విన్ ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది.

## 14.12 ఉపయుక్త గ్రంథాలు :

1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C

2. Modern India – Bipan Chandra

3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C

4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C

5. Modern India – Sumit Sarkar

6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ

7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి

8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర

**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం – 15
# 1935 – 1945 మధ్య స్వాతంత్రోద్యమం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమంలో భాగంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


15.1 పరిచయం

15.2 1935–39 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు

15.3 రెండో ప్రపంచ యుద్ధం – కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా

15.4 క్రిప్స్ రాయబారం

15.4.1 క్రిప్స్ ప్రతిపాదనలు

15.5 క్విట్ ఇండియా ఉద్యమం

15.5.1 ఉద్యమ అణచివేత

15.6 సమీక్ష

15.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

15.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు

15.7.2 పది మార్కుల ప్రశ్నలు

15.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు

15.8 ఉపయుక్త గ్రంథాలు


## 15.1 పరిచయం :

ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం నిలిచిపోయిన తర్వాత కాంగ్రెస్ నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ సమయంలో ప్రభుత్వం 1935 రాజ్యాంగ చట్టాన్ని చేసింది. దానిప్రకారం ఎన్నికలు జరగగా చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఈ లోగా 1939 వ సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం

కాగా, భారతీయుల మద్దతు కూడగట్టేందుకు ఇంగ్లాండ్ ప్రభుత్వం క్రిప్స్ రాయభారాన్ని పంపింది. అది విఫలం అవడంతో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభం అయింది.

## 15.2 1935-39 మధ్యకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు :

1935 జవహర్ లాల్ నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యాడు. కాంగ్రెస్ 1935 రాజ్యాంగ చట్టాన్ని తీవ్రంగా విమర్శించినా, ఎన్నికలలో పాల్గొనాలని నిర్ణయించింది. 1936లో నెహ్రూ తిరిగి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. అప్పటికి నెహ్రూ సోషలిస్ట్ ప్రభావానికి లోనైనా –

"కాంగ్రెస్ భారతదేశంలో పూర్తి ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు పోరాడుతుంది. భారతదేశానికి కావలసింది సామ్యవాదం కాదు, ప్రజాస్వామిక రాజ్యం" అని స్పష్టం చేశాడు.

1935 రాజ్యాంగ చట్టం ప్రకారం 1936-37లలో సాధారణ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో మద్రాస్, ఉత్తర ప్రదేశ్, సెంట్రల్ ప్రావిన్స్, బీహార్, ఒరిస్సాలలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చింది. బొంబాయి, బెంగాల్, అస్సాం, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రాలలో, మిగతా పార్టీలకన్నా ముందు వుంది. ఒక్క సింధ్, పంజాబ్ లలో మాత్రం కొద్ది సీట్లే వచ్చి కాంగ్రెస్, మైనారిటీగా వుండిపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వాలను స్థాపించాలా లేదా అనే విషయమై 1937 మార్చినెలలో ఢిల్లీలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సమావేశంలో రెండు రోజులపాటు చర్చించి చివరకు మెజారిటీ వున్న రాష్ట్రాలలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ అంగీకరించింది. అయితే, రాష్ట్రాలలో గవర్నర్లు పాలనలో జోక్యం చేసుకోమని హామీ ఇవ్వాలని కాంగ్రెస్ కోరింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని భగ్నపరచే ఎట్టి వివాదాలను కూడా తీసుకురావడం తమ అభిమతం కాదని వైస్రాయి ప్రకటించడంతో, మెజారిటీ వున్న చోట్ల కాంగ్రెస్ మంత్రివర్గాల ఏర్పాటుకు పార్టీ అనుమతి నిచ్చింది.

కాంగ్రెస్ మంత్రివర్గాలు వున్న రాష్ట్రాలలో అధికార పరిమితులలో ప్రజాజీవనాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేసాయి. మంత్రులు తమ జీతాలను బాగా తగ్గించుకొని, 500/- రూపాయలు తీసుకొంటూ, రైళ్ళో సామాన్యంగా రెండో తరగతి లేదా మూడో తరగతిలో ప్రయాణాలే చేసేవారు. విద్య, వైద్య సదుపాయాలపై ఎక్కువ శ్రద్ధ చూపారు. పౌరహక్కులను కల్పించి, కార్మిక సంఘాలు అధిక వేతనాలను పొందేటట్లు కృషి చేసారు. పత్రికా స్వాతంత్ర్యం అధికమైంది. ప్రప్రథమంగా, స్వేచ్ఛావాయువులను పిలుస్తున్నట్లుగా భారతీయ ప్రజలు భావించారు. తమకు అత్యధిక సంఖ్యాకబలం వున్న రాష్ట్రాలలోనే మంత్రివర్గాల నేర్పరచిన కాంగ్రెస్ సమర్థమైన పాలనను, నాలుగు కాలాలపాటు నిలబడగట్టే ప్రభుత్వాలను స్థాపించింది. మంత్రివర్గాల పనితీరులపై పార్టీ అజమాయిషీ వుండేది. అన్ని శాసన సభలలో మంత్రి వర్గాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకై డాక్టర్ రాజేంద్రప్రసాద్, వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం అజాద్ లతో ఒక ఉపసంఘాన్ని నియమించారు. మొత్తం మీద, కాంగ్రెస్ మంత్రివర్గాలు ఒక జట్టులా పనిచేసాయి.రాజకీయ ఖైదీలను విడుదల చేయడం ద్వారా, కాంగ్రెస్ మంత్రివర్గాలు వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలను తొలగించారు. కమ్యూనిస్టులు, తదితర వర్గాలపై వున్న నిషేధాన్ని రద్దుచేసి, వారిపై వున్న కేసులను ఉపసంహరించారు. పత్రికలు కట్టవలసిన ధరావత్తులను తిరిగి ఇచ్చివేసారు.

ప్రాథమిక విద్య, మద్యపాన నిషేధం, అస్పృశ్యతా నివారణతో సహా దళిత వర్గాల ఉద్ధరణ వంటి సాంఘిక సంస్కరణలకు కాంగ్రెస్ మంత్రివర్గాలు కృషి చేశాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్, బొంబాయి లలో విద్యా విధానం ప్రవేశపెట్టబడింది. వయోజన విద్యను అమలుచేశారు. కొన్ని ప్రాంతాలలో మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టారు. మద్యపాన నిషేధంవల్ల ప్రభుత్వాదాయాలు గణనీయంగా పడిపోయినా ప్రయోగాత్మకంగా అమలు చేస్తూ శాసనాలు చేసారు. దొంగసారా కాయడాన్ని నిరోధించారు. దళిత వర్గాల ఉద్ధరణకు పెక్కు శాసనాలు చేయబడ్డాయి. ఉచిత విద్య ఇవ్వబడింది. హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పింస్తూ ఎవరైనా అందుకు నిరాకరింస్తే శిక్షార్హులని బొంబాయి ప్రభుత్వం శాసనాన్ని చేసింది.

## 15.3 రెండో ప్రపంచ యుద్ధం – కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామా :

1939 సెప్టెంబర్ 1వ తేదీన పోలెండ్ పై జర్మనీ జరిపిన దురాక్రమణతో రెండో ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. ప్రథమంలో జపాన్, ఇటలీలు జర్మనీతో చేరాయి. ఆంగ్లేయ పాలిత ప్రాంతాలు, భారతదేశంకూడా యుద్ధంలో భాగస్వాములయ్యాయి. అయితే 1936 వ సంవత్సరంలోనే జవహర్ లాల్ నెహ్రూ ఈ సమయంలో – "సామ్రాజ్యవాద రాజ్యాలు ఎట్టి సాకులు చెప్పినా, వారుచేసే యుద్ధాలన్నీ సామ్రాజ్యవాద పరమైనవే. అట్టి యుద్ధాలతో మాకెట్టి ప్రమేయమూలేదు. తమకు స్వేచ్ఛలేకుండా స్వేచ్ఛా రాజ్యాల తరపున భారతదేశం ఎట్టి యుద్ధంలోను పాల్గొనలేదు" అని ప్రకటించాడు. నెహ్రూ అభిప్రాయం ప్రకారమే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మంత్రివర్గాలు యుద్ధనిర్వహణ విషయాల్లో ఆంగ్ల ప్రభుత్వానికి ఎట్టి సహాయ సహకారాలు అందించరాదనీ, ఒక వేళ ఈ విధానం కొనసాగడం కష్టమైతే, రాజీనామాకు సంసిద్ధం కావలనీ ఆదేశాలిచ్చింది.

యుద్ధం ప్రారంభమైన తరుణంలో సంస్థానాధిపతులు, కాంగ్రెసేతర మంత్రివర్గాలు ఆంగ్ల ప్రభుత్వానికి పూర్తి మద్దతును ప్రకటించాయి. కానీ, కాంగ్రెస్ సహకారించడానికి నిరాకరించింది. అంతేకాకండా దేశానికి పూర్తి స్వాతంత్ర్యాన్నిచ్చేది, లేనిది వివరించాలని కాంగ్రెస్ కోరింది.

"స్వయంపాలనా ప్రతిపత్తి" ఇవ్వడం తమ ధ్యేయమని, వైస్రాయి ప్రకటించాడు. ఈ ప్రకటన కేవలం సామ్రాజ్యవాద విధానాన్ని ప్రతిబింబిస్తోంది అని భావించిన కాంగ్రెస్, తమ మంత్రివర్గాలను రాజీనామా చేయవలసిందిగా ఆదేశించింది. 1939 నవంబర్ నాటికి, కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసాయి. 1940 మార్చి నెలలో, రానాఘర్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అధ్యక్షతన కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత ప్రజలను సంప్రదించకుండా. భారతదేశాన్ని యుద్ధంలో పాల్గొనే రాజ్యంగా ప్రకటించడానికి తీవ్ర అభ్యంతరం తెలుపుతూ తీర్మానం చేయడంతో పాటు "సంపూర్ణ స్వరాజ్యం మినహా ఎట్టి వాగ్దానాలు తమకు ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ ప్రకటించింది.

## 15.4 క్రిప్స్ రాయబారం :

ఈ కాంగ్రెస్ విధానంతో పాటు రెండవ ప్రపంచయుద్దంలో జర్మనీ పై చేయి సాధిస్తూ ఉండడంతో యుద్ధంలో భారత దేశ సహకారం తప్పనిసరి అని భావించిన ఇంగ్లాండ్ ప్రభుత్వం ఒక రాయభారాన్ని భారత దేశానికి పంపింది. ఈ రాయభారానికి అధ్యక్షుడు స్టాఫర్డ్ క్రిప్స్. కనుక దీనికి క్రిప్స్ రాయభారం అని పేరు.

భారతదేశానికి చేరుకున్న క్రిప్స్ దేశంలోని రాజకీయ పార్టీ నాయకులందరిని కలిసి 1942 మార్చి నెలలో కొన్ని ప్రతిపాదనలు చేశారు.

### 15.4.1 క్రిప్స్ ప్రతిపాదనలు :

1. బ్రిటీష్ కామన్వెల్త్ పరిధిలోనే ఒక డొమినియన్ గా , బ్రిటీష్ ఇండియా భారతీయ రాజ్యాల సమాఖ్య ఏర్పడుతుంది.
2. యుద్ధానంతరం, ఒక రాజ్యాంగ రచన సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
3. దాని సభ్యులను భారతదేశ దిగువ సభనుంచి ఎన్నుకోవాలి.
4. ఈ కింది షరతులకు కట్టుబడి, రాజ్యాంగ రచనల సంఘం రూపొందించిన రాజ్యాంగాన్ని ఇంగ్లాండ్ అంగీకరిస్తుంది.
   - i. ఏదేని బ్రిటీష్ రాష్ట్రం ఈ సమాఖ్యలో చేరకుండా ఉన్నట్లయితే దానికి ప్రస్తుతమున్న హెూదా అలాగే వుంటుంది. డానికి బ్రిటీష్ ప్రభుత్వం, ఆ రాష్ట్రానికి ఇండియన్ యూనియన్ లోని ఇతర రాష్ట్రాలకు ఇచ్చే హెూదానే ఇస్తుంది.
   - ii. రాజ్యాంగ రచన సంఘం, బ్రిటీష్ ప్రభుత్వ, అల్ప సంఖ్యాక వర్గాల హక్కులతో సహా. అధికార బదిలీకి అన్ని అంశాలతో కూడిన ఒక ఒప్పందంపై సంతకం చేయవలసి వుంటుంది.
   - iii. రాష్ట్రాలకు అధినివేశరాజ్య ప్రతిపత్తి ని, మరియు యూనియన్ నుంచి వైదొలగే హక్కు కూడా వుంటుంది.

ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ వ్యతిరేకించింది. చివరగా, బ్రిటీష్ రాజ్యపునాదులే శిథిలావస్థలో ఉన్న ఆ దశలో, ఈ అధినివేశ రాజ్య ప్రతిపత్తినిచ్చే దీర్ఘకాలిక ప్రతిపాదనను "ఒక దివాలా తీసిన బ్యాంకుకు వ్రాసిన ముందు తేదీగల చెక్కు" గా గాంధీజీ పేర్కొన్నాడు.

## 15.5 క్విట్ ఇండియా ఉద్యమం :

క్రిప్స్ రాయబారం విఫలమవ్వడంతో భవిష్యత్తు కార్యాచరణ ను తయారు చేయడానికి కాంగ్రెస్ 1942, ఆగస్టు 8వ తేదీన బొంబాయి సమావేశం అయింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టాలని తీర్మానం అయింది. ఈ సమావేశంలో గాంధీ మాట్లాడుతూ – " తక్షణమే. ఈ రోజురాత్రే, ఒకవేళ పొందగలిగితే, తెల్లవారక ముందే స్వాతంత్ర్యం కావాలంటాను. అందుకు ఇక్కడొక మంత్రముంది. అదినేను మీకుపదేశించే చాలా చిన్న మంత్రం. దానిని మీ హృదయాల మీద ముద్రించుకోవచ్చు. మీ ప్రతిశ్వాస దానికి చిహ్నంగా ఉంచవచ్చు. ఈ మంత్రమేమిటంటే "సాధించు లేదా చావు, Do or Die". మనం. భారతదేశానికి స్వేచ్ఛను కల్పిద్దాం లేదా దాని ప్రయత్నంలో మరణిద్దాం. మన బానిసత్వం వృద్ధిపొందటాన్ని చూడడం కోసం బ్రతకకూడదు" అని పిలుపును ఇచ్చారు.

ప్రభుత్వం 1942 ఆగష్టు 9వ తేది ఉదయానికే గాంధీజీ, ఆజాద్, పటేల్, నెహ్రూ అరుణాసఫాలి, పట్టాభి, కృపలానీ వంటి కాంగ్రెస్ ప్రముఖ నాయకులందరినీ అరెస్ట్ చేసింది. మొదలయిన వారందరు అరెస్టయిరి మొదలయిన వారిని అరెస్టు చేసింది.

ఈ అరెస్టులకు నిరసనగా ఆగష్టు 9, 10 తేదీలలో దేశ వ్యాప్తంగా సభలు, సమావేశాలు, హర్తాళ్ళు జరిగాయి. ఒక వారం రోజులపాటు ప్రధాన నగరాల్లో వ్యాపారం నిలిచిపోయింది. జాతీయ నాయకులను విడుదల చేయవలసిందిగా కోరుతూ స్త్రీలు, విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు.

నాయకులు లేని ప్రజలలో ఆవేశం కట్టలు తెంచుకుని ఉద్యమం హింసా యుతంగా మారింది. విద్యార్థులు చదువుమాని విధ్వంసక చర్యలకు పాల్పడ్డారు. రైల్వేస్టేషన్, పోలీసు స్టేషనులపై దాడి, రైలుపట్టాలు తొలగించడం, టెలిఫోన్ వ్యవస్థ విధ్వంసం చేయడం, రహదారుల ప్రతిష్టంభన, వంతెనలను విధ్వంసం చేయడం వంటి హింసాత్మక చర్యలు అనేక ప్రాంతాలలో జరిగాయి. కొన్ని కోట్ల విలువయిన ఆస్తి నష్టమేగాక ప్రాణనష్టము జరిగింది. ముప్పయిమంది పోలీసులు, 11 మంది సైనికులు మరణించారు. ఉద్యమకారులు ఎంతమంది మరణించారో అంచనావేయడం కష్టము.

వీటితో పాటు పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘన వంటి కార్యక్రమాలు కూడా జరిగాయి. అనేక చోట్ల సమ్మెలుకూడా జరిగినవి. జంషెడ్పూర్ ఇనుము – ఉక్కు కర్మాగారములో కార్మికులు 15 రోజులు సమ్మెజరిగింది. యాజమాన్యం నాయకులను విడిపించుటకు హామీయివ్వడంతో సమ్మె విరమించి కార్మికులు పనిలో చేరారు. అహ్మదాబాద్ లో కార్మికులు మూడు నెలలు సమ్మెచేశారు.

### 15.5.1 ఉద్యమ అణచివేత :

ఉధృతంగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచి వేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. వేలాదిమందిని అరెస్ట్ చేసి జైళ్లలో నిర్బంధించింది. లాఠీచార్జీలు సర్వసాధారణం అయ్యాయి. అత్యాచార యత్నాలు, జరిమానాలు విధించడం పెద్ద ఎత్తున చేశారు. అనేక చోట్ల ఉద్యమం చేస్తున్నవారిపై కాల్పులు జరిపారు. కాల్పులలో 1090 మంది మరణించగా, 60 వేలమంది నిర్బంధింపబడ్డారని అధికారిక లెక్కల ద్వారా వెల్లడైంది. 28 లక్షల రూపాయలు జరిమానాగా వసూలు చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలను ప్రభుత్వం నిషేదించింది. అలహాబాద్ కాంగ్రెస్ కార్యాలయాన్ని, నిధులను స్వాధీనం చేసుకున్నారు.

క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమయిన రెండు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం తమ నిరంకుశ కఠిన చర్యల ద్వారా ఈ ఉద్యమమును అణచివేసింది. క్విట్ ఇండియా ఉద్యమం తన లక్ష్యసాధనలో తక్షణ విజయమును సాధించలేదు. విప్లవనాయకులందురు జైళ్లలో నిర్బందింప బడి ఉండడం వల్ల ఉద్యమం ఒక ప్రణాళిక ప్రకారం క్రమబద్ధంగా జరిగే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడూ ఉన్నత విద్యావంతులు, ముస్లింలీగ్, కమ్యూనిస్టులు వంటివారు ఉద్యమంలో చేరకపోవటం ఉద్యమం ఆగిపోవడానికి కారణమైంది.

అంతేకాకుండా ఉద్యమంలో గాంధీ అహింసా మార్గాన్ని విడిచిపెట్టాడనీ, ఉద్యమంలో జరిగిన హింసాత్మక చర్యలకు గాంధీ నే కారణం అని ప్రభుత్వం పేర్కొంది. దీనితో తనపై వచ్చిన నింద నిజం కాదని చెప్పేందుకు గాంధీ నిరాహార చేయడానికి సిద్ధమయ్యారు. గాంధీ జైలులోనే 1945 వ సంవత్సరం ఫిబ్రవరి 10 వ తేదిన నిరాహార దీక్షను ప్రారంభించారు. నిరాహార దీక్ష 21 రోజులపాటు సాగింది. దీక్ష చేస్తున్న గాంధీ గారిని జైలు నుంచి విడుదల చేయమని అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వాన్ని కోరాయి.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రభుత్వం నిరంకుశ, కఠిన విధానాల ద్వారా అణచివేయడం వల్ల ఉదయం తీవ్రత తగ్గింది. దీనికి తోడూ రెండవ ప్రపంచ యుద్ధంలో న అమెరికా చేరడంతో మిత్రరాజ్యాల విజయావకాశాలు మెరుగవడం వల్ల భారతదేశానికి యుద్ధ భయం తీరిపోయింది. ఇలాంటి స్థితి లో 1945 నాటికి ఉద్యమం ఆగిపాయింది.

ఈ క్విట్ ఇండియా ఉద్యమం తక్షణ విజయం సాధించలేక పోయినా... నాయకులేక పోయినా సామాన్య ప్రజలు ఉద్యమాన్ని నడపడం, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో ఉద్యమంలో పాల్గొనడం వంటి వాటి వల్ల భారత దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష అధికమైందనే విషమం స్పష్టమై ... భారతదేశాన్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకొనడం కష్టం అనే భావాన్ని ఆంగ్లేయులకు కలిగించడంలో ఈ ఉద్యమం విజయం సాధించింది.

## 15.6 సమీక్ష :

శాసన ఉల్లంఘన ఉద్యమం నిలిచిపోయిన తర్వాత కాంగ్రెస్ నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ సమయంలో ప్రభుత్వం 1935 రాజ్యాంగ చట్టాన్ని చేసింది. దానిప్రకారం ఎన్నికలు జరగగా చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సంస్కరణలు అందించి మంచి పేరును పొందాయి. ఈ లోగా 1939 వ సంవత్సరంలో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగా, భారతీయులను ఇంగ్లాండ్ ప్రభుత్వం అందులో దించింది. దీనితో తమకు పూర్ణ స్వరాజ విషమై హామీ ఇస్తే సహకరిస్తామని కాంగ్రెస్ తేల్చి చెప్పింది. వైస్రాయి యుద్ధం అనంతరం స్వయం పాలన ఇచ్చే విషయం ఆలోచిస్తామని ప్రకటించడంతో యుద్ధంలో సహకరించడానికి నిరాకరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. దీనితో భారతదేశ మద్దతు కూడగట్టేందుకు ఇంగ్లాండ్ ప్రభుత్వం క్రిప్స్ రాయభారాన్ని పంపింది. అది విఫలం అవడంతో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభం అయింది. ప్రభుత్వం నాయకులందరినీ అరెస్ట్ చేసి జైళ్లలో నిర్భందించింది. దీనితో నాయకులు లేకుండా ప్రజలే ఉద్యమాన్ని నడిపారు. ఇందులో కొంత హింస చోటు చేసుకుంది.

## 15.7 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 15.7.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. కాంగ్రెస్ ప్రభుత్వాలు
2. క్రిప్స్ రాయభారం

### 15.7.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని గురించి రాయండి.

### 15.7.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానాన్ని ఏ కాంగ్రెస్ సమావేశంలో ఆమోదించారు.
2. బొంబాయి కాంగ్రెస్ సమావేశ అధ్యక్షులు ఎవరు.
3. క్రిప్స్ రాయభారం ఎప్పుడు వచ్చింది.

4. రెండవ ప్రపంచ యుద్ధం ఎప్పుడు ప్రారంభం అయింది.

5. ఏ రాజ్యాంగ చట్టం ప్రకారం ఎన్నికలు జరిగాయి.

## 15.8 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం – 16
# విప్లవోద్యమాలు

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమం జరుగుతూ వున్న సమయంలో కొందరు యువకులు విప్లవోద్యమాల పట్ల ఆకర్షితులై చేసిన ఉద్యమాల గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


16.1 పరిచయం

16.2 విప్లవోద్యమాలు

16.3 చిట్టగాంగ్ దోపిడి

16.4 యుగాంతర్ పార్టీ

16.5 కాకోరీ దోపిడి

16.6 లాహోర్ కుట్ర కేసు

16.7 అల్లూరి సీతారామరాజు – రంపా విప్లవం

16.7.1 పోలీసు స్టేషన్ లపై దాడి

16.8 సమీక్ష

16.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

16.9.1 ఐదు మార్కుల ప్రశ్నలు

16.9.2 పది మార్కుల ప్రశ్నలు

16.9.3 ఒక్క మార్కు ప్రశ్నలు

16.10 ఉపయుక్త గ్రంథాలు


## 16.1 పరిచయం :

భారత స్వాతంత్రోద్యమంలోకి గాంధీ ప్రవేశించడంతో ఉద్యమ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఉద్యమం పూర్తిగా అహింసాయుతంగా సాగడాన్ని కొందరు యువకులు జీర్ణించుకోలేక పోయారు. దీనికి తోడు ఉద్యమం ఉధృతంగా

సాగుతూ వున్న సమయంలో చౌరీ చౌరా సంఘటన జరగడంతో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్ధాంతరంగా నిలుపుదల చేయడాన్ని యువకులు అంగీకరించ లేదు. దీనితో విప్లవోద్యమం పట్ల యువకులు ఆకర్షితులయ్యారు. ఫలితంగా స్వాతంత్ర్యోద్యమంలో సమాంతరంగా విప్లవోద్యమాలు నడిచాయి.

## 16.2 విప్లవోద్యమాలు :

క్రీ.శ. 1922 సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమం ఉధృతంగా సాగుతూ వున్న సమయంలో చౌరీ చౌరీలో ఉద్యమకారులు పోలీసు స్టేషన్ కు నిప్పుపెట్టడం, పోలీసులు మరణిచడంతో ఉద్యమంలో హింస చోటు చేసుకుందని గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలుపుదల చేశాడు. ఈ విధంగా ఉద్యమాన్ని నిలుపుదల చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు కూడా కొందరు వ్యతిరేకించారు. దీనిని ఆసరాగా తీసుకుని గాంధీని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఇలాంటి స్థితిలో గాంధీని విధానాలు నచ్చని యువకులు విప్లవోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు

దీనికితోడు "ఆత్మశక్తి", "సారథి" మొదలైన బెంగాల్ పత్రికలు, బెంగాల్ లోని గత విప్లవకారులు, వారి విప్లవోద్యమాలు, సాహస కార్యక్రమాలు, త్యాగాలను గురించి కథనాలు ప్రచురించాయి. ఇవి యువకులకు మరింత స్ఫూర్తిని ఇచ్చాయి. అనుశీలన్, యుగాంతర్ సమాజ్ వంటి విప్లవ సంఘాలు తిరిగి ఉద్యమాన్ని ప్రారంభించాయి. ఆంగ్ల అధికారులు చంపడం, బహిరంగ దోపిడీలు చేయడం వంటి విప్లవ కార్యక్రమాలకు సూర్యసేన్ నాయకత్వం వహించాడు. బాంబులు, మందుగుండు సామాగ్రి భారీగా తయారు చేయబడింది.

ఇలాంటి పరిస్థితులను చూసి ప్రభుత్వం కలవరం చెంది, విప్లవ కార్యక్రమాలను అదుపు చేయడానికి పూనుకుంది. అందుకు నూతన నిరంకుశ శాసనాలను చేసింది. అనేక మంది విప్లవకారులను నిర్బంధించింది.

## 16.3 చిట్టగాంగ్ దోపిడి :

బెంగాల్ లో క్రీ.శ 1927 అనంతరం విప్లవం కొంత సన్నగిల్లింది. దీనితో ప్రభుత్వం విప్లవకారులను కారాగారాలనుంచి విడుదల చేసింది. అయితే కొద్ది రోజులకే చిట్ట గాంగ్ ఆయుధాగారంలో దోపిడి జరిగింది. ఈ చిట్టా గాంగ్ దోపిడికి సూర్యసేన్ నాయకత్వం వహించాడు. ఒక వ్యూహం ప్రకారం ఈ దోపిడీ జరిగింది. విప్లవ కారులు నాలుగు భాగాలుగా విడిపోయారు. అందులో రెండు భాగాల సభ్యులు ఆయుధాగారాన్ని దోచుకోనడంలో పాల్గొన్నారు. ఒక భాగం విప్లవకారులు ఆంగ్లేయులను హత్య చేయడంలో పాల్గొన్నారు. నాలువ భాగం విప్లవకారులు టెలిఫోన్, టెలిగ్రాఫ్ కార్యాలయాలను తీగలను ధ్వంసం చేయడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ఆయుధాగారాలు రెండూ విప్లవకారుల స్వాధీనమయ్యాయి. ఆయుధాగార కాపలా సిబ్బంది కాల్చి చంపబడ్డారు. విప్లవవాదులు రివాల్వర్లు, రైఫిళ్ళు, మందుగుండు సామాగ్రి వంటి వాటిని స్వాధీనం చేసుకుని తీసుకువెళ్లారు కానీ తుపాకీ తూటాలను తీసుకు వెళ్ళడం మరిచారు. ఆయుధాగార భవనం కూడా చాలావరకు ధ్వంసం అయింది. సూర్యసేన్ అధ్యక్షుడిగా విప్లకారులు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

దీనితో ఆంగ్ల ప్రభుత్వం ప్రతిచర్యలు ప్రారంభించింది. విప్లవవీరులు అడవులలోకి పారిపోయారు. కొందరు టెలిగ్రాఫ్ తీగలు తెంచడానికి, రైళ్లను పడగొట్టి, రైళ్ల మార్గాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించారు. తిండి లేకుండా

విప్లవవాదులు అడవులలో తిరగాల్సి వచ్చింది. మెషిన్ గన్ లతో సైనికులు వారిని వెంటాడారు. రెండు వైపుల కాల్పులు జరిగి ఎందరో చనిపోయారు. సూర్యసేన్, మరికొందరు విప్లవవీరులు చాలారోజులు తప్పించుకొని తిరిగారు. ఎన్నిచోట్ల గాలించినా సూర్యసేన్ దొరకలేదు. క్రీ.శ 1932 నాటికి చిట్ట గాంగ్ దోపిడి విచారణ ముగిసి, పద్నాలుగు మందికి యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష విధించారు. ఎన్నో సాహస కృత్యాలు. చేస్తూ, తప్పించుకు తిరిగిన సూర్యసేన్ ను పట్టుకుని 1933 ఫిబ్రవరి నెలలో ఉరితీశారు.

## 16.4 యుగాంతర్ పార్టీ :

బెంగాల్ లోని విప్లవ పార్టీలలో యుగాంతర్ పార్టీ ఒకటి. క్రీ.శ 1930వ సంవత్సరం మే నెలలో కలకత్తాలోని యుగాంతర్ పార్టీ నాయకులు, సాయుధ విప్లవ చర్యలకు సిద్ధమయ్యారు. బాంబులు తయారు చేశారు. యుగాంతర్ పార్టీ లోని విప్లవకారులు 1930–33 మధ్యకాలంలో ఇరవై హత్యలు చేశారు. హత్యకు గురైన వారిలో న్యాయ, పోలీసుశాఖకు చెందిన ఆంగ్ల అధికారులు ఎక్కువ మంది వున్నారు. పది చోట్ల బాంబులు వేశారు. ఒక సాయుధ దోపిడి జరిగింది.

## 16.5 కాకోరీ దోపిడి :

విప్లవోద్యమం పట్ల ఆకర్షితులైన కొందరు యువకులు 1924వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ లో సమావేశం అయ్యారు. వారు "హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ సంస్థ" అనే విప్లవ సంస్థను ఏర్పాటు చేశారు. సాయుధ విప్లవం ద్వారా భారత దేశంలో రిపబ్లిక్ ను స్థాపించడం ఈ సంస్థ ప్రధాన ధ్యేయం. ఈ సంస్థ రూపకర్త – రాంప్రసాద్ బిస్మిల్. సంస్థ కార్యక్రమాల్లో భాగంగా రాంప్రసాద్ బిస్మిల్ ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టాలని నిర్ణయించాడు. క్రీ.శ 1925 ఆగస్టు నెలలో ఉత్తర రైల్వేలో "కాకోరి" వద్ద వీరు ఒక రైలులోని గార్డు పెట్టె నుండి ధనాన్ని కొల్లగొట్టారు.

తర్వాత ప్రభుత్వం ఈ దోపిడీ చేసినవారిని గుర్తించింది. ఈ సంస్థ నాయకులను అరెస్ట్ చేసి విచారణ జరిపి శిక్షలు విధించింది. ఈ కేసులో నలుగురికి మరణశిక్ష, మరొక నలుగురికి జీవితాంత దేశ బహిష్కరణ శిక్ష విధించింది. నాయకుడైన రాంప్రసాద్ బిస్మిల్ తో పాటు మరో ముగ్గురికి ఉరిశిక్ష విధించింది. ఉరికంభంపై శిక్ష అమలు చేసే సమయంలో రాంప్రసాద్ బిస్మిల్ "బ్రిటీష్ సామ్రాజ్య పతనాన్ని నేను కోరుతున్నాను" అని నినదించాడు. కారాగార శిక్ష విధింపబడిన రాంప్రసాద్ బిస్మిల్ స్నేహితుడు రోషన్ లాల్ "వందేమాతరం" అని నినదిస్తూ జైలులో ప్రవేశించాడు.

## 16.6 లాహోర్ కుట్ర కేసు :

బెంగాల్ కాకోరి కేసు తర్వాత పోలీసులు కఠిన అణచివేత చర్యలు చేపట్టి అనేకమంది నాయకులను నిర్భందించడం తో "హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్" కార్యకలాపాలు కొన్నిరోజులపాటు ఆగిపోయాయి. విప్లవ కార్యక్రమాలు పునరుద్ధరించడానికి, చంద్రశేఖర్ ఆజాద్ తీవ్ర ప్రయత్నాలు చేశాడు.

సైమన్ కమీషన్ వ్యతిరేకోద్యమం సమయంలో పంజాబ్ లో ఉద్యమానికి లాలా లజపతిరాయ్ నాయకత్వం వహించాడు. లాహోర్ లో సైమన్ కు వ్యతిరేకంగా లాలా లజపతి రాయ్ నాయకత్వం లో ఊరేగింపు జరుగుతున్న సమయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు గా ఉన్న సాండర్స్ లాఠీ ఛార్జి చేశాడు. ఈ సమయంలో సాండర్స్

లజపతి రాయ్ తలమీద కొట్టడంతో లజపతి రాయ్ తలకు గాయం అయి, దానివల్ల తర్వాత లజపతి రాయ్ మరణించారు. దీనికి ప్రతీకారం చేయాలని సాండర్స్ ను హత్యచేయాలని విప్లవకారులు నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం ప్రకారం భగత్ సింగ్ తన అనుచరులతో కలిసి సాండర్స్ ను కాల్చి చంపి పారిపోయాడు.

తర్వాత 1929 వ సంవత్సరం ఏప్రిల్ 9 వ తేదీన భగత్ సింగ్, అతని మిత్రుడు భూటకేశ్వర్ దత్ లు పార్లమెంట్ లో ప్రవేశించి ప్రేక్షక గ్యాలరీలో కూర్చిన పార్లమెంట్ జరుగుతూ వున్న సమయంలో బాంబులు వేశారు. విప్లవ కరపత్రాలను పార్లమెంట్ హాలులో వెదజల్లారు. విప్లమ్ వర్ధిల్లాలి, ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

అసెంబ్లీలో బాంబులు వేసిన తర్వాత జరిగిన పోలీసు సోదాల్లో లాహోర్ లో విప్లవవాదులు ఏర్పాటు చేసిన పెద్ద బాంబులు తయారీ కర్మాగారం కనుక్కొన్నారు. అందులో పెద్ద ఎత్తున బాంబు తయారి సామాగ్రి దొరికింది. సహరాన్ పూర్ లో మరొక బాంబు తయారీ కర్మాగారం బయల్పడింది. ప్రభుత్వం విప్లవకారులను అరెస్టుచేసి, వారి మీద "లాహోర్ కుట్ర కేసు" పెట్టింది.

దీనితో హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ పూర్తిగా అంతరించింది. అయితే చంద్రశేఖర్ ఆజాద్ పారిపోయి సాయుధ విప్లవ ప్రయత్నాలు చేశాడు. పోలీసులు చంద్రశేఖర్ ఆజాద్ ను పట్టుకోనేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. చివరకు క్రీ.శ 1931 ఫిబ్రవరిలో చంద్ర శేఖర్ ఆజాద్ ను పట్టుకుని కాల్చి చంపారు. ప్రభుత్వం క్రీ.శ 1931వ సంవత్సరం మార్చి 23వ తేదీన భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ లను ఉరితీసింది. ఈ సంఘటన తర్వాత విప్లవ సంఘాల రహస్య కార్యకలాపాలు ముగిశాయి.

## 16.7 అల్లూరి సీతారామరాజు – రంపా విప్లవం :

దక్షిణ భారత దేశంలో జరిగిన విప్లవోద్యమాల్లో ఆంధ్రదేశంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో జరిగిన రంపా విప్లం ప్రధానమైంది. మన్యంలో గిరిజనులు పడుతున్న కష్టాలను, ప్రభుత్వం వాబు శ్రమను దోచుకొనడం, అటవీ వస్తువులు, ఉత్పత్తుల వినియోగంలో వారిపై పెట్టిన ఆంక్షలు, స్థానిక తహసీల్దార్ బాస్టియన్ దుర్మార్గాలు చూసి చలించి రామరాజు ఈ ఉద్యమం చేశారు. 1922 వ సంవత్సరంలో ఉద్యమం ప్రారంభం అయింది. ఉద్యమంలో సీతా రామరాజుకు గంటందొర, మల్లుదొర, అగ్గిరాజు మొదలైనవారు అనుచరులుగా వుండి తోడ్పడ్డారు.

గోదావరి, విశాఖపట్నం ఏజన్సి ప్రాంతాలలో 1922 నుంచి 1924 మే వరకు బ్రిటిష్ వారిని ముప్పు తిప్పలు పెట్టి, ఆంగ్ల సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 1897లో పశ్చిమ గోదావరి జిల్లా మొగల్లులో క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. అతనికి చదువు అంతగా అబ్బలేదు. కాని గుర్రపు స్వారి మూలిక వైద్యం, జ్యోతిస్యం నేర్చుకొని అడవులలో తిరుగుతూ ఆ ప్రాంతమైన గూడెం నాయకుడయ్యాడు. నాటి రాజకీయ స్థితిని గమనించిన రాజుకు అహింసా పద్దతులపై నమ్మకం కలుగక తిరుగుబాటు ద్వారామాత్రమే ఆంగ్లేయులను తరిమి వేయగలం అని ఆయన అభిగ్రాయం. 1921 లో చిట్టగాంగ్ వెళ్ళి బెంగాల్ విప్లవాదులతో మంతనాలు జరిపారు.

### 16.7.1 పోలీసు స్టేషన్‌లపై దాడి :

ఆంగ్లేయులను సాయుధంగా ఎదిరించాలంటే ఆయుధాలను పెద్ద ఎత్తున సేకరించలని భావించిన సీతారామరాజు అందుకు పోలీసుస్టేషన్లపై దాడులు ప్రారంభించాడు. 1922 ఆగష్టు 22న చింతపల్లి పోలీసుస్టేషన్ పై దాడిచేసి 11 తుపాకులు, 1390 మందుగుండ్లు, 5 కత్తులు 14 బాయి ్నెట్లు వశం చేసుకొన్నాడు. ఏమి స్వాధీనం చేసుకున్నది రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేసాడు. ఆ సమయంలో స్టేషనులో ఉన్న పోలీసులకు ఏ అపాయమూ తలపెట్టలేదు. ఆగష్టు 23న – కృష్ణదేవీ పేట ఆగష్టు 24న రాజవొమ్మంగి, అక్టోబర్ 15 అడ్డతీగల, అక్టోబర్ 19న రంపచోడవరం పోలీసుస్టేషన్ లపై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. వీటిల్లో అడ్డతీగల పోలీసు స్టేషన్ పై దాడి ప్రత్యేకమైంది. ముందుగానే ఎప్పుడు దాడి చేస్తామనే విషయం తెలిపి దాడి చేశాడు. అయినా ప్రభుత్వం రక్షించుకోలేక పోయింది

పోలీసు స్టేషన్లపై దాడులు ప్రభుత్వం ఊహించలేదు. ఈ దాడులతో ఆందోళన చెందిన ప్రభుత్వం అదనపు పోలీసు దళాలను హుటా హుటిని తరలించింది. సెప్టెంబర్ 3వ తేదీన, పోలీసు దళాలకు సీతరామరాజు అనుచరులకు ఓండేరిఘాట్ వద్ద జరిగిన పోరాటంలో పోలీసులు పలాయనం చిత్తగించగా, కొన్ని ఆయుధాలు పట్టుబడ్డాయి. కొద్దిరోజుల తరువాత రాజు దామనపల్లి చేరాడు. ఈ విషయం తెలిసిన ఆంగ్ల సైన్యాధికారులు స్కాట్ కోవార్డ్ హేటర్ బళ్ళారి పోలీసు బలగంతో దామనపల్లి బయలుదేరారు. ఈ విషయాన్ని తన వేగుల ద్వారా తెలుసుకొన్న రాజు, వారిపై మెరుపుదాడి చేయగా, స్కాట్ కోవార్డ్, హేటర్, మరి నలుగురు పోలీసులు హతులయ్యారు. మందుగుండు సామగ్రి, ఆరు రైఫిళ్ళు దొరికాయి.

దీనితో ప్రభుత్వం అరణ్య ప్రాంతంలో పోరాటంలో శిక్షణగల మలబార్ పోలీసులను ఈ ప్రాంతానికి రప్పించింది. రాజును అతని అనుచరులను బంధించి ఇచ్చినవారికి బహుమానాలు ప్రకటించింది.

నవంబర్ 17వ తేదీన రంపోల్, చిపర్తిపాలెం లూటీ చేసింది. ఈ సంఘటనల తరువాత కొన్నాళ్ళు ఎలాంటి దాడులు జరగలేదు. రాజు అతని అనుచరుల జాడ తెలియరాలేదు. తిరుగుబాటు దానంతటదే ఆగిపోయిందని భ్రమించి ప్రభుత్వం మలబారు పోలీసుదళాన్ని ఉపసంహరించింది.

రాజు 1923 ఏప్రిల్ నెలలో అన్నవరంపై దాడి చేశాడు. రాజు వీరోచితపోరాటానికి ముగ్ధులైన స్థానిక సబ్ ఇనస్పెక్టర్, పోస్టుమాస్టర్, డిప్యూటీ తహసీల్దార్ రాజును వారి గృహాలకు తీసుక వెళ్ళారు. స్త్రీలు హారతులు పెట్టి కాళ్ళు కడిగి, తలపై ఆ నీళ్ళను చల్లుకొన్నారు. శంఖవరం గ్రామంలో కూడా రాజుకు ఘనస్వాగతం లభించింది. ఈవిషయం తెలుసుకొన్న ప్రభుత్వం ఈ రెండు గ్రామాలపై నాలుగు వేల రూపాయల సమష్టి జరిమానా విధించింది. మే 31వ తేదీన రాజు అనుచరులు కొయ్యూరు వద్ద సబ్ ఇనస్పెక్టర్, డిప్యూటీ తహసిల్దార్లను కొట్టి వదలి వేశారు. జూన్ 15వ తేదీన అగ్గిరాజు నాయకత్వంలో ఒక దళం కొండకంటేరు. మల్కనగిరి పోలీసుస్టేషనులపై దాడిచేసింది. కాని ఫలితం లేకపోయింది.

రాజు ను పట్టుకోవడానికి తీవ్ర గాలింపు ప్రారంభమైంది. సెప్టెంబర్ 16వ తేదీన గాందొర దొరికాడు. రాజు దళాల ఉనికి గ్రహించి ప్రభుత్వం అనేక దాడులు జరిపింది. ప్రమాదస్థితి ఏర్పడింది. రాజు, గంగరాజు మడుగుల పెద్దేరులపై దాడిచేయగా పోలీసులు కాల్పులు జరిపారు. గుడ్డపల్లిలో రాజును నిర్బంధించడానికి అవకాశం కలిగింది. కాని గ్రామ మునసబ్ నేర్పుగా అతనిని తప్పించాడు. అనాటికే రాజువద్ద ఆయుధ సామగ్రి తరిగిపోయింది. ఆయుధాల సేకరణకోసం గూడెం వద్దనున్న సైనిక పటాలంపై రాజు దాడిచేశాడు. కాని ఫలితం లేకపోయింది. పోలీసులు ఎదురు దాడిలో రాజు అనుచరులు కొందరు గాయపడగా, ఒకరు మరణించారు. 1924 జనవరి నెలలో అస్సాం రైఫిల్ నర్సీపట్నం చేరాయి. రూథర్ ఫర్డ్ ప్రత్యేక కమీషనర్ గా నియమితుడయ్యాడు. రాజు పట్ల సానుభూతిగల స్థానిక ప్రజలను నిర్బంధించి, హింసించారు. మే 6వ తేదీన మాడేరు నది వద్ద మలబారు పోలీసులు రాజుదళంపై దాడి చేశారు. అగ్గిరాజు పట్టుబడ్డాడు. చివరకు 1924 మే 7వ తేదీన తూర్పుతీర ప్రత్యేక దళానికి చెందిన జమేదార్ కంచుమీనెన్ ఒక వ్యక్తిని రాజుగా అనుమానించి పట్టుకోగా మేజర్ గుడాల్ కాల్చి చంపాడు. వెంటపడి, బంధించాడు. 1924 జూన్ నాటికి రంపా విప్లవం ఆగిపోయింది.

## 16.8 సమీక్ష :

ఉద్యమం పూర్తిగా అహింసాయుతంగా సాగడాన్ని కొందరు యువకులు జీర్ణించుకోలేక పోయారు. దీనికి తోడు ఉద్యమం ఉధృతంగా సాగుతూ వున్న సమయంలో చౌరీ చౌరా సంఘటన జరగడంతో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్ధాంతరంగా నిలుపుదల చేయడాన్ని యువకులు అంగీకరించ లేదు. దీనితో విప్లవోద్యమం పట్ల యువకులు ఆకర్షితులయ్యారు. ఫలితంగా స్వాతంత్రోద్యమంలో సమాంతరంగా విప్లవోద్యమాలు నడిచాయి.

## 16.9 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 16.9.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. చిట్టగాంగ్ దోపిడీ
2. లాహోర్ కుట్ర కేసు

### 16.9.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశంలో స్వాతంత్రోద్యమ సమయంలో జరిగిన విప్లవోద్యమాలను గురించి రాయండి.

### 16.9.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. చిట్టగాంగ్ దోపిడీ నాయకుడు ఎవరు.
2. హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ సంస్థ రూపకర్త ఎవరు.
3. లాలా లజపతి రాయ్ మరణానికి కారకుడైన ఆంగ్ల అధికారి ఎవరు.
4. పార్లమెంట్ లో భగత్ సింగ్, భూటకేశ్వర్ దత్ లు ఎప్పుడు బాంబులు వేశారు.
5. రంపా విప్లవ నాయకుడు ఎవరు.

## 16.10 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర
9. Leftism in India, 1917–1947 – Satyabratha Roy Choudary


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం – 17
# సుభాష్ చంద్రబోస్ – భారతజాతీయ సైన్యం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమం లో ప్రధాన పాత్ర పోషించిన సుభాష్ చంద్ర బోస్ మరియు భారత జాతీయ సైన్యం లను గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

17.1 పరిచయం

17.2 సుభాష్ చంద్ర బోస్

17.2.1 సహాయనిరాకరణోద్యమంలో బోస్

17.2.2 ఫార్వర్డ్ బ్లాక్

17.2.3 భారత జాతీయ సైన్య సాయుధ పోరాటం

17.3 సమీక్ష

17.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

17.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు

17.4.2 పది మార్కుల ప్రశ్నలు

17.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు

17.5 ఉపయుక్త గ్రంధాలు

## 17.1 పరిచయం :

భారత స్వాతంత్రోద్యమంలోకి గాంధీ ప్రవేశించడంతో ఉద్యమ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ఉద్యమం పూర్తిగా అహింసాయుతంగా సాగడాన్ని కొందరు యువకులు జీర్ణించుకోలేక పోయారు. దీనికి తోడు ఉద్యమం ఉధృతంగా సాగుతూ వున్న సమయంలో చౌరీ చౌరా సంఘటన జరగడంతో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్ధాంతరంగా నిలుపుదల చేయడాన్ని యువకులు అంగీకరించలేదు. అందులో సుభాష్ చంద్ర బోస్ ప్రధానమైన వాడు. సాయుధ ఉద్యమంతో స్వాతంత్ర్య సాధన సాధ్యం అని భావించి అందుకు కృషి చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇంగ్లాండ్ శత్రు దేశాలైన జర్మనీ, జపాన్ దేశాల సహకారం తో స్వాతంత్ర్య సముపార్జనకు ప్రయత్నించాడు.

## 17.2 సుభాష్ చంద్రబోస్:

గాంధీ నాయకత్వంలో అహింసా యుతంగా స్వాతంత్రోద్యమం జరుగుతున్నా సమయంలో సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం సాధించ వచ్చని భావించి అందుకు కృషి చేసిన నాయకుడు – ప్రజలందరిచేత నేతాజీ అని పిలిపించుకునే చిరస్మరణీయుడు – సుభాష్ చంద్రబోస్

సుభాస్ చంద్రబోస్ 1897 వ సంవత్సరం జనవరి నెల 23 వ తేదీన ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జానకీనాథ్ బోస్, ప్రభావతీ దేవి దంపతులకు జన్మించాడు. బోస్ తండ్రి న్యాయవాది. జాతీయభావాలు గలవాడు. జానకీనాథ్ బోస్ కొంతకాలం బెంగాల్ శాసనమండలి సభ్యులుగా కూడా పనిచేశాడు. సుభాష్ చంద్ర బోస్ కటక్ లోని రావెన్ష కాలేజియేట్ పాఠశాలలోనూ, కలకత్తాలోని స్కాటిష్ చర్చి కాలేజీలోను, ఫిట్జ్ విలియంకాలేజీ లోనూ విద్యను అభ్యసించాడు.

సుభాష్ చంద్ర బోస్ 1920 వ సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలు రాశి అందులో ఉత్తీర్ణుడయ్యాడు. నాలుగవ ర్యాంక్ సాధించి సివిల్ సర్వీస్ ఉద్యోగం సంపాదించాడు. అరవింద్ ఘోష్, బాలగంగాధర తిలక్ ప్రసంగాల వల్ల ప్రభావితుడయ్యాడు.

### 17.2.1 సహాయనిరాకరణోద్యమంలో బోస్:

సుభాష్ చంద్రబోస్ 1920 వ సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి, అందులో ఉత్తీర్ణుడయ్యాడు. నాలుగవ ర్యాంక్ సాధించి సివిల్ సర్వీసు ఉద్యోగం సంపాదించాడు. అరవిందఘోష్, బాలగంగాధర తిలక్ ప్రసంగాల వల్ల ప్రభావితుడయ్యాడు. రౌలత్ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో భాగంగా స్వాతంత్రోద్యమ తెరపై ఆవిర్భవించిన గాంధీ 1920 వ సంవత్సరంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1920వ సంవత్సరం సెప్టెంబర్ లో కలకత్తాలో కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం జరిగింది. లాలాలజపతిరాయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గాంధీ సహాయనిరాకరణ ఉద్యమ తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు. ఈ సమావేశంలో తీర్మానం ఆమోదింపబడింది. తర్వాత 1920 డిసెంబర్ లో నాగపూర్ లో విజయ రాఘవాచారి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశం సహాయ నిరాకరణోద్యమం తీర్మానాన్ని ధృవీకరించడంతో గాంధీ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

భారతదేశంలో ఆంగ్ల ప్రభుత్వం పరిపాలన చేయగలుగుతోంది అంటే అందుకు భారతీయులు సహకరిస్తూ ఉండడమే ప్రధాన కారణం కనుక వారికి సహాయ నిరాకరణ చేయడం ద్వారా ప్రభుత్వం దిగి వచ్చేలాగా చేయడమే సహాయ నిరాకరణ ప్రధానలక్ష్యం.

సహాయ నిరాకరణ కార్యక్రమాల్లో బహిష్కరణ ప్రధానమైన అంశం. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులను గౌరవ ఉద్యోగాలను త్యజించడం, ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు, దర్బారులకు, సన్మానాలకు హాజరు కాకుండా ఉండడం, విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలను బహిష్కరించి జాతీయ పాఠశాలలో చేరడం, ప్రభుత్వ న్యాయస్థానాలను బహిష్కరించి వాటి స్థానంలో స్వదేశీ న్యాయస్థానాలను ఏర్పరచడం, విదేశీ వస్త్రాలను వస్తువులను బహిష్కరించి ఖద్దరు వస్త్రాలు, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం , కొత్త శాసనసభ ఎన్నికలలో అభ్యర్థులు పోటీ చేయకుండా ఉండడంతో పాటు పోటీలో ఉన్న

వారు ఉపసంహరించుకోవడం అనేవి సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా చేపట్టబడ్డాయి. ఈ పిలుపును అందుకుని సుభాష్ చంద్ర బోస్ సివిల్ సర్వీస్ ఉద్యోగాన్ని వదిలివేసి స్వాతంత్రోద్యమం లో ప్రవేశించారు.

సహాయ నిరాకరణోద్యమం సమయంలో గాంధీ బోస్‌ను కలకత్తా పంపారు . అక్కడ చిత్తరంజన్ దాస్ తో కలసి బోస్ బెంగాల్‌లో ఉద్యమం నిర్వహించాడు. చిత్తరంజన్ దాస్ సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని జాతీయ కళాశాలను ఏర్పాటు చేశాడు. అంతేకాకుండా ఫార్వర్డ్ అనే పత్రికను ప్రారంభించాడు. ఈ జాతీయ కళాశాలలో బోస్ ప్రిన్సిపాల్ గా బాధ్యతలను నిర్వహించడంతో పాటు ఫార్వర్డ్ పత్రికా సంపాదకునిగా పనిచేశాడు. వేల్స్ యువరాజు పర్యటనను నిరసిస్తూ కలకత్తాలో ప్రదర్శనలు నిర్వహించినందుకు బోస్ అరెస్ట్ అయి ఆరు నెలలు జైళ్ళ గడిపాడు. చిత్తరంజన్ కలకత్తా కార్పోరేషన్ మేయర్ గా వున్న సమయంలో సుభాష్ చంద్రబోస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా నియమింప బడ్డాడు. బోస్ భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగంలో చురుకైన పాత్ర నిర్వహించ సాగాడు. ఈ రకంగా ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే గోరఖ్ పూర్ జిల్లాలో ఉన్న చౌరీచౌరా లో 1922 వ సంవత్సరం ఫిబ్రవరి ఐదవ తేదీన ఊరేగింపు చేస్తున్న ప్రజల పైన పోలీసులు కాల్పులు జరిపారు. దీనితో ఆగ్రహానికి లోనైన ప్రజలు పోలీసులుపై తిరగబడ్డారు. పోలీసులు పారిపోయి పోలీస్ స్టేషన్ లో తలదాచుకున్నారు. రెచ్చిపోయిన ఉద్యమకారులు పోలీస్ స్టేషన్ కు నిప్పు పెట్టడంతో 22 మంది పోలీసులు సజీవదహనమయ్యారు. దీనితో అహింసాయుత ఉద్యమానికి ప్రజలు ఇంకా సన్నద్ధం కాలేదు అని భావించిన గాంధీ 1922 సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన ఉద్యమాన్ని నిలిపివేశారు. దీనిని సుభాష్ చంద్ర బోస్ తీవ్రంగా వ్యతిరేకించాడు. గాంధీ యొక్క అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, సాయుధ పోరాటం కూడా ముఖ్యమని బోస్ అభిప్రాయం.

1924 లో విప్లవోద్యమంతో సంబంధాన్ని కలిగివున్నాడనే ఆరోపణతో ఆంగ్ల ప్రభుత్వం సుభాష్ చంద్ర బోస్ ను అరెస్ట్ చేసి అరెస్ట్ చేసి మాండలే జైలులో పెట్టింది. బోస్ అనారోగ్యం వల్ల 1927లో విడుదల అయ్యాడు. ప్రజా కార్యక్రమాలలో పాల్గొంటున్న సుభాష్ చంద్ర బోస్ భగత్ సింగ్ అనుచరుడైన జితేంద్రనాథ్ జైళ్ళో నిరహార దీక్ష చేసి మరణించగా అతడి శవాన్ని కలకత్తాకు తీసుకొని వచ్చాడు. ఈ సందర్భంలో హాజరైన అశేష ప్రజలను ఉద్దేశించి ఆవేశపూరితమైన ప్రసంగాన్ని చేసి ప్రజలను చైతన్యం చేశాడు. దీనితో ప్రభుత్వం ప్రజలను రెచ్చగొడుతున్నాడనే నెపం మోపి అరెస్ట్ చేసి ఆరునెలలు జైలు శిక్ష విధించడంతో సుభాష్ చంద్ర బోస్ 1931లో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాడు. దీనికి తోడు మధురలో జరిగిన యువజన సమ్మేళనంలో ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆవేశపూరితంగా ప్రసంగించి మరోసారి జైలు శిక్షకు గురయ్యాడు.

### 17.2.2 ఫార్వర్డ్ బ్లాక్:

సుభాష్ చంద్ర బోస్ 1938వ సంవత్సరం హరిపురలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షుడు గా అన్నికయ్యాడు. ఈ సమావేశంలో మాట్లాడుతూ – భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వడం కోసం ప్రభుత్వం ఒక గడువు పెట్టి ఆ గడువు లోగా భేషరతుగా స్వాతంత్ర్యాన్ని ఇవ్వాలని ఆంగ్ల ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశాడు.

1939 వ సంవత్సరం లో త్రిపుర లో భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఇందులో కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నిక అవ్వడంకోసం సుభాష్ చంద్ర బోస్ సిద్ధం కాగా, గాంధీ అందుకు అంగీకరించక తన అనుచరుడైన భోగరాజు పట్టాభిసీతారామయ్య ను పోటీకి నిలిపాడు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో సుభాష్ చంద్ర బోస్ విజయం సాధించాడు. అయితే గాంధీజీ సహా ఇతర నాయకులు సహకరించకపోవడంతో అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. రాజీనామా చేసిన సుభాష్ చంద్ర బోస్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించాడు. పార్టీ లక్ష్యాన్ని వివరిస్తూ దేశవ్యాప్తంగా పర్యటించాడు. ఈ సమయంలో ఆరునెలల్లో ఆంగ్లేయులు భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వకపోతే సాయుధ పోరాటం చేయాలని పిలుపునిచ్చాడు. వీర సావర్కర్ ను కలుసుకొని అనేక విషయాలను చర్చించాడు.

### 17.2.3 భారత జాతీయ సైన్య సాయుధ పోరాటం :

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం అయింది. మొదట్లో మిత్రరాజ్యాలు వెనుకబడ్డాయి. దీనిని ఆసరాగా చేసుకులో బ్రిటిషు వారికి ఉన్న ప్రతికూలతలు గమనించి జర్మనీ, ఇటలీల అదుపులో ఉన్న భారత యుద్ధ ఖైదీలను సమీకరించి జపాన్ సహకారం కోసం ప్రయత్నించి తూర్పు సముద్రం ద్వారాగానీ , బర్మా ద్వారాగానీ ఆంగ్లేయ స్వాధీనంలో వున్న భారత దేశం పై దాడిచేసి దేశ విమోచన పొందవచ్చని ఒక ప్రణాళికను బోస్ సూచించాడు.

తర్వాత కలకత్తాకు చేరుకున్న సుభాష్ చంద్ర బోస్ ను ప్రభుత్వం అరెస్ట్ చేసి నిర్బంధంలో వుంచింది. నిర్బంధంనుండి బయట పడడానికి గడ్డం పెంచి ఎవరితో సంభాషించకుండా మౌనంగా అధ్యాత్మిక చింతనలో గడుపుతున్నట్లు నటించాడు. 1941 జులై 16న జైలు నుండి తప్పించుకున్నాడు. కలకత్తా నుండి నలభై మైళ్ళు ప్రయాణించి పెషావర్ చేరుకొని జియావుద్దీన్ అనే మారు పేరుతో భగత్ రామ్ సహాయంతో కాబూల్ చేరాడు. అక్కడి నుండి మాస్కోద్వారా జర్మనీ చేరాడు.

జర్మనీ విదేశాంగ సహకారంతో భారత సైన్యాన్ని నిర్మించి జర్మన్లు దాడికి పూనుకున్నపుడే ఇండియన్ సేనతో దాడి జరపాలని నిర్ణయించుకున్నాడు. జపాన్ లో నివసిస్తున్న విప్లవకారుడు రాస్ బీహారీ బోస్ భారత స్వాతంత్ర్యం కోసం ఒక విముక్తి సేనను సమకూర్చుకోవాలని ఆలోచించి బ్యాంకాక్ సమ్మేళనానికి బోస్ ను ఆహ్వానించాడు. మలేషియాలో ఆంగ్ల సైన్యం జపాన్ చేతిలో ఓడిన సమయంలో కెప్టెన్ మోహన్ సింగ్ అనే సైన్యాధికారి పారిపోవడానికి ప్రయత్నించకుండా జపాన్ సేనలకు లొంగిపోయాడు. జపాన్ కెప్టెన్ మోహన్ సింగ్ ను భారత స్వాతంత్ర్యానికి పోరాడే విధంగా పురికొల్పి తన ఆధీనంలో ఉన్న భారతీయ ఖైదీలను విడిచిపెట్టి సైన్య నిర్మాణం కోసం కెప్టెన్ మోహన్ సింగ్ కు అప్పగించారు. వారితో మోహన్ సింగ్ భారత జాతీయ సైన్యాన్నిభారత జాతీయ సైన్యాన్ని 1942 వ సంవత్సరం సెప్టెంబర్ 1 వ తేదీన నిర్మించాడు. దీనికే ఆజాద్ హింద్ ఫౌజ్ అని పేరు. సైన్య నిర్మాణంలో పాలు పంచుకున్న రాస్ బీహార్ బోస్, కెప్టెన్ మోహన్ సింగ్ లు తర్వాత విడిపోయి జపాన్ చేతిలో అరెస్టయ్యారు.

బోస్ జర్మనీ నుండి సరైన సహకారం లభించక పోవడం వల్ల జలాంతర్గాముల్లో ప్రయాణించి సుమత్రా చేరాడు. అక్కడ కల్నల్ యామమో తో కలిసి టోక్యో చేరాడు. ఈ సమయంలోనే భారతదేశంనుండి ఆంగ్లేయులను వెళ్ళగొట్టడానికి జపాన్ సహాయపడుతుందని జపాన్ ప్రధాని జపాన్ శాసన సభలో ప్రకటించాడు. దీనితో సుభాష్ చంద్ర బోస్ జపాన్

ప్రభుత్వంతో సంప్రదించి కెప్టెన్ మోహన్ సింగ్ కు ఎదురైన చిక్కులను పరిష్కరించాడు. అనంతరం 1943వ సంవత్సరం జులై 2 వ తేదీ నాటికి బోస్ సింగపూర్ చేరాడు. అక్కడ రాస్ బీహారీ బోస్ ప్రోత్సాహంతో భారత స్వాతంత్ర్య లీగ్ అధ్యక్ష పదవిని, ఆజాద్ హింద్ ఫౌజ్ సైనిక వందనాన్ని స్వీకరించాడు.

1943 అక్టోబర్ 21 తేదీన బోస్ భారత దేశ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పర్చాడు. బోస్ అధ్యక్షుడుగా, సర్వసైన్యాధిపతిగా, ఆర్ధికమంత్రిగా, ఎపి చటర్జీ ప్రసార సారధిగా, ఎస్ ఎ అయ్యర్ మహిళా విభాగ సారధిగా ప్రభుత్వం ఏర్పడింది. జాతీయ భాషగా హిందీని , ఠాగూర్ రాసిన గీతం జాతీయ గీతంగా, త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా స్వీకరించారు. అధికార నినాదంగా జైహింద్ స్వీకరించారు. జపాన్ తాను స్వాదీనం చేసుకున్నా అండమాన్, నికోబార్ దీవులను తాత్కాలిక భారత ప్రభుత్వ స్వాధీనం చేసింది. సుభాష్ చంద్ర బోస్ ఆదీవులకు షహీద్ ద్వీపం, స్వరాజ్య ద్వీపం అని పేర్లు పెట్టాడు. రంగూన్ లో ఎనిమిది కోట్ల మూలధనంతో ఫ్రీ ఇండియా బ్యాంకును ప్రారంభించాడు.

రంగూన్ నుండి ఆంగ్లేయ స్వాధీనంలోని భారత దేశం పై దాడికి బయలుదేరిన భారత జాతీయ సైన్యం భారత్ సరిహద్దుల్లో ఆంగ్ల సైన్యంతో పోరాడి 1944 ఫిబ్రవరి 1న తొలి విజయాన్ని సాధించింది. తరువాత కోహిమాను గెల్చి త్రివర్ణ పతాకాన్ని ప్రతిష్ఠించింది. దాడిని కొనసాగించిన జాతీయ సైన్యం అస్సాం పై దాడికి సిద్ధమైంది కానీ వర్షకాలం అవడం వర్షాలు అధికంగా కుర్స్తూ ఉండడం తో దాడి చేయలేకపోయారు.

రాను రాను జాతీయ సైన్య సామర్థ్యం తగ్గి పోసాగింది. జాతీయ సైన్యానికి విమాన బలం, శతఘ్నులు, ఆధునిక ఆయుధాలు పెద్దమొత్తంలో లేవు. అంతేకాకుండా సరైన రవాణా సౌకర్యాలు, వైద్యసదుపాయాలు లేవు. దీనితో జాతీయ సైన్యం సామర్థ్యం సన్నగిల్లింది. 1945 జనవరి నాటికి జపాన్ భారతీయ సైన్యాలను అరకాన్ ప్రాంతం నుండి తరిమివేయడం జరిగింది. బ్రిటి సైన్యం ఇరావది నదిని దాటడంతో భారత జాతీయ సైన్యం తప్పనిసరిగా వెనుదిరగాల్సి వచ్చింది. క్రమంగా జాతీయ సైన్యంలోని అధికారులూ, సైనికులూ సైన్యాన్ని వదిలి పోసాగారు. భారత జాతీయ సైనికులు ఆయుధాలు విడిచిపెట్టారు. సింగపూర్ నుండి బ్యాంకాక్, అక్కడి నుండి సైగాను వెళ్ళి అక్కడినుండి బోస్ ఫార్మోజాకు చేరుకున్నాడు. టోక్యో వెళ్ళవలసిన విమానం ఫార్మోజానుండి బయలుదేరింది కాని కొద్ది సేపట్లో కూలిపోయింది. తరువాత బోస్ కనుమరుగైనాడు.

## 17.3 సమీక్ష :

ఉద్యమం పూర్తిగా అహింసాయుతంగా సాగడాన్ని కొందరు యువకులు జీర్ణించుకోలేక పోయారు. దీనికి తోడు ఉద్యమం ఉధృతంగా సాగుతూ వున్న సమయంలో చౌరీ చౌరా సంఘటన జరగడంతో గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్ధాంతరంగా నిలుపుదల చేయడాన్ని యువకులు అంగీకరించ లేదు. దీనిని సుభాష్ చంద్ర బోస్ వ్యతిరేకించాడు. ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీని స్థాపించాడు. భారత జాతీయ సైన్యాన్ని స్థాపించి జర్మనీ, జపాన్ ల సహాయంతో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో స్వాతంత్ర్య సముపార్జనకు కృషి చేశాడు.

## 17.4 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 17.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. ఫార్వర్డ్ బ్లాక్
2. భారత జాతీయ సైన్యం

### 17.4.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశం స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చేసిన పోరాటాన్ని వివరించండి.

### 17.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. సుభాష్ చంద్ర బోస్ ఎక్కడ జన్మించాడు.
2. 1938 వ సంవత్సరంలో కాంగ్రెస్ సమావేశం ఎక్కడ జరిగింది.
3. 1939 లో కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎవరిపై విజయం సాధించాడు.
4. భారత జాతీయ సైన్యం ఎప్పుడు స్థాపింప బడింది.
5. భారత జాతీయ సైన్యం మరో పేరు ఏమి.

## 17.5 ఉపయుక్త గ్రంధాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర
9. Leftism in India, 1917-1947 – Satyabratha Roy Choudary


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★

# పాఠం – 18
# 1935 చట్టం

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారత స్వాతంత్రోద్యమం జరుగుతూ వున్న సమయంలో ఆంగ్ల ప్రభుత్వం చేసిన 1935 చట్టం గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

18.1 పరిచయం

18.2 చట్టం జారీచేయడానికి దారితీసిన పరిస్థితులు

- 18.2.1 సెలెక్ట్ కమిటీ నివేదిక
- 18.2.2 పార్లమెంట్ ఆమోదం
- 18.2.3 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రధాన అంశాలు
- 18..2.4 విమర్శ

18.3 సమీక్ష

18.4 పరీక్ష నమూనా ప్రశ్నలు

- 18.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు
- 18.4.2 పది మార్కుల ప్రశ్నలు
- 18.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు

18.5 ఉపయుక్త గ్రంధాలు

## 18.1 పరిచయం :

భారత దేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయ ప్రభుత్వం తన పాలనా సమయంలో అనేక రాజ్యాంగ సంస్కరణలు, రాజ్యాంగ చట్టాలను చేసి భారతీయులలో వున్న అసంతృప్తిని పోగొట్టే ప్రయత్నం చేసింది. అటువంటి చట్టాలలో చివరి చట్టం 1935 చట్టం. ఇది భారతదేశంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని అందించటంలో ఒక మైలురాయిగా పేరుపొందింది. అంతేకాకుండా స్వాతంత్ర్యానంతరం భారతదేశం చేసిన 1950 భారత రాజ్యాంగ చట్టానికి కూడా మూల ప్రాతిపదికగా ఉపయోగపడింది.

## 18.2 చట్టం జారీచేయడానికి దారితీసిన పరిస్థితులు :

1919 చట్టం పనితీరును గురించి అధ్యయనం చేయడానికి వచ్చిన సైమన్ కమీషన్ తన నివేదిక సమర్పించింది. 1929 లాహోర్ కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యంగానే ఉద్యమం సాగుతుందని తీర్మానించింది. ఈ కాంగ్రెస్ తీర్మానం మేరకు శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభం అయింది. ఈ దండి సత్యాగ్రహం జరుగుతూ వున్న సమయంలో జాతీయ కాంగ్రెస్ నాయకులందరిని జైళ్ళలో నిర్బంధించారు. ఈ సమయంలో ఆంగ్ల ప్రభుత్వం కాంగ్రెసేతర రాజకీయపార్టీలతో, ప్రభుత్వ సానుభూతిపరులతో, వివిధ ప్రతినిధులతో అనేక విషయాలను చర్చించారు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి అందరినీ చర్చలకు ఆహ్వానించారు. అయితే భారత జాతీయ కాంగ్రెస్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. దీనితో మొదటి రౌండ్ టేబుల్ సమావేశం విఫలమై జాతీయ కాంగ్రెస్ ప్రాతినిధ్యం లేకుండా జరిగే సమావేశాలలోని నిర్ణయాలకు విలువలేదని ఆంగ్ల ప్రభుత్వం గ్రహించింది. రెండవ రౌండ్ టేబుల్ సమావేశాలకు గాంధీని కాంగ్రెస్ ప్రతినిధిగా రప్పించి.. సమావేశం నిర్వహించారు. అయితే కమ్యూనల్ రిజర్వేషన్లకు సంబంధించి, గాంధీ అర్థాంతరంగా సభ నుంచి నిష్క్రమించారు. బ్రిటన్ ప్రధానమంత్రి రామ్సే మెక్ డోనాల్డ్ నాయకత్వాన సమస్య పరిష్కారానికి మిగతా రాజకీయ పార్టీలు అంగీకరించారు. దీనిని రామ్ మెక్డొనాల్డ్ 16 ఆగస్టు 1932న పేరుమోసిన 'కమ్యూనల్ అవార్డ్'గా ప్రకటించారు. దీని ప్రకారం భారతదేశంలోని నిమ్న వర్గాలకు, అల్ప సంఖ్యాక వర్గాలకు, ముస్లిం మైనారిటీలకు కుల ప్రాతిపదికన ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. దీనిని తీవ్రంగా తప్పుపట్టిన మహాత్మాగాంధీ నిరసనతో బ్రిటిష్ ప్రభుత్వానికి ఘాటైన ఉత్తరం వ్రాయడమేగాక, ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. మూడవ రౌండ్ టేబుల్ సమావేశాన్ని కూడా భారత జాతీయ కాంగ్రెస్ బహిష్కరించింది.

### 18.2.1 సెలెక్ట్ కమిటీ నివేదిక :

రౌండ్ టేబుల్ సమావేశాల అనంతరం ఆంగ్ల ప్రభుత్వ నిర్ణయాలను ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసి వివరించింది.అయితే ఈ శ్వేత పత్రంలోని అంశాలను భారత జాతీయ కాంగ్రెస్ తో పాటు ఎవరూ అంగీకరించలేదు. ఇది తమకు ఆమోదయోగ్యం కాదు అని ప్రకటించారు. ఇవేవీ పట్టించుకోని ఇంగ్లాండ్ ప్రభుత్వం దీనిని ఇంగ్లాండ్ పార్లమెంట్ సంయుక్త సెలెక్ట్ కమిటీ ముందు దీనిని ఉంచింది. లిత్ అధ్యక్షుడుగా ఇంగ్లాండ్ పార్లమెంట్ లోని రెండుసంభాలలో ఒక్కోసభ నుంచి పదహారు మంది సభ్యులుగా గల సెలెక్ట్ కమిటీ దీనిని అధ్యయనం చేసింది. కొందరు భారతదేశంలోని సంస్థానాధీశులతో చర్చలు జరిపి చివరకు సెలెక్ట్ కమిటీ 1934 సంవత్సరం నవంబర్ నెల 13వ తేదీన తన నివేదికను సమర్పించింది.

### 18.2.2 పార్లమెంట్ ఆమోదం :

సెలెక్ట్ కమిటీ సిఫార్సుల మేరకు మొదటగా ఈ బిల్లును 1935వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఇంగ్లాండ్ పార్లమెంట్ లోని హౌస్ ఆఫ్ కామన్స్ సభలో ప్రవేశపెట్టారు. లేబర్ పార్టీ సూచించిన అంశాలతో బిల్లులో కొన్ని అంశాలకు సవరణలు చేశారు. తర్వాత ఈ బిల్లును సభ ఆమోదించింది. అనంతరం బిల్లును పార్లమెంట్ లోని హౌస్ ఆఫ్ లార్డ్ లో ప్రవేశ పెట్టారు. ఆ సభలో కూడా ఆమోదం పొందింది. చివరకు ఇంగ్లాండ్ రాణి 1935వ సంవత్సరం ఆగస్టు నెల 2వ తేదీన అంగీకరించడంతో చట్టం గా మారింది. ఈ చట్టానికి భారత ప్రభుత్వ చట్టం 1935 అనే పేరు ఏర్పడింది.

### 18.2.3 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రధాన అంశాలు :

1. ఈ చట్టం అఖిలభారత సమాఖ్యను ఏర్పాటుచేసింది. ఆంగ్ల పాలనలోని భారత దేశంలోని స్వదేశీ సంస్థానాలు, రాష్ట్రాలు అన్నీ ఇందులో భాగంగా వుంటాయి. అయితే ఇందులో చేరిన సంస్థానాల పాలకులకు స్వేచ్ఛ వుంటుంది. ఇందులో చేరిన సంస్తానాలన్నీ ప్రభుత్వం తయారు చేసే అమోదయోగ్య పత్రం పైన సంతకాలు చేయాలి.

2. 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం కేంద్రంలో ద్విశాసన సభా పద్దతి వుంటుంది. రెండు సభలలోని ఎగువ సభకు 104 మంది, దిగువ సభలో 125 మంది సభ్యులను సంస్థానాలనుంచి ఎన్నుకుని పంపుతారు. ఇక రాష్ట్రాలనుంచి ఎగువ సభకు 156 మంది, దిగువ సభకు 250 మందిని ఎన్నుకుంటారు. సంస్థానాల నుంచి సంస్థానాధిపతులు సభ్యులను నామినేట్ చేస్తారు. రాష్ట్రాలనుంచి వచ్చే సభ్యులు మతప్రాతిపదికపై ఎంపిక చేయ బడతారు.

3. కేంద్ర ప్రభుత్వ అధికారాలను 1935 చట్టం కేంద్ర అధికారాలు, రాష్ట్రాధికారాలు, ఉమ్మడి అధికారాలు అనే మూడు రకాలుగా విభజించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ అధికారాలపై శాసనాలను చేసే అధికారం వుంటుంది. ఉమ్మడి అధికారాలకు సంబధించిన శాసనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేస్తాయి. అయితే, ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం అప్పటికే శాసనం చేసి ఉంటే, రాష్ట్రాలకు వాటిపై శాసనం చేసే అధికారం వుండదు. విశేషాధికారాలను కేంద్రానికి గాని, రాష్ట్రానికి గాని కేటాయించే విశిష్ట అధికారం గవర్నర్ జనరల్ కు వుంటుంది.

4. 1935 చట్టం కేంద్రంలో ఉన్న అధికారాలను రిజర్వ్, ట్రాన్స్ ఫర్డ్ శాఖలుగా విభజించింది. రిజర్వు అధికారాలను ఉపయోగిస్తూ గవర్నర్, ఆయన ఎన్నిక చేసుకున్న ముగ్గురు సలహాదారులతో కలిసి పరిపాలించే పాలించే అధికారం ఇచ్చింది. ట్రాన్స్ ఫర్డ్ శాఖల అధికారాలను వాటి గవర్నర్ జనరల్, భారతీయ మంత్రులతో కూడిన మంత్రి మండలి సహాయంతో నిర్వహించాలని పేర్కొంది. కీలక శాఖలైన రక్షణ, విదేశ వ్యవహారాలు, మత విషయాలు, ఆర్థిక వ్యవహారాలను రిజర్వ్ శాఖలో ఉంచి, సాధారణ పరిపాలన వంటి బాధ్యత కలిగిన శాఖలను ట్రాన్స్ ఫర్డ్ భాగంలో చేర్చారు.

5. మంత్రుల సంఖ్య పదికి మించకూడదు. ఇంగ్లాండ్ తరహాలోనే క్యాబినెట్ నియామకం జరిగినప్పటికీ, అందులో సంస్థానాల ప్రతినిధులు, అల్ప సంఖ్యాక వర్గాల ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఉండాలని షరతు పెట్టింది. వీరు కేంద్ర శాసన సభకు బాధ్యత వహించాలి.

6. 1935 చట్టం శాసనసభలో ద్విసభావిధానాన్ని ఏర్పాటు చేసింది. ఆ రెండు సభలకు ఫెడరల్ అసెంబ్లీ, కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ అని పేర్లు. ఫెడరల్ అసెంబ్లీకి ఐదేళ్ళకోసారి ఎన్నికలు జరుగుతాయి. మత ప్రాతినిధ్యం, పరిమిత ఓటింగ్ హక్కు కలిగిన ప్రజలు వీరిని ఎన్నుకుంటారు. రాష్ట్రాల పాలకులు, కొంతమందిని

ఎన్నుకోగా సంస్థానాధీశులు కొందరు కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ సభ్యులుగా నామినేట్ చేస్తారు. ఈ సభలో ప్రతి మూడేళ్ళకు ఒక్కసారి 1/3 వంతు మంది సభ్యులు పదవీ విరమణ చేస్తారు.

7. 1935 చట్టం భారత శాసనసభల అధికారాలను చాలావరకు పరిమితం చేసింది. సైనిక శాసనం, వాయుసేన చట్టం, బ్రిటిష్ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాలు, రాజరికం, వారసత్వం విషయాలపై కేంద్ర, రాష్ట్ర శాసనసభలు ఎలాంటి శాసనాలు చేయడానికి వీలులేదు. అంతేకాదు 1935 చట్టాన్ని సవరించడానికి కూడా కేంద్ర, రాష్ట్ర శాసన సభలకు వీలులేదు. వ్యాపారం తదితర బ్రిటిష్ ప్రయోజనాలకు విరుద్ధంగా శాసనాలు చేసే అధికారం కూడ లేదు. వాస్తవంగా బడ్జెట్ లో మొత్తం 80% పద్దులపై ఓటు వేసే అధికారం శాసనసభలకు ఇవ్వలేదు. ఒకవేళ రెండు శాసనాల మధ్య ఏదైన విషయంలో విభేదం వచ్చినపుడు సంయుక్తంగా కూర్చొని మెజారిటీ ద్వారా తీర్మానం చేయాలి.

8. 1935 చట్టం ప్రకారం ఎలాంటి శాసనమైనా 'వీటో' చేసే అధికారం గవర్నర్ జనరల్ కు ఇవ్వబడింది. బిల్లులను పునః పరిశీలించమని చెప్పడానికి గానీ, బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపేందుకు గాని ఈయనకు అధికారముంది.

9. 1935 చట్టం ప్రకారం రాష్ట్రాలలో మంత్రివర్గం ఏర్పాటు జరుగుతుంది. మెజారిటీ పార్టీకి చెందిన నాయకున్ని గవర్నర్ ముఖ్యమంత్రిగా నియమించి, మిగతావారిని ఆయన సలహాదారులుగా నియమించాలి. మంత్రులందరూ సమిష్టి బాధ్యత వహించాలి. గవర్నర్ వారిని ప్రోత్సహించాలి. అనేక పరిమితులతో కూడిన బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఆంగ్ల ప్రభుత్వం రాష్ట్రాలలో ఏర్పాటు చేసింది

10. 1935 చట్టం ప్రకారం చీఫ్ జస్టిస్, ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ఫెడరల్ న్యాయస్థానాన్ని ఏర్పాటుచేసింది. దీనికి స్వయం నిర్ణయాధికారం, అప్పీల్ అధికారం కూడా ఇవ్వబడింది. రాష్ట్రాలపై, స్వదేశీ సంస్థానాలపై న్యాయ సమీక్ష అధికారం దీనికి ఇవ్వబడింది.

11. 1935 చట్టం భారతదేశ రాజ్య వ్యవహార కార్యదర్శి పదవిని, కౌన్సిల్ ను రద్దుచేసింది. గవర్నర్ జనరల్ వివిధ రాష్ట్రాల గవర్నర్లు సెక్రటరీ ఆఫ్ స్టేట్స్ కు బాధ్యత వహిస్తారు.

12. 1935 రాజ్యాంగం చాలా దృఢమైనది. రాజా ంగాన్ని మార్చే అధికారం కేవలం బ్రిటిష్ ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది.

### 18.2.4 విమర్శ :

ఆంగ్ల ప్రభుత్వం జారీచేసిన చట్టాలతో పోల్చినపుడు 1935 చట్టం ఎంతో ప్రయోజనకరంగా ఉందని చాలామంది భావించినప్పటికీ ఇందులో కూడా అనేక లోపాలున్నాయి. బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనలో ఎన్నో పరిమితులను విధించారు. ఫెడరల్ వ్యవస్థ ఎంతో లోప భూయిష్టంగా ఉంది. సమాఖ్య లో చేరే విషయంలో రాష్ట్రాలకు, సంస్థానాలకు స్వేచ్ఛ ఇవ్వడం ఆంగ్ల ప్రభుత్వ విభజించు పాలించు సిద్ధాంతాన్ని బయటపడింది. అంతేకాకుండా ఇది భారత దేశ విభజకు

కారణమైంది. మొత్తం మీద 1935 చట్టం రాజ్యాంగంలో శాసన సభలకు అధికారాలను నిరాకరించడం, గవర్నర్ జనరల్ కు విస్తృత అధికారాలు ఇవ్వడం, రాష్ట్రాలలో గవర్నర్ మంత్రుల సలహాలు ధిక్కరించే అధికారారాన్ని కలిగి వుండడం వంటి వాటి వల్ల భారత దేశంలో ఆంగ్ల ప్రభుత్వ రక్షణకు అనేక చర్యలు తీసుకున్నట్లు స్పష్టమై భారత దేశం పట్ల ఆంగ్లేయుల వైఖరి వెల్లడైంది. శాసనసభకు దాదాపు 80% శాతం పద్దులపై అధికారం లేకపోవడం, శాసన సభపై కార్యనిర్వాహక శాఖకు పెత్తనం కల్పించడం లాంటి సంఘటనలు బాధ్యత గల ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేసినట్టుగా ఉంది. తమ దేశంపై భారతీయులకు నియంత్రణ ఈ చట్టం కల్పించలేదు. వారికి రాజ్యాంగాన్ని సవరించుటకు గాని మార్పుచేసుకోవడానికి గానీ అవకాశం కల్పించలేదు. అధికారమంతా బ్రిటిష్ పార్లమెంట్ కే కట్టబెట్టింది. మత ప్రాతిపదికన నియోజక వర్గాలను ఏర్పరచి భారత జాతీయ ఐక్యతను నాశనం చేసింది.

అందుకే – "ఈ రాజ్యాంగం తమపై బలవంతంగా రుద్దబడిందని, పైకి ప్రజాస్వామికంగా కన్పించినప్పటికీ, లోపల డొల్ల"అని మదన్ మోహన మాలవ్యా విమర్శించాడు.

## 18.3 సమీక్ష :

1935 చట్టం భారతదేశానికి సమైఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ చట్టం ప్రతిపత్తిని కల్పించింది. అనేక నూతన సంస్కరణలు ఇందులో ప్రవేశ పెట్టినా భారతీయులకు సంతృప్తి కలుగలేదు. అందుకు బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనలో ఎన్నో పరిమితులను విధించదమే ప్రధాన కారణం.

## 18.4 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 18.4.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. సెలెక్ట్ కమిటీ
2. 1935 చట్టం లోని శాసనసభా విధానం

### 18.4.2 పది మార్కుల ప్రశ్నలు :

1. 1935 చట్టం లోని అంశాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

### 18.4.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. లాహోర్ లో కాంగ్రెస్ సమావేశం ఏ సంవత్సరంలో జరిగింది.
2. పార్ల మెంట్ సెలెక్ట్ కమిటీ అధ్యక్షుడు ఎవరు.
3. 1935 చట్టం ప్రకారం అధికారారాలను ఎన్ని రకాలుగా విభజించారు.
4. 1935 చట్టం ప్రకారం కేంద్ర శాసనసభలో ఎన్ని సభలు వుంటాయి.
5. 1935 చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన న్యాస్థానం పేరు ఏమి.

### 18.5 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు**

★★★★★★★

# పాఠం – 19
# మతతత్త్వం – ముస్లింలీగ్

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రారంభమయిన ముస్లిం మతత్త్వం, ముస్లిం లీగ్, దాని కార్యక్రమాలు, అవన్నీ దేశ విభజనకు ఏవిధంగా దారితీసింది అనే గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

19.1 పరిచయం

19.2 ముస్లింల పట్ల ఆంగ్లేయుల వైఖరి

19.3 సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్

19.4 మింటో వద్దకు సిమ్లా ప్రతిపాదనలు

19.5 అఖిల భారత ముస్లింలీగ్ స్థాపన

19.5.1 ముస్లింలీగ్ లక్ష్యాలు

19.6 లక్నో ఒప్పందం

19.7 ముస్లింలీగ్ పునరుద్ధరణ

19.8 మహమ్మద్ అలీ జిన్నా

19.9 సమీక్ష

19.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

19.10.1 ఐదు మార్కుల ప్రశ్నలు

19.10.2 పది మార్కుల ప్రశ్నలు

19.10.3 ఒక్క మార్కు ప్రశ్నలు

19.11 ఉపయుక్త గ్రంధాలు

## 19.1 పరిచయం :

1857 తిరుగుబాటు తర్వాత భారత దేశంలో హిందూ ముస్లిం మతాలమధ్య విబేధాలు రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషిచాయి. అవి తీవ్రతరం కావడానికి ఆంగ్లేయులు మరింత దోహదం చేశారు. ఆంగ్లేయులు హిందూ ముస్లిం లు కలిసివుంటే భారతదేశంలో తమ ఉనికికి ఇబ్బంది అని భావించి విభజించు పాలించు అనే విధానాన్ని అనుసరించి వారిమధ్య విబేధాలు తీవ్రతరం కావడానికి కారణమయ్యారు. చివరకు అవి దేశవిభజనకు కారణం అయ్యాయి.

## 19.2 ముస్లింల పట్ల ఆంగ్లేయుల వైఖరి :

1857 తిరుగుబాటు హిందు, ముస్లింల సమైక్య ప్రయత్నం అయినప్పటికీ, ఆంగ్లేయులు మొఘల్ పాలనను పునరుద్ధరించడానికి ముస్లింలు చేసిన ప్రయత్నంగా 1857 తిరుగుబాటును అనుమానించారు. 1857 తిరుగుబాటు తరువాత కొన్ని దశాబ్దాలుగా, బ్రిటిష్ ప్రభుత్వం ముస్లింలపై పగ పెంచుకుంది. ప్రభుత్వంలోనూ సైన్యంలోనూ ప్రధాన పదవులను వారికి ఇవ్వకుండా వారు అణచివేయబడ్డారు. దీనికితోడు చేతివృత్తులపై ఆధారపడి జీవనోపాధిని కలిగిన ముస్లింలు ఇంగ్లాండ్ పారిశ్రామిక విప్లవం వల్ల భారతదేశంలో కుటీరపరిశ్రమలు నాశనం కావడంతో ముస్లింలు జీవనోపాధిని కోల్పోయి ఆర్థికంగా చితికిపోయారు. సాంప్రదాయిక విధానాలను అనుసరించిన ముస్లింలు ఇంగ్లీష్ విద్యపట్ల వారు వ్యతిరేక భావాన్ని పెంపొందించు కోవడంతో, 1872 వరకు కొత్త ఇంగ్లీష్ విద్యా విధానంవల్ల ప్రయోజనాన్ని కూడా పొందలేక విద్యా విషయంలో కూడా ముస్లింలు వెనుకబడ్డారు.

జాతీయోద్యమం ప్రారంభం కావడంతో అంతవరకు ముస్లింల పట్ల వ్యతిరేకంగా వున్న ఆంగ్ల అధికారులు అనుకూలంగా వ్యవహరించడం ప్రారంభించారు. ఆంగ్ల పాలకులు భారత రాజకీయాలలో మతతత్వ ఏర్పాటు ధోరణులను ప్రోత్సహించారు. ముస్లిం అల్పసంఖ్యాక వర్గాల హక్కులను రక్షించే బాధ్యత తమది అని పేర్కొన్నారు. ఈ స్థితిలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ముస్లీంలు ఆంగ్లేయుల మధ్య సఖ్యతకు ప్రయత్నం చేశాడు.

## 19.3 సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ :

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ముస్లిం సంస్కరణవాది. భారతీయ ముస్లింలు ఆంగ్లేయ ప్రభుత్వం మధ్య సఖ్యత, సత్సంబంధాలకోసం ప్రయత్నిస్తూనే ముస్లింలలో సంస్కరణలు తీసుకురావడం ద్వారా వారిని ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి కృషి చేశాడు. 1817 అక్టోబరు 17న డిల్లిలో సంపన్న కుటుంబంలో జన్మించిన అహ్మద్ ఖాన్ విద్యాభ్యాసం అనంతరం కుటుంబ అభీష్టానికి వ్యతిరేకంగా ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగంలో చేరాడు. మొగలుల పతనం, ఆంగ్లేయ అధికారాన్ని, 1857 తిరుగుబాటును ఆంగ్లేయులు అణచివేసిన విధానాన్ని పరిశీలించాడు. ఆంగ్లేయులు ముస్లింలను నమ్మక పోవడాన్ని గమనించి 'భారతదేశ తిరుగుబాటు కారణాలు''ది లాయల్ మొహమ్మదియన్స్ ఆఫ్ ఇండియా'' అనే పుస్తకాలను రచించి ముస్లింలు ఆంగ్లేయులకు విధేయులుగా వున్నారని చెప్పే ప్రయత్నం చేశాడు.

ముస్లింలలో విద్యలో వెనుకబడివున్నారని గుర్తించి వారి విద్యాభివృద్ధికి కృషి చేశాడు. వారిలో పాశ్చాత్య విద్యపట్ల ఆసక్తిని కలిగించాడు. రెండు పాఠశాలల ను స్థాపించడంతో పాటు తన ఆశయాల సాధనకై అలీఘర్ లో ఆంగ్ల ఓరియెంటల్ కళాశాలను స్థాపించాడు. ఈ కళాశాలే తర్వాత అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయమైంది.

ప్రారంభంలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జాతీయ భావాలపట్ల ప్రభావితుడై హిందూ ముస్లింల మధ్య సన్నిహిత సహకార అవసరాన్ని విశ్వసించాడు. సమైక్యంగా ఉంటే, పరస్పరం మద్దతును ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా ఇరువర్గాల అభివృద్ధి సాధ్యమని, పరస్పర విభేదాలు రెండు వర్గాల ప్రజలను నాశనం చేస్తాయని ప్రకటించాడు. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన తర్వాత ఆయన వైఖరి లో మార్పు వచ్చి భారత జాతీయ కాంగ్రెస్ ను వ్యతిరేకించి, ముస్లింలు కాంగ్రెస్ లో చేరవద్దని పిలుపునిచ్చాడు. అందువల్ల అధికమంది ముస్లింలు కాంగ్రెస్ లో చేరలేదు. హిందువులు ఆర్థికంగా ఉన్నతంగా ఉండడంవల్ల, వారు విద్యావంతులు కావడం వల్ల ముస్లింలకు ఆంగ్ల ప్రభుత్వ మద్దతులేకపోతే హిందువులు ముస్లింలను పూర్తిగా అణగదొక్కుతారని సయ్యద్ అహమ్మద్ ఖాన్ ప్రకటించడంతో పాటు ముస్లింలు ప్రభుత్వంపట్ల విశ్వాసపాత్రులై ఉండాలని సలహా ఇచ్చాడు. సయ్యద్ అహమ్మద్ ఖాన్ బెనారస్ రాజా, శివరామ్ ప్రసాద్ లతో కలిసి, 1883లో బ్రిటీష్ పరిపాలనవల్ల విశ్వాసం ప్రకటించే పేట్రియాటిక్ అసోసియేషన్ అనే సంస్థను సంస్థను కాంగ్రెస్ కు పోటీగా స్థాపించాడు. ఈ ఇది కాంగ్రెస్ అభ్యుదయ భావాలను వ్యతిరేకించి, ఆంగ్ల ప్రభుత్వంపట్ల విశ్వాసాన్ని ప్రకటించింది.

## 19.4 మింటో వద్దకు సిమ్లా ప్రతిపాదనలు :

1882 రాజ్యాంగ చట్టం ప్రకారం భారత శాసనసభ కౌన్సిల్ లో ముస్లింలకు తగినంత ప్రాతినిధ్యం లేనందున వారు ఎన్నికల్లో పోటీచేసి గెలిచే అవకాశం లేకుండా పోవడంతో ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని సయ్యద్ అహమ్మద్ ఖాన్ కోరాడు. 1906లో వైస్రాయ్ మింటో భారతదేశంలో కొత్త సంస్కరణలు ప్రవేశ పెట్టే ఆవసరాన్ని పరిశీలించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశాడు. హిందువులు అధికంగా వుండడం వల్ల తాము తక్కువ సంఖ్యలో వుండడం వల్ల పరిపాలనలో ప్రాధాన్యత ఉండదనీ భయపడ్డ అహమ్మద్ ఖాన్ ప్రత్యేక నియోజకవర్గాలు ఇస్తే తప్ప తమకు ప్రయోజనం ఉండదని భావించాడు. దీనితో ఆగాఖాన్ నాయకత్వంలో ఐదుగురు ప్రముఖ ముస్లిం నాయకుల ప్రతినిధి వర్గం 1906 అక్టోబర్ 1వ తేదీన సిమ్లాలో వైస్రాయ్ మింటోను కలుసుకుని ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ ప్రతినిధి వర్గం మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలనీ, కేంద్ర శాసనసభ నుంచి జిల్లా బోర్డుల వరకు మత ప్రాతిపదికపై సభ్యత్వాన్ని, ముస్లింలకు జనాభా ప్రకారం కాక, ప్రత్యేక పద్ధతిపై ప్రాతినిధ్యం కల్పించాలనీ, గవర్నర్–జనరల్ కౌన్సిలు నియామకంలో ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరడంతో పాటు క్రొత్త ముస్లిం విశ్వవిద్యాలయాల స్థాపనకు ప్రభుత్వ సహాయాన్ని కోరింది.

వీరి కోరికలపట్ల వైస్రాయ్ మింటో సానుభూతిని చూపించడమే కాక "జనాభా ప్రకారం మాత్రమే కాక మీ వర్గ రాజకీయ ప్రాధాన్యతను బట్టి, ఆంగ్ల సామ్రాజ్యానికి మీరు చేసిన సేవను బట్టి, మీ స్థానాన్ని పరిశీలించాలన్న మీ కోరిక న్యాయమైనదే. మీతో పూర్తిగా ఏకభవిస్తున్నాను" అని అన్నాడు. అంతేకాకుండా భారత రాజ్య కార్యదర్శి మార్లే మత ప్రాతిపదికపై నియోజక వర్గాలను వ్యతిరేకించినా,మింటో ముస్లింలకు హామీ ఇచ్చినట్లు గానే 1909 మింటో మార్లే సంస్కరణలలో ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పరచబడ్డాయి. ఈ విధంగా ముస్లింల పట్ల ఆంగ్ల ప్రభుత్వం అనుసరించిన సానుకూల వైఖరి వల్ల ముస్లింలు జాతీయ కాంగ్రెస్ పార్టీకీ, హిందువులకు దూరం కావడం ప్రారంభమై చివరకు దేశ విభజనకు కారణమైంది.

## 19.5 అఖిల భారత ముస్లింలీగ్ స్థాపన :

ముస్లింల ప్రథమ రాజకీయ సంస్థ ముస్లింలీగ్ 1906 వ సంవత్సరం డిసెంబర్ నెల 30 వ తేదిన ఢాకాలో స్థాపింపబడింది. ఆగాఖాన్ ప్రెసిడెంట్ గా ఢాకా నవాబ్ ఖ్వాజీ సలీముల్లాల నాయకత్వంలో స్థాపింపబడిన ముస్లిం లీగ్ ముస్లింలలోని నవాబులు, జమీందార్లు, కులీన వర్గాల ప్రత్యేక ప్రయోజనాలకు మాత్రమే కృషి చేయడంతో ముస్లింలలోని సామాన్య ప్రజలకు దగ్గరకాలేదు. భారత జాతీయ కాంగ్రెస్ ను వ్యతిరేకించడానికి ఆంగ్లేయులు ముస్లిం లీగ్ ను సమర్థించి ప్రోత్సహించారు. అయితే జిన్నా లీగ్ స్థాపనను వ్యతిరేకించడం విశేషం.

### 19.5.1 ముస్లింలీగ్ లక్ష్యాలు :

1. ముస్లింలో ఆంగ్ల ప్రభుత్వంపట్ల విధేయతను పెంపొందించడం.
2. ఆంగ్ల ప్రభుత్వ విధానాలపట్ల వ్యతిరేకత కనబరచాకుండా వుండడం చూపకూడదు.
3. భారతదేశంలోని ముస్లింల రాజకీయ హక్కులకు, ప్రయోజనాలకు రక్షణ కల్పించి పెంపొందించడం.
4. ముస్లింల సమస్యలను ఆంగ్ల ప్రభుత్వానికి విన్నవించడం.
5. ఇతర వర్గాలపట్ల ద్వేష భావాలు పెంపొందకుండా నిరోధించడం.

ముస్లింల హక్కులు అభివృద్ధి మెరుగైన అవకాశాలు అధికారాలకోసం ప్రారంభంలో కృషిచేసిన ముస్లిం లీగ్ రాను రాను హిందువుల పట్ల ద్వేష భావాన్ని పెంపొందేందుకు కృషిచేసింది. ఈ సంస్థ తన కార్యకలాపాలను ఆంగ్లేయులకు అనుకూలంగా, హిందువులకు, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా కొనసాగించడంతో ముస్లింలీగ్ ముస్లిం మేధావి వర్గం మద్దతును పూర్తిగా పొందలేకపోయింది. లీగ్ మతతత్వ లక్షణాలను జాతీయ నాయకులు వ్యతిరేకించారు. చాలా సంవత్సరాలు జిన్నా కూడా ముస్లిం లీగ్ మతతత్వ విధానాన్ని ద్వేషించాడు. 1910 అలహాబాద్ కాంగ్రెస్ సమావేశంలో జిన్నా మతతత్వం ఆధారంగా చేసుకున్న ప్రాతినిధ్య వ్యవస్థను ఖండిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానాన్ని మౌలానా మజహర్ ఉల్ హక్ సమర్థిస్తూ హిందూ ముస్లిం వర్గాల మధ్య స్నేహం, అవగాహన పెంపొందాలని కోరాడు. నవాబ్ సయ్యద్ మొహమ్మద్ మౌలానా, మౌలానా మహమ్మదాలి, మౌలానా అజాద్ మొదలైన నాయకులు ముస్లింలీగ్ తో ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదు. అంతేకాకుండా లీగ్ అనుసరించిన మతతత్వ విధానాన్ని, ఆంగ్ల ప్రభుత్వంపట్ల లీగ్ ప్రదర్శించిన విధేయతా విధానాన్ని తీవ్రంగా విమర్శించారు. సయ్యద్ నజీర్ హుస్సేన్, హస్సన్ ఇమామ్, హకీమ్ అజ్ మల్ఖాన్ మొదలైన అభ్యుదయభావాలుగల నాయకులు లీగ్ విధానాలను పూర్తిగా వ్యతిరేకించి విమర్శించారు.

## 19.6 లక్నో ఒప్పందం :

భారత జాతీయ కాంగ్రెస్ ఆందోళన ఫలితంగా బెంగాల్ విభజనను ఆంగ్ల ప్రభుత్వం రద్దు చెయ్యడంవల్ల, ముస్లింలు ఆంగ్ల ప్రభుత్వంతో సహకరిస్తూవుండడం వల్ల ఉపయోగంలేదు అని మహమ్మదాలీ ప్రకటించాడు. దీనికి తోడూ ఇంగ్లాండ్ ముస్లిం రాజ్యాలైన టర్కీ, పర్షియా, మొరాకోలపట్ల వ్యవహరించిన విధానంవల్ల ఆంగ్ల ప్రభుత్వం పట్ల భారతీయ ముస్లింలలో నమ్మకం సన్నగిల్లింది. ఇంగ్లీష్ వారు ముస్లింలకు విశ్వాసపాత్రులైన మిత్రులు కాదని వారు భావించారు.

అంతేకాకుండా మహమ్మదాలీ, షౌకతాలీ, జిన్నా వంటి నాయకులు, ముస్లింలీగ్ ఆంగ్ల అనుకూల విధానాన్ని వదిలి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనడం మంచిదని భావించారు. దీనితో ముస్లిం లీగ్ కాంగ్రెస్ కు చేరువైంది. 1913లో లక్నోలో జరిగిన సమావేశంలో ఆంగ్ల ప్రభుత్వంపట్ల విధేయతను పెంపొందించాలి అనే ఆశయానికి బదులు, ఆంగ్ల సార్వభౌమత్వ రక్షణలో భారతదేశానికి తగిన రీతిలో స్వపరిపాలనను సాధించడం ముఖ్యాంశమని మార్చారు. జాతీయ ఐక్యత కోసం, ప్రజాభీష్టం కోసం కాంగ్రెస్ తో కలిసి పోరాడాలని నిర్ణయించారు.

1913 కాంగ్రెస్ సమావేశంలో ముస్లింలీగ్ వైఖరిలో వచ్చిన మార్పును హర్షించారు. ఆంగ్ల సామ్రాజ్యంలో అంతర్భాగంగా స్వపరిపాలన ఆశయాన్ని వివరిస్తూ, ముస్లింలీగ్ ఆమోదించిన తీర్మానాన్ని కాంగ్రెస్ ప్రశంసించింది. దేశంలో వివిధ వర్గాల మధ్య సంఘీభావం, సహకారాన్ని కాంగ్రెస్ సభ్యులు ఆకాంక్షించారు. 1916లో లీగ్ వార్షిక సమావేశాన్ని బొంబాయిలో నిర్వహించింది. అదే సమయంలో బొంబాయిలోనే కాంగ్రెస్ కూడా సమావేశమైంది. గాంధీ, మాలవ్యా, సరోజినీ నాయుడు మొదలైన నాయకులు, లీగ్ సమావేశాలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు సిన్హా, లీగ్ అధ్యక్షుడు మజరుల్ హక్ సమావేశమై పరస్పరం అభిప్రాయాలను తెలుపుకున్నారు. 1916లో కాంగ్రెస్, ముస్లింలీగ్ ఒకే సమయంలో లక్నోలో సమావేశమై కాంగ్రెస్– ముస్లిం లీగ్ లు రెండూ ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనికే లక్నో ఒప్పందం అనిపేరు.

ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ నుంచి ఆర్థిక పరిపాలనా వ్యవహారాలలో సాధ్యమైనంతవరకు స్వేచ్ఛ ఉండాలి. పంజాబ్, బెంగాల్ లతో సహా అన్ని రాష్ట్రాలలో మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలు కావాలన్న ముస్లిం లీగ్ కోరికను కాంగ్రెస్ అంగీకరించింది. ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలలో, వారి ప్రాతినిధ్యం హిందూ–ముస్లిం జనాభా నిష్పత్తికి రెట్టింపు ఉండాలని అంగీకరించారు. ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తూ, మైనారిటీలకు గల హక్కులను కూడా ఆమోదించారు. తమ ప్రయోజనాలకు భంగకరంగా ఉండే శాసనాన్ని, తాము వ్యతిరేకించిన శాసనాన్ని తిరస్కరించడానికి కూడా మైనారిటీలకు హక్కునిచ్చారు. లక్నో ఒప్పందం రెండు రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, ముస్లింలీగ్లు సాధించిన ఘనవిజయం. హిందూ ముస్లిం సమైక్యతను పెంపొందించడానికి ఈ ఒప్పందం చాలా వరకు తోడ్పడింది.

హిందువులు–ముస్లింలు భిన్నమార్గాలలో వ్యవహరిస్తే స్వాతంత్ర్య ఉద్యమాన్ని కొనసాగించడం అసాధ్యమవుతుందని భావించిన కాంగ్రెస్ వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంవల్ల లక్నో ఒప్పందం షరతులను అంగీకరించింది. ఈ ఒప్పందం తర్వాత ముస్లింలీగ్ కాంగ్రెస్ తో కలిసి సమైక్యంగా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొంటుందని కాంగ్రెస్ విశ్వసించింది. అయితే ఆ విశ్వాసం ఎక్కువ కాలం నిలువలేదు. ఒకసారి మతపరమైన డిమాండ్లను ఆమోదించగానే 1919, 1935 రాజ్యాంగ సంస్కరణలు అమలు జరిపినప్పుడు కూడా మళ్ళీ ప్రారంభమై సమైక్యతా వాతావరణం ఎక్కువ కాలం నిలువలేదు.

మతతత్త్వం తిరిగి జీవం పోసుకోవడంతో, హిందూ ముస్లింల మధ్య చిన్న చిన్న కలహాలు ప్రారంభమయ్యాయి. మలబార్, ముల్తాన్, ఆగ్రా మొదలైన ప్రాంతాలలో రెండు మతాల మధ్య ఎన్నో విచారకర సంఘటనలు జరిగాయి.

అలహాబాద్, లక్నోలలో తీవ్ర మత ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు హిందూ–ముస్లింల మధ్య ద్వేషభావనను రగిలించాయి. మతతత్వవాదులు పరిస్థితులను తమకనుగుణంగా మార్చుకున్నారు. రెండు మతాల ప్రజలు ఒకరినొకరు అనుమానించడం సాధారణమైంది.

## 19.7 ముస్లింలీగ్ పునరుద్ధరణ :

1922 లో సహాయ నిరాకరణోద్యమ రద్దు తర్వాత, ముస్లింలలో మితవాదులైన జాతీయ లిబరల్ పార్టీ, 1923 లో జరిగిన ఎన్నికలలో పరాజయం పొందింది. 1924 లో ఖలీఫా స్థానాన్ని ముస్తాఫా కమాల్ పాషా రద్దు చేయడంతో, ఖిలాఫత్ ఉద్యమం ముగిసింది. దీనితో జాతీయ లిబరల్ పార్టీ తన కార్యకలాపాలను నిలిపివేసింది. ఇలాంటి స్థితిలో భారత ముస్లింలీగ్ పార్టీ పునరుద్ధరింపబడింది. 1924 మే నెలలో లాహోర్ లో సమావేశమైన ముస్లిం లీగ్ సమావేశానికి మహమ్మద్ ఆలీ జిన్నా అధ్యక్షత వహించాడు. ఇందులో న. స్వరాజ్యం తమ ధ్యేయమని జిన్నా ప్రకటించాడు. అయితే ముస్లిం లకు ఆమోదకరమైన రాజ్యాంగం గూర్చి కొన్ని షరతులు సమావేశం విధించింది. ఈ సమావేశంలోనే ముస్లిం లీగ్ భారతదేశానికి సమాఖ్య రాజ్యాంగం ఇవ్వాలని, రాష్ట్రాలకు పూర్తి స్వయంపాలన ఉండాలని, కేంద్ర ప్రభుత్వాధికారాలు కేవలం రాష్ట్రాలన్నింటికి సంబంధించిన సాధారణ అధికారాలకు మాత్రమే పరిమితం కావాలని ముస్లింలీగ్ కోరింది. రాష్ట్ర శాసనసభా సభ్యులు ఎన్నిక పద్ధతిలో మైనారిటీలకు సరైన ప్రాతినిధ్యం ఉండేటట్లుగా రాజ్యాంగ రక్షణలు పొందుపర్చాలని కోరారు. నాటికి వున్నరీతిలోనే, ఈ ప్రాతినిధ్యం ప్రత్యేక నియోజకవర్గాల పద్ధతిలో కొనసాగింపబడాలి. శాసనసభలలో తమ మతానికి చెందిన 3/4 వంతు మంది సభ్యులు వ్యతిరేకిస్తే మతవిషయాలకు సంబంధించిన బిల్లును ఆమోదించకూడదు అని తీర్మానించారు. స్వరాజ్య సాధనకు హిందూ ముస్లిం ఐక్యత అవసరమని ముస్లింలీగ్ భావించింది. హిందువులతో సయోధ్యకు జిన్నా కృషి చేసారు.

అయితే 1923 నుంచి తీవ్రమైన మతకలహాలు చెలరేగి, భారత రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసాయి. 1923 మే నెలలో కలకత్తాలో దారుణమైన మతకలహం ప్రారంభమై కొన్నిరోజులు సాగింది. ఈ ఘర్షణల్లో రెండుమతాలకు చెందిన అనేకమంది మరణించారు. హిందూ–ముస్లింలు వందల సంవత్సరాలుగా కలిసి మెలసి జీవించినప్పటికీ, వారు రెండు ప్రత్యేక వర్గాలుగానే ఉండిపోయారు. పాతుకు పోయిన అనేక సాంఘిక, రాజకీయ, మత విభేదాలు ఈ విభజనకు కారణం. 1921 భారత జాతీయ ఒప్పందం రూపొందించటానికై ఒక సంఘం నియమింపబడింది. డాక్టర్ అన్సారీ, లాలాలజపతిరాయ్ కలిసి ఒక ముసాయిదా తయారు చేసి, 1923లో దాన్ని సంఘానికి నివేదించినారు. ఇంతలో బెంగాల్ కాంగ్రెస్ సంఘం చిత్తరంజన్ దాస్ నాయకత్వంలో హిందూ ముసల్మాన్ల మధ్య ఒక ఒప్పందాన్ని తయారుచేసి, అంగీకరించింది. స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం 60–40 శాతంతో ఉండాలి. జిల్లా జనాభాలో ఏ మతస్తులు అధిక సంఖ్యాకులో, వారికి అరవై శాతం ప్రాతినిధ్యం, అల్పసంఖ్యాక మతస్తులకు నలభై శాతం ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో 55 శాతం ముసల్మాన్లకు ఇవ్వాలి. మసీదుల ముందు ఎట్టి సంగీతం వినిపించరాదు. ఈ షరతులు కాంగ్రెస్ బహిరంగ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించబడి, నిరాకరింపబడ్డాయి.

ఒక మసీదు ముందుగా వాద్య సంగీతంతో ఆర్యసమాజం వారి ఊరేగింపు, వెళ్తుండగా. మతదౌర్జన్యాలు ఎన్నో రోజులుగా కొనసాగి, ఇరువైపులా ఎందరో మరణించారు. 1924లో బక్రీద్ పండుగ నాడు ఢిల్లీ, నాగ పూర్, జబల్ పూర్ వంటి నగరాలలో మతకలహాలు జరిగాయి. సైన్యం కాల్పులు జరిపితేనే కానీ, పరిస్థితి అదుపులోనికి రాలేదు. ఇలా దేశంలోని అనేక ప్రాంతాలకు మతకలహాలు ప్రాకి 1926 వ సంవత్సర ప్రాంతానికి హిందూ ముస్లింల మధ్య ద్వేష భావం ఏర్పడింది. ఈ ద్వేష భావాన్ని తగ్గించడానికి కాంగ్రెస్, ముస్లిం మితవాదులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ మత రాజకీయాలు దేశ స్వాతంత్రోద్యమంపై. తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి.

## 19.8 మహమ్మద్ అలీ జిన్నా :

మహమ్మద్ అలీ జిన్నా భారత రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన నాయకుడు. బారిష్టర్ చదివిన జిన్నా భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. **కలకత్తా కాంగ్రెస్** సమవేశంలో దాదాభాయి నౌరోజీకి సెక్రటరీగా పనిచేసారు. ముస్లింలీగ్ స్థాపనను వ్యతిరేకించిన జిన్నా – "ప్రత్యేక నియోజకవర్గాల డిమాండు దేశాన్ని రెండుగా విడదీసిందని" పేర్కొన్నాడు. 1913లో ముస్లిం లీగ్ లో జిన్నా చేరినప్పటికీ, ముస్లింల ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటును నిరసించాడు. తర్వాతికాలంలో జిన్నా ముస్లింల ప్రతినిధిగా వారి పక్షాన మాట్లాడినా జాతీయవాదానికీ, లౌకిక రాజకీయాలకు కట్టుబడే పనిచేసి లక్నో ఒప్పందంలో ప్రధాన పాత్ర పోషించాడు. రౌలత్ బిల్లుకు వ్యతిరేకంగా శాసనసభకు రాజీనామా చేసాడు.

మహమ్మద్ ఆలీ జిన్నా 1924లో ముస్లిం లీగ్ పునరుద్ధరించి, లాహోర్ సమావేశానికి అధ్యక్షత వహించాడు. 1927లో కేవలం ప్రత్యేక నియోజకవర్గాల డిమాండుకు వ్యతిరేకంగా ముస్లింలీగ్ నాయకులను ఒప్పించి, ముస్లింల కోసం ఇతర సంక్షేమ విధానాలకై రూపకల్పన చేసాడు. ఈ ప్రతిపాదనలనే 'ఢిల్లీ ప్రతిపాదనల'ని పిలుస్తారు. దీనితో ప్రత్యేక నియోజకవర్గ విషయంపై లీగ్ రెండుగా చీలిపోయింది.

కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ నివేదిక ఆమోదింపబడి తన సవరణ వీగిపోవడంతో జిన్నా వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. 1929 మార్చి నెలలో ఢిల్లీలో ముస్లింలీగ్ సభను ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ముస్లింలకు వ్యతిరేక చర్య అని ప్రకటించడంతో పాటు 14 సూత్రాలను ప్రకటించాడు. వీటికే ముస్లింల కనీస కోర్కెలు అని పేరు.

భవిష్యత్తు రాజ్యాంగం, సమైఖ్య రాజ్యాంగంగా ఉండాలి. మిగులు అధికారాలు రాష్ట్రాలకు సంక్రమించాలి.రాష్ట్రాలన్నింటికి సమానమైన స్వయంపాలనాధికారాలు ఉండాలి. దేశంలోని అన్ని ఎన్నిక అయ్యే శాసనసభలలో అల్పసంఖ్యాక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం వుండాలి. మతప్రాతినిధ్యంతో ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలి. ఎట్టి భౌగోళిక పరమైన మార్పులు జరిగినా పంజాబ్, బెంగాల్, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రాలలోని ముస్లింల మెజారిటీకి భంగం కలుగకూడదు. బొంబాయి రాష్ట్రం నుంచి సింధ్ ను వేరుపరచాలి. అన్నివర్గాల వారికి పూర్తి మత స్వేచ్ఛను ఇవ్వాలి. ముస్లింల సంస్కృతి, విద్య, భాష, శాసనాలు పరిరక్షించేందుకు కావలసిన హామీలను రాజ్యాంగంలో పొందుపరచాలి. కేంద్రంలో, రాష్ట్రాలలో ఏ మంత్రివర్గంలో నైనా, 13 వంతు మంది ముస్లింలు ఉండాలి వంటివి జిన్నా 14 సూత్రాలలో ప్రధానమైనవి. అనంతరం నెహ్రూ నివేదిక మరుగున పడడం, జాతీయ ముస్లిం పార్టీ క్షీణించడంతో జిన్నాకు ఎదురులేకుండా పోయింది. మత ప్రాతినిధ్యం మరింత ఎక్కువగా వుండాలని ఒత్తిడి

ప్రారంభించాడు. దీనితో హిందూ ముస్లింల మధ్య సమన్వయ అవకాశాలు సన్నగిల్లి, రోజు రోజుకూ వారి మధ్య విభేదాలు మరింత తీవ్రతరమైయ్యాయి. ముస్లింలలో పెక్కు పార్టీలు వున్నా, మత ప్రాతినిధ్య విషయంలో మాత్రం అందరూ కలసిపోయేవారు.

మొదటి రౌండుటేబుల్ సమావేశం ఏర్పాటును జిన్నా హర్షించగా సమావేశానికి హాజరైన ముస్లిం లీగ్ ప్రతినిధులు – . తమ ప్రయోజనాలకు సరైన రక్షణను కల్పించని ఏ రాజ్యాంగమైనా, తమకు అంగీకారం కాదని రాజ్యాంగలో చేసే రాజ్యాంగ రక్షణలు తమకు సరిపోతాయో లేదో నిర్ణయించే అధికారం కూడా ముస్లిం ప్రతినిధులకే ఉండాలని కోరారు. ప్రభుత్వం ఈ కోర్కెలను చాలావరకు అంగీకరించింది. రెండవ రౌండుటేబుల్ సమావేశంలో ముస్లింలీగ్ తో అంగీకారానికి గాంధీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనితో పప్రత్యేక నియోజకవర్గాల విషయమై ఇంగ్లాండ్ ప్రధాని మాక్ డొనాల్డ్ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించాల్సి వచ్చింది. మాక్ డొనాల్డ్ ముస్లింలకే కాక, సిక్కులకు, ఆంగ్లో–ఇండియన్లకు కూడా ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వడంతో నిమ్నజాతులకు ప్రత్యేక సీట్లు కేటాయించాడు.

పూనా ఒప్పందం తర్వాత 1932 నవంబర్ లో అలహాబాద్ లో ఐక్యతా సమావేశం జరిగింది. రాజ్యాంగ విషయాలలో ముఖ్యమైన విభేదాలను పరిష్కరించేందుకై, ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం ఉమ్మడి నియోజకవర్గాలను అంగీకరించింది. అయితే, ఈ సంఘ సిఫార్సులకు తుదిరూపం ఇవ్వకముందే, ఆంగ్ల ప్రభుత్వం కేంద్ర శాసనసభలో 33 1/3 శాతం సీట్లు ముస్లింలకు ఇవ్వగలమని, సింధ్ ను ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించగలమని అంగీకరించింది. దీనికి తోడూ జిన్నా పట్టుదలవల్ల హిందూ–ముస్లింల మధ్య సమైక్యతా అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఐక్యతావకాశాలు మృగ్యమైనాయి. ఈ కాలంలో ఏర్పడిన మత విభేదాలే తరువాత కాలంలో దేశవిభజనకు దారితీసాయి.

ఒకప్పుడు హిందూ–ముస్లింల మైత్రిని కాంక్షించిన జిన్నా 1930, 1940 దశాబ్దాలలో మతతత్వంవైపు మొగ్గుచూపాడు. 1938లో ముస్లిం లీగ్ సమావేశంలో కాంగ్రెస్ హిందూరాజ్య స్థాపనకు పూనుకుంది అని ప్రకటించడంతో పాటు 1940లో అలీఘర్ విద్యార్థులతో 'గాంధీ ముస్లింలను హిందూ రాజ్యంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉంచాలని అనుకుంటున్నాడని రెచ్చగొట్టాడు. ముస్లింలనుద్దేశించి ఇస్లాంను రక్షించాలంటే పాకిస్తాన్ ఒక్కటే ధ్యేయమని ఉద్ఘాటించాడు. 1946 లో ముస్లింలందరూ లీగ్ కు ఓటు వేయాలనీ, లేకపోతే వారు శూద్రులుగా చూడబడతారనీ, ఇస్లాం భారతదేశం నుండి మాయమవుతుందనీ అన్నాడు. వీటన్నిటి ఫలితంగా హిందూ ముస్లింల మధ్య దూరం అధికమై చివరకు దేశ విభజనకు దారి తీసింది.

## 19.9 సమీక్ష :

1857 తిరుగుబాటు తర్వాత భారత దేశంలో హిందూ ముస్లిం మతాలమధ్య విబేధాలు రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషిచాయి. అవి తీవ్రతరం కావడానికి ఆంగ్లేయులు మరింత దోహదం చేశారు. సయ్యద్ అహమ్మద్ ఖాన్ ముస్లింలలో చైతన్యం చేసేందుకు ప్రయత్నం చేయడంతో పాటు హిందూ ముస్లిం సఖ్యతకు కృషిచేశాడు. అయితే జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం తర్వాత అహమ్మద్ ఖాన్ వైఖరిలో మార్పు వచ్చింది. తర్వాత ముస్లిం లీగ్ స్థాపింపబడినప్పటినుంచి

ముస్లిం వాదం అధికమైంది. మొదట్లో హిందూ ముస్లిం సమైఖ్యతను ఆశించిన మహమ్మద్ అలీ తర్వాతి కాలంలో ముస్లిం మతతత్త్వ వాది గా తయారై చివరకు దేశవిభజనకు కారకుడు అయ్యాడు.

## 19.10 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 19.10.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్
2. మహమ్మద్ అలీ జిన్నా

### 19.10.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశంలో ప్రారంభమయిన ముస్లిం మతతత్త్వాన్ని వివరించి అది దేశ విభజనకు ఏ విధంగా దారి తీసిందో తెలపండి.

### 19.10.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. సయ్యద్ అహమ్మద్ ఖాన్ స్థాపించిన విశ్వవిద్యాలయం ఏది.
2. మింటో వద్దకు వెళ్ళిన ముస్లిం రాయభార వర్గానికి నాయకుడు ఎవరు.
3. ముస్లిం లీగ్ ఎప్పుడు స్థాపింప బడింది.
4. లక్నో ఒప్పందం ఎప్పుడు జరిగింది.

## 19.11 ఉపయుక్త గ్రంధాలు :

1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885-1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర

**డాక్టర్ జి. రాజమోహన్ రావు**

★★★★★

# పాఠం – 20
# దేశవిభజన – స్వాతంత్ర్య సముపార్జన

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశంలో ముస్లింలీగ్ అనుసరించిన విధానం, వివిధ ప్రణాళికలు, చివరకు జరిగిన దేశవిభజన స్వాతంత్ర్య సముపార్జనలను గురించి తెలుసుకో గలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


20.1 పరిచయం

20.2 వేవెల్ ప్రణాళిక

20.2.1 ప్రణాళికలోని ముఖ్యాంశాలు

20.3 సిమ్లా సమావేశం

20.4 ఆర్థిక అసంతృప్తి

20.5 భారత జాతీయ సైనికుల విచారణలు

20.6 సైన్యంలో తిరుగుబాట్లు

20.7 క్యాబినెట్ రాయభారం

20.7.1 క్యాబినెట్ రాయభార నివేదికాంశాలు

20.8 తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు

20.9 ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య

20.10 అట్లీ ప్రకటన

20.11 మౌంట్ బాటెన్ పథకం

20.12 దేశవిభజన – స్వాతంత్ర్య సముపార్జన

20.13 సమీక్ష

20.14 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.14.1 ఐదు మార్కుల ప్రశ్నలు

20.14.2 పది మార్కుల ప్రశ్నలు

20.14.3 ఒక్క మార్కు ప్రశ్నలు

20.15 ఉపయుక్త గ్రంథాలు

## 20.1 పరిచయం :

ఇంగ్లాండులో జరిగిన సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నాయకుడైన అట్లీ ఇంగ్లాండ్ ప్రధానమంత్రి అయ్యాడు. లారెన్స్ భారతదేశ సెక్రటరీగా నియమించబడ్డాడు. భారత దేశంలో వేవెల్ వైస్రాయి గా వున్నాడు. దీనికి తోడూ రెండవప్రపంచ యుద్ధంలో 1945లో జపాన్ లొంగిపోవడంతో యుద్ధం ముగిసింది. దీనితో భారతదేశ ప్రజలపట్ల సానుభూతికలిగిన లేబర్ పార్టీ, ప్రధానమంత్రి అట్లీ భారతదేశం పై దృష్టి సారించారు. సమస్యలపై దృష్టిపెట్టడానికి అవకాశం కల్గింది. ఇంగ్లాండ్ ప్రధాని అట్లీ, వైస్రాయి వేవెల్ భారతదేశ భవిష్యత్తును చర్చించి, 1942లో క్రిప్స్ చేసిన ప్రతిపాదనలను ఆంగ్ల ప్రభుత్వం అమలుచేస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రణాళిక రూపొందించాడు. దీనిని కాంగ్రెస్, ముస్లిం లీగ్ లు అంగీకరించలేదు. తర్వాత జరిగిన పరిణామాలు దేశం విభజింపబడి స్వాతంత్ర్యాన్ని పొందింది.

## 20.2 వేవెల్ ప్రణాళిక :

ఆంగ్ల ప్రభుత్వం రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్ విజయాలను చూసి ఆందోళనకు లోనైంది. ప్రభుత్వం 1944 మే 6వ తేదిన అనారోగ్యకారణంగా గాంధీని జైలునుంచి విడుదల చేసింది. కాంగ్రెస్ నాయకులను విడుదల చేసింది. దీనితో కాంగ్రెస్ కమిటీల పునరుద్ధరణ, సభ్యత్వ నమోదు, నిధి సేకరణ, కార్యకర్తల శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టి భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం కాసాగింది.

ఇలాంటి స్థితిలో యుద్ధం, ఆర్థిక స్థితి, యుద్ధానంతర సమస్యలు, కరువు పరిస్థితులు, ధరల పెరుగుదల వంటి వాటివల్ల భారత ఆర్థిక పరిస్థితి బలహీన పడడం, ముస్లిం లీగ్ కొత్త డిమాండ్లను తీసకురావడం, లీగ్ కోరికలను అంగీకరించా వద్దని కాంగ్రెస్ కోరడం లాంటి స్థితిలో వేవెల్ అనేక ఆలోచనలు చేసి, గవర్నర్ లతో చర్చించి, ఇంగ్లాండ్ వెళ్లి ఇంగ్లాండ్ ప్రభుత్వ అధికారులు, భారత ప్రభుత్వ కార్యదర్శి, భారత వ్యవహారాల కమిటీలతో చర్చించి చివరకు ఒక ప్రణాళిక రూపొందించాడు.

### 20.2.1 ప్రణాళికలోని ముఖ్యాంశాలు :

1. నూతనంగా ఏర్పాటు చేయబోయే రాజ్యాంగం ఆమోదం పొందేలోపు తాత్కాలిక ఏర్పాటును ఈ ప్రణాళిక ప్రతిపాదిస్తుంది. ఈ ప్రణాళిక రాజకీయ ప్రతిష్టంభనను ముగించి స్వపరిపాలనా లక్ష్యాన్ని సాధించడానికి తోడ్పడే విధంగావుంటుంది. వైశ్రాయ్ అఖిలపక్ష కార్యసమితిని ఏర్పాటును చేస్తాడు. వైశ్రాయ్ అధ్యక్షుడిగా ముఖ్య సైన్యాధిపతులిద్దరు మాత్రమే ఆంగ్లేయులు ఉంటారు.

2. సరిహద్దులు, ఆదివాసి తెగల సమస్యలు మినహా మిగతా విషయాలన్నీ భారతీయుల నిర్వహణలోనే ఉంటాయి.
3. వైస్రాయ్ భారత రాజ్య వ్యవహారాల కార్యదర్శిల జోక్యం ఉన్నప్పటికీ అది భారతీయుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుంది.
4. వైస్రాయ్ కార్య సమితి 1935 చట్ట పరిధిలోనే పనిచేస్తుంది. వైస్రాయ్ విశేషాధికారాలు ప్రయోగించరాదు.
5. వైస్రాయ్ అధ్యక్షునిగా ఉంటాడు కాబట్టి భారతదేశంలో బ్రిటన్ వాణిజ్య ప్రయోజనాలను పర్యవేక్షించడానికి హై కమీషన్ ను నియమించడం జరుగుతుంది.
6. కార్య నిర్వాహక సమితి తాత్కాలిక జాతీయ ప్రభుత్వంగా కొనసాగుతుంది. ఇది రాజ్యాంగ నిర్మాణానికి ఏ విధంగా ప్రతిబంధకం కాదు.
7. రాష్ట్రాలలో మంత్రి వర్గాలు సంకీర్ణ పద్ధతిలో ఏర్పడుతాయి. నూతన రాజ్యంగం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్రాలు ఒక ఉప సమాఖ్యనుంచి ఇంకో ఉప సమాఖ్యలోకి మారవచ్చు.
8. రాజ్యాంగ సభ క్యాబినెట్ మిషన్ ప్రతిపాదనలను మార్చాలంటే హిందు ముస్లిం వర్గాల ప్రతినిధులతో మెజారిటీ ఆమోదం పొందాలి. రాజ్యాంగ సభ మైనారిటీ వర్గాల ప్రయోజనాల్ని కూడా పరిరక్షించవలసి ఉంటుంది.
9. రాజ్యాంగం రూపొందేవరకు అన్ని రాజకీయ పక్షాల మద్దతుతో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వాన్ని నిర్మించాలి. యుద్ధ శాఖతో సహా అన్ని ప్రభుత్వ శాఖలు భారతీయ మంత్రులే నిర్వహిస్తారు.
10. పరిపాలన సజావుగా సాగటానికి, అధికార బదలాయింపు సక్రమంగా జరపటానికి ప్రభుత్వ సహకారం ఉంటుంది.
11. ఇంగ్లాండ్ చక్రవర్తికి భారతదేశంపై వున్న సార్వభౌమాధికారం, అధికార బదలాయింపుతో అంతమౌతుంది. చట్టబద్ధమైన సర్వ స్వతంత్ర్య దేశంగా అవతరించిన భారతదేశం కామన్వెల్త్ తోగల అనుబంధాన్ని కొనసాగించ వచ్చు.

## 20.3 సిమ్లా సమావేశం :

వైస్రాయ్ వేవెల్ తన ప్రణాళికలోని అంశాలు చర్చించేందుకు 1945 జూన్ 29న సిమ్లా లో సమావేశం ఏర్పాటు చేశాడు. కాంగ్రెస్, ముస్లింలీగ్ పూర్వ ప్రధాన మంత్రులు, గాంధీ, జిన్నా, శిక్కు దళిత వర్గాల నుంచి ఒక్కొక్క ప్రతినిధి కలిపి మొత్తం 21 మందిని ఈ సమావేశానికి ఆహ్వానించాడు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాల్గొన్నాడు. ముస్లింలీగ్ ముస్లింలు తప్ప ఇతర ముస్లింలు సమావేశంలో ఉండరాదని జిన్నా పేర్కొన్నాడు. అందువల్ల ముస్లింలు అంతా లీగ్ వైపు ఉంటారని జిన్నా విశ్వాసం. పంజాబ్ యూనియనిష్టు సభ్యుడు బజ్ హయత్ ఖాన్ ను సమావేశానికి ఆహ్వానించడాన్ని జిన్నా తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ సమావేశంలో మౌలానా ఆజాద్ జాతీయతా సూత్రానికి విరుద్ధమైన ఎలాంటి ఏర్పాటును కాంగ్రెస్ ఆమోదించదని, సంస్థానాధీశులు, సంస్థానాలప్రజలను భిన్నంగా చూడరాదని, జాతీయతా స్వభావం కలిగిన సైన్యం ఉండాలని పేర్కొన్నాడు. ఈ సమావేశంలో సమైక్య భారతం సమైక్య

ప్రభుత్వాలను కోరే కాంగ్రెస్ ధోరణిని ముస్లిం లీగ్ వ్యతిరేకిస్తుందని జిన్నాపేర్కొన్నాడు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేవెల్ సిమ్లా సమావేశం విఫలమయ్యిందని ప్రకటించాడు.

ఈ లోగా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ఇంగ్లాండ్ లో జరిగిన సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. లేబర్ పార్టీ నాయకుడు అట్లీ ప్రధానమంత్రి అయ్యాడు.

## 20.4 ఆర్థిక అసంతృప్తి :

రెండవ ప్రపంచ యుద్ధం ఫలితంగా దేశంలో ఆర్థిక పరిస్థితులు క్షీణించాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆహార కొరత వంటివి అధికమై దేశంలో ఆందోళన ప్రారంభం అయింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో సమ్మెలు, హర్తాళ్లు జరగసాగాయి. కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు వంటి వివిధ సంఘాలు ఒకటిగా ఉద్యమాన్ని నిర్వహించసాగాయి. దేశంలో భూస్వాములకు వ్యతేరేకంగా పోరాటాలు మొదలయ్యాయి.

## 20.5 భారత జాతీయ సైనికుల విచారణలు :

ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత జాతీయ సైన్యంలో పనిచేసిన షానవాజ్ ఖాన్, పి.కె. సెహగల్, గురుబక్షీసింగ్ థిల్లాన్ వంటి వారిని విచారించి, రాజుకు వ్యతిరేకంగా యుద్ధం చేసిన నేరస్థులుగా ప్రకటించి సైనిక న్యాయస్థానం కారాగారవాస శిక్ష విధించింది. భాలుభాయ్ దేశాయ్, తేజ్ బహదూర్ సప్రూ, జవహర్ లాల్ నెహ్రూ వంటివారు ఈ శిక్షలకు వ్యతిరేకంగా భారత జాతీయ సైనికాధికారుల పక్షాన న్యాయస్థానంలో వాదించారు. భారత జాతీయ సైనికాధికారులకు శిక్షలు విధించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రధానంగా వీరంతా ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు పట్టిన గొప్ప దేశభక్తులుగా ప్రజలు భావించి 1945 నవంబర్ నెలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. కార్మికులు, విద్యా , వర్తకులు ఇందులో పాల్గొన్నారు. దేశంలోని అనేక నగరాలలో నిరసన ప్రదర్శనలు, సమ్మెలు జరిగాయి. ఇలాంటి స్థితిలో ప్రభుత్వం ప్రజా ఉద్యమానికి తలవంచి ప్రభుత్వం వారిని విడుదల చేయదానికి నిర్ణయించింది. నిశ్చయించింది. దీన్నిబట్టి బ్రిటీష్ అధికారం సన్నగిల్లి అంతిమదశకు చేరుకుందని చెప్పవచ్చు.

## 20.6 సైన్యంలో తిరుగుబాట్లు :

ఈ సమయంలోనే భారత సైన్యం, నావికాదళంలో కూడ ఆందోళనలు చెలరేగాయి. 1946 ఫిబ్రవరిలో సైన్యం, నావికాదళాల నుంచి నుంచి కూడా కొంతమంది ఉద్యమంలో చేరడం మొదలుపెట్టారు. మద్రాస్, కలకత్తా పూనా మొదలైన ప్రాంతాల్లో నావికాదళ సభ్యులు తిరుగుబాటు చేసి కాంగ్రెస్, ముస్లింలీగ్ జెండాలు, ఎర్రజెండాలను ఎగురవేయడం జరిగింది. ఈ సంఘటన దేశంలో ప్రజల ఐక్యతకు నిదర్శనంగా నిల్చింది. భారత నావికాదళ తిరుగుబాటును ఆపించేందుకు ప్రభుత్వం కాంగ్రెస్ కు చెందిన యం.యస్.ఖాన్, వల్లభాయ్ పటేల్ సహాయం తీసుకుంది. వారి కృషిఫలితంగా ఉద్యమం ఆగిపోయింది. కానీ ప్రభుత్వం 476 మంది నావికులపై సైనిక న్యాయ విచారణ జరిపి వారిని విధులనుండి తొలగించింది.ఇది ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను కలిగించింది. భారతీయ వైమానిక దళంలో కూడ విస్తృతమైన సమ్మెలు జరిగాయి. పోలీసు యంత్రాంగం కూడ జాతీయభావం వైపు మొగ్గు చూపుతున్న సూచనలు కనిపించాయి.

వీటన్నింటినీ గమనించిన ఆంగ్ల ప్రభుత్వం భారతదేశంలో జాతీయోద్యమాన్ని ఎంతోకాలం అణిచివేయలేమని గ్రహించింది.

## 20.7 క్యాబినెట్ రాయభారం :

భారతదేశంలో జరుగుతున్న పరిస్థితులను గమనించిన ఇంగ్లాండ్ ప్రధాని అట్లీ 1946 ఫిబ్రవరి 19న అధికార మార్పిడికోసం క్యాబినెట్ రాయబారాన్ని భారతదేశానికి పంపుతున్నట్లు ప్రకటన చేసాడు. దీనిలో లార్డ్ పెథిక్ లారెన్స్, సర్ స్టాఫర్డ్ క్రిప్స్, అలెగ్జాండర్ లు సభ్యులు. వారు 1946 మార్చిలో ఢిల్లీకి చేరుకుని భారత జాతీయ కాంగ్రెస్, ముస్లింలీగ్ తో చర్చలు జరిపారు.ఈ చర్చల్లో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ చర్చల సమయంలో ముస్లిం లీగ్ నాయకులు చేసిన పాకిస్తాన్ ప్రతిపాదనను కేబినెట్ మిషన్ తిరస్కరించింది. చివరకు క్యాబినెట్ రాయభారం 1946 మే 16వ తేదీన న తన నివేదికను ఇంగ్లాండ్ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో ఈ క్రింది అంశాలున్నాయి.

### 20.7.1 క్యాబినెట్ రాయభార నివేదికాంశాలు :

1. భారత దేశం రాష్ట్రాల, సంస్థానాల సమాఖ్యగా వుంటుంది.
2. రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ మాత్రమే కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయి.
3. రాష్ట్రాలు అత్యధిక స్వయంప్రతిపత్తిని కలిగి వుంటాయి. భారత దేశంలోని రాష్ట్రాలు మూడు విభాగాలుగా కలిసి వుంటాయి. హిందువులు ఎక్కువగా వున్న ప్రాంతం, ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతం. ముస్లింలు ఎక్కువగా వున్న అస్సాం, బెంగాలు ప్రాంతాలు. ఈ మూడు విభాగాలలోని రాష్ట్రాలు వాటి సమాన లక్ష్యం కోసం, పరస్పరాంగీకారంతో, కొత్త విభాగాలుగా ఏర్పడే స్వాతంత్ర్యాన్ని కలిగి వుంటాయి.
4. మతసంబంధమైన ప్రధాన సమస్య ఏదైనా శాసనసభలో తల ఎత్తినప్పుడు, ఒక్కొక్క ప్రధాన మతవర్గంలోని సభ్యుల మెజారిటీ ద్వారా, సభలో హాజరైన అందరూ సభ్యుల మెజారిటీ ద్వారా పరిష్కరించాలి.
5. రాజ్యాంగ రచనకు రాజ్యాంగ సభను ఏర్పాటు చేయాలి. ప్రతి రాష్ట్రానికి, దాని జనాభాను బట్టి కొన్ని స్థానాలుంటాయి. రాష్ట్రానికి వచ్చిన స్థానాలను, రాష్ట్రంలోని విభిన్న మతాలవారికి, వారి జనాభాను బట్టి కేటాయించాలి. రాజ్యాంగ సభ సభ్యులను రాష్ట్రాల శాసనసభల సభ్యులు ఎన్నుకుంటారు.
6. సాధ్యమైనంత త్వరలో ప్రధాన రాజకీయ పక్షాల మద్ధతు వున్న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.

క్యాబినెట్ రాయభార ప్రణాళిక మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ చర్చ తర్వాత, దీర్ఘకాలిక ఫలితాల దృష్ట్యా తాత్కాలిక ప్రభుత్వం ప్రతిపాదనను తిరస్కరించింది. భారత ముస్లింలకు ఏకైక ప్రతినిధి ముస్లింలీగ్ అన్న వాదనను కాంగ్రెస్ అంగీకరించలేదు. ముస్లింలీగ్ మొదట ప్రణాళికలను అంగీకరించింది. జూన్ నెలలో రాజ్యాంగసభకు జరిగిన ఎన్నికలలో 205 స్థానాలు కాంగ్రెస్ కు, 73 స్థానాలు ముస్లింలీగ్ కు లభించాయి. సభలో ఓటింగ్ జరిగినపుడు ఓటమి కల్గుతుందనే భయంతో ముస్లింలీగ్ క్యాబినెట్ రాయభార ప్రతిపాదనలను తిరస్కరించింది.

## 20.8 తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు :

జులైలో వేవెల్ కాంగ్రెస్, ముస్లింలీగ్ లకు క్రొత్త ప్రతిపాదనను చేశాడు. కాంగ్రెస్ కు ఆరు స్థానాలు, ముస్లిం లీగ్ కు ఐదు స్థానాలతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పర్చాలనేది వేవెల్ ప్రతిపాదన. కాంగ్రెస్ పార్టీ తో సమాన స్థానాలను కోరుతూ, ఈ ప్రతిపాదనను కూడ ముస్లింలీగ్ తిరస్కరించింది. కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను అంగీకరించి, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

## 20.9 ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య :

క్యాబినెట్ రాయభార, వేవెల్ ప్రతిపాదనలను అంగీకరించని ముస్లిం లీగ్ ప్రత్యక్ష చర్యకు పూనుకుంది. పాకిస్తాన్ ఏర్పాటు తన ధ్యేయమని ప్రకటించిన మహమ్మద్ అలీ జిన్నా1946లో ఆగస్ట్ 16వ తేదీన "ప్రత్యక్ష చర్య"ను ప్రకటించాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు తమ కార్యక్రమాలను స్థంభింప చేయాలని పిలుపునిచ్చాడు. ఈ చర్య ద్వారా ఆంగ్లేయులపై ఒత్తిడి పెంచాలని ప్రయత్నించాడు. ముస్లింలీగ్ భారతదేశాన్ని భారతదేశం పాకిస్తాన్ అనే రెండు దేశాలుగా విభజించి వెళ్ళిపోవాలని ఆంగ్లేయులను కోరింది. బెంగాల్, బీహార్, బొంబాయి, కలకత్తా మొదలైన చోట్ల ఘర్షణలు చెలరేగాయి. ఈ సమయంలో గాంధీ మత ఘర్షణల్ని తీవ్రంగా నిరసిస్తూ మత కల్లోలాలకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. ఆంగ్ల ప్రభుత్వం మతకల్లోలాల నివారణకు తగు చర్యలు తీసుకోలేకపోయింది.

ఇలాంటి స్థితిలోనే దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించసాగింది. ప్రజా ఉద్యమాలు దేశంలోని పట్టణాలకు, గ్రామాలకు విస్తరించడానికి ఇది తోడ్పడింది. 1946లో 2000కు పైగా సమ్మెలు జరిగాయి. కాన్పూర్, కలకత్తాలలో సమ్మె చేస్తున్న కార్మికులమీద పోలీసులు కాల్పులు జరిపారు. కాశ్మీర్ లో మహారాజు అధికారానికి వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా నాయకత్వంలో నేషనల్ కాన్ఫరెన్స్ క్విట్ కాశ్మీర్ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజా ఉద్యమాలతో పాటు మతపరమైన హింసాకాండ కొనసాగుతూ వచ్చింది.

1946 సెప్టెంబర్ 2న జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అయితే ఈ ప్రభుత్వంలో చేరడానికి అంగీకరించని ముస్లింలీగ్ ఆదేరోజు నల్లజెండాలతో నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చింది. తర్వాత ముస్లింలీగ్ 1946 అక్టోబర్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరినప్పటికి పాకిస్తాన్ నినాదాన్ని మాత్రం వదులుకోలేదు. నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం ఎటువంటి ఐక్యతను సాధించలేకపోయింది.

## 20.10 అట్లీ ప్రకటన :

భారత జాతీయ సైన్యంపై సైనిక విచారణలకు వ్యతిరేకంగా ప్రజాందోళనలు, దేశంలో మతకల్లోలాలు ఆంగ్లేయులను కలవరపర్చాయి. ఇంగ్లాండ్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947, ఫిబ్రవరి 20వ తేదీన ఒక ప్రకటన చేశాడు. ఇందులో ఇంగ్లాండ్ ప్రభుత్వం 1948వ సంవత్సరం జూన్ నెల లోగా అధికారాన్ని భారత ప్రజలకు అప్పగిస్తుంది అని ప్రకటించాడు. అంతేకాకుండా అధికారం ఒకటి లేదా ఎక్కువ కేంద్ర ప్రభుత్వాలకు అప్పగిస్తుందని పేర్కొన్నాడు. దీనికితోడు రాజకీయ పక్షాలు ఒప్పందానికి రాలేకపోతే ప్రభుత్వ యంత్రాంగాన్ని విభిన్న రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించటం జరుగుతుందని ప్రకటించాడు. ఈ ప్రకటనవల్ల దేశ విభజన జరుగుతుందనే విషయం స్పష్టమైంది.

అట్లీ ప్రకటనతో కొత్త ఆశలు చిగురించిన ముస్లింలీగ్, పాకిస్తాన్ సంపాదన కోసం పోరాటాన్ని ప్రత్యక్ష చర్యల ద్వారా ఉధృతం చేసింది. అందువల్ల స్వల్పకాలంలోనే ఉత్తర భారతదేశమంత మత కల్లోలాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా జరిగిన అనేక సంఘటనలకు విదేశీ ప్రభుత్వం తోడ్పాటు, ప్రోత్సాహం లభించాయి. ఇదంతా సర్దార్వల్లభాయి పటేల్, జవాహర్ లాల్ నెహ్రూ లు అభిప్రాయం మార్చుకునేందుకు కారణమయ్యాయి. గత యాభై సంవత్సరాలనుంచి ముస్లిం మతతత్వం అభివృద్ధి అయిన స్థితి అటు దేశ విభజనకుగానీ, లేకపోతే గందరగోళానికి, అరాచకత్వానికి దారితీస్తుందని వీరు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయం కారణంగానే, 1947లో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం వాస్తవ దృక్పథం పేరిట, పంజాబ్ విభజనను అంగీకరిస్తూ తీర్మానించింది.

## 20.11 మౌంట్ బాటెన్ పథకం :

ఇలాంటి పరిస్థితుల్లో మార్చి 1947లో వేవెల్ స్థానంలో మౌంట్ బాటెన్ వైస్రాయ్ గా వచ్చాడు. మౌంట్ బాటెన్ భారతదేశ రాజకీయ మత పరిస్థితులను పరిశీలించిన తరువాత దేశ విభజన కార్యక్రమాన్ని కొనసాగించాడు. ఎట్టి పరిస్థితుల్లోను ఒక మతం అధిక్యం క్రింద మరో మతం వుండరాదనీ, బహుళ సంఖ్యాక వర్గాధిక్యం అల్పసంఖ్యాకుల మీద వుండరాదని మౌంట్ బాటెన్ ప్రకటించాడు. చివరకు జూన్ 3, 1947లో మౌంట్ బాటెన్ తన పథకాన్ని ప్రకటించాడు.

1. భారతదేశం నుంచి ఆంగ్లేయుల విరమణ జూన్ 1948లో కాకుండా ఆగస్టు 1947లోనే జరుగుతుంది.
2. ఆంగ్లేయులు భారతదేశంలో ఏర్పడే తరువాతి ప్రభుత్వాలకు అధికారం అప్పజెప్పడం జరుగుతుంది.
3. భారతదేశాన్ని, భారతదేశం పాకిస్తాన్ అని రెండు దేశాలుగా విభజించడం జరుగుతుంది.
4. ఆంగ్లేయ అధికార విరమణతో దేశంలోని స్వదేశీ రాజ్యాలు భారతదేశం లేదా పాకిస్తాన్ లో చేరే స్వేచ్ఛను కలిగి వుంటాయి. వాటిమీద ఆంగ్లేయ అధికారం కోల్పోతుంది.
5. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్న తరువాత బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల విభజన జరుగుతుంది. ఈ రాష్ట్రాల శాసనసభలు సమావేశమై సదరు రాష్ట్రాలు ఐక్యంగా వుండాలో, విభజన కావాలో నిర్ణయిస్తాయి. వారు విభజన నిర్ణయించినట్లయితే ఒక సరిహద్దు సంఘాన్ని నియమించడం జరుగుతుంది.
6. ప్రస్తుత రాజ్యాంగ సభ అట్లాగే కొనసాగి భారతదేశానికి రాజ్యాంగాన్ని తయారుచేస్తుంది. పాకిస్తాన్ కు వేరే రాజ్యాంగ సభ ఏర్పాటు చేయబడుతుంది.
7. ఇంగ్లండ్ రాజు వీటో అధికారం కోల్పోయి, ఆ అధికారం రాజప్రతినిధికి ఇవ్వబడుతుంది.
8. భారతదేశంలో సెక్రటరీ పదవి రద్దు చేయబడుతుంది.
9. బ్రిటీష్ భారతీయ చక్రవర్తి అనే బిరుదు రద్దవుతుంది.

## 20.12 దేశవిభజన – స్వాతంత్ర్య సముపార్జన :

మౌంట్ బాటన్ పథకాన్ని భారతదేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలు అంగీకరించటంతో భారత్, పాకిస్తాన్ ల ఆస్తుల, ఋణాలను నిర్ణయించడానికి కేంద్రంలోను, రాష్ట్రాలలోను యంత్రాంగాన్ని నియమించారు. సైన్యంలోను ఇతర

ఉద్యోగాలలోను పనిచేసేవారిని, వారి ఇష్టాన్ని అడిగారు. పంజాబ్, బెంగాల్ ప్రాంతీయ శాసనసభలు విభజనకే నిర్ణయించాయి. ముస్లింలు అధికసంఖ్యలో వున్న జిల్లాలు పాకిస్తాన్ లో , ముస్లిమేతరులు అధికంగా వున్న ప్రాంతాలు భారత సమాఖ్యలో చేరాయి. సర్ రాడ్ క్లిఫ్ అధ్యక్షతన సరిహద్దు సంఘం పని ప్రారంభించి, 1947 ఆగస్ట్ 15 నాటికి సరిహద్దు రేఖను గీసే పనిని పూర్తిచేసింది.

జూన్ 3, 1947న ప్రకటించిన మౌంట్ బాటెన్ పథకాన్ని ఇంగ్లాండ్ పార్లమెంట్ 1947జూలై 16 న భారత స్వాతంత్ర్య చట్టం గా ఆమోదించి చట్టాన్ని జారీచేసింది.

అధికార మార్పిడికి 1947 ఆగస్ట్ 15వ తేదీని నిర్ణయించింది. దీనిని అనుసరించి ఆగస్ట్ 14, 1947 అర్ధరాత్రి అంటే 15న ప్రారంభ సమయంలో ఢిల్లీలో రాజ్యాంగ సభ ప్రత్యేక సమావేశం జరిగింది. ఢిల్లీ ఎర్రకోట మీద భారత జాతీయ పతాకం ఎగిరింది. రాజ్యాంగ సభ శాసనబద్ధంగా, బ్రిటీష్ కామన్వెల్త్ లో భాగంగా, భారతదేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. భారత దేశానికి మౌంట్ బాటెన్ కొత్త గవర్నర్ జనరల్ గా నియమింపబడ్డాడు. భారతదేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది.

## 20.13 సమీక్ష :

ఇంగ్లాండులో జరిగిన సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నాయకుడైన అట్లీ ఇంగ్లాండ్ ప్రధానమంత్రి అయ్యాడు. లారెన్స్ భారతదేశ సెక్రటరీగా నియమించబడ్డాడు. భారత దేశంలో వేవెల్ వైస్రాయి గా వున్నాడు. దీనికి తోడూ రెండవప్రపంచ యుద్ధంలో 1945లో జపాన్ లొంగిపోవడంతో యుద్ధం ముగిసింది. దీనితో భారతదేశ ప్రజలపట్ల సానుభూతికలిగిన లేబర్ పార్టీ, ప్రధానమంత్రి అట్లీ భారతదేశం పై దృష్టి సారించారు. సమస్యలపై దృష్టిపెట్టడానికి అవకాశం కల్గింది. ఇంగ్లాండ్ ప్రధాని అట్లీ, వైస్రాయి వేవెల్ భారతదేశ భవిష్యత్తును చర్చించి, 1942లో క్రిప్స్ చేసిన ప్రతిపాదనలను ఆంగ్ల ప్రభుత్వం అమలుచేస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రణాళిక రూపొందించాడు. దీనిని కాంగ్రెస్, ముస్లిం లీగ్ లు అంగీకరించలేదు. తర్వాత క్యాబినెట్ రాయభారం వచ్చి చేసిన ప్రతిపాదనలు కూడా ముస్లింలీగ్ వ్యతిరేకించి దేశవిభజనకు పట్టుబట్టింది. ఇలాంటి స్థితిలో వైస్రాయ్ గా వచ్చిన మౌంట్ బాటెన్ ఒక ప్రణాళిక రూపొందించాడు. ఆ ప్రణాళిక మేరకు దేశం రెండుగా విభజింపబడి చివరకు 1947 ఆగస్ట్ 15 వ తేదీన స్వతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది.

## 20.14 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### 20.14.1 ఐదు మార్కుల ప్రశ్నలు :

1. వేవెల్ ప్రణాళిక
2. క్యాబినెట్ రాయభారం

### 20.14.2 పది మార్కుల ప్రశ్నలు :

1. భారత దేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి ముందు జరిగిన విషయాలను వివరించండి.

### 20.14.3 ఒక్క మార్కు ప్రశ్నలు :

1. ఇంగ్లాండ్ సాధారణ ఎన్నికలలో ఏ పార్టీ విజయం సాధించింది.
2. క్యాబినెట్ రాయభారం ఎప్పుడు భారత దేశానికి వచ్చింది.
3. జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడింది.
4. వేవెల్ తర్వాత భారత వైస్రాయ్ ఎవరు.

### 20.15 ఉపయుక్త గ్రంథాలు :


1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర


**డాక్టర్ జి. రాజమోహన్ రావు**

★★★★★

# పాఠం – 21
# సంస్థానాల విలీనం – సర్దార్ వల్లభాయి పటేల్

**లక్ష్యాలు :**

ఈ పాఠ్య భాగాన్ని అధ్యయనం చేయడం ద్వారా భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత భారతదేశంలో వున్న స్వదేశీ సంస్థానాలను విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయి పటేల్ చేసిన కృషిని గురించి తెలుసుకోగలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


21.1 పరిచయం

21.2 సర్దార్ వల్లభాయి పటేల్

21.2.1 స్వాతంత్రోద్యమంలో పటేల్

21.2.2 బార్డోలి సత్యాగ్రహం 1928

21.3 సంస్థానాల విలీనం

21.3.1 జునాగఢ్

21.3.2 హైదరాబాద్

21.3.3 పోలీసుచర్య – ఆపరేషన్ పోలో

21.3.4 జమ్మూ–కాశ్మీర్

21.4 సమీక్ష

21.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

21.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు

215.2 పది మార్కుల ప్రశ్నలు

21.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు

21.6 ఉపయుక్త గ్రంధాలు

## 21.1 పరిచయం :

ఆంగ్లేయులు భారత దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చేందుకు నిర్ణయించి దేశాన్ని భారతదేశం, పాకిస్తాన్ అనే రెండు దేశాలుగా విభజించడం తో పాటు దేశంలో వున్న స్వదేశీ సంస్థానాల పాలకులు ఈ రెండు దేశాలలో దేనిలోనైనా చేరేందుకు గానీ లేదా స్వతంత్రంగా వుండడానికి గానీ అనుమతినిస్తూ సంస్థానాధీశులు ఇష్ట ప్రకారం తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారాన్ని 1947 భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం పొందారు. అందువల్ల కొందరు రాజులు తమ ప్రత్యేక అధికారాలను ప్రతిపత్తిని నిలుపుకోవడం కోసం తాము స్వతంత్రంగా కొనసాగుతామని ప్రకటించారు. ఇలాంటి స్థితిలో దేశ సమగ్రతను కాపాడేందుకు నడుం బిగించి సంస్థానాల విలీనంలో సర్దార్ వల్లభాయి పటేల్ ప్రధాన పాత్ర పోషించారు.

## 21.2 సర్దార్ వల్లభాయి పటేల్ :

స్వాతంత్ర్యానంతర భారతదేశ తొలి రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి సమైక్య భారత దేశాన్ని నిర్మించి ఉక్కుమనిషిగా పేరుపొందిన మహనీయుడు – సర్దార్ వల్లభాయి పటేల్.

వల్లభాయ్ పటేల్ 1875, అక్టోబరు 31న గుజరాత్ లో జవేరిభాయ్, లాడ్ భాయి దంపతులకు జన్మించారు. సర్దార్ వల్లభాయి పటేల్ తండ్రి జవేరిభాయ్ వృత్తి వ్యవసాయం. అయితా ఆయన 1858లో జరిగిన తిరుగుబాటులో పాల్గొని ఝాన్సీ లక్ష్మి భాయి సైన్యంలో పోరాడాడు. ప్రాధమిక, ఉన్నత విద్యలను గుజరాత్ రాష్ట్రంలోనే పూర్తి చేసిన పటేల్ తర్వాత ఇంగ్లాండ్ దేశం వెళ్లి బారిష్టర్ పూర్తి చేసి తిరిగి భారత దేశం తిరిగి వచ్చి అహమ్మదాబాద్ లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి కొద్ది కాలంలోనే మంచి న్యాయవాది గా పేరుపొందాడు.

### 21.2.1 స్వాతంత్రోద్యమంలో పటేల్ :

జాతీయోద్యమమున వహించిన పాత్ర ఇంగ్లండ్ నుండి తిరిగి రాగానే అహ్మదాబాద్ లో ప్రాక్టీసు పెట్టెను. 1917వ సంవత్సరంలో గాంధీ ఉపన్యాసాల పట్ల ఆకర్షితుడైన పటేల్ స్వాతంత్రోద్యమంలో ప్రవేశించారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడు అయ్యాడు. అనంతరం గాంధీ నిర్వహించిన చంపారన్ సత్యాగ్రహం, ఖేడా సత్యాగ్రహం, అహమ్మదాబాద్ మిల్లు కార్మికుల ఉద్యమాలలో పాల్గొని గాంధీ అనుచరుడు అయ్యాడు. సహాయ నిరాకరణోద్యమం లో చురుకుగా పాల్గొన్న పటేల్ 1924 సంవత్సరంలో అహ్మదాబాద్ పురపాలక సంఘ అధ్యక్షుడుగా పనిచేసి నగరాభివృద్ధి కి కృషి చేసి విజయం సాధించి గొప్ప పాలనా దక్షుడుగా పేరుపొందాడు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్న పటేల్ 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడయ్యాడు. 1932-1934 సంవత్సరాల మధ్య జైలు శిక్ష అనుభవించిన పటేల్ 1935-1940 సంవత్సరాల మధ్య కాలంలో కాంగ్రెస్ అధిష్టాన అధ్యక్షుడుగా పనిచేసి కాంగ్రెస్ లో క్రమశిక్షణను సాధించడంలో విజయం సాధించాడు.

## 21.2.2 బార్డోలి సత్యాగ్రహం 1928:

గుజరాత్ లోని బార్డోలి ప్రాంతంలోనే భూములు నీటివసతి, సత్తువ లేక పంటలు పండక బీడు భూములుగా మారాయి. అయినా ఆంగ్ల ప్రభుత్వం ఈ భూములపై భూమిశిస్తు విధించి వసూలుకు ప్రయత్నాలు చేయడం అధికం చేసింది. ఇలాంటి స్థితిలో అక్కడి పరిస్థితిని ప్రభుత్వానికి వివరించి భూమిశిస్తు రద్దు చేయమని గాంధీ వంటి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అయినా ప్రభుత్వం పట్టించుకొనక, బలవంతంగా శిస్తు వసూలుకు పూనుకుని రైతుల స్థిర చరాస్తులను జప్తు చేసి వాళ్ళను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేయ సాగింది. ఇలాంటి స్థితిలో గాంధీ సూచనతో పటేల్ ప్రారంభించిన సత్యాగ్రహమే బార్డోలీ సత్యాగ్రహం. పటేల్ బార్డోలీ లో హిందూ ముస్లిం, స్త్రీ, పురుష యువకులనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలను కూడగట్టుకొని శాంతియుత ఉద్యమాన్ని నిర్వహించాడు. ఆంగ్లేయులు ప్రజలను హింసించినా వెనుకడుగు వేయకుండా ఉద్యమం సాగింది. చివరకు ప్రభుత్వం దిగివచ్చి శిస్తును తగ్గించడంతో పాటు భూములను, చరాస్తులను జప్తునుంచి విడుదల చేసింది. ఉద్యమ సమయంలో నిర్బంధించిన వారిని ప్రభుత్వం విడుదల చేసింది. పటేల్ సాధించిన ఈ విజయాన్ని చూసి ఆనందించిన గాంధీ పటేల్ ను అభినందించి పటేల్ కు సర్దార్ అనే బిరుదును ఇచ్చాడు. అప్పటినుంచి వల్లభాయి పటేల్ సర్దార్ వల్లభాయి పటేల్ గా పిలవబడడం ప్రారంభం అయింది.

మంత్రిత్రయ రాయబార సూచనల మేరకు భారత దేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి నాయకుడయ్యే బలం, అవకాశం వున్నా పదవీ వ్యామోహము లేక జవహర్ లాల్ నెహ్రూ పేరును ప్రతిపాదించాడు. నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో పటేల్ దేశీయాంగ శాఖ మంత్రిగా (హోం మంత్రి) బాధ్యతలను నిర్వహించాడు. స్వాతంత్ర్య సిద్ధించిన అనంతరం 1947సంవత్సరం, అగష్టు 24వ తేదిన డిప్యూటీ ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టి సంస్థానాల విలీనంలో ప్రధాన పాత్ర పోషించి గొప్ప పేరును పొందాడు.

సమైక్య భారత నిర్మాతగా, ఇండియన్ బిస్మార్క్ గా ప్రసిద్ధి చెందిన సర్దార్ వల్లభాయి పటేల్ 1950 వ సంవత్సరం డిసెంబర్ నెల 15వ తేదీన మరణించారు.

## 21.3 సంస్థానాల విలీనం :

1947 ఆగస్టు 15వ తేదీన స్వతంత్ర రాజులపై ఆంగ్ల ప్రభుత్వాధిపత్యం తొలగుతుందనీ తర్వాత వారు భారతదేశం లేదా పాకిస్తాన్ లో గానీ విలీనం కావడానికి లేదంటే స్వతంత్రంగా ఉండటానికి నిర్ణయించుకొనే అధికారం ఉంటుందని మౌంట్ బాటన్ ప్రకటించాడు. దీనితో సంస్థానాధీశులు తమ వైపు ఆకర్షించేందుకు పాకిస్తాన్ తీవ్రంగా ప్రయత్నం చేసింది. దీనికితోడూ ఆంగ్ల బ్రిటీష్ అధికారులు కూడా పాకిస్తాన్ పక్షం వహించారు.

1947 భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం సంస్థానాధీశులు ఇష్ట ప్రకారం తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం పొందారు. ఆనాటికి దేశంలో 562 సంస్థానాలు వుండేవి. ఈ సంస్థానాల్లో కొన్ని పెద్దవి మరికొన్ని చిన్న సంస్థానాలు వుండేవి. ప్రధానంగా హైదరాబాద్, మైసూర్, బరోడా మొదలైనవి విస్తీర్ణం మరియు జనాభాలలో పెద్ద సంస్థానాలు. దాదాపు మిగతావన్ని చాలా చిన్న సంస్థానాలు. వీరు బ్రిటీష్ పాలన కింద తమ ప్రాంతాల్లో

సార్వభౌమాధికారం కల్గి బ్రిటీష్ వారి రక్షణ కింద కొనసాగారు. 1947 భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం సంస్థానాధీశులు తమ ఇష్ట ప్రకారం భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం పొందడంతో వారిలో కొందరు తమ ప్రత్యేక అధికారాలను ప్రతిపత్తిని నిలుపుకోవడం కోసం తాము స్వతంత్రంగా కొనసాగుతామని ప్రకటించారు. అయితే ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్ సెక్రటరీ పాటియాలా రాజు విలీనం తప్పనిసరి అని భావించాడు. స్వతంత్ర్యానంతరం స్వదేశీ రాజులు తమ ఇష్టం వచ్చినట్లు నిర్ణయించుకోవచ్చని జిన్నా ఇచ్చిన పిలుపు భారతదేశానికి సమస్యను సృష్టించే ఉద్దేశంతో చేసిందని కాంగ్రెస్ భావించింది. అప్పటికే కొంత భాగం పాకిస్తాన్ విడిపోయిన కారణంగా సంస్థానాధీశులకు స్వాతంత్ర్యాన్ని ఆపాదించి దేశం మరింత నష్టపోవడం వారు ఇష్టపడలేదు. దీనికితోడూ భోపాల్ నవాబు కాంగ్రెస్ భారతదేశంలో చేరడానికి సుముఖంగా ఉన్నామని చెబుతూనే, భారత ప్రభుత్వ రాజకీయశాఖతోనూ, ముస్లిం లీగుతోనూ రహస్యంగా కుమ్మక్కు అవుతున్నాడని తెలిసింది. వీటికి తోడు తిరువాన్కూర్ దివానైన సి.వి. రామస్వామి అయ్యర్ తమ రాజ్యం స్వతంత్రమైంది అనీ ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పాటు చేసుకొనేందుకు స్వాతంత్ర్యం ఉందని ప్రకటించారు. హైదరాబాద్ నిజాం తమది స్వతంత్ర దేశం అని ప్రకటించాడు.

ఇలాంటి పరిస్థితిలో అనేక కష్టాలు పడి సంపాదించిన భారత స్వాతంత్ర్యం సంస్థానాధీశుల మూలంగా ఛిన్నాభిన్నం కావడం ఇష్టంలేని వల్లభాయ్ పటేల్ – భోపాల్ లోని ప్రజలు ఎక్కువగా హిందువులు పైగా ఆ సంస్థానం భారతదేశం మధ్యన వుండడం వల్ల భోపాల్ భారతదేశంలో చేరకపోయినట్లయితే దేశ సమగ్రతకు భంగం కలుగుతుందని భావించి, దేశ వ్యవహారాల కార్యదర్శి వి.పి.మీనన్ సహకారంతో భోపాల్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేశాడు.

అనంతరం స్వతంత్ర రాజులను ఒప్పించడానికి ఒక ప్రణాళికలను రూపొందించారు. దాని ప్రకారం సంస్థానాల రాజులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పెన్షన్ తో పాటు పదవులు ఇస్తామని, వారి గౌరవానికి ఎటువంటి పరిస్థితులలో భంగం కలిగించమని విశ్వాసాన్ని కలిగించి విలీనానికి ఒప్పించే ప్రయత్నం చేశారు. దీనితో అనేక మంది విలీనానికి అంగీకరించారు. వెంటనే బరోడా, బికనీర్,జైపూర్, జోద్ పూర్, పాటియాల, కొచ్చిన్, తిరువాన్కూర్ మొదలైన సంస్థానాలు భారతదేశంలో చేరుతున్నట్లు ప్రకటించాయి. క్రమంగా దాదాపు మూడు సంస్థానాలు మినహా దేశంలోని అన్నీ స్వదేశీ సంస్థానాలు పటేల్ పిలుపును అంగీకరించి ఆయన కృషివల్ల భారతదేశంలో విలీనం అయ్యాయి. జునాగఢ్, హైదరాబాద్, కాశ్మీర్ సంస్థానాలుమాత్రం భారత దేశంలో కలవకుండా స్వతంత్రంగా వుండేందుకు నిర్ణయించుకున్నాయి. దీనితో ఆ మూడు సంస్థానాలను విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు.

### 21.3.1 జునాగఢ్:

కథియవాడ్ లోని జునాగఢ్ సంస్థానంలోని ప్రజలలో 75 శాతం మంది ప్రజలు హిందువులు. జూనాగఢ్ పాలకుడు మాత్రం ముస్లిం నవాబు. జూనాగఢ్ నవాబ్ విలాసపురుషుడు. పెంపుడు కుక్కలకు, విలాసాలకు, స్త్రీలకు అధిక మొత్తంలో సొమ్మును ఖర్చుపెట్టి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలివేశాడు. దీనికి తోడు జిన్నాతో సంప్రదింపులు జరిపి జిన్నాకు అనుకూలంగా ఉండి తన రాజ్యం పాకిస్తాన్ లో చేరుతుందని ప్రకటించారు. తన రాజ్యంలోని హిందువులపట్ల అమానుషంగా ప్రవర్తించి వారిని తన రాజ్యం నుంచి తరిమివేయడం ప్రారంభించారు. వీటిని సహించలేని ప్రజలు

ఆందోళన ప్రారంభించారు. దీనితో సర్ధార్ వల్లభాయి పటేల్ అధిక జునాగఢ్ పైకి సైన్యాలను పంపాడు. అక్కడ ప్రజాభిప్రాయాన్ని సేకరించగా, అధికసంఖ్యలో ప్రజలు భారతదేశంలో చేరడానికి అంగీకరించారు. ఈ విషయం తెలిసి నవాబు పాకిస్తాన్ కు పారిపోయాడు. జునాగఢ్ భారతదేశంలో విలీనమైంది.

### 21.3.2 హైదరాబాద్:

భారతదేశం మధ్యబాగంలోని అతిపెద్ద సంస్థానం – హైదరాబాద్. ఇక్కడ మొగల్ సుల్తాన్ ఔరంగజేబ్ మరణాంతరం ఏర్పడిన పరిస్థితులను ఆసరాగా చేసుకుని 1724లో దక్కన్ సుబేధార్ గా వున్న నిజాం ఉల్ ముల్క్ స్వతంత్ర అసఫ్ జాహీ రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. అప్పటినుంచి 1948 వరకు ఆ రాజ్యం కొనసాగింది. ఈ రాజ్యాన్ని ఏడు మంది పరిపాలించారు. వారికి నిజాం ప్రభువులు అనిపేరు. భారత దేశానికి స్వాతంత్రం వచ్చే సమయానికి ఈ హైదరాబాద్ రాజ్యాన్ని ఏడవ పాలకుడైన నిజాం ఉస్మాన్ అలీఖాన్ పరిపాలించే వాడు. ప్రపంచంలోనే అత్యంత ధనికుడుగా నిజాం ఉస్మాన్ అలీఖాన్ పేరుపొందాడు.

నిజాం పాలనాకాలంలో హైదరాబాద్ రాష్ట్రంలో పరిస్థితులు దుర్భరంగా వుండేవి. వేలాది ఎకరాల భూమి దేశములని పిలువబడే భూస్వాముల అధిపత్యంలో వుండేది. భూస్వాములను దేశ్ ముఖ్ అనే పేరుతో పిలిచేవారు. వారి వద్ద చాలామంది రైతులు కట్టుబానిసలుగా సేద్యం చేసేవారు. భూస్వాముల వద్దనుంచి రుణాలు తీసుకున్న పేద రైతులు వారివద్ద బానిసలుగా వుంది వెట్టిచాకిరీ చేయాల్సి వుండేది. దీనికితోడు జాగీర్ధారీ పద్దతి కూడా అమల్లో వుండేది. జాగీర్ధార్ లు, స్థానిక పాలకులు, దేశ్ ముఖ్ లు రైతులు, పేదవారిపట్ల దారుణంగా వ్యవహరించే వారు. ఎవరైనా వారికి ఎదురు తిరిగితే దారుణంగా శిక్షించే వారు. దీనికి తోడు పాలకుడైన నిజాం కూడా నియంతలా కఠినంగా వ్యవహరించే వాడు.

నిజాం రాజ్యంలోని ముస్లిం ప్రజల ప్రయోజనాలను పరిక్షించేందుకు 1927 సంవత్సరంలో ఇత్తెహదుల్ ముస్లిమీన్ సంస్థ అనే సంస్థ స్థాపించబడింది. ఇందులోని సభ్యులకు రజాకార్లు అని పేరు.1939 నుంచి ఈ సంస్థ చురుగ్గా పనిచేయడం ప్రారంభించింది. 1939–40 సంవత్సరాలలో నవాబు బహదూర్ యార్ జంగ్ ఇత్తెహాదుల్ పార్టీకి అధ్యక్షునిగా నిజాం అధికారాన్ని ధిక్కరించ సాగాను. ప్రారంభంలో బహదూర్ యార్ జంగ్ నాయకత్వంలో ఇత్తెహదుల్ పార్టీని నిజాం ప్రోత్సహించాడని కొందరి అభిప్రాయం. బహదూర్ యార్ జంగ్ రజాకార్లు ప్రత్యేక దుస్తులు, ఆయుధాలు ధరించేవారు. 1946 సంవత్సరం నాటికి కాశింరజ్వీ రజాకార్ల వ్యవస్థకు అధ్యక్షుడైనాడు. అప్పటినుంచి రజాకార్ల దురాగతాలు అధికమయ్యాయి. రజాకార్లు హత్యలు, మానభంగాలు, బలవంతంగా డబ్బు వసూలు చేయడం వంటి దుశ్చర్యలు చేపట్టారు. అందుచేత శాంతి భద్రతలు విచ్చిన్నమై ప్రజా జీవితం దుర్భరమైంది. ఇంత జరుగుతున్నా నిజాం ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూస్తూ ఉండిపోయాడు.

ఈ విధంగా నిజాం పాలనలో హైదరాబాద్ రాజ్యంలో వున్న పరిస్థితులు కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేసేందుకు దోహదం చేశాయి. దోపిడీనుంచి పేదరైతులకు రక్షణ కల్పించడం, భూమిపై పేద ప్రజలకు హక్కును సాధించి వారికి జీవనోపాధి కల్పించడం, తెలంగాణ ప్రాంతాన్ని నిజాం దుష్పరిపాలన నుంచి విముక్తి చేయడం అనే లక్ష్యాలతో కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, నల్లా

నరసింహులు, భీంరెడ్డి నరసింహరెడ్డి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. ఈ పోరాటం హింసామార్గం లో సాగినప్పటికీ ప్రజాభిమానాన్ని చూరగొంది.

నిజాంరాజ్యంలో సాయుధ పోరాటం పాలకుర్తి లో ప్రారంభమైంది. పాలకుర్తి గ్రామస్థుల దేశముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి అనుచరులు దురాగతాలను ప్రతిఘటించడంతో జరిగిన పోలీస్ కాల్పులలో దొడ్డి కొమరయ్య మరణించాడు. దీంతో కోపోద్రిక్తులైన ప్రజలు దేశముఖ్ ఇల్లు, పొలాలను ధ్వంసం చేశారు. క్రమక్రమంగా సాయుధ పోరాటం ప్రజా ఉద్యమంగా మారింది. ఈ సాయుధ పోరాటం నిజాం రాజ్యంలోని అధిక ప్రాంతాలకు విస్తరించింది. ఈ పోరాటంలో అనేకమంది మరణించారు. నిజాం 1946 నాటికి కమ్యూనిస్టు పార్టీని బహిష్కరించి కఠిన చర్యలు తీసుకోవడంవల్ల సాయుధ పోరాటం తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే 1947 సంవత్సరంలో సెప్టెంబర్ లో రజాకార్ల దురాగతాలు ప్రతిఘటించే లక్ష్యంతో కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని తిరిగి ప్రారంభించారు. కమ్యూనిస్టులు గెరిల్లా దళాలను నెలకొల్పి రజాకార్లవద్ద నుంచి, రక్షకభటులవద్దనుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడమేగాక, పేదలకు భూములను పంచే కార్యక్రమం నిర్వహించారు.

### 21.3.3 పోలీసుచర్య – ఆపరేషన్ పోలో :

1947 వ సంవత్సరం ఆగస్టు 15న భారతదేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. నిజాం భారత దేశంలో విలీనం కాకుండా స్వతంత్రంగానే ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. అయితే ఆవిర్భవించినప్పటికీ, నిజాం మాత్రం భారతదేశంలో విలీనం కావడానికి సుముఖంగా లేదు, కాని తన రాజ్యంలో వున్న అస్తవ్యస్త పరిస్థితులవల్ల నిజాం నవంబరు 1947 లో భారత ప్రభుత్వంతో యథాతథ ఒప్పందం చేసుకొన్నాడు. కాని పాకిస్తాన్ తో రహస్య సంప్రదింపులు జరపడం ప్రారంభించడం తో పాటు విదేశాల నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకునే ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టాడు. హైదరాబాద్ లో ఆయుధ కర్మాగారాలు ఏర్పాటు చేసి ఆయుధాల తయారీని ప్రారంభిచాడు. వీటికి తోడు రజాకార్ల పార్టీ విదేశాల నుంచి విమానాలు, ఆయుధాల కొనుగోలు కోసం ప్రయత్నించింది. ఇదేసమయంలో కాశింరజ్వీ ఢిల్లీపై యాత్ర నిర్వహించి ఎఱ్ఱకోటపై తమ పతాకాన్నిఎగురవేస్తామని ప్రకటించాడు.

ఇలాంటి స్థితిలో కె.యం. మున్షి హైదరాబాద్ సందర్శించి పరిస్థితులు చేజారిపోకుండా చర్య తీసుకోవాలని సూచించారు. మున్షి నివేదిక ఆధారంగా భారత ప్రభుత్వం చర్య తీసుకోవడానికి సిద్ధమైంది. 1948 సెప్టెంబర్ 13వ తేదీన భారత సైన్యాలు జనరల్ జె.ఎన్.చౌదరి సారధ్యంలో హైదరాబాద్ లో ప్రవేశించాయి. వేరేదారి లేని నిజాం భారత సైన్యానికి లొంగిపోయాడు. ఈ పోలీసుచర్య ఫలితంగా 1948 సెప్టెంబర్ 17వ తేదీ నిజాం హైదరాబాద్ రాజ్యం భారత దేశంలో విలీనమైంది. ఈ పోలీసు చర్యకే "ఆపరేషన్ పోలో" అని పేరు.

### 21.3.4 జమ్మూ-కాశ్మీర్ :

జమ్మూ-కాశ్మీర్ భారత పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న రాజ్యం. అందువల్ల రెండు దేశాలలో దేనిలోనైనా చేరే అవకాశంఈ సంస్థానానికి ఉంది. ఈ సంస్థానంలో వున్న ప్రజలలో ముస్లింల జనాభా సంఖ్య అధికం. కనుక ఈ సంస్థానాన్ని తన దేశంలో కలుపుకునేందుకు పాకిస్తాన్ ప్రయత్నించింది. అయితే ఈ సంస్థాన పాలకుడు రాజా హరిసింగ్

హిందువు. ఈ సంస్థానంలో 1931లో షేక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ అనే పార్టీని స్థాపించి, కాంగ్రెస్ పార్టీతో స్నేహ సంబంధాలను పెట్టుకున్నాడు. షేక్ అబ్దుల్లా మహారాజుకు వ్యతిరేకంగా 1946లో 'క్విట్ కాశ్మీర్' ఉద్యమాన్ని ప్రారంభించాడు. దీనితో పాలకుడు షేక్ అబ్దుల్లాను అరెస్ట్ చేసి నిర్భంధంలో ఉంచాడు. ఈ సమయంలో గాంధీ కాశ్మీర్ ను సందర్శించి రాజు తో చర్చించి షేక్ అబ్దుల్లాను నిర్భంధం నుంచి విడుదల చేయించాడు. అయితే భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత 1947 సెప్టెంబర్ నెలలో షేక్ అబ్దుల్లా "స్వాతంత్ర్యం ముందు, విలీనీకరణ తరువాత... తమ భవిష్యత్తు నిర్ణయించుకొనేది ప్రజలు కాని మహారాజు కాదు" అని ప్రకటించాడు. ఈ విషయాలను గమనించిన పాకిస్తాన్ దేశంలోని కొందరు పటాన్లు కాశ్మీర్ లోకి చొచ్చుకుని వచ్చారు. పాకిస్తాన్ సైన్యం కూడా వారికి సహకరించి వారితో చేతులు కలిపింది. కాశ్మీర్ మహారాజు ప్రభుత్వ యంత్రాంగం పతనమై రాజు భారత సైనిక సహాయాన్ని కోరడంతో పాటు 1947 అక్టోబరు 26వ తేదీన భారత సమాఖ్యలో చేరుతూ సంతకం చేశాడు. దీనితో అప్పుడు గాంధీజీ ఈ రాజ్యాన్ని సందర్శించి, రాజును ఒప్పించాడు. ", సెప్టెంబర్లో షేక్ అబ్దుల్లా పిలుపిచ్చాడు. తమ భవిష్యత్తు నిర్ణయించుకొనేది ప్రజలు కాని మహారాజు కాదన్నాడు. ఈ మార్గంలో ఏ విధమైన చర్య ప్రారంభం కాకముందే పాకిస్తాన్లోని పఠాన్లు, జమ్మూ-కాశ్మీర్ లోనికి చొచ్చుకొని వచ్చారు. పాకిస్తాన్ సైన్యాలు వారితో చేయి కలిపాయి. మహారాజు ప్రభుత్వ యంత్రాంగం పతనమైంది. ఆయన, భారత సైనిక సహాయాన్ని అర్ధించారు. అక్టోబరు 26న, భారత సమాఖ్యలో చేరుతూ సంతకం చేశాడు. భారత సైన్యం విమానాలలో దిగి రాజును ఆదుకున్నాయి. ఈ చర్యను నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు షేక్ అబ్దుల్లా అంగీకరించాడు. అక్టోబరు 31న షేర్ అబ్దుల్లా నాయకత్వాన, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. భారత సైన్యాల సహాయంతో, ఈ ప్రభుత్వం పాకిస్తాన్ సేనల ప్రవేశాన్ని తిప్పికొట్టింది. కాని, పాక్ సైన్యాలు కొంత భూభాగాన్ని ఆక్రమించుకొని, దానికి ఆజాద్ కాశ్మీర్ అని పేరు పెట్టాయి. జమ్ము-కాశ్మీరు రాజ్యాంగ రచనకోసం, రాజ్యాంగ సభ 1951లో జమ్ము-కాశ్మీర్ లో సమావేశమైంది. భారతదేశంతో చేరికను రాజ్యాంగ సభ 1954 ఫిబ్రవరిలో ఆమోదించింది. 1956 నవంబర్ లో రాజ్యాంగ సభ, జమ్ము- కాశ్మీర్ రాష్ట్రం భారత దేశంలో భాగమని శాసనం చేసింది. పాకిస్తాన్ సైన్యాలు 1947లో ఆక్రమించుకున్న ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంమీద, పాకిస్తాన్ తన అధికారాన్ని నిలబెట్టుకుంది.

ఈ విధంగా సంస్థానాల వేలీనంలో సర్దార్ వల్లభాయి పటేల్ ప్రధాన పాత్ర నిర్వహించి అఖండ భారతావని సమగ్రతను కాపాడి చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందారు.

## 21.4 సమీక్ష :

ఆంగ్లేయులు భారత దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి దేశంలో వున్న స్వదేశీ సంస్థానాల పాలకులు తమ ఇష్ట ప్రకారం దేశంలో చేరేందుకు లేదా స్వతంత్రంగా వుండడానికి అనుమతినిస్తూ 1947 భారత స్వాతంత్ర్య చట్టం రూపొందించారు. అందువల్ల కొందరు రాజులు తమ ప్రత్యేక అధికారాలను ప్రతిపత్తిని నిలుపుకోవడం కోసం తాము స్వతంత్రంగా కొనసాగుతామని ప్రకటించారు. ఇలాంటి స్థితిలో దేశ సమగ్రతను కాపాడేందుకు నడుం బిగించి సంస్థానాల విలీనంలో సర్దార్ వల్లభాయి పటేల్ ప్రధాన పాత్ర పోషించారు.

**21.5 పరీక్ష నమూనా ప్రశ్నలు :**

**21.5.1 ఐదు మార్కుల ప్రశ్నలు :**

1. వల్లభాయి పటేల్
2. ఆపరేషన్ పోలో

**21.5.2 పది మార్కుల ప్రశ్నలు :**

1. స్వదేశీ సంస్థానాల విలీనంలో వల్లభాయి పటేల్ కృషిని వివరించండి.

**21.5.3 ఒక్క మార్కు ప్రశ్నలు :**

1. వల్లభాయి పటేల్ సాగించిన సత్యాగ్రహం ఏది.
2. వల్లభాయి పటేల్ కాంగ్రెస్ అధ్యక్షుడు గా ఏ సంవత్సరంలో ఎన్నిక అయ్యాడు.
3. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా విలీనం చేసిన సంస్థానం ఏది.
4. నిజాం నవాబ్ పేరు ఏమి.
5. హైదరాబాద్ పై తీసుకున్న పోలీసు చర్యకు ఏమని పేరు.

**21.6 ఉపయుక్త గ్రంథాలు :**

1. Constitutional History of Indian National Movement – Agarwal, R.C
2. Modern India – Bipan Chandra
3. Advanced History of India, Vols. III&IV – Majumdar, R.C
4. Three Phases of India's Struggle for Freedom – Majumdar, R.C
5. Modern India – Sumit Sarkar
6. భారతదేశ చరిత్ర – సంస్కృతి (ద్వితీయ భాగం) – తెలుగు అకాడమి ప్రచురణ
7. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర (1885–1947) – వైదేహిఅల్లాడి
8. ఆధునిక భారతదేశం – బిపిన్ చంద్ర

**డాక్టర్ జి. రాజమోహన్ రావు**

★★★★★